

తెలుగు

# యువభారతి

పదకొండవ తరగతి



# భారత సంవిధానము

## పార్ట్ – IV A

## ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.


ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్-2116/(ప్ర.క్ర.43/16) ఎస్‌డి-4 తేదీ 25.4.2016 ప్రకారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేదీ 20.06.2019 రోజు సమావేశంలో ఈ పాఠ్య పుస్తకమును 2019-20 విద్యాసంవత్సరం నుంచి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

# తెలుగు
# యువభారతి
## పదకొండవ తరగతి




మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP ను ఉపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు పాఠ్యపుస్తకంలోని పాఠాల అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

L8C6I9

First Edition : 2019 / ప్రథమ ప్రచురణ:2019
Reprint : 2021 / పునర్ముద్రణ : 2021

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏభాగమును ఉటంకించుటగాని లేదా పునర్ముద్రించుటగాని చేయరాదు.

**Telugu Langauge Committee**

Smt. B. Sarada, Chair Person
Smt. T. Suseela, Member
Sri K. Y. Kondanna, Member
Smt. M. Vidya Benerji, Member
Smt. K. Anuradha, Memebr
Sri B. Vijaybhaskar Reddy, Memebr
Smt. Y. Sitamahalakshmi, Member
Sri Mallesham Krishnahari Bethi, Member

**తెలుగు భాషా సమితి**

శ్రీమతి భమిడిపాటి శారద, అధ్యక్షులు
శ్రీమతి టి. సుశీల, సభ్యులు
శ్రీ కె. వై. కొండన్న, సభ్యులు
శ్రీమతి ఎమ్. విద్యా బెనర్జీ, సభ్యులు
శ్రీమతి కె. అనురాధ, సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు
శ్రీమతి వై. సీతామహాలక్ష్మి, సభ్యులు
శ్రీ మల్లేశం కృష్ణహరి బేతి, సభ్యులు

**Co-ordination**

Dr. Smt. Thulasi Bharat Bhushan
Special Officer, Telugu

**ప్రధాన సమన్వయకులు**

డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్
విశేషాధికారిణి, తెలుగు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, పుణె

**Cover:**

Sri Vivekananda Patil

**ముఖచిత్రం:**

శ్రీ వివేకానందా పాటిల్

**Illustrations**

Sri Yogesh Patankar
Smt. Monica Y. Patankar

**చిత్రాలు**

శ్రీ యోగేష్ పాఠన్‌కర్
శ్రీమతి మోనిక వై. పాఠన్‌కర్

**Telugu Langauge Study Group**

Smt. V. Rajeswari
Smt. A. S. Yadav
Sri Rajkumar Mutyalvar
Smt. Laxmi Prasad Chalasani
Sri Sridhar Pembatla

**తెలుగు భాషా అధ్యయన మండలి**

శ్రీమతి వి. రాజేశ్వరి
శ్రీమతి ఎ. ఎస్. యాదవ్
శ్రీ రాజ్‌కుమార్ ముత్యాల్‌వార్
శ్రీమతి లక్ష్మీ ప్రసాద్ చలసాని
శ్రీ శ్రీధర్ పెంబట్ల

**Publisher**

Sri Vivek Uttam Gosavi
Controller

**ప్రకాశకులు**

శ్రీ వివేక్ ఉత్తం గోసావి
నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, ప్రభాదేవి,
ముంబయి-25.

**Production**

Sri Sachchidanand Aphale
Chief Production Officer
Sri Rajendra Chindarkar
Production Officer
Sri Rajendra Pandloskar
Asst. Production Officer

**నిర్మితి**

శ్రీ సచ్చిదానంద అఫ్లే
ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర చిందర్‌కర్
నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర పాండ్లోస్కర్
సహాయ నిర్మితి అధికారి

**Typesetting**

M/s.Vijay Art Printers,
Pune

**అక్షరకూర్పు**

మె. విజయ్ ఆర్ట్ ప్రింటర్స్,
పుణె

Paper:
కాగితము : 70 GSM Creamwove

Print Order No :
ముద్రణాదేశము :

Printer:
ముద్రణ :

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ** నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు

సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,

భావము, భావప్రకటన, విశ్వాసము,

ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,

అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**

చేకూర్చుటకు; మరియు వారందరిలో

వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,

అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,

పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,

ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ

దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**

**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**

**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

**ప్రియమైన విద్యార్థి మిత్రులారా!**

మిమ్ములనందరిని పదకొండవ తరగతిలోకి ఆహ్వానిస్తున్నాను. అలాగే ఈ నూతన **పదకొండవ తరగతి** తెలుగు **''యువ భారతి''** అనే నేస్తం, వివిధ చిత్రాలు, ఛాయాచిత్రాలతో ఆకర్షణీయమైన హంగులు సంతరించుకొని మీకు హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుచున్నది.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, సామర్థ్య వికాసం జరిగి, సమర్థవంతమైన, ప్రజ్ఞావంతులైన, క్రియాశీల ఆలోచనలుగల పౌరులుగా వారిని తీర్చిదిద్దడమే నేటి మార్పు చెందిన పాఠ్యప్రణాళిక ముఖ్యోద్దేశ్యము.

ఏ సమాజ సంస్కృతి అయినా వారి మాతృభాష ద్వారా ప్రతిబింబిస్తుంది. భాష అనేది అన్ని విషయాల అధ్యయనానికి మూలాధారము. జ్ఞాననిర్మితివాదం, పటిష్టమైన పాఠ్యప్రణాళిక పునాదుల ఆధారంగా కృత్యయుక్త అధ్యయన అధ్యాపన పద్ధతికి అనుగుణంగా రూపొందించబడిన ఈ పాఠ్యపుస్తక నేస్తాన్ని మీకందించుచున్నందులకు మిక్కిలి ఆనందించుచున్నాము. అంతేగాక పాఠ్యాంశాలను కంఠస్థం చేసే భారం తొలగి విషయావగాహన, జ్ఞాన సముపార్జన చేసికొని మీ ఆలోచనలను, సృజనాత్మకతను స్వయంగా మీదైన భాషలో, మీ బాణిలో వ్యక్త పరచుటకు అవకాశము కల్పించబడినది. పుస్తకాల విద్య కేవలము ఉద్యోగావకాశాలకే గాక జీవితానికి ఉపయోగపడే విధంగా ప్రణాళిక చేయబడినది. దానిని తప్పక సద్వినియోగ పరచుకొనగలరు.

నియతవిద్యకు ఆవల గ్రంథాలయం, అంతర్జాలం, ప్రసార మాధ్యమాల ద్వారా లభించే సముచిత జ్ఞానాన్ని సంప్రదింపు (రిఫరెన్స్) సాహిత్యంగా ఉపయోగించుకొనే రిఫరెన్స్ స్కిల్స్ పెంపొంది మీరే స్వయంగా బ్లాగ్ వ్రాసే స్థాయికి అందుకునే విధంగా అభ్యాసాలు, ఉపక్రమాలు, ప్రాజెక్టులు, లేఖన కౌశల్యాలు ఈ పుస్తకంలో ఇవ్వబడ్డాయి.

దీనిని ఆనందంగా అభ్యసించండి. ఈ పుస్తకాన్ని గురించిన మీ భావనలు, అభిప్రాయాలను మాకు తప్పక తెలియజేయండి. మీ అందరికీ శుభాభినందనలు.

**(డా. సునిల్ మగర్)**
సంచాలకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్య పుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004.

పుణె
తేది : 20.06.2019.
భారతీయ సౌరమాన తేది : 30 జ్యేష్ఠం 1941.

# విషయ సూచిక

## పద్యభాగం


| | | | |
|---|---|---|---|
| 1. | మన పతాకమేమన్నది | కీ.శే. డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | 01 |
| 2. | ఉడుతా భక్తి | కీ.శే. నేమాని రామజోగి సన్యాసిరావు | 06 |
| 3. | వామనాగమనం | కీ.శే. బమ్మెర పోతన | 12 |
| 4. | హంస తీర్పు | కీ.శే. డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రి | 18 |
| 5. | సంక్రాంతి | కీ.శే. గుఱ్ఱం జాషువా | 25 |
| • | అవధానము (పఠనం) | | 31 |
| 6. | తెలుగు జాతి వైభవం | కీ.శే. డా॥ దాశరథి కృష్ణమాచార్యులు | 33 |


## గద్యభాగం


| | | | |
|---|---|---|---|
| 1. | బాధ్యతాయుత పౌరుడు | శ్రీ షేక్ అబ్దుల్ హాకీం జాని | 40 |
| 2. | చక్కని ప్రణాళికతో ముందుకెళదాం | డా॥ బి.వి. పట్టాభిరామ్ | 49 |
| 3. | అభిరుచులు - ఆప్తబంధువులు | శ్రీ బెలగాం భీమేశ్వర్ రావు | 57 |
| • | అంతర్జాతీయ యోగాదినోత్సవం (పఠనం) | | 62 |
| 4. | ఓ చీమకథ | కీ.శే. డా॥ రావూరి భరద్వాజ | 63 |
| 5. | సాహస మహిళల సాగరయానం | డా॥ వెన్నా వల్లభరావు | 70 |
| 6. | కరెంటు సంబరం | శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి | 77 |
| 7. | విశ్వకవి | | 84 |
| 8. | పచ్చలద్వీపాలు - పగడాల సంద్రాలు | శ్రీ దాసరి అమరేంద్ర | 89 |
| • | ప్రసిద్ధ పర్యటనస్థలం-జున్నర్ తాలుకా (పఠనం) | | 94 |
| 9. | స్వయం ఉపాధి | శ్రీ అంబల్ల జనార్ధన్ | 96 |


## సాహితీ ప్రక్రియలు


| | | | |
|---|---|---|---|
| 1. | గలీవర్ సాహసయాత్రలు | శ్రీ షేక్ సుభాన్ (శైలి) | 104 |
| 2. | చిట్టిబాబు | కీ.శే. మధురాంతకం రాజారాం | 113 |
| 3. | నీరు - మీరు | శ్రీ చొక్కాపు వెంకటరమణ | 121 |
| • | వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా (పఠనం) | | 126 |


## లేఖన కౌశల్యాలు


| | | | |
|---|---|---|---|
| 1. | బ్లాగ్ లేఖనం | | 127 |
| 2. | వార్తా లేఖనం | | 128 |
| 3. | అనువాదం | | 129 |
| 4. | సంభాషణ లేఖనం (డైలాగ్స్/మాటలు) | | 131 |
| 5. | సూత్రసంచాలనం | | 132 |
| • | వ్యాకరణం | | 134 |

## 11వ తరగతి - తెలుగు - భాషాధ్యయన సామర్థ్యాలు

1. వివిధరకాల వ్యావహారిక, గ్రాంథిక భాషల్లోని కథలను అవగాహనతో వింటారు.
2. సంభాషణ ప్రసంగాలు, ఉపన్యాసాలు, ముఖాముఖి చర్చలు పాఠశాల/కళాశాలలోని ప్రకటనలు మొదలగునవి అవగాహనతో విని ప్రతిస్పందిస్తారు.
3. తమకు కావల్సిన సమాచారాన్ని 'అంతర్జాలంలో' అన్వేషించి అధ్యయనానికి ఉపయోగించుకుంటారు.
4. వివిధ ప్రాచీన, ఆధునిక గద్య, పద్య పాఠ్యాంశాల్లోని భాషా విశిష్టతను గుర్తించుటకై జరిపిన చర్చలను అవగాహనతో వింటారు.
5. స్థానిక ప్రదర్శనలు, కళారూపాలను చూసి, విని అర్థం చేసుకుంటారు.
6. వివిధ రకాల ప్రాచీన ఆధునిక సాహిత్యాన్ని విని ఆకళింపు చేసుకుంటారు.
7. ఈ-లర్నింగ్ ద్వారా నేర్చుకున్న సమాచారాన్ని వినియోగించుకుంటారు.
8. పద్యాలు, గేయాలు భావానుగుణంగా పాడతారు.
9. సందర్భానుసారంగా స్వీయ అభిప్రాయాలను సూటిగా తగిన పదాలను/వాక్యాలను ఉపయోగిస్తూ అభివ్యక్తీకరిస్తారు.
10. పాఠ్య, పాఠ్యేతర అంశాలను చదివి వారి భావాలను సొంతమాటల్లో అభివ్యక్తీకరిస్తారు.
11. విన్న వార్తలను, విషయాలను గురించి చర్చిస్తారు.
12. వార్తలు, సందేశాలు, సూచనలు మొదలగు వానిలోని ముఖ్యాంశాలు గ్రహిస్తారు. చర్చిస్తారు.
13. మాతృదినోత్సవం, విహారయాత్ర మొదలగు వాటి గురించి చర్చించి ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తారు.
14. ఇచ్చిన అంశంపై తొట్రుపడకుండా ఉపన్యసిస్తారు.
15. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహాధ్యాయులు మొదలగువారిని అడిగి, తెలియని అంశాలను తెలుసుకుంటారు.
16. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను పఠించి అవగాహన చేసుకుంటారు.
17. వివిధ పత్రికలు చదివి అందలి అంశాలు అర్థం చేసుకుంటారు.
18. పత్రికలలో, మ్యాగజైన్‌లలో వచ్చే సాహిత్యాన్ని ప్రకాశపఠనం చేస్తారు.
19. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం తెలుసుకొనుటకు మౌనపఠనం చేస్తారు.
20. వ్యావహారిక భాషకు-వ్రాసే భాషకు ఉన్న తేడాను గ్రహించ గలుగుతారు.
21. తగిన ఉచ్చారణతో, విరామచిహ్నాల నియమాలను పాటిస్తూ అంశానికి తగినట్లుగా స్వరములోని హెచ్చుతగ్గులతో, స్పష్టంగా ప్రకాశ పఠనం చేస్తారు.
22. అంతర్జాలంలో 'ఈ' పుస్తకాల (E-books) పఠనం చేస్తారు.
23. అతిథుల ప్రసంగాలు, కార్యక్రమాలు వింటూ ముఖ్యాంశాలను నోటు పుస్తకంలో నమోదు చేసుకుంటారు.
24. విషయానుగుణంగా అంశాల ఆధారంగా నివేదికలు, చక్కని వ్యాసాలు, కథలు రాస్తారు.
25. పరిచిత, అపరిచిత గద్య పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు జవాబులను కనుగొని సొంతంగా రాస్తారు.
26. లేఖన కౌశల్యాలకై కేటాయించిన అంశాలు మొ॥ రాస్తారు.
27. వివిధ రకాల తెలుగు ఫాంట్లను, తెలుగు టైపింగ్ విధానం తెలుసుకుంటారు.
28. పదవ తరగతి వ్యాకరణం పునర్విమర్శ
29. చదివిన అంశాల్లోని జాతీయాలను, సామెతలను గుర్తించి అవగాహనతో నిత్యవ్యవహారంలో తిరిగి సందర్భోచితంగా ప్రయోగిస్తారు.
30. వివిధ భాషాక్రీడల ద్వారా పదజాలాన్ని పెంపొందించుకుంటారు.

31. భాషాభాగాలు, వాక్యరకములు, వాక్యభేదాలు, విభక్తులు, వాక్యాంగాలు, సంధి, సమాసపదాల్ని గుర్తించి సందర్భోచితంగా ప్రయోగిస్తారు. అకార, ఇకార, ఉకార సంధులను, ద్వంద్వ, తత్పురుష కర్మధారయ సమాసాలను గుర్తిస్తారు. శబ్దాలంకారాలను గుర్తించి, వాక్యరచనలో ప్రయోగిస్తారు.
32. విభిన్న సాహితీ ప్రక్రియలను చదివి రసాస్వాదన చేస్తారు.
33. భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే విధంగా విభిన్న సంస్కృతుల కార్యక్రమాల్లో పాల్గొని వాటిని అర్థం చేసుకొని ప్రశంసిస్తారు.
34. దివ్యాంగులు, వృద్ధులు, ప్రాణుల యెడ సమానుభూతిని గలిగి తగిన సహాయ సహకారాలు అందిస్తారు.
35. చదివి, విన్న తమకు తెలిసిన అంశాలను వర్ణిస్తారు.
36. అంతర్జాలాన్ని తగిన విధంగా ఉపయోగించుకుంటారు. తమ దగ్గరనున్న ప్రామాణికమైన అంశాలను బ్లాగులకు అందిస్తారు.
37. వివిధ ఆకృతులు, అల్లిక (వెబ్)లలో అంశాల ఆధారంగా నివేదిక రాస్తారు.
38. తగిన జాతీయాలనుపయోగించి కథలు, వ్యాసాలు రాస్తారు.
39. ఇచ్చిన విషయానికి అనుగుణంగా సమర్థవంతంగా ఉపన్యసిస్తారు.
40. పద్య, గద్యాలను, ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని చదివి రసాస్వాదన చేస్తారు. కావ్య సౌందర్యాన్ని గుర్తిస్తారు. వాటిలోని భావాన్ని వివరిస్తూ సందేశాన్ని అందిస్తారు. పరిసరాలలోను విహారయాత్రా స్థలాలలోని బోర్డులపై ఉన్న వివరాలను అర్థవంతంగా, అవగాహనతో చదువుతారు.
41. వివిధ రకాల తెలుగు ఫాంట్లను, టైపింగ్ విధానాన్ని తెలుసుకుంటారు.

## ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు .....


1. విద్యార్థులలో కంఠస్థము చేయు అలవాటును తొలగించాలి.
2. ఇచ్చిన విషయాన్ని అవగాహన చేసికొని కృత్యాలు చేయునట్లు విద్యార్థులకు శిక్షణనివ్వాలి. దానికి తగిన సంప్రదింపు సాహిత్యాన్ని గ్రంథాలయాలు, అంతర్జాలం, ప్రసారమాధ్యమాల ద్వారా పొందుటకు తగిన అవకాశం కల్పించాలి.
3. పాఠ్యాంశాలలోని విషయ గ్రహణం, రసాస్వాదన, కవితా సౌందర్య గ్రహణంతోబాటు ఆయా అంశాల ఆధారంగా భాషా కౌశల్యాలను తద్వారా భాషావికాసాన్ని పెంపొందించుకొనుట ముఖ్యోద్దేశ్యముగా గ్రహించాలి.
4. అటులనే పాఠ్యాంశాల మాధ్యమంద్వారా, వాటి ఆవల మీరు తెలియజేయు అధిక సమాచారం ద్వారా జీవన కౌశల్యాలను, నైతిక విలువలను పెంపొందించుకొని పాఠశాల విద్య జీవితాంతం ఉపయోగపడు విధంగా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలి.
5. సాహితీ ప్రక్రియలు: విద్యార్థుల పఠనాసక్తిని, అవగాహనను పెంపొందించుటయే ఈ విభాగపు ముఖ్యోద్దేశ్యము. కావున విద్యార్థులే స్ఫూర్తిని పొంది స్వయంగా వాటిని చదివేటట్లు ప్రోత్సహించగలరు.
6. భాషావికాసానికి, భాషపై ప్రభుతకు వ్యాకరణం పట్టుకొమ్మ. కాని దానిని సాంప్రదాయ పద్ధతిలో కాక ప్రాయోగిక లేక అన్వయ పద్ధతిలో బోధించుట ఆశించబడినది. కావున "**భాషావగాహన**" శీర్షిక క్రింద ఇచ్చిన అంశాలను ఈ పద్ధతిలో నేర్పగలరు. సౌలభ్యార్థం పుస్తకం చివర అంశాలు ఇవ్వడం జరిగినది.
7. నిత్యజీవితంలో ఆయా సందర్భాలలో ఆత్మవిశ్వాసంతో, సరియైన ఉచ్ఛారణతో చక్కని భాష మాట్లాడుట ఎంతేని అవసరం అందుకుగాను పాఠ్యపుస్తకంలోని '**స్వీయవ్యక్తీకరణ**' '**స్వీయస్పందన**' శీర్షికలకు ప్రాధాన్యమివ్వవలెను. విద్యార్థులందరూ వైయక్తికంగా ఇద్దరేసి మరియు జట్టులలో నిర్భయంగా, స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను, భావాలను, అనుభవాలను వెల్లడించుటకు అవకాశం, ప్రోత్సాహం ఇవ్వగలరు.

# 1. మన పతాకమేమన్నది?

పద్యభాగం

**నేపథ్యం :** అనాదికాలం నుండి ప్రజలకు తమ ప్రత్యేకతను తెలియజేసే ఏదో ఒక చిహ్నం ఉంటూనే ఉంది. ఆదికాలంలో ఒక్కొక్క తెగకు ఒక్కో చిహ్నం/జెండా ఉండేది. రాజులు రాజ్యాలు ఏర్పడ్డాక ఆయా రాజ్యాలు తమ కేతనాన్ని రూపొందించుకున్నాయి. ప్రస్తుత కాలంలో కూడా ప్రతి దేశానికి ఒక పతాకం ఉన్నది. అది ఆయాదేశాల ప్రత్యేకతలను సూచించేవిగా ఉంటాయి. అలాగే మన పతాకానికి కూడా మనవైన కొన్ని ప్రత్యేకతలు ప్రతీకగా ఉన్నాయి. అవి ఏంటో తెలుసుకోండి. కింది పట్టికలో పూరించండి.

| జెండాలోని అంశాలు | ప్రతీక |
|---|---|
| ● కాషాయరంగు | |
| ● తెలుపు రంగు | |
| ● ఆకుపచ్చ రంగు | |
| ● అశోక చక్రము | |



ఏ మన్నది? ఏ మన్నది?
మన పతాకమేమన్నది?

మారుతున్న కాలంతో
మనుషులు మారాలన్నది!
కులవివక్ష మతవివక్ష
కూల్చివేసి రమ్మన్నది


భాషలు వేఱైన జాతి
ప్రాణ మొక్కటే అన్నది!
అవినీతికి దిగజారుట
అధమాధమమని అన్నది!
అధికలాభములకోసం

ఆరాటం తగదన్నది!
ప్రక్కవాని బ్రతుకుదెరువు
ఒక్కపిసరు చూడన్నది!
దేశసేవకై నేడే
దీక్షను గైకొమ్మన్నది!
ఉత్సాహంతో ముందుకు
యువకులు రావాలన్నది!
వీరభారతీయుడ వను
పేరు నిలుపుకొమ్మన్నది!
విశ్వశాంతిసాధనలో
విశ్రమించవద్దన్నది!
స్వాతంత్ర్యము ప్రతిపౌరుని
జన్మహక్కుసుమ్మన్నది!
పారతంత్ర్యమెట నున్నా
ప్రతిఘటించి రమ్మన్నది!!
ప్రాక్పశ్చిమఖండములకు
వారధివై నిలుమన్నది!
శాంతిదూతవై మహికా
శాజ్యోతివికమ్మన్నది!
బ్రతుకుపచ్చకప్పురముగ
పరిమళించవలెనన్నది!!
పరిమళించవలెనన్నది!





విపక్ష = పక్షపాతం;
అధమాధమము = మిక్కిలి తక్కువైనవి;
పారతంత్ర్యము = విదేశీపాలన;
మహి = భూమి.



**కవి పరిచయం : కీ.శే.డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు** గారు 1926 జూన్ 3న కీ.శే. శ్రీమతి అచ్చాయమ్మ, కీ.శే. సుబ్బారావు అను దంపతులకు తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం గ్రామంనందు జన్మించారు. వీరు ఎమ్.ఏ. (తెలుగు) చదివి ఇష్టమైన అధ్యాపక వృత్తిని చేబట్టారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పొందారు. **వీరభారత మహాకావ్యం, పారిజాత సౌరభం, తెలుగు నీడలు** మొదగునవి వీరి పద్యకావ్యాలు. **స్వతంత్రభారతి, బాలభారతి, సుమాంజలి, కవితాలోకం** మొదగునవి గేయకావ్యాలు. వీరికి **కోనసీమ కవికోకిల, సాహిత్యకళాసాగర్, మధురకవి, కవిరత్న, కవి చక్రవర్తి** అను బిరుదులు కలవు. వీరి రచనలపై పలువురు విద్యావేత్తలు పరిశోధనలు చేశారు. వీరు 2010 జులైలో పరమపదించారు.

## I చర్చించండి.


1) నైతిక విలువ 2) దేశభక్తి

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### భావాన్ని తెలుసుకుందాం.

మారుతున్న కాలంతో మనుష్యులు మారాలని, కుల, మత వివక్షలను విడనాడాలని మన పతాకం ఉద్బోధిస్తున్నది. భారతదేశంలో వివిధ భాషలవారు ఉన్నా అందరూ భారతీయులే. భారతజాతి గౌరవాన్ని నిలబెట్టడం మనందరి కర్తవ్యం. అవినీతికి పాల్పడుట, అధికలాభాలకై ఆశించుట, ఆరాటపడుట తగదు. మనం నీతిగా, న్యాయబద్ధంగా జీవించుటయే పరమధర్మంగా భావించి దీక్షాదక్షులం కావలెను. యువత దేశమాతసేవకు ఉత్సాహంతో ముందుకు రావలెను. దేశరక్షణ బాధ్యతను స్వీకరించి వీరభారతీయుడన్న పేరు సార్థకము చేసుకోవలెను.

స్వాతంత్ర్యము అన్నది ప్రతి పౌరుని జన్మహక్కు. ప్రపంచశాంతికై శ్రమ అన్నది ఎరుగక పాటుపడుట ప్రతి భారతీయుని కర్తవ్యం అని మన పతాకం ప్రబోధించుచున్నది.



### అ) జవాబులు రాయండి.

1) ఒక్క వాక్యములో జవాబులు రాయండి.
   - i) కూల్చివేయవలసినవి.
   - ii) పారతంత్ర్యమును ఏమి చేయాలి.
   - iii) భాషలు వేరైనగాని ఇది ఒక్కటే.
   - iv) మన బ్రతుకు పరిమళించాల్సిన విధం.

2) ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.
   - i) మారుతున్న కాలంతోబాటు రావలసిన మార్పులు.
   - ii) దేశసేవకై మన పతాకమిచ్చిన పిలుపు.

### ఆ) కింది వాక్యాల్లోని తప్పొప్పులు గుర్తించండి.

1) కులవివక్ష, మతవివక్ష కూల్చివేసి రమ్మన్నది. (      )
2) భాషలు వేరైనగాని జాతిప్రాణమొక్కటే అన్నది. (      )
3) అధికలాభం కోసం ఆరాటం మేలన్నది. (      )
4) వీరభారతీయుడవను పేరు నిలుపుకోమన్నది. (      )

## III స్వీయ వ్యక్తీకరణ:

1) ప్రజలు మారాలని మన పతాకమిచ్చిన సందేశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2) దేశసేవ కోసం మన బాధ్యతల గురించి పతాకమేమన్నదో మీ సొంతమాటల్లో రాయండి.

## IV భాషావగాహన

### 1) గీత గీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.

- i) <u>మన</u> పతాకమేమన్నది.
- ii) స్వాతంత్ర్యము <u>ప్రతి</u> పౌరుని జన్మహక్కన్నది.

**2) కింది పదములను విడదీసి సంధి పేర్లు రాయండి.**

i) ఏమన్నది ii) చూడన్నది iii) వేత్తైన iv) రావాలన్నది

**3) కింది పదములకు విగ్రహవాక్యాలు రాసి సమాసాల పేర్లు రాయండి.**

i) కులవివక్ష ii) శాంతిదూత iii) మహికాశాజ్యోతి iv) అవినీతి

**4) వ్యతిరేక పదాలను రాయండి.**

i) అధికం × [ ]

ii) ముందుకు × [ ]

iii) ఉత్సాహం × [ ]

iv) శాంతి × [ ]

**5) గీతగీసిన పదము ఏ వాక్యాంగమో గడిలో రాయండి.**

i) <u>పతాకము</u> వీరభారతీయుడవని పేరు నిలుపుకొమ్మన్నది. [ ]

ii) ఉత్సాహంతో యువకులు ముందుకు <u>రావాలన్నది</u>. [ ]

**6) వచనములు మార్చి రాయండి.**

i) మనుషులు ii) భాష

iii) ప్రాణాలు iv) జాతి

**7) వాచకములను రాయండి.**

i) యువకుడు ii) పతాకము iii) భారతీయుడు

**V కింది అల్లికను పూరించండి.**

మన పతాకం ఇచ్చిన నాలుగు సందేశాలు.

**ఉపక్రమము :**

మన జెండా ఆవిర్భావం వివరాలు ఇంటర్నెట్ ద్వారా తెలుసుకొని రాయండి.

**ప్రాజెక్ట్ పని**

భారత జాతీయపతాకం-రూపకల్పన-ప్రతీకాత్మకతల సమాచారాన్ని గ్రంథాలయము మరియు అంతర్జాలం సహాయంతో సేకరించి, ఒక గోడచిత్రాన్ని (Poster) తయారు చేయండి. తరగతిలో ఆ గోడచిత్రాన్ని గురించి వివరిస్తూ వైయక్తికంగా సమర్పణ (Presentation) చేయండి.

## ఉకార సంధి

**సంధి : క్రింది వానిని పరిశీలించుము.**

వాడు + ఏడి = వాడేడి

వాడ్ + ఉ + ఏడి = వాడేడి (డ్ + ఏ = డే)

చింత్ + అ + ఆకు = త్ + ఆ = తా

చింత + ఆకు = చింతాకు (త్ + ఆ = తా)

పై ఉదాహరణంలో పదములు కలియునపుడు మొదటి పదము చివరి అచ్చుపోయి, ఆ స్థానమున రెండవ పదము మొదటి అచ్చు నిలిచినది. దీనినే 'సంధి' అందురు.

**పూర్వపరస్వరంబులకు పరస్వరంబు ఏకాదేశమగుట సంధి అనబడు**

**ఉకారసంధి :**

**క్రింది వానిని గమనించుము.**

వారలు + అందరు = వారలందరు (ఉ + అ)

వారల్ + ఉ + అందరు = వారల్ + అందరు = వారలందరు

దూలము + ఒకటి = దూలమొకటి (ఉ + ఒ)

దూలమ్ + ఉ + ఒకటి = దూలమ్ + ఒకటి = దూలమొకటి

పై పదములలో మొదటి పదము చివర 'ఉ' కారమున్నది. రెండవ పదము మొదటచ్చు ఉన్నది. రెండు పదములు కలిసినపుడు, మొదటి పదము చివరి ఉన్న 'ఉ' కారము లోపించి దాని స్థానమున రెండవ పదము మొదటి అచ్చు వచ్చినది. పై సంధి కార్యమున 'ఉ'లోపించుచున్నది. కాన దీనిని 'ఉత్వసంధి' అని అందురు.

సూ: ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధియగు.

**క్రింది పదములను విడదీసి వ్రాయుము.**

1) అవమానమేల 2) అనుమానమేల

## యడాగమసంధి

**సంధిలేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.**

**ఆగమము** : రెండు అచ్చుల మధ్య వేరొక అక్షరము మిత్రునివలె వచ్చుట.

కింది పదాలను గమనించండి.

**మా + అమ్మ - మామ్మ** అని సంధి జరుగదు.

పై ఉదాహరణలో సంధి కార్యము జరుగలేదు.

రెండు అచ్చుల మధ్య సంధి జరుగనప్పుడు **'యట్'** (య) ఆగమముగా వచ్చును. **మా + య్ + అమ్మ - మాయమ్మ** అనియగును. దీనినే యడాగమము అందురు.

**మీ + ఇల్లు = మీల్లు** అని కాదు

**మీ + య్ + ఇల్లు = మీ యిల్లు**

మొదటి పదము చివరి అచ్చునకు రెండవ పదము మొదటి అచ్చునకు సంధి జరుగుట లేదు. కావున **'యట్** ఆగమముగా వచ్చి **"మీ యిల్లు"** అను రూపము ఏర్పడినది.

**నేనివి గ్రహించా :**

- ప్రతి పౌరుడు దేశభక్తికలిగి యుండాలి.
- పొరపొచ్చాలు లేక కలిసిమెలిసి జీవించాలి - దేశ పురోగతికి పాటుపడాలి.

# 2 ఉడుతాభక్తి



**నేపథ్యం :**

మనం ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. కొన్ని పనులు స్వయంగా ఒక్కరే చేయగలరు. మరికొన్ని పనులు చేయడానికి ఇతరుల సహాయం కావలసి వస్తుంది. మానవుడు సంఘజీవి. ఆయా పనులలో ఒకరికి ఒకరు సహకరిస్తూ ఉండాలి. అలా నీవు ఎవరికైనా, ఏమైనా సాయపడ్డావా? ఏమని మెప్పు పొందావు? ఉడత సహాయం లేదా 'ఉడుతాభక్తి' అనే నానుడి గురించి చర్చించండి. ఈ నానుడికి కారణమైన కథను తెలుసుకుందామా!



ఉ. శ్రీ రఘురామ చంద్రునకు సేవలొనర్చెడు వేడ్కతో కపుల్
వారిధి పైన సేతువును బాగుగ కట్టుచు నున్నవేళ ఆ
చేరువ నీవు సాయమును చేయుచునుండవె భక్తి యుక్తులొ
ప్పారగ ధన్యవో ఉడుత! అందుము నాడు జొహారులాదృతిన్. 1

కం. పని ఎంత బృహత్తరమో
అని ఎంచక చేసితివి సహాయము నుడుతా
ఘన దీక్ష బూని తీరిక
గొనక రఘూద్వహుని యందకుంఠిత భక్తిన్. 2

తే.గీ. వానరులు నీ మహోత్సాహ వైఖరి గని
నిన్ను మించిన దీక్షతో సన్నయమున
రేబవళ్ళు శ్రమించి నిర్మించిరంత
జలధిపై సేతువననేమి సందియమ్ము? 3

ఉ. రాముడు నిన్నుగాంచి అనురాగముతో నిను చేరదీసి తత్
కోమల పాణి పద్మముల గోముగ దువ్వుచు పల్కరించి నీ
సేమ మెరింగి సాయమును చేసిన చందము నెంతో మెచ్చె అ
ట్లోముట భాగ్యవైభవము యోగవరిష్ఠము భక్తశేఖరా! 4


తే.గీ. పట్టుదలమీర శ్రీరామ పాదములను
నమ్మి పూనిన యట్టి యత్నముల వలన
స్వామి కరుణించు కలిగించు సత్ఫలములు
సంశయము లేదు కనవచ్చు సద్గతులను. 5



ఆ.వె. నీదు వీపుపైన నిమిరె రాముండన
అలరె వ్రేలి ముద్రలద్భుతముగ
ఉడుత సాయమంచు నుడుత భక్తియటంచు
నిలిచె శాశ్వతముగ నీదు కీర్తి. 6

తే.గీ. ఎవ్వరేనియు పెద్దలకే సహాయ
పడెదరనిపరులన బాధపడుట తగదు
స్వామి నీ భక్తికిన్ మెచ్చి శాశ్వతముగ
ప్రేమముద్రలు వేసి దీవింపలేదె? 7

తే.గీ. చిన్నదానవయ్యును మనసున్న దాన
వో ఉడుత! నీ సదాశయమున్నతిగనె
పరుల కవ్యాజముగ సాయపడెడు వేళ
నిన్ను పేర్కొందు రెల్లరు నిశ్చయముగ. 8



**కవి పరిచయం : కీ.శే. నేమాని రామజోగి సన్యాసిరావు** ఫిబ్రవరి 18, 1944న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో గోల్లాది అగ్రహారం అనే గ్రామంలో లక్ష్మీనరసింహ సోమయాజులు, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించారు. వీరు అష్టావధాని, కవి. **శ్రీగిరి మల్లికార్జున శతకం, మనో మందిర కృష్ణశతకం, బ్రహ్మాచ్యుత శతకం** అనే మూడు శతకాలను, **కాళీయ మర్ధనం** అనే లఘు పద్యకావ్యాన్ని రచించారు. వీరు ఆగస్టు 7, 2014 నాడు పరమపదించారు.

ప్రస్తుత పాఠ్యభాగము **'సుప్రభాతం'** అను పద్య కవితాసంపుటి నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1) తెలుగులో ప్రసిద్ధి చెందిన గ్రంథాలు.
2) రామకథను రాసిన కవులు.
3) రాముడు సముద్రంపై వారధి నిర్మించడానికి గల కారణం.

## II పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.

1. వేడ్క = ఉబలాటము, కుతూహలము, అభిలాష; కపులు=కోతులు; వారిధి=సముద్రము; సేతువు=వారధి, వంతెన, నీటికట్ట; ఆదృతి = ఆదరము.

**భావము:** శ్రీరామచంద్రుని సేవించుకోవలెనన్న కోరికతో కోతులు సముద్రముపై వారధి నిర్మించుచుండెను. ఆ సమయమందు తన భక్తి, యుక్తులు వెల్లడియగునట్లు ఉడుత సాయము చేయుచుండెను. అది చేయుచున్న సాయమునకు కవి ఆదరముతో జోహారులర్పించెను.

2. బృహత్తరము=గొప్పనైనది; ఎంచక=లెక్కింపక; ఘన=గొప్పదైన, దృఢమైన; దీక్ష=పట్టుదల; ఉద్వాహుడు=పుత్రుడు; అకుంఠిత=మొక్కవోని.

**భావము:** రఘువంశమున జన్మించిన రామచంద్రుని యందున్న సాటిలేని భక్తితో సాయపడితివి. పని ఎంతటి కష్టతరమైనదో లెక్కింపక దీక్షబూని, తీరిక లేకుండా సాయము చేసితివి.

3. సత్+నయము = మంచి నేర్పు, ఆసక్తి; రేబవళ్ళు = రాత్రి, పగలును; జలధి = సముద్రము; సందియము = సందేహము, అనుమానము.

**భావము:** నీ ఉత్సాహము చూచి వానరులు కూడా నీకన్నా దీక్షతో చేయవలెనని ఉత్సహించిరి. రాత్రింబవళ్ళు శ్రమించి సముద్రముపై వారధి నిర్మించిరనుటలో సందేహము లేదు.

4. కాంచి = చూచి; పాణి = చేయి; గోముగ=ప్రేమతో; చందము=విధము; ఓముట=కాచుట; రక్షించుట = కాపాడుట; వరిష్ఠము = శ్రేష్ఠము.

**భావము:** ఓ భక్త శేఖరా! రాముడు నిన్ను ప్రేమతో చూచి చేరదీసెను. అతని కోమలమైన చేతులతో నిన్ను ప్రేమగా నిమురుచు నీ క్షేమమును తెలిసికొనెను. నీవు సాయము చేసిన విధమునకు ఎంతగానో మెచ్చుకొనెను. ఎంతయో యోగముండినగాని అటువంటి భాగ్యము చేకూరదు.

5. పూనిన=చేపట్టిన; యత్నము=కార్యము; సంశయము=అనుమానము.

**భావము:** పట్టుదలతో శ్రీరామ పాదములను నమ్మి చేపట్టిన కార్యములు స్వామి కరుణతో సత్ఫలితములనిచ్చును. స్వర్గప్రాప్తి కలుగుననుటలో సందేహములేదు.

6. అలరు = ఒప్పారు; పూయు, శోభిల్లు

**భావము:** రాముడు నీ వీపుపై నిమరగా వేలిముద్రలు అద్భుతముగా నీ వీపుపై ఏర్పడెను. ఎవరైనా సాయము చేయునపుడు ఉడుత సాయము అనియు, భక్తితో సేవించుటను ఉడుతా భక్తి అనియు నానుడులు ఏర్పడి నీ కీర్తిని శాశ్వతము చేసినవి.

7. **భావము:** పెద్దవారికి మీరేమి సహాయము చేయగలరు అని ఇతరులన్ననూ ఎవరుకూడా నిరుత్సాహ పడవలసిన పనిలేదు. నీ భక్తికి మెచ్చిన స్వామి తన వేలిముద్రలను నీపై శాశ్వతముగా వేసి దీవించెను కదా!

8. అవ్యాజము=కపటము లేకుండుట.

**భావము:** చిన్నదానవు అయినప్పటికి ఓ ఉడుతా! నీవు మంచి మనసుకలదానవు కనుకనే ఎవరైనా కపటము లేకుండా ఇతరులకు సహాయము చేయునపుడు నిన్ను నిశ్చయముగా తలంతురు. ఆ విధంగా నీ సదాశయము ఉన్నతిని పొందినది.

## III జవాబులు రాయండి.

**అ) కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాల్లో సమాధానములు రాయండి.**

1. సముద్రముపై వారధిని కట్టదలచిన వారు.
2. రామచంద్రుడు జన్మించిన వంశము.
3. ఉడుత వీపుపై వేలిముద్రలు పడుటకు కారణం.

**ఆ) కింది ప్రశ్నలకు ఐదు లేక ఆరు వాక్యములలో జవాబులు రాయండి.**

1. శ్రీరాముడు ఉడుత పట్ల ప్రేమచూపుటకు కారణం.
2. ఉడుతాభక్తి, ఉడుతసాయం అను నానుడులు ఎట్లేర్పడెను?
3. ఉడుత సాయం ఎట్లున్నతిగన్నది?

## ఇ) సరియైన పదంతో కింది గడులను పూరించండి.

1. సముద్రంపైన కట్టుచున్నది. [ ]

   (1) సేతువు (2) రహదారి (3) సదనం (4) గోడ

2. సంశయము లేదు కనవచ్చును. [ ]

   (1) దుర్గతులను (2) సద్గతులను (3) ఆచారమును (4) దురాచారమును.

3. ఉన్నతిని కన్నది. [ ]

   (1) సదాశయము (2) దురాశయము (3) ఉన్నతాశయము (4) అత్యాశయము

## IV స్వీయస్పందన.

1. రామకార్యము పట్ల ఉడుత చూపిన భక్తి శ్రద్ధలను మీ సొంతమాటల్లో తెలపండి.
2. 'ఉడుతాభక్తి' అని ఎందుకంటారో మీ సొంతమాటల్లో రాయండి.

## V అభిప్రాయ వ్యక్తీకరణ.

1) దివ్యాంగుల వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్, వృద్ధాశ్రమాన్ని సందర్శించి, ఉడుతాభక్తితో నీవొనరించిన సాయమును వ్యక్తీకరించుము.

2) 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న నానుడి పట్ల మీ అభిప్రాయాన్ని తెలియజేయండి.

## VI సృజనాత్మకత :

ఉడుత చేసిన సాయమును తెలుపుతూ కవి ఈ పద్యాల ద్వారా దేనిని ప్రోత్సహించుచున్నాడో తెలియజేయండి.

## VII భాషావగాహన

## అ) భాషాభాగములను గుర్తించండి.



1. చేరువ <u>నీవు</u> సహాయము చేయుచునుండవే.
   (నామవాచకము, క్రియ, సర్వనామము)
2. రాముడు నిన్నుగాంచి <u>అనురాగముతో</u> చేరదీసె.
   (సర్వనామము, విశేషణము, క్రియ)
3. చిన్నదానవయ్యును మనసున్నదానవో <u>ఉడుత</u>!
   (విశేషణము, సర్వనామము, నామవాచకము)

## ఆ) కింది సంధులను అడిగిన విధంగా పూరించండి.

1. సేవలొనర్చెడు = [ ] + [ ] –> ఉకారసంధి
2. భక్తియుటంచు = [ ] + [ ] –> [ ]
3. [ ] = నిర్మించిరి + అంత –> ఇకారసంధి
4. మనసున్న = [ ] + [ ] –> [ ]

**ఇ) తగిన సమాసనామములతో జతపరచండి.**

| | |
|---|---|
| ప్రేమ ముద్రలు | సప్తమీ తత్పురుష సమాసము. |
| భక్తియుక్తులు | విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము. |
| భక్త శేఖరా | షష్ఠీ తత్పురుష సమాసము. |
| రఘూద్వహుడు | ద్వంద్వ సమాసము. |
| ఘనదీక్ష | తృతీయా తత్పురుష సమాసము. |

**ఈ) కింది వాక్యాల కాలాలను సూచనానుసారం మార్చండి.**

1. వారధిపై సేతువు కట్టుచుండిరి. (భూతకాలం)
2. రేబవళ్ళు శ్రమించి నిర్మించిరి. (భవిష్యత్కాలం)
3. పరులకు సాయపడువేళ నిన్ను పేర్కొందురు. (వర్తమానకాలం)

**ఉ) వచనము మార్చి రాయండి.**

1. కపులు —— [ ]
2. [ ] —— వానరులు
3. పాదములు —— [ ]
4. [ ] —— సత్ఫలము

**ఊ) కింది వానిలో ఏది వ్యతిరేక పదాల జోడి కాదు.**

1. సద్గతి × దుర్గతి
2. ఉత్సాహము × ఆనందము
3. సంశయము × నిస్సంశయము
4. శాశ్వతము × అశాశ్వతము

**ఋ) కింది పదాలను సొంతవాక్యములలో ప్రయోగించండి.**

1. బృహత్తరము 2. దీక్ష 3. అకుంఠిత 4. అద్భుతము 5. సదాశయము 6. అవ్యాజము

**గ్రంథాలయ సమయం :** 

వివిధ కావ్యాలు, గ్రంథాలు, పుస్తకాలలో పేర్కొన్న వివిధ పక్షులు, జంతువుల గురించిన కథలను సేకరించండి. అనాదిగా ప్రాణులకు–మానవులతో గల అనుబంధాన్ని గురించి చర్చించండి.

**ప్రాజెక్టుపని :**

మీరెప్పుడైనా, ఎవరికైనా సహాయం చేశారా? మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు పరస్పరం గావించుకొన్న సహాయ సహకారాలలో పేర్కొనతగ్గవి లేదా పత్రికలలో సంఘసేవకులను గురించి చదివిన సమాచారం మొదలగు సత్య సంఘటనల గురించి గుర్తుచేసుకోండి. ఆలోచించండి. మీ జట్టులోని విద్యార్థులతో చర్చించండి.

**ఉపక్రమము :**

1. మీ పరిసరాలలో చిన్న పిల్లలు చేపట్టిన ఏదైనా మంచి కార్యక్రమం గురించిన వివరాలు తెలుసుకొని రాయండి.
2. Kid Doctors/సాహస బాలల గురించి అంతర్జాలంలో చదివి చర్చావేదిక నిర్వహించండి.

## తెలుగు సంధులు

### అకారసంధి :

**అత్వసంధి :** అత్తు అనగా హ్రస్వ అకారము.

**సూత్రము :** అత్తునకు సంధి బహుళము.

బహుళము అనగా – 1) సంధి తప్పక జరుగుట (నిత్యం)
2) సంధి జరుగక పోవుట (నిషేధం)
3) సంధి రెండు విధములుగా జరుగుట (వైకల్పికం).
4) సంధి వేరు విధముగా జరుగుట (అన్యకార్యము).

అను నాలుగు విధములు వుండును.

ఉదా: 1) **రాము + అన్న = రామన్న** ... సంధి జరిగిన రూపము (నిత్యం).

2) **మా + ఇల్లు = మాయిల్లు** ... సంధి జరగని రూపము (నిషేధం)

రెండు అచ్చుల మధ్య సంధి జరగనిచో **'యట్'** ఆగమముగా వచ్చును. కనుక

**మా + య్ + ఇల్లు = మాయిల్లు** ... అయినది

3) **మేన + అత్త = మేనత్త**
**మేనయత్త** } వైకల్పికము

4) **ఒక + ఒక = ఒకానొక** (అన్యకార్యం)

**ఒక + ఒక = ఒకొక** ... కావలసి యుండగా సంధి జరుగక పోవుటచే వేరొక అక్షరము వచ్చి

**ఒక + న్ + ఒక = ఒకానొక** ... అను రూపము ఏర్పడినది.

### ఇకారసంధి

**ఎత్తిరి + అవలీల = ఎత్తిరవలీల**

**ఎత్తిర్ + ఇ + అవలీల = ఎత్తిర్ + అవలీల = ఎత్తిరవలీల**

పై ఉదాహరణములో మొదటి పదమునందలి చివరి అచ్చైన హ్రస్వ 'ఇ' కారము లోపించి దీని స్థానమున రెండవ పదము మొదటి అచ్చు పలుకబడుచున్నది. హ్రస్వ 'ఇ' కారము లోపించుటను ఇకారసంధియని అందురు.

సూత్రము : ఏమ్యాదుల 'ఇ' కారమునకు సంధి వైకల్పికముగా నగును. వికల్పము = ఒకప్పుడు సంధి జరుగుట. ఒకప్పుడు సంధి జరుగకుండుట. ఉదా: **ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి.**

**క్రింది పదములను విడదీసి వ్రాయుము.**

1) **ఒకటేల** 2) **వచ్చితిమిప్పుడు**

**నేనివి గ్రహించా :**

- సేతు నిర్మాణ హేతువు
- వానరసేన సహాయం
- పరోపకార పరాయణత్వం.

# 3. వామనాగమనము

**నేపథ్యం :**

- ఈ గోడచిత్రం దేనికి సంబంధించింది.
- 'రక్తదానం - ప్రాణదానం' గురించి చర్చించండి.
- రక్తదానం గురించిన అపోహలు ఏమిటి.
- శ్రేష్ఠమైన కొన్ని దానాలు.

అన్నదానం    విద్యాదానం    అవయవదానం

ఇప్పుడు దానగుణానికి మారుపేరైన బలిచక్రవర్తి వద్దకు వామనాగమనము ఎలా జరిగిందో ఈ పాఠ్యభాగంలో చూద్దాం.



సీ. చవులుగా జెవులకు సామగానంబులు
సదివెడు హోతల చదువు వినుచు
మంత్ర తంత్రార్థ సంబంధ భావంబులు
గొనియాడు యాజుల గూడికొనుచు
హోమకుండంబులం దున్న త్రేతాగ్నుల
వెలిగించు యాజక వితతి గనుచు
దక్షులై బహువిధాధ్వర విధానంబులు
సెప్పెడు సభ్యుల జేర జనుచు

తే. బెట్టు గోరెడు వేడుక పట్టు పఱుప
నదితి పుట్టువు లచ్చికి నాటపట్టు
కోరి చరియించె సభలోన గొంత తడవు
పుట్టు వెన్నడు నెఱుగని పొట్టి వడుగు. 1



క. వెఱచుచు వంగుచు వ్రాలుచు
నఱిముఱి గుబురలకు జనుచు హరిహరి యనుచున్
మఱుగుచు నులుకుచు దిరదిర
గుఱు మట్టపు పొట్టివడుగు గొంత నటించెన్. 2

క. కొందఱితో జర్చించును
గొందఱితో జటలు సెప్పు గోష్ఠింజేయుం
గొందఱితో దర్కించును
గొందఱితో ముచ్చటాడు గొందఱనవ్వున్. 3



వ. మఱియు ననేక విధంబుల నందఱికి నన్నిరూపులై వినోదించుచు. 4

క. వెడవెడ నడకలు నడచుచు
నెడనెడ నడుగిడక నడరి యిల దిగబడగన్
బుడిబుడి నొడువులు నొడువుచు
జిడిముడి తడబడగ వడుగుసేరెన్ రాజున్. 5

వ. ఇట్లు డగ్గఱి మాయా భిక్షుకుండు రక్షోవల్లభుం జూచి యిట్లనియె. 6

ఉ. స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు హాసమాత్ర వి
ధ్వస్త నిలింప భర్తకు నుదార పదవ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు నిర్జరీ గళ
న్యస్త సువర్ణ సూత్ర పరిహర్తకు దానవలోక భర్తకున్. 7

**కవి పరిచయం : కీ.శే. బమ్మెరపోతన** 15వ శతాబ్దానికి చెందిన కవి. సంస్కృత **భాగవతమును ఆంధ్రీకరించారు. భోగినీదండకం, వీరభద్ర విజయం** వీరి ఇతర రచనలు, ఈతనికి **'సహజ పాండిత్యుడు'** అనే బిరుదు కలదు. ఈతడు తెనిగించిన శ్రీమదాంధ్ర మహాభాగవతంలోని భాగములు శిథిలములు కాగా మరికొందరు ఆ భాగాలను పూరించిరని అందురు. ఈతని కవిత్వము తేటతెలుగు పదములతో కూడి మధురమై చెవులకింపును కలిగించును. ప్రస్తుత పాఠ్యభాగం **భాగవతంలోని అష్టమస్కంధం** నుండి గ్రహింపబడినది.

**I చర్చించండి.**

1. శిబిచక్రవర్తి, కర్ణుడు మొదలగు వారి విశిష్టత.
2. వ్యాసుడు రచించిన గ్రంథాలు.
3. భాగవతాన్ని ఆంధ్రీకరించిన కవి.

**II చదవండి - ఆలోచించండి - రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం, భావాన్ని తెల్సుకుందాం.**

1. చవులుగా=ఇంపుగా; హోతలు=హోమము చేయించువారు; యాజులు=యజ్ఞము చేయువారు; అధ్వరములు=క్రతువులు (యజ్ఞము); పట్టుపఱుప=అతిశయింపగా.

   **భావము:** భిక్ష కోరవలెనను వేడుక అతిశయింపగా పుట్టుక లేనివాడైనను కారణార్థముగా అదితికి జన్మించినట్టియు, లక్ష్మికి నిలయమైన ఆ పొట్టి బ్రహ్మచారి చెవులకింపుగా హోతలు చదువు సామవేదగానమును వినుచుండెను. మంత్రతంత్రములకు గల సంబంధమును కొనియాడు పండితుల దగ్గరకు వెళ్ళుచుండెను. హోమకుండములందు త్రేతాగ్నులను వెలిగించు యాజులను, క్రతువులను చేయు విధమును చెప్పు సమర్థులైన సభ్యులను చూచుచుండెను. ఈ విధముగా కొంతసేపు ఆ సభలో సంచరించెను.

2. అఱిమురి = సంభ్రమము; కుఱుమట్టపు = మఱుగుజ్జువాడైన; మఱుగుచు = చాటగుచు; ఉలుకు = బెదురుచు; దిరదిర = తిరుగు.

   **భావము:** మరియును ఆ బ్రహ్మచారి భయపడుచు, వినయముతో వంగుచు, జనసమూహములోనికి వెళ్ళుచు, హరిహరి యనుచు, ఎంతో జాగ్రత్తపడుచు తిరుగుచు కొంత నటించెను.

3. జటలు = వేదపాఠాలు; గోష్ఠించేయు = సంభాషించు; తర్కించు = వాదించు; ముచ్చటాడు = కబుర్లుచెప్పు.

   **భావము:** అతడు కొందరితో చర్చించును. మరికొందరితో వేదమందలి జటలు చెప్పును. కొందరితో గోష్ఠిసేయును. కొందరితో వాదించును. కొందరితో ముచ్చట్లు చెప్పును. కొందరితో నవ్వుచు సంభాషించును.

4. మరియును అనేక విధాలుగా అందరితో అన్ని విధములా వినోదించుచు.

5. వెడవెడ = మెల్లమెల్లగా; అడరు = అతిశయం; ఇల = భూమి; దిగబడగా = అడుగిడునట్లుగా; బుడిబుడినొడువులు = ముద్దుముద్దు మాటలు; నొడువుచు = పలుకుచు; జిడిముడి = చిన్నశిఖ; వడుగు = బ్రహ్మచారి.

   **భావము :** నెమ్మదినెమ్మదిగా నడుచుచూ, మధ్యమధ్యలో ఆగుచు, బుల్లిబుల్లి మాటలు పలుకుచు, చిన్న శిఖ తడబడుచుండగా ఆ వడుగు రాజును సమీపించెను.

6. రక్షోవల్లభుడు = రాజు.

   **భావము :** ఈ విధముగా మాయాభిక్షకుడు బలిచక్రవర్తిని సమీపించి యిట్లు పలికెను.

7. శాసనకర్త = శాసించు ప్రభువునకు; హాసమాత్ర=చిరునవ్వుచేతనే; విధ్వస్త=నాశనము కావింపబడిన; నిలింపభర్త=దేవతల ప్రభువు; ఉదారపదవ్యవహర్తకున్ = ఉదారగుణముగలవానికి; మునీంద్రనుత = మునులచేత స్తుతింపబడుచు; మంగళాధ్వర = శుభప్రదమైన క్రతువులను; విధానవిహర్తకు = చేయువానికి; నిర్జరీ = దేవతాస్త్రీలు; గళన్యస్త=మెడలోగల; సువర్ణసూత్ర=మంగళసూత్రముల; పరిహర్తకు = నాశనము చేయువానికి; దానవలోక భర్త = రాక్షసలోక ప్రభువు.

   **భావము:** 'మూడు లోకములకు ప్రభువైనట్టియు, చిఱునవ్వుతో దేవేంద్రుని నశింపజేయునట్టియు, ఔదార్యగుణముకలిగినట్టియు, మునీంద్రులచే ప్రశంసింపబడు క్రతువులు చేయునట్టి దేవతలను సంహరించునట్టియు బలిచక్రవర్తికి శుభమగుగాక.

## III వినండి - చర్చించండి - రాయండి.

**అ) ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వామనుడు సభలో నటించిన విధం.
2. సభలోని వారితో వామనుడు వినోదించిన తీరు.
3. సభలో ప్రవేశించిన వామనుని రూపం.
4. వామనుడు బలిని దీవించిన తీరు.

**ఆ) ఎవరు ఎవరితో అనిరి.**

1. పుట్టు వెన్నడు నెరుగని పొట్టి వడుగు. { } → { }
2. స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు. { } → { }

**ఇ) తప్పొప్పులను గుర్తించుము.**

1. కోరి నటియించె సభలోన కొంత తడవు. ( )
2. కుఱు మట్టపు పొడుగువడుగు గొంత నటించెన్. ( )
3. కొందఱితో వాదుటాడు గొందఱ నవ్వున్. ( )

## IV స్వీయవ్యక్తీకరణ :

1. ''వామనుడు - బలిచక్రవర్తి'' సంభాషణ సొంతమాటల్లో రాయండి.
2. వామనుడు సభలో సంచరించిన విధం సొంతమాటల్లో రాయండి.

**పద్య రసాస్వాదన:**

**కింది పద్యాన్ని చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.**

వెఱచుచు వంగుచు వ్రాలుచు
నఱిముఱి గుబురులకు జనుచు హరిహరి యనుచున్
మఱుగుచు సులుకుచు దిరదిర
గుఱుమట్టపు పొట్టివడుగు గొంత నటించెన్.

## V భాషావగాహన :

**అ) వచనము మార్చి రాయండి.**

1. హోతలు 2. సభ్యుడు 3. జట 4. నొడువు 5. భక్షకుడు 6. చరణములు 7. కోరిక

**ఆ) ఏ వాచకమో రాయండి.**

1. అదితి 2. వటుడు 3. లచ్చి 4. హరి 5. ఫలము 6. బలి

**ఇ) సొంతవాక్యాలలో ఉపయోగించండి.**

1. ముచ్చటాడు 2. దీవించు 3. ధన్యాత్ముడు.

**ఈ) సంధులను జతపరచండి.**

| | |
|---|---|
| తంత్ర + అర్ధ | త్రేతాగ్నులు |
| త్రేత + అగ్నులు | బహువిధాధ్వర |
| బహువిధ + అధ్వర | సురేంద్రోత్తమా |
| గిరి + ఈశుడు | తంత్రార్ధ |
| సురేంద్ర + ఉత్తమా | గిరీశుడు |



**ఉ) పదాలను విగ్రహ వాక్యాలతో జతపరచండి**

| పదాలు | విగ్రహ వాక్యాలు |
|---|---|
| త్రేతాగ్నులు | అదితి యొక్క పుట్టువు |
| అదితి పుట్టువు | యాజకుల యొక్క సమూహము |
| యాజక వితతి | మూడైన అగ్నులు |

**ఊ) అలంకారమును గుర్తించండి.**

1. వెఱచుచు వంగుచు వ్రాలుచు, నఱిమిఱి గుబురలకు జనుచు హరిహరి యనుచున్
   మఱుగుచు నులుకుచు దిరదిర, గుఱుమట్టపు పొట్టివడుగు గొంత నటించెన్.

2. కొందఱితో జర్చించును, గొందఱితో జటలుసెప్పు గోష్ఠింజేయుం
   గొందఱితో దర్కించును, గొందఱితో ముచ్చటాడు గొందఱ నవ్వున్.

3. వెడవెడ నడకలు నడుచుచు, నెడనెడ నడుగిడక నడిరి యిల దిగబడగన్.
   బుడిబుడి నొడువులు నొడువుచు, జిడిముడి తడబడగ వడుగుసేరెన్ రాజున్.

## VI సృజనాత్మకత :

బలిప్రతిపదను గురించిన సమాచారాన్ని అంతర్జాలం నుండి గ్రహించి దీన్ని ఏ పండుగ సందర్భముగా, ఏ విధంగా జరుపుకుంటామో రాయండి.

**ప్రాజెక్టుపని:**

దానగుణం అనగానే మనకు గుర్తుకు వచ్చేది శిబిచక్రవర్తి, మహాభారతంలోని కర్ణుడు మొదలగువారు. వీరి కథలను పెద్దలనడిగి తెలుసుకోండి. గ్రంథాలయంలోని పుస్తకాలలో చదవండి. చక్కని ఉచ్చారణ, కంఠస్వరం, అభినయం, ఆత్మవిశ్వాసాలతో తరగతిలో కథాకథనం చేయండి.

**ఉపక్రమము :**

దశావతారాల గురించి మీ ఉపాధ్యాయునితో చర్చించి తెల్సుకోండి.

## అలంకారములు

శరీరమునకు సౌందర్యము కలిగించు గాజులు, కంఠహారములు మొదలగు వానిని అలంకారములందురు. అట్లే పద్యమునకు సౌందర్యమును కలిగించు సాధనములును అలంకారములనబడును. ఇవి శబ్దాలంకారములు, అర్థాలంకారములు అని రెండు విధములు.

### శబ్దాలంకారములు

శబ్దము యొక్క ఆవృత్తిని బట్టి ఏర్పడు అలంకారములు.

ఇవి అనుప్రాసము, యమకము, ముక్త పదగ్రస్తము అని మూడు విధములు.

### అనుప్రాసము

ఇది **వృత్త్యను ప్రాసము, ఛేకాను ప్రాసము, లాటాను ప్రాసము, అంత్యాను ప్రాసము** అని నాలుగు విధములు.

**వృత్త్యనుప్రాసము :** ఒకటి లేదా రెండక్షరములు పలుమార్లు ఆవృత్తి అగుట అనగా మరల మరల వచ్చుట. ఉదా., ఆనంద్ర, బింద్రు బృందస్యంద్రన. సుందరము బిందు పూర్వక'ద'కారము పలుమార్లు ఆవృతమైనది.

**ఛేకానుప్రాసము :** రెండు హల్లులు అవ్యవధానముగా అనగా వెంట వెంటనే వచ్చుట – అర్థములో మార్పు వుండుట. ఉదా., నీ సుందర దరహాసము – దర, దర అను పదములు వెంట వెంటనే వచ్చినవి కాని సుందర – అనునపుడు అందమైన అని, దరహాసము అనగా చిరునవ్వు అని అర్థమునందు భేదమును చెప్పుకొందుము.

**లాటానుప్రాసము :** తాత్పర్య భేదముతో శబ్దార్థములు పునరుక్తములగుట.

**ఉదా:** కనులాక్షు నర్చించు కరములు కరములు

ఇందు కరములు అన్న పదమును రెండుసార్లు కవి ప్రయోగించారు. కరములు అనగా చేతులు. విష్ణువును పూజించునట్టి చేతులే సార్థకత కలిగిన చేతులు అని తాత్పర్యమునందు భేదమును తెలుపుచున్నాము.

నేనివి గ్రహించా :

- దానగుణ వైశిష్ట్యము
- కావ్యరచనలో అలంకార ప్రాముఖ్యత.

# 4. హంస తీర్పు

**నేపథ్యం :**

- పక్కనున్న చిహ్నము (Logo) దేనిని సూచిస్తున్నది.
- ఈ సొసైటీ చేయు కార్యకలాపాల గురించి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి. చర్చించండి.

గాయపరచబడిన హంసను కరుణార్ద్రహృదయుడైన సిద్ధార్థుడు రక్షించెను. దానిద్వారా దేవదత్తుడు–సిద్ధార్థుల మధ్య జరిగిన వాగ్వివాదము–దాని తీర్పును ప్రస్తుత పాఠ్యభాగము ద్వారా తెలుసుకుందాము.



ఆ.వె. కలహ మెంత పుట్టె కలహంసచే నంచు
నగవు వచ్చె శాక్యనాయకులకు;
'తగవు మాలినట్టి తగ' వంచు తలపోసి
తగవు చెప్పెనిట్లు ధర్మమూర్తి. 1

తే.గీ. ''బాణహతిచేత ప్రాణమ్ము బాసెనేని
దేవదత్త కుమారునిదే ఖగమ్ము;
ప్రాణదానమ్ము సలిపి కాపాడుకతన
రాజపుత్త్రుని దయ్యె నీ రాజహంస. 2

చం. పలికెను దేవదత్త నరపాలకుమారులంజూచి ''రండిటన్
నిలువుఁ డొకింత దూరమున, నిల్చి కరమ్ములు సాచి హంసయున్
బిలువుఁడు వేరువేరుగను మీర; లదెవ్వరిదైన వ్రాలు వా
రల కరసారసమ్ముల మరాళము; న్యాయము దేలు దానితోన్.'' 3


ఉ. అంతట ప్రాడ్వివాకవరు లాడిన మాటలు, దేవదత్తుండ
త్యంతము సంతసించి కలహంసము నుంచిన రత్నపీఠి క
ల్లంతన నిల్చి పిల్చె ''ఖగమా! యిటురా! యిటురా!'' యటంచు వి
భ్రాంతమనమ్ముతో కటుకరమ్ములతో చటులస్వరమ్ముతో. 4

ఉ. ఆతని రూపు గాంచి భయమొందెనో! టక్కరిచూపు గాంచియే
భీతిలెనో! కరానఁ గనిపించు ధనస్సునకున్ మనస్సులోఁ
గాతరభావముం గనెనొ గాని! నృశంసు స్పృశింపఁబోని సం
గీతము భంగి, వెన్కకొదిగెన్ కలహంసము కుంచితాంసమై. 5

తే.గీ. అంత నగుచు సముత్కంఠ మగుచుఁగనె స
భా జనము రాజసుతుని సభాజనముగ;
గౌతముండును ధర్మాధికారి ముదల
నొదల ధరించి పిలిచె రాయంచ నిట్లు- 6

ఆ.వె. ''చెల్లి రావె! మంచిమల్లి రావే! కల్ప
వల్లి రావె! పాలవెల్లి రావె!
చిక్కదనము లీను చక్కదనాల జా
బిల్లి రావె; అంచతల్లి రావె!'' 7


తే.గీ. అంచుఁ గేల్సాచి పిలువ రాయంచ ''రివ్వు''
మంచు వ్రాలె సిద్ధార్థు హస్తాంచలముల;
'జయజయ' నినాదములు సభాసదులు పలుక!
శాక్యపతి కళ్ళ హర్షభాష్పమ్ము లొలుక!! 8



ఉ. ఆ కరుణార్ద్రమూర్తి కలహంస నటుల్ మరికొన్నినాళ్ళు ప్రే
మైక విలోకనమ్ముల ప్రియమ్ము నయమ్ములరన్ స్వయమ్ముగా
సాకి, భయమ్ము దీరిచి, ద్విజమ్ము వియద్గమనక్షమత్వముం
గైకొనుటల్ గనుంగొని యొకానొక చల్లని సంజవేళలో - 9

ఉ. ''నా యనుజన్ముఁ డొక్కరుఁ డొనర్చిన దుష్కృతిచేత నేలపా
లాయె భవద్విహాయస విహార మహోత్సవ మల్లనాఁడు; నీ
యాయువు గట్టి దింతకును హంసమ! గాయము మానె, నింకపై
హాయిగ పోయి యాడుకొనుమా! కనుమా నిజబంధుమిత్రులన్'' 10

తే.గీ. అంచు వదలె కుమారుఁ డాయంచ, నదియు
పై కెగిరె నవ్య మధుర కల్పన విధాన;
నల్లనల్లని గగనాంగణమ్మునందు
తెల్లతెల్లని సొగసులు వెల్లివిరిసె. 11



**కవి పరిచయం :** తన రచనలతో పాఠకులను మురిపించి మైమరపించిన మధురకవి **కీ.శే. డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి**గారు. ఆయన కలం పేరు **కరుణశ్రీ**. పుట్టింది గుంటూరు జిల్లాలోని కొప్పర్రు, ఆయన తల్లిదండ్రులు మహాలక్ష్మమ్మ, పరదేశయ్య. ఆయన కవిగా, పండితుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా బాలసాహిత్య కథకుడిగా ప్రసిద్ధులు. **ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ** మొదలగునవి వీరి కావ్యాలు. ప్రస్తుత పాఠ్యభాగం ఈయన రచించిన **ఉదయశ్రీ** అను ఖండకావ్యం నుండి గ్రహింపబడింది.

## I చర్చించండి.

1. గౌతమ బుద్ధుని జీవిత విశేషాలు.
2. గౌతముడు ఇల్లు విడిచి వెళ్ళిపోవటానికి కారణాలు.
3. మీరు ఎప్పుడైనా ఆపదలో ఉన్నవారిని ఎవరినైన కాపాడిన విధం.

## II ఆలోచించండి - రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం-భావాన్ని తెలుసుకుందాం.

1. కలహము = తగాదా; నగవు = నవ్వు; తగవుమాలిన = అనవసరమైన; తగవు = జగడము; న్యాయము = తీర్పు; ధర్మమూర్తి = న్యాయమూర్తి.

   **భావము :** శాక్యవంశపు రాజులకు హంస వలన ఎటువంటి తగాదా వచ్చినదని నవ్వువచ్చినది. అవసరమైన తగాదా అని తలపోయుచు న్యాయమూర్తి ఈ విధముగా తీర్పు చెప్పెను.

2. బాణహతి = బాణపుదెబ్బ; ప్రాణమ్ముబాసెనేని = ప్రాణము పోగొట్టు కొనినచో; ఖగమ్ము = పక్షి; కాపాడు కతన = కాపాడుట వలన;

   **భావము:** బాణపు దెబ్బ తగిలి హంస మరణించినచో అది దేవదత్తునిదే కాని దానికి ప్రాణదానము చేయుట వలన ఈ హంస రాజకుమారునకే చెందును.

3. ఒకింతదూరమున = కొద్దిదూరములో; కరములు = చేతులు, కరసారసములు = పద్మముల వంటి చేతులు

   **భావము:** న్యాయమూర్తి దేవదత్త రాజకుమారులను జూచి ఈ విధంగా పలికెను. మీరు ఇచ్చటకు వచ్చి కొద్ది దూరములో నిలబడి చేతులు చాచి హంసను పిలవండి. అది ఎవరిదైనచో వారి పద్మముల వంటి చేతుల యందు వ్రాలును దానితో న్యాయము తేలును.

4. ప్రాడ్వివాకవరులు = న్యాయమూర్తులు; కటుకరమ్ములతో=మొరటైనచేతులతో; చటులస్వరమ్ముతో = భయంకరమైన కంఠముతో.

   **భావము :** న్యాయమూర్తి చెప్పిన మాటలను విని దేవదత్తుడు మిక్కిలి సంతోషించెను. కలహంసనుంచిన రత్నపీఠికకు కొద్ది దూరములో నిల్చి తన కఠినమైన స్వరముతో "ఓ పక్షి ఇటు రా" అని పిలిచెను.

5. టక్కరిచూపు = మోసపు చూపు/(ధూర్తునిచూపు) / దొంగచూపు; కాతరభావము = భయము; నృశంసుడు = క్రూరుడు స్పృశింపబోని = తాకని; కుంచితాంసమై = వంచినమెడ కలదై.

   **భావము :** అతని రూపమును జూచి భయపడెనో, మోసపుచూపునకు భయపడెనో, అతని చేతిలోని ధనస్సును జూచి భయపడినదో కాని క్రూరుని తాకని సంగీతమువలె ఆ హంస వెనకకు ఒదిగి వుండెను.

6. ఉత్కంఠ = వేగిరపాటు, ఇష్టమైన వస్తువును పొందవలెనని తొందర; ముదల = ఆజ్ఞ; ఔదలధరించి = శిరసావహించి.
**భావము :** అంతట సభయందలి జనులు ఉత్సాహముతో రాజకుమారుని సంతోషముతో చూచిరి. గౌతముడును న్యాయాధికారి ఆజ్ఞను శిరసావహించి ఆ రాజహంసను ఈ విధముగా పిలిచెను.

7. **భావము :** ఓ కల్పవల్లీ! పాలవల్లీ చక్కదనాల జాబిలీ! హంసతల్లీ ఇటురావె!

8. హస్తాంచలము = చిగురుల వంటి చేతుల యందు; నినాదములు=ధ్వనులు; హర్షభాష్పములు = ఆనంద భాష్పములు.
**భావము:** అని పలుకుచు చేతులుచాచి పిలువగానే ఆ హంస రివ్వున వచ్చి సిద్ధార్థుని చేతులయందు వ్రాలెను. సభాసదులందరు జయ జయ ధ్వనులు పలుకుచుండగా గౌతముని కళ్ళయందు ఆనంద భాష్పములు స్రవించెను.

9. విలోకనమ్ముల = చూపుల; నయమ్ము = మృదుత్వము; తరిచి = పోగొట్టి; ద్విజమ్ము = పక్షి; వియత్ = ఆకాసమున; గమన = తిరుగుటయందు, క్షమత్వము = నేర్పు, కైకొనుట = స్వీకరించుట.
**భావము :** కరుణార్ద్రమూర్తి మరికొన్ని రోజులు ఎంతోప్రేమతో కూడిన చూపులతో మృదువుగా తానే ఆపక్షిని సాకెను. దాని భయమును పోగొట్టెను. ఆ పక్షి ఆకాశమునందు తిరుగుటలో శక్తిని సంపాదించినదని తెలిసికొనెను. తరువాత ఒకానొక రోజు చల్లని సంధ్యా సమయములో.

10. అనుజన్ముడు = తమ్ముడు; ఒనర్చిన = చేసిన; దుష్కృతి = చెడుపని; భవత్ = నీ యొక్క; విహాయస = ఆకాశము; విహారము = విహరించుట.
**భావము :** నా తమ్ముడు ఆనాడు చేసిన చెడుపనికి నీ ఆకాశ విహారము నేలపాలైనది. ఓ హంసా! ఇంతకును నీ ఆయువు ప్రాణము గట్టిది. నీ గాయము మానినది. ఇకపై హాయిగా వెళ్ళి ఆడుకొనుము. నీ బంధుమిత్రులను చూచుకొనుము.

11. **భావము :** అని పలుకుచు గౌతముడు ఆ రాజహంసను కొత్తదైన మధుర భావన వలె వదిలిపెట్టెను. అదియు ఎంతో ఉత్సాహముతో ఆకాశమున కెగిరెను. నల్లనల్లని ఆకాశమునందు తెల్లతెల్లని సొగసులు అంతటా వ్యాపించెను.

## III వినండి - చర్చించండి - రాయండి.

### అ) ఒకటి / రెండు పదాలు లేదా వాక్యములలో జవాబులు రాయండి.

1. హంసకై తగవు పడిన వారు.

2. రాజహంస గౌతమునిదగుటకు కారణము.

3. దేవదత్తుడు గౌతముడు రాజహంసను పిలిచిన విధము.

4. దేవదత్తుని వద్దకు హంస రాకపోవుటకు కారణములు

5. హంస పైకెగిరిన విధానము.

ఆ) ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.

1. దేవదత్త గౌతములకు ధర్మమూర్తి చెప్పిన న్యాయము.
2. గౌతమునకు రాజహంస దక్కిన విధము.
3. గౌతముడు రాజహంసను ఆకాశమున వదిలిన విధము.

ఇ) సరియైన పదాలతో గడులను పూరించండి.

(భీతిలెనో, ఖగమ్ము, కరమ్ములు, ముదల)

1. ఒకింత దూరమున నిల్చి [ ] సాచి హంసయున్ పిలువుడు.
2. టక్కరి చూపు గాంచియే [ ]
3. ధర్మాధికారి [ ] నౌదల ధరించి పిలిచె.

ఈ) ఎవరు ఎవరితో అనిరి.

1. రాజపుత్రునిదయ్యె నీ రాజహంస.
2. కరమ్ములు సాచి హంసయున్ పిలువుడు.
3. ఖగమా! యిటురా! యిటురా!
4. ఇకపై హాయిగపోయి ఆడుకొనుమా.

## IV స్వీయస్పందన :

1. సభాజనులు గౌతముని జయమును కోరుచున్నారని ఎట్లు చెప్పగలవో నీ సొంతమాటల్లో వివరించు.
2. గౌతముడు కలహంసను అనునయించి ఆకాశమున వదిలిన సందర్భంగా నీ మనోభావాలను సొంతవాక్యాల్లో వివరించు.
3. గౌతముడు దయాగుణము కలవాడు అనుటలో నీ అభిప్రాయము.

## V భాషావగాహన :

అ) గీతగీసిన పదములు ఏ భాషాభాగానికి చెందినవో పట్టికలో రాయండి.

| పదము | భాషాభాగం |
|---|---|
| 1. రాయంచ రివ్వుమంచు వ్రాలె. | |
| 2. గాయము మానె. | |
| 3. తెల్లతెల్లని సొగసులు వెల్లివిరిసె. | |

ఆ) జతపరచండి.

| | |
|---|---|
| కఠిన + ఆత్ములు | గగనాంగణమ్ము |
| కుంచిత + అంసమై | హస్తాంచలముల |
| హస్త + అంచలముల | మహోత్సవము |
| గగన + అంగణమ్ము | కుంచితాంసమై |
| మహా + ఉత్సవము | కఠినాత్ములు |



ఇ) సరియైన సంధి పేరును గుర్తించి, గడిలో రాయండి.

1. తగవు మాలిన + అట్టి

ఇకారసంధి    అకారసంధి    ఉకారసంధి

2. రాజపుత్రునిది + అయ్యె

ఇకారసంధి    ఉకారసంధి    అకారసంధి

3. ఒక + ఇంత

అకారసంధి    ఉకారసంధి    ఇకారసంధి

4. పైకి + ఎగిరె

ఉకారసంధి    ఇకారసంధి    అకారసంధి

ఈ) పట్టికను అడిగిన విధంగా రాయండి.

| పదము | విగ్రహ వాక్యము | సమాసము పేరు |
|---|---|---|
| 1. బాణహతి | ______________ | ______________ |
| 2. రాజపుత్రుడు | ______________ | ______________ |
| 3. ______________ | ధర్మమునకు అధికారి | ______________ |
| 4. ______________ | బంధువులును, మిత్రులును | ______________ |

ఉ) వ్యతిరేక పదాలు రాయండి.

1. న్యాయము    2. దుఃఖించు    3. భయము    4. అధర్మము

ఊ) ఏ వాచకమో రాయండి.

1. రాజపుత్రుడు    2. రాజహంస    3. దేవదత్తుడు    4. ఖగము

ఋ) సొంతవాక్యాల్లో ప్రయోగించండి.

| | | |
|---|---|---|
| 1. | తగవుమాలిన | |
| 2. | టక్కరిచూపు | |
| 3. | హర్షభాష్పములు | |

ౠ) అలంకారాన్ని గుర్తించండి.

చెల్లిరావె! మంచిమల్లిరావె! కల్పవల్లి రావె! పాలవెల్లి రావె!!

## VI సృజనాత్మకత :

1. హంస 'తీర్పు' పాఠం ద్వారా నీవు తెలిసికొన్న నీతిని వివరిస్తూ ఒక కథ రాయి.
2. ''దేవదత్తుడు-గౌతము''ల మనస్తత్వములందలి తారతమ్యతను తెలియచేయండి.

కింది నానుడులు ఎలా వచ్చాయో ఉపాధ్యాయులద్వారా, పెద్దల ద్వారా తెలుసుకోండి.

''హంస నడక''  ''హంస పాదం''  ''నీరక్షీర వివేకం''

ప్రాజెక్టుపని :

- Blue Cross Society of India కార్యకలాపాలను గురించి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి. Computer సహాయంతో ఆకర్షణీయమైన చిత్రాలు-వివరాల రూపంలో సమర్పణ (Presentation) చేయండి.
- తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా 'హంస తీర్పు' అను సంపూర్ణ పద్యభాగాన్ని పంతులవారిగా పద్యపఠనం చేయండి.

## రసాస్వాదన

కవితలను చదువునపుడు మన మనస్సులు చెప్పలేని ఆనందముతో నిండుతాయి. కళ్ళు చెమరుస్తాయి. కవితలలోని పాత్ర చిత్రణ, సంఘటనలు, ప్రకృతి సౌందర్యము కళ్ళముందు కనిపిస్తాయి. మరొకప్పుడు సంఘములోని వాస్తవాల చిత్రీకరణద్వారా జాగృతి కలిగిస్తాయి. ఇవన్నీ మనస్సులోని భావుకతకు, కవిత్వ రసాస్వాదనకు చిహ్నాలు.

కృత్యపత్రికలోని పద్యభాగము నందలి మూల్యాంకనములో కవితా రసాస్వాదన అనే అంశము చేర్చబడినది.

కవితా రసాస్వాదన-విషయ సౌందర్యము, కవితా సౌందర్యము మరియు భాషా సౌందర్యము (భాషా విశిష్టతలు) అను మూడు ముఖ్యాంశాల పరిశీలన ద్వారా కలుగుతుంది. కవిత్వములో అలతిపదాలలో అనంతమైన అర్థం వ్యక్తమవుతుంది. కవిత్వంలో నిర్దోషము, తగిన పదాల ఎంపిక, కల్పనలు, ఊహలు, ప్రతీకాత్మకత (symbolic) మరియు భాషాపరమైన ప్రత్యేకతల ద్వారా పద్యంలో కవి యొక్క భావం ప్రస్ఫుటమౌతుంది.

పై అంశాలను దృష్టిలో నుంచుకొని కవిత్వాన్ని అభ్యసించినచో దాని అర్థం, భాషాసౌందర్యాలను కలిపి ఆస్వాదించవచ్చు. పూర్తి కవితనుకాక కొంత భాగం లేదా కొన్ని పాదాల రసాస్వాదన గావించ వలసి వచ్చినను ఇదే పద్ధతిని అనుసరించాలనే విషయాన్ని గుర్తుంచుకోగలరు.

'ఉడుతాభక్తి' నుండి గ్రహించిన 'రాముడు నిన్నుగాంచి' అను పద్యములోని కవిత్వ రసాస్వాదన చిహ్నాలైన వాత్సల్యరసాన్ని, అలంకారాన్ని, పదవైచిత్రి మొదలగువానిని గమనిద్దాము.

'రాముడు నిన్నుగాంచి'.... అను ఈపద్యం ''ఉడుతాభక్తి'' అను పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది. దీనిని రచించిన వారు నేమాని రామజోగి సన్యాసిరావుగారు.

రామచంద్రుడు సేతువును నిర్మించుచున్న సమయంలో ఉడుత నీట తడిసి, ఇసుకలో పొరలి ఇసుకను సముద్రంలో వేయసాగింది. అది చూచిన శ్రీరామచంద్రుడు దానిని వాత్సల్యంతో వీపుపై నిమురగా ఉడుత శరీరంపై ఆతని వేలిముద్రలు పడినవని కవి వర్ణించారు. దీనిలో ''పాణిపద్మములు'' అన్న ప్రయోగం ద్వారా పద్మములవంటి సున్నితమైన సుకుమార హస్తములను కన్నులకు కట్టారు కవి. కవి తాను చెప్పదలచిన భావాన్ని ఉపమాలంకారం ద్వారా స్పష్టం చేసినపుడు అది పాఠకుని మనస్సులో ముద్రవేసుకుంటుంది. అలాగే రాముని స్వభావం కూడా మనకీపద్యం ద్వారా కళ్ళకు కట్టారు కవి. రాముడు మూగ జీవులపట్ల చూపిన వాత్సల్యరసం పాఠకుల మనస్సును ద్రవింపజేస్తుంది. రాముని మనస్సు ఎంత సున్నితమో ఈ పద్యం ద్వారా గ్రహింపవచ్చు. భక్త శేఖరా! అన్న పదం ఉపయోగించడంలో రామానుగ్రహం గలగటం ఎంతో భక్తి ప్రపత్తులు కలవారికి కూడా సాధ్యం కాదని, అదొక భాగ్య విశేషమని కవి భావించారు.

ఇతరులకు సహాయ పడుటను భగవంతుడు కూడా మెచ్చుకుంటాడని అన్యాపదేశంగా కవి సూచిస్తున్నారు.


నేనివి గ్రహించా :

- సర్వప్రాణులయందు కరుణ కలిగి యుండుట
- ప్రాణదానము, అవయవదానముల ఆవశ్యకత.

# 5. సంక్రాంతి



**నేపథ్యం :** పై చిత్రాలు ఏ పండుగను సూచిస్తున్నాయి. ఇప్పుడు కవికోకిల గుఱ్ఱం జాషువాగారు ఏ పండుగను వర్ణించారో చూద్దామా!



మ. ఒడలన్ జెమ్మటలూర కర్షకజన వ్యూహంబు రేయిం బవల్
పుడమిన్ దున్నిన దీర్ఘకష్టఫలితంబున్ ధాన్యరూపంబుతో
నిడి విశ్రాంతి యొసంగు పండుగవు, దేవీ! నీవు ఆనందపుం
గడలిం దేలె సమస్తలోకమును సంక్రాంతీ! నమోవాకముల్. 1

 మ. అలరారెన్ దెలిమబ్బు లున్నతధరేంద్రాగ్రంబులన్, బంతితో
టలు, చేమంతులు గుమ్మడుల్ పసుపుబట్టల్ దాల్చి, లేమొగ్గన
వ్వులతో స్వాగత మిచ్చు చున్నవి, భగత్పుణ్యాగమం బెల్లసీ
మల విశ్రాంతికి కారణం బగు గదమ్మా! పర్వరాజ్ఞీమణీ! 2

మ. చలితో రేగిన రోగబీజముల దోషం బెల్ల నీ భోగి మం
టలతో దగ్ధము జేసి జీవితపుతోటల్ శుద్ధి గావించి, రా
గల సంవత్సర మెల్ల దేశమున సౌఖ్యశ్రీలు వర్షించి, ని
ర్మలధీశక్తు లొసంగు మమ్మ! శుభసంక్రాంతీ! దిగంతంబులన్.. 3

శా. వచ్చున్ సంకురుమయ్య భూతలికి నీ బంగారుతే రెక్కి మీ
కిచ్చున్ మేళ్ళని శాస్త్రముల్ బలుకు, నేడెట్లైన నీ రాకచే
పచ్చంబడ్డవి మామనోబ్జములు సంప్రాప్తించె నీసత్కటా
క్షోచ్చచ్ఛాయల నన్నవస్త్రములు మాకో పర్వరాజేశ్వరీ! 4


ఆ.వె. నీళ్ళు మోసి మోసి నింగిని మేఘముల్
పర్వతాలిశయ్య వవ్వళించె
కలత లెల్ల బాసి కొలకులు పరిశుభ్ర
జలయుతంబు లై ప్రశాంతి నలరె! 5

ఆ.వె. కర్ష కాళి బాహుకష్టంబు ఋణమీగి
క్షేత్రరాజి నిద్ర జెంద సాగె
కాడిమ్రాని బరువు గడచి పోవగ నెడ్లు
హాయి మీర నెమరు వేయుచుండె. 6

ఆ.వె. మానవులకె కాదు మహి నెల్ల సృష్టికి
తలప నీదు రాక సెలవు రోజు
ప్రణతు లమ్మ సంకురాతిరి యింటింట
నడుగు మోపి విందు గుడిచి పొమ్ము. 7

ఉ. రైతుల సేవకున్ కొలుచు రాసు లొసంగి ఋణంబు నీగు భూ
మాత విధాన మేలునకు మారుగ మే లొనరింప దీ నర
వ్రాతము ఎన్న డీ నరుల జాతి మనస్సులలో కృతజ్ఞతా
నైతికధాన్యబీజములు నాటి ప్రశాంతి ఫలంబు లిత్తువో. 8





**కవి పరిచయం : కీ.శే. గుఱ్ఱం జాషువా** గారు 28 సెప్టెంబరు 1895 సంవత్సరంలో జన్మించారు. ప్రాథమికోపాధ్యాయునిగా పనిచేశారు. మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరూరా తిరిగి మంచిపేరు తెచ్చుకున్నారు. వీరు ఉభయభాషా ప్రవీణులు, 1956 నుండి 1960 వరకు ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసరుగా ఉద్యోగం నిర్వహించారు. **కవికోకిల, కవితా విశారద, నవయుగ కవిచక్రవర్తి, కవిసామ్రాట్** అను బిరుదులను పొందారు. అనేక సాహితి సంస్థలచే సన్మానాలు పొందారు. వీరు **శిల్పి, ఫిరదౌసి, ముసాఫిరులు, స్వయంవరం, క్రీస్తుచరిత్ర** మున్నగు కావ్యములను రచించిరి. వీటిలో వీరి 'క్రీస్తుచరిత్ర' కావ్యమునకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం **'కళాప్రపూర్ణ'** బిరుదుతో సత్కరించింది. ప్రస్తుత పాఠ్యభాగం **'ఖండకావ్య సంపుటి'** (ఆరవ భాగము) అనుగ్రంథం నుండి గ్రహించబడింది.

**I చర్చించండి.**

1. మన పండుగలు
2. పండుగలు జరుపుకోవటంలో ముఖ్యోద్దేశ్యం
3. తెలుగు నెలల పేర్లు
4. మన పండుగలు – అవి వచ్చే నెలలు
5. సంక్రాంతి పండుగ జరుపుకొనుటలో ముఖ్యోద్దేశ్యం.

**II ఆలోచించండి - రాయండి.**

**పదజాలం పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.**

1. ఒడలు = శరీరము; కర్షకులు = రైతులు; వ్యూహంబు=సమూహము; రేయి=రాత్రి; పుడమి=భూమి; ధాన్యము=పంట; కడలి=సముద్రము; నమోవాకములు=నమస్సులు.

**భావము :** శరీరము చెమటలు చిందుచుండగా రైతులు రాత్రింబవళ్ళు శ్రమించి భూమిని దున్నెదరు. వారి కష్టమునకు ధాన్యరూపంబులో పంటలనిచ్చి వారికి విశ్రాంతిని ఇచ్చెదవు. నీవందించిన ధాన్యరాశులతో ప్రజలు ఆనందమనెడి సముద్రములో తేలియాడుచున్నారు. ఓ దేవీ! నీకు మా నమస్సులు.

2. ధరేంద్రాగ్రములు=పర్వతములు; తాల్చి=ధరించి; ఆగమము=వచ్చుట; పర్వము=పండుగ; రాజ్ఞీ=రాణీ.

**భావము:** తెల్లని మబ్బులు పర్వతాగ్రములలో ఒప్పారుచున్నవి. బంతులు, చేమంతులు, గుమ్మడిపూలు లేత నవ్వులతో పసుపు బట్టలు ధరించి నీకు స్వాగతము పలుకుచున్నవి. ఓ పండుగల రాణీ! నీ రాక ఈ జగత్తునకంతయు విశ్రాంతి నొసంగుచున్నది.

3. దగ్ధము చేసి = నశింపజేసి; శుద్ధి=శుభ్రము; కావించి=చేసి; వర్షించి=కురిపించి; ధీశక్తి=బుద్ధిబలము; దిగంతంబులు=దిక్కుల అంతములు.

**భావము:** చలికాలమందు వ్యాపించు వ్యాధులను భోగిమంటలతో కాల్చివేసెదవు. జీవితమనే ఉద్యానవనమును పరిశుభ్రము చేయునట్టి ఓ సంక్రాంతీ! రాబోవు కాలమంతయు దేశమందు సౌఖ్యలక్ష్మిని కురిపించు నిర్మలమైన శక్తియుక్తులను ప్రపంచమునకు ప్రసాదించుము.

4. తేరు=రథము; సంప్రాప్తించెను=కలిగెను; ఛాయ=నీడ.

**భావము :** బంగారు రథము నెక్కి సూర్యుడు భూతలికి మేలు చేకూర్చుటకు వచ్చునని సకల శాస్త్రములు పలుకుచున్నవి. ఓ సంక్రాంతి లక్ష్మీ! నీ రాకచే మా మనస్సులు ఆనందముతో నిండినవి. నీ కటాక్షముచే అన్నవస్త్రములు మాకు సమకూరినవి.

5. నింగి = ఆకాశము; శయ్య=పడక; కలతలు=కష్టములు; కొలకులు = కొలనులు;

**భావము :** నీళ్ళతో నిండినట్టి నల్లని మేఘములు ఇప్పుడు పర్వతప్రాంతమందు నిద్రించుచున్నవి. కొలనులన్నీ ఇప్పుడు పరిశుభ్రమైన జలముతో అలరారుచున్నవి.

6. ఆళి=సమూహము; ఈగు=తొలగించు.

**భావము :** కర్షకులు పడిన శ్రమకు తగ్గ ఫలితమునందించి క్షేత్రము విశ్రాంతి పొందుచున్నది. ఇంతవరకు కాడి బరువు మోసి అలసిపోయిన ఎడ్లు ఇపుడు హాయిగా నెమరు వేసుకొనుచున్నవి.

7. మహి=భూమి; ప్రణతి=నమస్కారము; కుడుచు=ఆరగించు;

**భావము :** కేవలం మానవులకే కాక భూమిపై గల సమస్త సృష్టికి సంక్రాంతి రాక విశ్రాంతి పొందు కాలము. అందరికి ఆనందమును కూర్చు ఓ సంక్రాంతీ! ప్రతి ఇంట అడుగుపెట్టి విందారగింపుము. నీకు నమస్సులు.

8. ఒనరించు=చేయు, నరవ్రాతము=నరుల సమూహము; బీజము=విత్తు/విత్తనము.

**భావము:** రైతుల కష్టమునకు తగిన ధాన్యరాసులను ఇచ్చి ఈ భూమాత ఋణము తీర్చుకొనుచున్నది. మానవులు మాత్రము మేలొనరించిన వారికి తిరిగి మేలు చేకూర్చలేకున్నారు. సంక్రాంతి లక్ష్మీ, ఎప్పుడు నీవు ఈ నరుల రాతిగుండెల్లో కృతజ్ఞతా బీజములను నాటి ప్రశాంతతను కలుగ జేయుదువు.

ఆ) ఒకటి, రెండు వాక్యములలో జవాబులు రాయండి.

1. రైతుల కష్టానికి సంక్రాంతి ఏ రూపంలో ఫలితమందజేయుచున్నది?
2. పసుపు బట్టలు ధరించినవి.
3. భోగి మంటల వలన కలుగు ప్రయోజనం తెలపండి.
4. నీరు మోసి మోసి పవ్వళించెనని కవి వేటిని గూర్చి వర్ణించెను?

ఇ) ఐదు, ఆరు వాక్యములలో జవాబులు రాయండి.

1. సంక్రాంతిలక్ష్మి కర్షకుల ఋణము తీర్చుకొన్న విధం.
2. సంక్రాంతి సర్వప్రాణులకు విశ్రాంతి నొసంగుచున్నది-వివరించండి.
3. మానవులలో ఎటువంటి పరివర్తన కవి కోరుకుంటున్నాడు?

III స్వీయ వ్యక్తీకరణ:

1. సంక్రాంతి సమయంలోని ప్రకృతి సౌందర్యాన్ని గురించి మీ సొంతమాటల్లో వర్ణించండి.
2. భూమాత కర్షకుల ఋణము ఏ విధంగా తీర్చుకొనుచున్నదో మీ మాటల్లో తెలపండి.

IV భాషావగాహన

అ) కింది వాక్యాలలోని గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించి పట్టికలో రాయండి.

| పదము | భాషాభాగము |
|---|---|
| 1. విశ్రాంతి నొసంగు పండుగవు దేవీ! నీవు | |
| 2. లే మొగ్గ నవ్వులతో స్వాగత మిచ్చుచున్నవి. | |
| 3. కొలకులు పరిశుభ్ర బలయుతంబులై ప్రశాంతి నలరె. | |
| 4. మేఘముల్ పర్వతాళి శయ్య పవ్వళించె. | |

ఆ) జతపరచండి

| | |
|---|---|
| ధర + ఇంద్ర | కర్షకాళి |
| పుణ్య + ఆగమము | పర్వతాళి |
| పర్వత + ఆళి | ధరేంద్ర |
| కర్షక + ఆళి | పుణ్యాగమము |

ఇ) సంధి కార్యములు రాయండి.

| పదము | విడదీసి రాయుట | సంధిపేరు |
|---|---|---|
| 1. స్వాగతమిచ్చు | = ______ + ______ → | ______ |
| 2. ______ | = మహిని + ఎల్ల → | ______ |
| 3. ______ | = మేలు + ఒనరింప → | ______ |

**ఈ) సరియగు సమాసములను గుర్తించండి.**

1. **రేయింబవళ్ళు**

ద్వితీయా తత్పురుష సమాసం    ద్వంద్వ సమాసం    తృతీయా తత్పురుష సమాసం

2. **రాజ్ఞీమణి**

చతుర్థీ తత్పురుష సమాసం    సప్తమీ తత్పురుష సమాసం    షష్ఠీ తత్పురుష సమాసం

3. **పర్వతాళి**

షష్ఠీతత్పురుష సమాసం    తృతీయా తత్పురుష సమాసం    ద్వంద్వ సమాసం

4. **అన్నవస్త్రంబులు**

ప్రథమా తత్పురుష సమాసం    తృతీయా తత్పురుష సమాసం    ద్వంద్వ సమాసం

**ఉ) కింది వృత్తంలోని పదాలకు, చతురస్త్రంలోని వ్యతిరేక పదాలను వెదికి రాయండి.**

| వృత్తం | చతురస్త్రం |
| --- | --- |
| రేయి, విశ్రాంతి | అవిశ్రాంతి, కీడు |
| ఆనందము, శాంతి | నేల, పగలు |
| మేలు, నింగి | అశాంతి, దుఃఖము |

**ఊ) కింది పదాలకు వాచకము గుర్తించి రాయండి.**


1. దేవి –
2. చేమంతులు –
3. అమ్మ –
4. వస్త్రములు –
5. సంకురుమయ్య –

**ఋ) కింది పదాలను సొంతవాక్యములలో ప్రయోగించండి.**

1. అలరారు  2. దగ్ధము చేయు  3. సంప్రాప్తించు

## V అల్లిక

సంక్రాంతికి కవి ఉపయోగించిన పర్యాయపదాలు రాయండి.



**ఉపక్రమము :**

1. అంతర్జాలం (ఇంటర్నెట్)లో చూసి తెలుసుకొని కింది పట్టికను పూరించండి.

| పండుగ | జరుపుకునే ప్రాంతాలు | ప్రత్యేకతలు |
|---|---|---|
| సంక్రాంతి | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులు, బొమ్మల కొలువు, పిల్లలకు భోగిపళ్ళు. |
| పొంగల్ | తమిళనాడు | పొంగలి |
| సంక్రాంత్ | మహారాష్ట్ర | తిల్‌గుడ్ పంచుకోవడం |
| సంక్రాంత్ | గుజరాత్ | గాలిపటాలు |
| ఉగాది<br>గుడిపాడ్వ | | |
| దసరా నవరాత్రులు<br>దీపావళి | | |

2. ఉపాధ్యాయుల సహాయంతో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగను మీ పాఠశాలలో జరుపుకోండి. దానిని గురించి ఒక నివేదిక రాయండి. దానిని బ్లాగ్‌లో ప్రచురించండి.

**ప్రాజెక్టుపని :**

సంక్రాంతి పండుగను వివిధ రాష్ట్రాలలో ఏ విధంగా జరుపుకుంటారో తెలుసుకోండి. తరగతిలో చెప్పండి.



**నేనివి గ్రహించా :**

- వివిధ పండుగల ప్రాముఖ్యత
- పండుగలు జరుపుకొనుటలో వైవిధ్యం
- కాలానుగుణంగా ప్రకృతిలో వచ్చు మార్పులు.

# అవధానము

పఠనం

అవధానము తెలుగు భాషలో అత్యంత ప్రసిద్ధిజెందిన మహోన్నతమైన భాషాప్రక్రియ. ఈ విశిష్టప్రక్రియ సంస్కృతము, తెలుగు మొదలగు కొన్నిభాషలకు మాత్రమే స్వంతము.

**అవధానము-విధములు**

- అష్టావధానము
- శతావధానము
- సహస్రావధానము
- పంచసహస్రావధానము

ఇందులో అష్టావధానము చాలా ప్రసిద్ధి చెందినది. తెలుగునాట ఈ అవధాన కార్యక్రమము తరుచుగా జరుగుచుండుట విశేషము. అవధాన ప్రక్రియ నిర్వహించే అవధాని సంస్కృతము మరియు తెలుగు భాషలలో అపరిమిత భాషా పటుత్వము, పరిజ్ఞానము కలిగిన వాడైయుంటాడు.

అంతేకాకుండ ఏకాగ్రత మరియు ధారణశక్తి కలిగియుండుట అత్యావశ్యకము. అవధానమంటే అవధాని ఏకాగ్రత మరియు ధారణా ప్రతిభకు పరీక్ష. అష్టావధానములో వైవిధ్యమైన ప్రశ్నలు అడుగుటకు ఎనమండ్రుగురు ఉంటారు. వీరిని పృచ్ఛకులు అంటారు. వీరు ఈ క్రింది విధంగా అవధానికి ప్రశ్నలు సంధిస్తారు.

1) సమస్యా పూరణ 2) దత్తపది 3) నిషిద్ధాక్షరి 4) పురాణ పఠనము 5) ఆశువు 6) హాస్య లేదా అప్రస్తుత ప్రసంగము 7) సద్యోవర్ణన 8) గంటారవము.

**సమస్యాపూరణ :** ఇందులో ఏదేని పద్యంలో ఒక పాదము విపరీతార్థములో ఇవ్వబడును. అవధాని ఇచ్చిన పాదమును మార్చకుండా మిగతా మూడు పాదములు ఒక్కొక్క పాదమును చెబుతూ పద్యమును విపరీతార్థము లేకుండా చక్కదిద్ది పూరిస్తాడు.

**దత్తపది :** పృచ్ఛకుడు తనకు తోచిన ఏవేని నాలుగు పదములు ఇచ్చి అన్యార్థములో తానిచ్చిన విషయముపై పద్యం చెప్పమంటాడు.

**నిషిద్ధాక్షరి :** అవధాని పద్య పాదములనల్లుచుండగా పృచ్ఛకుడు రాబోవు అక్షరమును గ్రహించి ఆ యక్షరము అక్కడ నిషిద్ధమంటాడు. ఆ విధంగా మధ్యమధ్యలో అక్షరాలను నిషేధిస్తుంటాడు. అవధాని ఆ యక్షరము మార్చి వేరొక యక్షరముతో భావము చెదరకుండా పద్యమును పూరిస్తాడు.

**పురాణ పఠనము :** పృచ్ఛకుడు ఏదేని ఒక పురాణమునుండి తనకు నచ్చిన పద్యమును చదివి, అది ఏ పురాణములోనిదో, వ్రాసిన వారెవరో, సందర్భము గురించి చెప్పమంటాడు.

**ఆశువు :** పృచ్ఛకుడు తానిచ్చిన నిర్దిష్టాంశముపై ఆశువుగా (వెంటనే) సంపూర్ణ పద్యమును చెప్పమంటాడు.

**హాస్య ప్రసంగము :** ఈ పృచ్ఛకుడు అవధాని ఏకాగ్రతను భంగము చేయడానికి మధ్య మధ్య హాస్యాన్విత విషయములపై ప్రశ్నలను అడుగుతాడు.

**సద్యోవర్ణన :** అవధానము జరుపుచున్న స్థలమునకు సంబంధించి పద్యములో వర్ణించుమని ఈ పృచ్ఛకుడు అడుగుతాడు.

**గంటారవము :** అవధాన కాలములో పృచ్ఛకుడు మధ్య మధ్య అప్పుడప్పుడు గంటలుకొట్టి తాను ఎన్ని గంటలు కొట్టినాడో చెప్పుమని అడుగుతాడు.

ఈ విధంగా ఎనమండ్రుగురు పృచ్ఛకులు ఒకరి తరువాత ఒకరు అడిగిన ప్రశ్నలనన్నింటిని జ్ఞాపకముంచుకొని అవధాని వరసగా అందరి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం జరుగుతుంది. ఇది అమితమైన ఏకాగ్రత, పాండిత్యం ఉన్నవారికే సాధ్యమౌతుంది.

చివరికి అవధాని సంపూర్ణ అవధాన ప్రక్రియలో చదివిన పద్యములను ఏకాధాటిగా చదివి వినిపిస్తాడు. కొట్టిన గంటల సంఖ్యను తెలియజేస్తాడు. దీనినే ధారణా ప్రతిభ అంటారు. అవధానము పూర్తి కావడానికి రమారమి రెండు గంటల సమయం పడుతుంది.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు :

**దత్తపది : (చీమ, దోమ, నల్లి, పేను) శ్రీ కృష్ణరాయబారం గూర్చి**

'చీ మ' తి చెడ్డదేల, తమ సేమము నారయజాలరేల, ఏ
'దో మ' మకారమిట్లు మిము దోషపు మార్గమునందు నిల్పెనే
ప్రేమను జూపి వారు మును 'పే ను' తికెక్కిరి పాండుపుత్రులా
భీమబలాఢ్యులాలమున నేయరె మిమ్ముల 'నల్లి' బిల్లిగన్.

**సమస్యాపూరణ : ''పుష్పముల వల్ల పాడయ్యెపూలతోట''**

''పూలకోసము వచ్చిన బాలవెల్ల
రెమ్మలను చూసి కొమ్మలు త్రెంచివేయ
వగపు చెందిన యజమాని వదరెనిట్లు
పుష్పములవల్ల పాడయ్యె పూలతోట''

**వర్ణన / సద్యోవర్ణన**

ఒకసారి జంటకవులైన దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రికవులు అష్టావధానం చేస్తుండగా ఒక పృచ్ఛకుడు 'వర్ణన' అను అంశానికిగానూ దశావతరాల గురించి వర్ణించమని అడిగాడట. తిరుపతి వేంకటకవులు పద్యం చెప్పడం ప్రారంభిస్తుండగా, కందపద్యంలో చెప్పమని అడిగాడట. సరేనని పద్యం కొనసాగిస్తుండగా, అయ్యా! పద్యంలో మా అధ్యక్షుడు పరబ్రహ్మశాస్త్రిగారి పేరుకూడా వుండాలని కోరాడట. సరేనని పద్యం పూరిస్తుండగా మధ్యలో మళ్ళీ ఆపి దానిలో మీరిద్దరి పేర్లుకూడా వుండాలని అన్నాడట. అప్పుడు అవధానులు ....

జలచర,ఢులి, కిరి, నరహరి
కలితవటు, త్రివిధ రామకల్కులు, బుద్ధం
డిల తిరుపతి వెంకటేశా
స్త్రులను, పరమబ్రహ్మశాస్త్రి, జూతురు పేర్మిన్ – అని పూరించారట.

దీని అర్థం ..... ఈ లోకంలో

జలచరం – మీనావతారం, ఢులి – కూర్మావతారం

కిరి – వరహావతారం, కలితవటు – వామనావతారం

త్రివిధరామః – పరశురాముడు, శ్రీరాముడు, బలరాముడు; కల్కి – కల్కి అవతారం, బుద్ధుండు – బుద్ధుడు, తిరుపతి వేంకటశాస్త్రులను, పరబ్రహ్మ శాస్త్రిని ప్రేమతో చూతురు.


# 6. తెలుగు జాతి వైభవం



**నేపథ్యం :**

- ప్రపంచ మాతృభాషా దినోత్సవం ఎప్పుడు జరుపుకొంటారు?
- తెలుగు భాషాదినోత్సవంను ఎప్పుడు జరుపుకొంటారు?
- 'దేశభాషలందు తెలుగులెస్స' అని చెప్పిన వారెవరు?
- ప్రపంచభాషలలోని అందమైన లిపిగల భాషగా తెలుగుభాష స్థానం ఏంటో తెలుసా?
- వివిధ రంగాలలో, వివిధదేశాలలో కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్న తెలుగువారి విశేషాలు, చిత్రాలతో ఒక గోడ పత్రికను రూపొందించండి.

ఇప్పుడు తెలుగు జాతి వైభవాన్ని కవి ఏ విధంగా విశ్లేషించారో చూద్దాం.



తెలుగు పతాకం యెగురని దిశయే లేదు
తెలుగు దివ్వె వెలుగనట్టి దిశయే లేదు
తెలుగు వెలుగు చేరలేని దేశం లేదు
తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు. 1

వేయి స్థంభముల గుడిని వెలయించిన చేతులు
వేయి యేండ్ల మన గాథలు వినిపించే గీతలు
కాకతి రుద్రమను మరువగలుగునెవరు? సోదరీ
రాయల పౌరుషము మరువరాదెన్నడు సోదరా! 2

నాగార్జునాచార్య నవ బోధనలోన
నరుల నాగరకతయే నాట్యమాడేనులే
నందికొండ శిల్పాలకు నతు లొనరించాలి
సుందరమగు రామప్పకు వందే అనాలి. 3





నా దేశ వైభవము గానమై వినిపిస్తుంది.
గోదావరి తీరంలో 'కో' అంటే చాలును
కృష్ణానది తరంగాల తృష్ణతీర్చు సుధాఝరులు
నాగార్జున సాగరాన నాట్యమాడు తరంగాలు. 4

నన్నయ పద్యమొక్కటి నాల్కమీద ఉన్న చాలు
అన్ని విద్య లొకసారే ఆకళించినట్లునుండు
తిక్కన పద్య మొక్కటి చక్కగ చదివిన చాలు
తెలుగు జాతి నుడికారము తెలిసికొన్న యటలన్. 5

పోతన పద్య మొక్కటి ప్రీతిగ చదివిన చాలును
అమృతమునే రుచిచూచిన ఆనందము కలుగును
విశ్వదాభిరాముడైన వేమన ఆటవెలదిలో
విశ్వమెల్ల ఇమిడిపోయి వేదాంతం విరియును. 6

త్యాగరాజ కీర్తనతో తాదాత్మ్యం పొందితే
సంగీతం హృదయంలో జడివానై కురియును
కలకాలం మన ఐక్యత కాపాడాలి
తెలుగుజాతి గౌరవాన్ని నిలబెట్టాలి. 7





**కవి పరిచయం : కీ.శే.డా॥ దాశరథి కృష్ణమాచార్యులు** గారు జులై 22, 1925న తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లాలోని చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. ఈయన ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణి ప్రయోక్తగా పనిచేస్తూ తన అభ్యుదయ రచనలు, సినీసాహిత్యాన్ని రాసారు. ఇతని ప్రసిద్ధరచనలు **అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, కవితాపుష్పకం, తిమిరంతో సమరం** మొదలగునవి. వీరు కేంద్రసాహిత్య అకాడమి పురస్కారగ్రహీత. వీరు నవంబరు 5, 1987లో పరమపదించారు.

ప్రస్తుత పాఠ్యభాగం **'సుప్రసిద్ధగేయాలు-పాటలు'** అనే సంకలన పుస్తకంనుండి గ్రహించబడింది.

**I చర్చించండి.**

1. మీకు తెలిసిన వివిధ భాషల పేర్లు.
2. మీరు చూచిన వివిధ రకాల శిల్పకళా క్షేత్రాలు.
3. మన జాతీయపతాక ప్రాముఖ్యత.
4. మీకు తెలిసిన ప్రాచీనకవుల పేర్లు.

**II చదవండి - ఆలోచించండి - రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.**

1. పతాకం = జెండా; దిశ = దిక్కు; దివ్వె = దీపం; కోశం = ఇల్లు; వెలుగు = కాంతి; చేరలేని = వెళ్ళలేని.

**భావము :** తెలుగు జెండా ఎగురని ప్రదేశం గాని, తెలుగు జ్యోతి వెలుగని దిక్కుగాని లేదు. తెలుగు కాంతి చేరని దేశం గాని, తెలుగు కాంతి చేరని ఇల్లుగాని లేదు.

2. వెలయించిన = కట్టించిన; యేండ్లు = సంవత్సరములు; గాథలు = కథలు; గీతాలు = పాడటానికి వీలుగా వుండే కవితలు; సోదరీ = చెల్లెలా!; సోదరా = తమ్ముడా!

**భావము :** ఓ చెల్లెలా! తమ్ముడా! వేయిస్తంభాల గుడిని కట్టించిన వారిని, వేయి సంవత్సరాల మన కథలను వినిపించే గీతాలను, కాకతీయ రుద్రమదేవి, కృష్ణదేవరాయల పౌరుషాన్ని మరచి పోకూడదు.

3. నాగార్జున + ఆచార్య = నాగార్జునుడను గురువు; నవ = కొత్త; బోధనలోన = నేర్పినదానిలో; నరుల = మానవుల; నతులొనరించడం = నమస్కరించడం; సుందరమగు = అందమైన.

**భావము :** నాగార్జునుడు బోధించిన కొత్త విషయాలలో నాగరికత నాట్యమాడింది. నందిగొండ శిల్పాలకు నమస్కరించాలి. అందమైన రామప్పదేవాలయానికి నమస్కారములు చెప్పాలి.

4. వైభవము = గొప్పతనము; తరంగాలు = అలలు, తృష్ణ = దాహం; సుధ = అమృతము; ఝురులు = ధారలు (జలపాతాలు)

**భావము :** నా దేశ వైభవము గోదావరీ తీరంలో గానమై వినిపిస్తుంది. నాగార్జున సాగరంలో నర్తించే తరంగాలు కృష్ణానది కోరికలను తీర్చు అమృతధారలు.

5. ఆకళించు = పూర్తిగా తెలుసుకొని; నుడికారము = భాషలోని చమత్కారము, పలుకుబడి.

**భావము :** ఆదికవియైన నన్నయ పద్యాన్ని కంఠతాపట్టిన అన్ని విద్యలు ఒకేసారి పూర్తిగా నేర్చుకున్నట్లే, అలాగే తిక్కన పద్యమొక్కటి చదివిన తెలుగు జాతి మొత్తం భాషాచమత్కారం తెలుసుకోవచ్చు అని కవి చెబుతున్నారు.

6. ప్రీతిగ = ఇష్టముతో; ఆనందము = సంతోషము; ఇమిడి = ఒదిగి, సర్దుకొని; వేదాంతం = ఉపనిషత్తు; విరియును = వికసించును.

**భావము :** పోతన పద్యము ఒక్కటి ఇష్టముతో చదివినాచాలు, అమృతం రుచిచూసిన ఆనందం కలుగుతుంది. అట్లే వేమన పద్యాలలో లోకమంతా నిండిన ఉపనిషత్తుసారం విపులంగా తెలుస్తుంది.

7. తాదాత్మ్యం = లీనమగుట; ఐక్యత = ఏకత్వం; కలకాలం = ఎల్లప్పుడు.

**భావము :** త్యాగరాజు రాసి, పాడిన కీర్తనలతో లీనమైపోతే హృదయంలో సంగీతం వానై కురిసినట్లుంది. వీటన్నింటిని తెలుసుకొని ఎప్పటికీ మన ఐకమత్యాన్ని, మన తెలుగుజాతి గౌరవాన్ని నిలుపుకోవాలి.

## III వినండి - చర్చించండి - రాయండి.

అ) 1) కింది వాటికి ఒకటి, రెండు వాక్యాల్లో జవాబులు రాయండి.

i) మనము ఎవరెవరికి నమస్కరించాలి.


ii) తెలుగుదేశ గొప్పతనాన్ని తెలియ జేయునవి.

iii) పోతన పద్యాన్ని ప్రీతిగా చదివితే కల్గునది.

2) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

i) నన్నయ, తిక్కనలను గూర్చి కవి చెప్పిన విధము.

ii) మన ఐక్యతను, గౌరవాన్ని నిలబెట్టుకొను విధము.



ఆ) కింది గేయపాదాలను జతపరచండి.

| | |
|---|---|
| గోదావరి తీరంలో | వందే అనాలి. |
| సుందరమగు రామప్పకు | జడివానై కురియును. |
| కాకతి రుద్రమను | 'కో' అంటే చాలును. |
| సంగీతం హృదయంలో | మరువగలుగునెవరు? |
| | నాదాలై వినబడును. |

## IV స్వీయ స్పందన :

1) తెలుగు జాతి వైభవాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

2) మన ఐక్యతను కాపాడుకోవలసిన ఆవశ్యకతను మీ సొంతమాటల్లో రాయండి.

3) వేమన పద్యాల ప్రాముఖ్యతను మీ సొంతమాటల్లో రాయండి.

4) పోతన పద్యాలను చదువుట వలన కలుగు ఆనందాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

## V భాషావగాహన :

అ) కింది వాక్యములో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.

<u>పోతన</u> పద్యమొక్కటి <u>ప్రీతిగ</u> <u>చదివిన</u> చాలును.

ఆ) కింది పదాలకు సంధికార్యాలను రాయండి.

| | పదము | | విడదీయుట | సంధి పేరు |
|---|---|---|---|---|
| 1. | వెలుగు నట్టి | = | + | |
| 2. | | = | మరువరాదు + ఎన్నడు | |
| 3. | | = | వేయి + ఏండ్లు | |
| 4. | ఆకళించినట్లు | = | + | |

ఇ) కింది పదాలకు పట్టికలో అడిగిన విధంగా రాయండి.

| పదము | విగ్రహవాక్యము | సమాసనామం |
|---|---|---|
| 1. రాయలపౌరుషం | | |
| 2. | నన్నయయును, తిక్కనయును | |
| 3. | నాదేశము యొక్క వైభవము | |

ఈ) కింది వాక్యములలో గుర్తింపబడిన ప్రత్యయములను, సరియైన విభక్తులతో జతపరచండి.

| | |
|---|---|
| నందికొండ శిల్పాలకు నతులొనరించాలి. | ద్వితీయా విభక్తి |
| వేయిస్తంభాల గుడిని వెలయించిన చేతులు | షష్ఠీ విభక్తి |
| త్యాగరాజు కీర్తనతో తాదాత్మ్యం పొందుదురు. | తృతీయా విభక్తి |

ఉ) వాక్యభేదములను గుర్తించి రాయండి..

(ఆశ్చర్యార్థకము, ప్రశ్నార్థకము, నిశ్చయార్థకము, వ్యతిరేకార్థకము)

1) కాకతి రుద్రమను మరువగలుగునెవరు?

2) నా దేశ వైభవము నాదాలై వినబడును.

3) రాయల పౌరుషము మరువరాదెన్నడు సోదరా!

4) తెలుగు వెలుగు చేరలేని దేశం లేదు.

ఊ) కింది పదాలకు వచనములను మార్చి రాయండి.

1) చేతులు 2) దేశము

3) దిశ 4) గాథలు

ఋ) కింది పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.

1) సోదరి 2) గుడి

3) సోదరుడు 4) పోతన

ౠ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) వెలుగు × 2) అమృతము ×

3) అగౌరవము × 4) అనైక్యత ×

ఎ) కింది పదాలను మీ సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) ఇమిడి పోవుట : ______________________________

2) వెలయించుట : ______________________________

3) వైభవము : ______________________________

4) ఆకళించినట్లు : ______________________________

ఏ) కింది గేయపాదములందలి అలంకారాన్ని గుర్తించి రాయండి.

(వృత్త్యను ప్రాసము, ఛేకాను ప్రాసము, లాటానుప్రాసము, అంత్యాను ప్రాసము)

తెలుగు వెలుగు చేరలేని దేశం లేదు.
తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు. → (          )

## కృత్యం

అ) కింది గేయములను చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.

1) కింది గేయాపాదాలను సరియైన వాక్యాలతో జతపరచండి.

| | |
|---|---|
| వేయిస్తంభముల గుడిని | మరువ రాదెన్నడు సోదరా! |
| రాయల పౌరుషము | గానమై వినిపిస్తుంది. |
| నందికొండ శిల్పాలకు | వెలయించిన చేతులు |
| నాదేశ వైభవము | నతులొనరించాలి. |

(పాఠ్యభాగంలోని 1 నుండి 4 గేయముల వరకు)

2) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

i) వెలయించుట : ........................................................................

ii) వైభవము : ........................................................................

3) i) తెలుగు పతాకం .......... కోశంలేదు – ఈ గేయంలోని కవితా సౌందర్యాన్ని మీ మాటల్లో వ్యక్తీకరించండి.

ii) నా దేశవైభవం ..... తరంగాలు ఈ గేయంలోని కవితా సౌందర్యాన్ని మీ మాటల్లో వివరించండి.

ఆ) 2-3 పద్యాల ద్వారా నీవు పొందిన రసాస్వాదన సారాంశమును సొంతమాటల్లో తెలియజేయుము.

## VI అల్లిక

1) కింది అల్లికను పూరించండి :

మనము మరచిపోకూడని వారు

2) ప్రాముఖ్యతను చెబుదాం.

- తెలుగుపతాకం
- తెలుగు వెలుగులు
- తెలుగు దివ్వె

**ప్రాజెక్టుపని :**

మహారాష్ట్రలో తెలుగు జాతివైభవాన్ని చాటిన, చాటుతున్న కట్టడాలు, వ్యక్తులు, రచయితలు, కవుల గురించిన సమాచారాన్ని సేకరించండి. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో సమర్పించండి.

## కవితా సౌందర్యము

కవి ఆలంకారికంగా పొందుపరచిన విధానము, ఉపయోగించిన అలంకారాలు, ఛందస్సులతో కవి గావించిన కవితాసృష్టి ద్వారా మన మనస్సుపై ఏర్పడిన పరిణామము, తద్వారా మనకు జ్ఞప్తికి వచ్చే వాటిని పోలిన ఇతర కవితలు వీటన్నింటి సమాహార ప్రభావమే కావ్య సౌందర్యము.

కవిత్వంలోని వస్తువు, విషయము, కవిత్వములో వెల్లడించిన ఆలోచనలు, విలువలు, ఇచ్చిన సందేశము, భావనలు వీటన్నింటి ద్వారా కవితా సౌందర్యము వెల్లడి అవుతుంది.

ఉదాహరణకు వామనాగమనము పాఠములోని 5–7 పద్యాల కవితా సౌందర్యాన్ని పరిశీలిద్దాము.

పోతనకవి రచించిన భాగవతం శబ్దాలంకారములతో తేటనైన తెలుగు పదాలతో ఎంతో రమణీయంగా సాగుతుంది. వామనుడు యజ్ఞశాలలో సంచరించి రాజును చేరిన విధము అలతి పదాలతో వృత్త్యనుప్రాసాలంకారానికి ప్రాణం పోసింది.

**''వెడవెడనడకలు నడుచుచు.**

**నెడనెడనడుగిడకనడరి'' – అన్న పద్యంలో 'డ' కారపునరావృత్తి ఆ పద్యానికే ఒక సౌందర్యాన్ని చేకూర్చింది.**

7వ పద్యంలో బలిచక్రవర్తి రాక్షసరాజే అయినప్పటికి మూడులోకాలను శాశించువాడని, ఇంద్రుని జయించినవాడని, ఔదార్యగుణం కలవాడని మునీంద్రులచే ప్రశంసింపబడు క్రతువులు చేయువాడని, ఆయన గొప్పదనాన్ని వామనుడు తెలియజేస్తాడు. తాను అడగబోతున్న మూడడుగుల నేలను కాదనకుండా ''ముందరి కాళ్ళకు బంధంవేస్తూ'' ఔదార్య గుణం కలవాడని వామనుడు బలిని ప్రశంసించడం కావ్యసౌందర్యాన్ని తెలియజేస్తోంది.

**నేనివి గ్రహించా :**

- వేయిస్తంభాల గుడి, గోదావరి, కృష్ణా నదుల విశిష్టత.
- తెలుగు భాషా ప్రాముఖ్యత.
- వాగ్గేయ కారుల భాషాసేవ.

# 1. బాధ్యతాయుత పౌరుడు

గద్యభాగం

**నేపథ్యం :** ఇంటాబయట మనం కొన్ని పనులు బాధ్యత తీసుకొని చేయాల్సి వస్తుంది. మనకు కావలసిన పనులను చేయడమే కాకుండా జరగకూడని పనులు లేదా ఇతరులకు అసౌకర్యం కలిగించే పనులు జరుగుచున్నపుడు మనం సొంతలాభం ఆశించక బాధ్యత తీసుకొని వాటిని చక్కబెట్టడం లేదా సరిచేయడం యుక్తమైనపని. అంటే ప్రజాసంపద కాపాడటం వంటి పనులు ఎప్పుడైనా మీరు చేశారా?

- 'సొంతలాభం కొంతమానుకు పొరుగువాడికి తోడుపడవోయ్' - అన్నమాటల అంతరార్థమేమి?
- రైళ్ళు, బస్సులు మొ. ప్రజాసంపద, చారిత్రక కట్టడాల విషయంలో దేశపౌరులుగా మన బాధ్యతలేంటి?
- ప్రస్తుత పాఠంలోని యువకుడైన ప్రతాప్ ఒక బాధ్యతాయుత పౌరునిగా తన బాధ్యతను ఎలా నిర్వహించాడో తెలుసుకుందామా!

ధీరగుణ్ గౌతమీ రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు. అతని మంత్రి పేరు సర్వోత్తమ్. ఆ రాజ్యంలో కొందరు ప్రజలు నిత్యం తమ హక్కుల గురించి పోరాటాలు చేస్తూ ఉండేవారు. ప్రజలు తమ బాధ్యతలను మరచి హక్కుల కోసం పోరాడటం ధీరగుణ్ మహారాజుకు ఏ మాత్రం నచ్చలేదు. ఒక రోజు రాజు-మంత్రి మాట్లాడుకుంటున్నారు. అనుకోకుండా బాధ్యతాయుతమైన పౌరుల గురించి చర్చసాగింది.

గౌతమీ రాజ్యం మంత్రి.

''మంత్రివర్యా! మనదేశంలో పౌరులు తమతమ బాధ్యతలను విస్మరించి జీవనం సాగిస్తున్నారు. వీరికి క్రమశిక్షణతో కూడిన బాధ్యతను నేర్పించాలని ఉంది. బాధ్యతాయుత పౌరులు కొందరు మనకు కనిపించినా దేశప్రజలకు వారు స్ఫూర్తిదాయకమౌతారనేది నా ఆశ. ఏదైనా ఉపాయం చెప్పండి'' అన్నాడు మహారాజు ధీరగుణ్.

మంత్రి సర్వోత్తమ్ మాట్లాడుతూ ''మహారాజా! మీరు చెప్పినది అక్షర సత్యం. మనదేశంలో పౌరులు తమ హక్కుల

విస్మరించి=మరచి; స్ఫూర్తి = ప్రేరణ;



కోసం పోరాడుతున్నారే తప్ప వారి బాధ్యతలను విస్మరించారు. వారిని సక్రమమైన దారిలో పెట్టవలసిన అవసరం ఉంది'' అని ఒక ఉపాయం చెప్పాడు మంత్రి సర్వోత్తమ్.

మరుసటి రోజు నగరవీధి నడికూడలిలో పెద్ద బండరాయి ప్రత్యక్షమైంది. దానిపై ముళ్ళకంప కూడా ఉంది. నడిచే మనుషులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

**నగరవీధి కూడలిలో ప్రత్యక్షమైనది.**

అయితే ఏ ఒక్కరూ వాటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదు. ముళ్ళు తమ ఒంటికి గుచ్చుకోకుండా చాకచక్యంగా తప్పుకుని వెళుతున్నారే తప్ప వాటిని తొలగించే ప్రయత్నం ఒక్కరూ చేయలేదు. ఈ సన్నివేశాన్ని మారువేషాలలో చెట్టుక్రింద కూర్చుని రాజు-మంత్రి గమనిస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం కావస్తున్నా రహదారి నడికూడలిలో ఉన్న అతిపెద్ద బండరాయి, దానిపైఉన్న ముళ్ళకంపను తొలగించే ప్రయత్నం ఏ ఒక్కరూ చేయలేదు. మధ్యాహ్నం పొలంనుండి వస్తున్న ప్రతాప్ అనే యువకుడు బండరాయి, దానిపైవున్న ముళ్ళకంపను చూశాడు. ముందుగా ముళ్ళకంపను తొలగించి రహదారి ఆవలకు విసిరాడు. అనంతరం బండరాయిని తొలగించే ప్రయత్నం చేశాడు. ఈ దృశ్యాన్ని ప్రజలంతా వీక్షిస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ ప్రతాప్‌కు సాయపడలేదు. కొద్దిసేపటికి ప్రతాప్ ఆ బండరాయిని రహదారి నడికూడలి నుండి తొలగించడంలో విజయం సాధించాడు. ఇంతలో తొలగించిన బండరాయి క్రింద కొన్ని చిన్నమూటలు ఉన్నాయి. ప్రతాప్ వాటిని ఊడదీసి చూశాడు. అందులో వజ్రాలు, వైఢూర్యాలు, కెంపులు ఉన్నాయి. ప్రతాప్ ఆనందంగా వాటిని తీసుకుని ఇంటిముఖం పట్టాడు. అక్కడ నిలబడి ఈ వింతను చూస్తున్న ప్రజల్లో కొంతమంది యువకులు ప్రతాప్‌ను అడ్డుకున్నారు.

**మారు వేషాలలో చెట్టుక్రింద కూర్చున్నవారు.**

**బండరాయిని తొలగించే ప్రయత్నం చేసినవారు.**

''నీకు దొరికిన ఈ వజ్రవైఢూర్యాలలో మాకూ భాగం ఇవ్వు'' అని అడ్డుకున్నారు.

**కూడలి = త్రోవలు కలిసే చోటు;**
**వీక్షించడం = చూడడం;**



''నాకు దొరికిన వాటిలో మీకు భాగం ఎందుకు ఇవ్వాలి?'' ప్రశ్నించాడు ప్రతాప్.

''వీటిని మేము కూడా చూశాము. చూసిన వారికి కూడా వీటిపై హక్కు ఉంటుంది?'' అని వారు వాదించారు.

''మిత్రులారా! ఇక్కడ విలువైన వజ్రాలు, రత్నాలు ఉన్నట్లు నాకు తెలియదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నందున రహదారికి అడ్డుగా ఉన్న బండరాయి, ముళ్ళకంపను నేను తొలగించాను. కాకతాళీయంగా ఈ సొమ్ము దొరికింది. అయితే వీటిని నా సొంతానికి ఖర్చు చేయాలనుకోవడం లేదు. ఇవి అమ్మగా వచ్చిన సొమ్ముతో రహదారులకు ఇరువైపులా పూలు, ఫలాలనిచ్చే చెట్లను నాటాలనుకుంటున్నాను. బాటసారులకు అవి కడుపునింపుతాయి. మిగిలిన డబ్బుతో మంచి వైద్యశాల నిర్మించి ప్రజలకు మేలు చేయాలనుకుంటున్నాను'' అన్నాడు ప్రతాప్.

''మేము ఒప్పుకోము. ఈ సొమ్ములో మాకు వాటా ఇవ్వవలసిందే'' పట్టుపట్టారు అక్కడి యువకులు.

అక్కడే చెట్టు క్రింద మారువేషాలలో ఉన్న రాజు, మంత్రి ఆ యువకుల వద్దకు చేరుకున్నారు. మారువేషాలు తొలగించి వారి అసలు రూపం చూపించారు. అక్కడి ప్రజలంతా అవాక్కయ్యారు.

''ఈ బండరాయి, ముళ్ళ కంప రహదారికి అడ్డంగా పడినప్పుడు మీరంతా ఏమయ్యారు? వాటిని ఎందుకు తొలగించలేదు. అప్పుడు మీ బాధ్యత గుర్తుకు రాలేదా? అయాచితంగా సొమ్ము దొరికేసరికి మీ హక్కులు గుర్తుకు వచ్చాయా?'' కోపంగా ప్రశ్నించాడు మహారాజు ధీరగుణ్.

పురప్రజలంతా సిగ్గుతో తలలు దించుకున్నారు.

''హక్కులతోపాటు బాధ్యతగా వ్యవహరించడమేకాక తనకు దొరికిన విలువైన సొమ్మును సమాజహితం కోసం ఖర్చు పెట్టాలనుకుంటున్న ప్రతాప్ బాధ్యతాయుతమైన పౌరుడిగా వ్యవహరించాడు. మా ధనాగారం నుండి ఇంకా కొంత మొత్తాన్ని తెప్పించి ప్రతాప్‌కు బహుకరిస్తాను. ప్రజాహితమైన ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు చేసే అధికారిగా ప్రతాప్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నాను'' అని మహారాజు ప్రకటించారు. తాము బాధ్యతను మరచినట్లు అక్కడి యువకులు అంగీకరించి ఇకపై తమ హక్కులకోసం మాత్రమే అర్రులు చాచకుండా బాధ్యతతో వ్యవహరిస్తామని మహారాజు ముందు ప్రతిజ్ఞ చేశారు. ప్రజలంతా స్నేహభావంతో సమిష్టిగా కష్టపడి పని చేయడంతో ఆ రాజ్యం మరింత శోభాయమానంగా అభివృద్ధిచెంది ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లారు.

**కాకతాళీయంగా = అనుకోకుండా;**
**సొమ్ము = ధనం; అయాచితంగా = అడగకుండా;**
**పురము = పట్టణము, రాజ్యము.**



**రచయిత పరిచయం :** తెలుగుభాషకు వెలుగు తెస్తున్న వారిలో ఒకరు **బాలసాహితీరత్న షేక్ అబ్దుల్ హకీం జాని**. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలిలో షేక్ ఫరీద్ సాహెబ్, మహబూబ్‌బీ దంపతులకు 01-01-1963లో జన్మించిన వీరు వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడు, ప్రవృత్తిరీత్యా బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. బాలసాహిత్యంలో 30 పుస్తకాలు, 200 కథలు రచించారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా 1991 నుండి తెలుగు పత్రికలకు వ్యాసాలు రాయగా 1300 వ్యాసాలు ప్రచురితమై **'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'**లో స్థానం పొందారు. వయోజనుల కోసం 29 పుస్తకాలు, **డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, మన వీరవనితలు, సంపూర్ణ ఆంధ్రప్రదేశ్ యాత్రా దర్శిని, సుందర భారతయాత్రాదర్శిని** గ్రంథాలు రచించారు. వీరు చేసిన కృషికిగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం **ఉగాది పురస్కారం, పర్యాటక శాఖ ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పురస్కారం,** తెలుగు విశ్వవిద్యాలయం వారి **ధర్మనిధి పురస్కారం**తో పాటు మొత్తం 21 పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుత పాఠ్యభాగము **'అమ్మఒడి'** అను కథల సంపుటి నుండి గ్రహింపబడినది.

## I చర్చించండి..

1) పౌరుల హక్కులు – విధులు.

2) బాధ్యతగల పౌరులుగా మీరు చేసిన మంచి పనులు.

3) 'స్వంతలాభం కొంత మానుకొని పొరుగు వాడికి తోడుపడవోయ్' అనే అంశంపై చర్చించండి.

## II చదవండి – ఆలోచించండి – రాయండి.

### అ) కింది వాటికి రెండు నుండి నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) రాజు–మంత్రి చర్చించుకున్న విషయం.

2) ప్రతాప్ బండరాయిని, ముళ్ళకంపను తొలగించిన విధం

3) ప్రతాప్ దొరికిన సొమ్ముతో చేస్తానన్న పనులు.

4) రాజు యువకులకు తమ బాధ్యత తెలియజేసిన విధము.

### ఆ) ఎవరు ఎవరితో పలికిరి.

1) ఏదైనా ఉపాయం ఉంటే చెప్పండి.

2) మీరు చెప్పినది అక్షర సత్యం.

3) నీకు దొరికిన వజ్రవైఢూర్యాల్లో మాకూ భాగం ఇవ్వు.

4) ఈ సొమ్ములో మాకు వాటా ఇవ్వవలసిందే.

### ఇ) కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) మంత్రి పేరు సర్వోత్తమ్. ( )

2) చెట్టుపైన కూర్చుని రాజు, మంత్రి గమనిస్తున్నారు. ( )

3) నగరవీధి నడికూడలిలో పెద్ద బండరాయి ప్రత్యక్షమయింది. ( )

4) ఈ డబ్బుని నా సొంతానికి ఖర్చు చేయాలనుకుంటున్నాను. ( )

## III స్వీయవ్యక్తీకరణ

1) చదువు విషయంలో మీ బాధ్యతలను వివరింపుము.

2) పౌరులు బాధ్యతలు నిర్వహించకపోతే కలిగే పరిణామాలను ఆలోచించి రాయుము.

## IV భాషావగాహన :

### అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.

1) <u>ధీరగుణ్</u> గౌతమీ రాజ్యాన్ని <u>చక్కగా</u> <u>పరిపాలిస్తున్నాడు</u>.

2) <u>అనంతరం</u> బండ రాయిని తొలగించే <u>ప్రయత్నం చేశాడు</u>.

ఆ) కింది పదాలను విడదీసి, సంధినామం రాయండి.

| | పదము | | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|---|
| 1) | | = | సాగిస్తు + ఉన్నారు | → | |
| 2) | | = | నాటాలి + అనుకుంటు | → | |
| 3) | ఫలాలనిచ్చే | = | + | → | |
| 4) | | = | మరచిన + అట్లు | → | |

ఇ) కింది పట్టికను పూరించండి.

| | పదము | | విగ్రహవాక్యము | | సమాసము పేరు |
|---|---|---|---|---|---|
| 1) | | = | సమాజం యొక్క హితం | → | |
| 2) | | = | వజ్రములును, వైఢూర్యాలును | → | |
| 3) | పురప్రజలు | = | | → | |

ఈ) కింది వాక్యాలు సామాన్య/సంయుక్త/సంశ్లిష్టములలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.

1) ఈ సన్నివేశాన్ని మారువేషాలలో రాజు, మంత్రి గమనిస్తూనే ఉన్నారు.

2) మేము ఒప్పుకోము.

3) వీటిని మేము కూడా చూశాము.

4) ఇవి అమ్మగా వచ్చిన సొమ్ముతో రహదారులకు ఇరువైపులా చెట్లు నాటాలనుకుంటున్నాను.

ఉ) గుర్తింపబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) దానిపై ఉన్న ముళ్ళకంపను చూశాడు.

2) వీటిని మేము కూడా చూశాము.

3) "ఈ సొమ్ములో మాకు వాటా ఇవ్వవలసిందే" పట్టుబట్టారు అక్కడి యువకులు.

4) నా సొంతానికి ఖర్చు చేయాలనుకోవడం లేదు.

ఊ) కింది పదాలకు వచనము మార్చి రాయండి.

1) పౌరులు = 2) బాధ్యత =

3) హక్కు = 4) సొమ్ములు =

ఋ) కింది పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.

1) రాజు = 2) బండరాయి =

3) పూలు = 4) యువకుడు =

ఋ) వ్యతిరేకపదాలు రాయండి:

1) ధీరుడు × 2) విజయం ×

3) మేలు × 4) అంగీకారం ×

ఎ) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) స్ఫూర్తి 2) నడికూడలి 3) కాకతాళీయంగా 4) స్నేహభావం

ఏ) కింది వాక్యాలు ఏకాలములకు చెందినవో గుర్తించి రాయండి.

1) బండరాయిని తొలగించే ప్రయత్నం చేసాడు.

2) ప్రజలకు మేలు చేయాలనుకుంటున్నాను.

3) ప్రతాప్‌ను అధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నాను.

## కృత్యం

కింది గద్యమును చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.

**i) కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.**

1) ముందుగా ముళ్ళకంపను తొలగించి రహదారి ఆవలకు విసిరాడు.

2) నడిచే మనుషులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

3) అందులో వజ్రాలు, వైఢూర్యాలు, కెంపులు ఉన్నాయి.

4) బండరాయి కింద కొన్ని చిన్న మూటలు ఉన్నాయి.

| "మరుసటి రోజు నగరవీధి ................ నుండి ........ అని వారు వాదించారు" వరకు. |
|---|

**ii) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.**

1) వీటిని మేము కూడా చూశాము. (   )

2) మరుసటి రోజు నగరవీధి నడికూడలిలో పెద్ద విగ్రహం ప్రత్యక్షమైంది. (   )

3) ప్రతాప్ వాటిని ఊడదీసి చూశాడు. (   )

4) చూసిన వారికి కూడా వీటిపై హక్కు ఉంటుంది. (   )

**iii) కింద గీతగీసిన పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.**

1) దానిపై <u>ముళ్ళకంప</u> కూడా ఉంది.

2) <u>ప్రతాప్</u> ఆ బండరాయిని రహదారి నడికూడలి నుండి తొలగించడంలో విజయం సాధించాడు.

**iv) స్వీయస్పందన :**

బండరాయిని తొలగించటం ఎంతవరకు సమంజసమో నీ సొంతమాటల్లో రాయుము.

## VI అల్లిక :

1) మూటలలో ఉన్నవి.

2) మారు వేషంలో ఉన్నవారు.

**ఉపక్రమము :**

జతలు / జట్టులలో హక్కులు – బాధ్యతలకు సంబంధించిన కృత్యమును చేయండి.

ఉదా:

రోజూ కళాశాలకు వెళతావా ?

అవును! రోజూ వెళ్ళకపోతే పాఠాలు అర్థం కావు.

1. రోజూ కళాశాలకు వెళతావా?
2. కష్టపడి చదవడానికి ఇష్టపడతావా?
3. ఇంటిపనులలో అమ్మానాన్నలకు సహకరిస్తావా?
4. వీధిలోని చెత్తను శుభ్రం చేయడానికి ఇష్టపడతావా?
5. రోడ్లపై ఇష్టం వచ్చినట్లు ఉమ్మివేయడం సరైనదా?
6. స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొంటావా?
7. హృదయ పూర్వకంగా పెద్దలను గౌరవిస్తావా?
8. మన ప్రాథమిక హక్కుల గురించి నీకేమయినా తెలుసా?
9. మన హక్కులు మనకు లభిస్తున్నాయా?
10. హక్కులు బాధ్యతల గురించి ఎవరితోనైనా చర్చించావా?

**ప్రాజెక్టుపని :**

జట్టు ప్రాజెక్టు – వైయక్తిక సమర్పణ (క్షేత్రసందర్శనం ఆధారంగా) : మీ జట్టులోని విద్యార్థులందరూ పాఠశాల/కళాశాల చుట్టుప్రక్కల ప్రాంతాలను సందర్శించండి. స్వచ్ఛ భారత్ అభియాన్ ఎంతవరకు అమలుపరచబడింది. గమనించండి. విషయాలను పట్టికలో నమోదు చేసుకోండి.

ఉదా:

| వరుస సంఖ్య | ప్రాంతం | గమనించిన విషయము | శ్రేణి |
|---|---|---|---|
| 1 | ఆంధ్ర స్కూల్ ఆవరణ | • పరిశుభ్రంగా ఉన్నది<br>• తడి-పొడి చెత్త సక్రమంగా ఆయాడబ్బాలలో వేయబడుచున్నది.<br>• మరుగు దొడ్ల పరిశుభ్రత విషయంలో విద్యార్థులు నియమాలను పాటిస్తున్నారు. | A |
| 2 | వడాల-4 నెంబర్ గేట్ | | |

చేసిన ప్రాజెక్టు ఆధారంగా వేరువేరు అంశాల గురించి వైయక్తికంగా ఛాయాచిత్రాలతో సహా సమర్పణ (Presentation) చేయండి.

**ఉపక్రమం :**

భారత రాజ్యాంగంలో పేర్కొన్న పౌరుల **'హక్కులు-బాధ్యత'** ల గురించి వివరంగా తెలుసుకోండి. చర్చావేదిక నిర్వహించండి.

## తత్పురుష సమాసము

కింది పదాలను గమనించండి.

**1. గాడిద చిట్కా 2. ఉప్పు బస్తా 3. బస్తాల బరువు**

ఒకటి కంటె ఎక్కువ పదాలు కలిసి ఒక్క పదంగా ఏర్పడినచో 'సమాసము' అందురు.

దీనిలో మొదటి పదాన్ని **'పూర్వ'** పదమని, రెండవ పదాన్ని **'ఉత్తర'** పదమని అంటారు.

1. పైన ఇచ్చిన 'గాడిద' అన్న పదానికి 'చిట్కా' అన్న పదానికి వేరువేరు అర్థాలు కలవు. రెంటిని కలిపి ఏకపదంగా చేసినచో గాడిద యొక్క చిట్కా అని అర్థమును చెప్పు కొందుము. ఈ విధంగా సమాసము యొక్క అర్థాన్ని తెలియజేయుటను **'విగ్రహ వాక్యము'** అందురు.

   కిందటి తరగతిలో మీరు విభక్తి ప్రత్యయాలను నేర్చుకొన్నారు కదా! **'యొక్క'** అనునది షష్ఠీ విభక్తి కనుక దీనిని **'షష్ఠీ తత్పురుష సమాసము'** అందురు.

   విభక్తులకు తరువాతి పదముతో గల సంబంధమును తెలియజేయుచున్నాము. కనుక ఉత్తరపదమునకు మనము ప్రాధాన్యతను ఇచ్చుచున్నాము అని అర్థము. ఈ విధంగా ఉత్తర పద ప్రాధాన్యత కల సమాసము **'తత్పురుష సమాసము'** అనబడును.

2. **ఉప్పు బస్తాలు** - దీనికి విగ్రహవాక్యమును చెప్పునపుడు ఉప్పుతో కూడిన బస్తాలు అని అర్థం చెప్పుదుము. ఇందు **'తో'** అను విభక్తి ప్రత్యయమును చెప్పుట వలన ఇది **'తృతీయా తత్పురుష సమాసము'**: అయినది. అట్లే

3. **'బస్తాల బరువు'** = బస్తాల యొక్క బరువు అనునది దీని విగ్రహవాక్యము.

- ప్రథమా తత్పురుష :

**మధ్యాహ్నము** : అహ్నము యొక్క మధ్యభాగము. ప్రథమా విభక్తి ప్రత్యయమును పూర్వపదము చివర కలిపి విగ్రహవాక్యమును చెపుతూ సమాసము చేసినచో అది ప్రథమా తత్పురుష సమాసమగును.

- ద్వితీయ తత్పురుష : రాజాశ్రితుడు = రాజును ఆశ్రయించినవాడు.
- తృతీయా తత్పురుష : రాజపూజితుడు = రాజుచేత పూజింపబడినవాడు.
- చతుర్థీ తత్పురుష : గ్రంథాలయము = గ్రంథముల కొఱకు ఆలయము.
- పంచమీ తత్పురుష : దొంగ భయము = దొంగ వలన భయము.
- షష్ఠీ తత్పురుష : రాజసుతుడు = రాజు యొక్క సుతుడు.
- సప్తమీ తత్పురుష : శాస్త్రనిపుణుడు = శాస్త్రములందునిపుణుడు.
- నఞ్ తత్పురుష : 'న' అనగా లేదు, కాదు అని అర్థము వచ్చును, ఇట్లు వ్యతిరేకార్థమునిచ్చు పదము పూర్వ పదము చేసి విగ్రహ వాక్యము చెప్పినచో ఆ సమాసమును **'నఞ్ తత్పురుష'** సమాసము అందురు. ఉదా.: **అధర్మము** = ధర్మమముకానిది

## ద్వంద్వ సమాసము

సమాసములో ఉత్తర పదమునకు ప్రాధాన్యత కలది తత్పురుష అని తెలుసుకున్నారు కదా. కింది సమాసమును గమనించండి.

**విద్యాబుద్ధులు** – దీనికి విద్యయును, బుద్ధియును అని విగ్రహవాక్యమును చెప్పుదుము. ఏ సమాసము నందు రెండు పదములకు సమానమైన ప్రాధాన్యత వుండునో దానిని **'ద్వంద్వ సమాసము'** అందురు.

**సూత్రము** : ఉభయపద ప్రాధాన్యత కలది ద్వంద్వము.

ఉదా: **తల్లిదండ్రులు**–తల్లియును, తండ్రియును

**కూరగాయలు** – కూరలును, కాయలును.

నేనివి గ్రహించా :

ఒక్కొక్క నీటిబొట్టు కలిసి సముద్రంగా తయారౌతుంది కావున ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వహిస్తే దేశం పురోగమిస్తుంది.

నేడు సంఘాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో 'వ్యసనాలు' కూడా ఒక పెద్ద సమస్య.
దీని నిర్మూలనకు ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నిస్తున్నది.
అయినా బాధ్యతాయుత పౌరులుగా ఈ సమస్య నివారణకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలి.

పొగాకు బహిష్కరణకు
విద్యార్థుల ముందడుగు




## వ్యసన విముక్తి ప్రతిజ్ఞ

ఈ భూమిపై నా జననం మరియు నా శరీరంలో ప్రకృతి ఒసగిన వరం. ఇది చాలా అమూల్యమైనది. వెలకట్టలేనిది. నా ఆయురారోగ్యాల కొరకు ............................................................ చిరునామాలో నివసించు ........... సంవత్సరాల వయస్సుగల చి/కు/శ్రీ/శ్రీమతి. ..........................................అను పేరుగల నేను సిగరెట్, బీడి, మద్యం, పొగాకు, గుట్కా మొదలగువానిని సేవించనని, జీవితంలో ఏ విధమైన వ్యసనానికి బానిసను కానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

తేది : సంతకము

వద్దు వద్దు పోవద్దు
పొగాకు దరికి పోవద్దు
గుట్కా దరికి చేరొద్దు

**"పొగత్రాగటం ఒక వ్యసనం బయటపడటం కఠినం"**

ప్రాణం తీసే పొగాకు
ప్రాణాంతకమీ పొగాకు
క్యాన్సర్ వంటి మహమ్మారులను
కలుగ జేయునీపొగాకు

ప్రాణం తీసే పొగాకుకు
బానిస లసలే కావద్దు.
బంగరు భవితను కూల్చివేసే
పొగాకు జోలికి పోవద్దు.

**"పొగాకు, గుట్కా అపాయకరం నీకు - నాకు - ఎల్లరకు"**

ప్రాజెక్టుపని : పై అంశాలు మరియు మీరే స్వయంగా సేకరించిన/తయారుచేసిన నినాదాలు, చిత్రాల సహాయంతో కొన్ని గోడపత్రికలను, పిడిగల అట్టలను (Placards) తయారుచేసుకోండి. వాటి సహాయంతో పాఠశాలలో, రహదారి కూడలిలో వ్యసన విముక్తి, పొగాకు బహిష్కరణ గురించి పాటలు పాడుతూ చప్పట్లు చరిచి, నినాదాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకొని వీధినాటిక (స్ట్రీట్‌ప్లే) ను ప్రదర్శించండి. ప్రజలలో జాగృతిని కల్గించండి.

# 2. చక్కని ప్రణాళికతో ముందుకెళ్ళండి

**నేపథ్యం :**

- మీ ఇంట్లో ఏదైనా ఒక కార్యక్రమం చేయాలంటే ఏం చేస్తారు?
- ఏ పనినైనా మొదలు పెట్టేముందుగా బాగా ఆలోచించి చక్కని ప్రణాళిక వేసుకుని చేస్తూపోతే అది సక్రమంగా అవుతుంది కదా!

అలాగే మీరు మీ చదువు గురించి ప్రణాళిక వేసుకుంటున్నారు కదూ! జ్ఞానోపార్జన కొరకు మరియు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులవటానికి ప్రణాళికాబద్ధంగా ఎలా చదువుకోవాలని పట్టాభిరాంగారు అంటున్నారో చూద్దామా?

స్టూడెంట్స్‌ని ఎవరినైనా 'ఎలా చదువుతున్నావు?' అని అడిగితే ఇలాంటి సమాధానాలు రావొచ్చు.

''బాగా చదువుతున్నాను''

''బాగానే చదువుతున్నాను''

''ఫరవాలేదు''

''ఏదో చదువుతున్నాను''

''చాలా బాగా చదువుతున్నాననుకుంటున్నాను.''

''చదవాలంటే రావటంలేదు''..

మరి పరీక్షలు అందరూ ఎందుకు పాసవటం లేదు? దానికి కారణం ప్రణాళిక లేకుండా చదవటమే. ప్రణాళికతో చదవటానికి కొన్ని నేర్పులున్నాయి. వీటినే యుద్ధతంత్రాలు (War Strategies) అంటారు. ఇది శత్రువుల మీద యుద్ధం కాదు చదువుని జయించటానికి, పరీక్షలో గెలుపు సాధించటానికి పనికొచ్చే చిన్న చిన్న చిట్కాలు.

## కష్టమనుకున్నదే ముందుగా చదవాలి

చాలామంది స్టూడెంట్స్ తమకు ఫలానా సబ్జక్టు కష్టంగా ఉందని, అది తీరిగ్గా చదవొచ్చు అని పక్కన పెడతారు. ఇది ప్రమాదమైన అలవాటు. సైకలాజికల్‌గా అది కష్టమైనది అని పదే పదే అనుకోవటం జరుగుతుంది. అందుచేత, వెంటనే ఆ సబ్జక్టుని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. కష్టం అనే మాటని మర్చిపోవాలి. ఈ ప్రపంచంలో కష్టాలనేవి ఏవీలేవు. ఇష్టంతో చేస్తే అన్నీ చేయగలుగుతాం. క్లిష్టంగా ఉండే సబ్జక్టు గురించి టీచర్లని అడిగి తెలుసుకోవాలి లేదా క్లాస్‌లో ఆ సబ్జక్టు మీద పట్టు సాధించిన స్టూడెంట్స్‌ని కలిసి తెలుసుకోవాలి. తరువాత మీరు తగిన సమయం చూసుకుని చదవాలి. మనసు బాగా ఫ్రెష్‌గా ఉన్నప్పుడు, ఇతర ఇబ్బందులేవీ లేనప్పుడు చదవాలి.

చిట్కాలు = ఉపాయాలు; క్లిష్టం = కష్టం;
లంకించుకొను = ప్రారంభించు

క్లిష్టమైన విషయాన్ని వీరిని అడిగి తెలుసుకోవాలి.

## ఆందోళన, కంగారు వద్దు

చదివే సమయంలో కొంతమంది స్టూడెంట్స్ కంగారుగా, ఆందోళనగా ఉంటారు. ఆ సమయంలో చదివేది బుర్రకెక్కదు. స్లో అండ్ స్టడీ విన్స్ ది రేస్ (Slow and steady wins the race) అనే సత్యం గుర్తుపెట్టుకుంటే పాల్గొనేవారు, విజిల్ వేయగానే వేగంగా పరుగు లంకించుకోరు, నెమ్మది నెమ్మదిగా స్పీడు పెంచుతారు. అప్పుడు విజయం సాధించవచ్చు.

ప్రారంభంలోనే స్పీడుగా పరిగెడితే, మధ్య దూరంలోనే అలసిపోవచ్చు. అలాగే చదివేటప్పుడు నెమ్మదిగా, ప్రశాంత మనసుతో ప్రారంభించాలి. అలా చదివినది మనసులోకి చొచ్చుకుపోతుంది.

## బ్రేకులుండాలి

వాహనం వేగంగా వెళ్తే బాగానే ఉంటుంది కానీ బ్రేకులేస్తే ఆగాలి. బ్రేకుల్లేని స్పీడు ప్రమాదానికి దారి తీస్తుంది. అదే విధంగా చదువుకునేటప్పుడు కూడా మధ్య మధ్యలో బ్రేకు ఇవ్వాలి. అది మీ వీలుని బట్టి అరగంటో, గంటో కావొచ్చు.

బ్రేకు ఇవ్వకుండా చదివితే మధ్యలో ఆలోచనలు కమ్ముతాయి. కళ్ళు పుస్తకం మీదే ఉన్నా మనసు మరెక్కడో ఉంటుంది. దాని వల్ల టైమ్ వేస్ట్ అవుతుంది. కాబట్టి చిన్న బ్రేకు ఇచ్చి లేచి నడవటం, నీళ్ళుతాగటంలాంటివి చేయాలి. కొంతమంది అలా లేకుండా నాన్‌స్టాప్‌గా చదువుతారు. దానివలన ఒత్తిడి పెరుగుతుంది. ఆ తరువాత ఎక్కువ గ్యాప్ ఇవ్వాల్సి వస్తుంది. మీరు బ్రేకు ఇచ్చినందువల్ల నష్టంలేదు. ఎందుకంటే అప్పుడు కూడా మీ మనసులో చదివిన సబ్జక్టే తిరుగుతూంటుంది.

## చదివే ప్రదేశం ఎలా ఉండాలి?

ఎలా ఉన్నా ఫరవాలేదు. చదవాలనే కోరిక ఉంటే ఎక్కడైన చదవొచ్చు. చదువుకునే ప్రదేశం ఇలా ఉండాలి, అలా ఉండాలి అని నేను రికమెండ్ చెయ్యను దాని వలన సమస్యలొస్తాయి. ఇలాగే ఉండాలి అనుకుంటే మరోలా ఉంటే చదువు బుర్రకెక్కదు. ఎలా ఉన్నా ఫరవాలేదు, కానీ ఆ గదిలో టీవీలు, సినిమా, క్రికెట్ స్టార్ల బొమ్మలు లేకుండా ఉంటేచాలు. మామూలు గది చాలు.

నిజానికి ఆ గది, గదిలో సామాగ్రి ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఉదాహరణకు ఎత్తైన రూఫ్, ఎంతో ఎత్తుకి ఎదగాలని సూచిస్తుంది. గిరగిరా తిరిగే సీలింగ్ ఫ్యాను, నిరంతరం ఉత్సాహంగా పనిచేస్తూ ఇతరులకు ఉల్లాసం అందించాలని చెప్తుంది. గదిలో క్యాలండరు సమయాన్ని వృథా చేయవద్దని, లైటు జీవితంలో వెలుగు నింపమని, స్విచ్చిబోర్డు క్షణాల్లో అనుకున్నది చెయ్యాలని, కిటికీ బయటి ప్రపంచాన్ని గమనించమని, గదితలుపు జీవితాన్ని భద్రంగా చూసుకోమని చెప్తాయి.

చదువుకుంటున్న ప్రదేశంలో వుండకూడనివి.

కొంతమంది స్టూడెంట్స్ నన్ను టీవి చూస్తే తప్పేమిటి? అని అడుగుతుంటారు. తప్పేమీలేదు కానీ దానికి బానిసకాకూడదు. అది చూడలేకపోతే ఉండలేని పరిస్థితి రాకూడదు. కొంతమంది స్టూడెంట్స్ రోజుకి మూడు నాలుగు గంటలు కూడా చూస్తూంటారు. అది మంచి పద్ధతికాదు. టీవి కన్నా చదువుకునే గదిలో మ్యూజిక్ లేదా రేడియో ఉన్నా ఫరవాలేదు. నాకు తెలిసి కాలేజి లైబ్రరీల్లో లేదా టీచర్ సమక్షంలో హాస్టల్ వరండాల్లో చదివిన వారు విజయాలు సాధించారు.

## గ్యారంటీ గెలుపు సాధించాలంటే?

- ప్రతి క్లాసుకి వెళ్ళాలి.
- నోట్సు తీసుకోవాలి.
- తెలియనివి అడిగి తెలుసుకోవాలి.

స్ఫూర్తి = ప్రేరణ; వృథా = వ్యర్థం



* హోమ్‌వర్కు చేయాలి.
* టీచర్లను కలుస్తూ సందేహాలను అడిగి తెలుసుకోవాలి.
* పార్టీలు, పిక్నిక్కులు సెలవుల్లోనే.
* లైబ్రరీకి వెళ్తుండాలి.
* మంచి మార్కులు వచ్చేవారితో స్నేహం చెయ్యాలి.
* చదువెందుకు? అనే సోమరులను దూరంగా ఉంచాలి.
* క్లాస్‌మిస్ అయినపుడు, మర్నాడు ఆ నోట్స్ తీసుకోవాలి.
* పరీక్షలంటే ఆందోళన వద్దు.
* ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలి.
* ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలి.
* పాత పరీక్ష పేపర్లను తిరగేయాలి.
* పరీక్షల ఫలితాల గురించి వర్రీ వద్దు.
* బాగా చదివే వారిపై జెలసీవద్దు.
* భవిష్యత్తు గురించి భయం వద్దు.
* ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు.
* వ్యాయామానికి కనీసం పావుగంట.

ఇవి అన్నీ కాకపోయినా కొన్ని సాధన చేస్తే గెలుపుమీదే.

### ఎందుకు చదవాలి?

నలుగురు విద్యార్థులు, సముద్రం ఒడ్డున నడుచుకుంటూ వెళ్తున్నారు. సముద్రంలోంచి కొట్టుకు వచ్చిన నక్షత్రపు చేప (స్టార్‌ఫిష్)లను మళ్ళీ నీళ్ళలోకి విసిరేస్తూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. ఇంతలో ఒక వృద్ధురాలు కనపడి. ''చూడండి బాబూ వేలాదిగా కొట్టుకొస్తున్న ఈ చేపల్ని మళ్ళీ నీళ్ళలో వేయటం మీ తరమా? ఇలా ఎన్నింటిని బతికించగలరు?'' అని అడిగింది. దానికి అందులో ఒక అబ్బాయి ''ఏ చేపకి బతకాలని రాసుందో, అదే మాకంట పడుతుంది దాన్ని నీళ్ళలోకి విసిరేస్తాం.'' అన్నాడు.

''మంచిది నాయనా'' అని మెచ్చుకుని ఆ వృద్ధురాలు, ''చూడండి బాబూ, ఇక్కడున్న గవ్వల్ని మర్చిపోకుండా ఇంటికి తీసుకెళ్ళండి మీకు మంచి జరుగుతుంది'' అని చెప్పి వెళ్ళిపోయింది. 'ఏదో ముసల్ది... ఏదో చెప్పింది' అని సణుక్కుంటూ ఒక అబ్బాయి ఒక గవ్వ తీసుకుని జేబులో వేసుకున్నాడు. రెండోవాడు ఏమీ తీసుకోలేదు. మూడోవాడు పది, నాలుగోవాడు రెండు జేబుల్నిండా వేసుకున్నారు. ఇంటికి వెళ్ళారు. మర్నాడు ఉదయం లేచేసరికి వాళ్ళ గవ్వలు, అత్యంత ఖరీదైన మణులుగా మారి పోయాయి.

రెండు జేబుల్నిండా తీసుకున్నవాడు అత్యంత ధనికుడయ్యాడు. పది తీసుకున్నవాడు చిన్న వ్యాపారం పెట్టుకున్నాడు, ఒక్కటి తీసుకున్నవాడు చిన్న ఉద్యోగంలో చేరాడు. ఏమీ తీసుకోనివాడు వీళ్ళ ఇళ్ళలో పాలేరు పనిలో చేరాడు.

ఈ కథ చదువుతున్న విద్యార్థులందరూ ఇందులోని సారాంశం కనిపెట్టే ఉంటారు. ఆ సముద్రపు ఒడ్డుని పాఠశాల అనుకుంటే, వృద్ధురాలు టీచరు, ఏరుకున్న గవ్వలు మనకు అబ్బిన జ్ఞానం అనుకోవాలి. ఎంత జ్ఞానం సంపాదిస్తే, ఆనక అంత సుఖంగా ఉండవచ్చు అనే సత్యం స్టూడెంట్స్ గుర్తించాలి. ఆ నలుగురూ కూడా సహజంగా మంచివారే, నదిలోంచి కొట్టుకు వస్తున్న చేపల్ని రక్షించే గుణం ఉంది. కానీ ఇతరులు చెప్పింది వినే విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికున్నాయి. అవే వారి భవిష్యత్తు నిర్ణయించాయి.



**రచయిత పరిచయం :**

**డా. బి.వి. పట్టాభిరామ్** అంతర్జాతీయంగా పేరు పొందిన హిప్నాటిస్టు, మెజీషియన్ మరియు ఫిలాసఫీలో నిష్ణాతులు. డా. పట్టాభిరామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ''యోగహిప్నాటిజమ్'' అనే అంశంపై పి.హెచ్‌డి. పొందారు. హిప్నాటిజమ్‌పై భారతదేశంలో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి పరిశోధకులు డా. పట్టాభిరామ్. ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన ''గుడ్‌స్టూడెంట్'' అను పుస్తకం నుండి స్వీకరించబడింది.

**I చర్చించండి.**

1. ప్రణాళిక అంటే ఏమిటి? ఎటువంటి విషయాల్లో అది అవసరం.
2. ప్రణాళికను అనుసరించి పనులు చేయటం వలన కలుగు లాభాలు.
3. అక్షరాస్యత మానవులకు ఎంతవరకు అవసరం.

**II ఆలోచించి రాయండి.**

**అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1) చదివినది మనస్సులోకి ఎక్కాలంటే ఇలాంటి జాగ్రత్తలు అవసరం.

2) మన గదిలోని వస్తువులే మనకు స్ఫూర్తిదాయకం.

3) గెలుపు సాధించాలంటే దృష్టిలో ఉంచుకోదగ్గ విషయాలు.

**ఆ) గడులను సరియగు పదములతో పూరించండి.**

1) పరీక్ష పాసవక పోవటానికి కారణం [ ] లేకుండా చదవటమే. (శ్రద్ధ, విరామం, ప్రణాళిక)

2) క్లిష్టంగా వుండే సబ్జక్టు గురించి [ ] అడిగి తెలుసుకోవాలి. (పక్కవారిని, టీచర్‌ని, మిత్రులని)

3) చదివేటప్పుడు నెమ్మదిగా [ ] మనసుతో ప్రారంభించాలి. (ప్రశాంత, తేలిక, దృఢమైన)

4) చదవాలనే [ ] ఉంటే ఎక్కడైనా చదవొచ్చు. (తీరిక, కోరిక, ఆశ)

**ఇ) కింది వాక్యాలను సరైన వరుసక్రమంలో అమర్చండి.**

1) కిటికి బయటి ప్రపంచాన్ని గమనించమంటుంది.

2) ఎత్తైన రూఫ్, ఎంతో ఎత్తుకు ఎదగాలని సూచిస్తుంది.

3) ఆ గదిలో టీవీలు, సినిమా, క్రికెట్‌స్టార్ల బొమ్మలు లేకుండా ఉంటేచాలు.

4) చదవాలనే కోరిక వుంటే ఎక్కడైనా చదవొచ్చు.



**III స్వీయవ్యక్తీకరణ**

1) ''చదువులో గెలుపు సాధించాలంటే'' – మీ అభిప్రాయాన్ని వ్యక్తీకరించండి.

2) టీ.వి. చూడటం చదువుకు ఆటంకం – సమర్థించండి.

**IV భాషావగాహన :**

**అ) కింది వాక్యములలో గుర్తింపబడిన పదాలు ఏ వాక్యాంగాలో తెలపండి.**

1) <u>విద్యార్థులు</u> ఒక ప్రణాళిక ప్రకారం చదవాలి.

2) <u>నలుగురు విద్యార్థులు</u> నడుచుకుంటూ వెళ్తున్నారు.

3) గదిలో <u>సామగ్రి</u> స్ఫూర్తినిస్తుంది.

4) <u>స్టూడెంట్స్</u> నన్ను <u>అడిగారు</u>.

**ఆ) కింది వాక్యాల్లో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగాలో తెలపండి.**



1) ఇది **ప్రమాదకరమైన** అలవాటు.

(క్రియ, నామవాచకం, విశేషణం)

2) **స్టూడెంట్స్** తమకు ఆ సబ్జెక్టు కష్టంగా ఉంది అంటారు.

(విశేషణం, సర్వనామం, నామవాచకం)

3) వాహనం **వేగంగా** వెళితే బాగానే వుంటుంది.

(నామవాచకం, విశేషణం, క్రియ)

4) **మీరు** బ్రేకు ఇచ్చినందువల్ల నష్టం లేదు.

(విశేషణం, అవ్యయం, సర్వనామం.)

5) పాత పరీక్ష పేపర్లను **తిరగేయాలి**.

(సర్వనామం, క్రియ, విశేషణం)

**ఇ) అడిగిన విధంగా సంధులను పూరించండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1) | | ప్రమాదము + ఐన | → | |
| 2) | ఎవరినైనా | + | → | ఇకార సంధి |
| 3) | | పనికి + ఒచ్చు | → | |
| 4) | బుర్రకెక్కదు | + | → | |
| 5) | | ఎందుకు + అంటే | → | ఉకారసంధి |

**ఈ) సమాసములను జతపరచండి.**

| | |
|---|---|
| యుద్ధతంత్రాలు | షష్ఠీతత్పురుష సమాసము |
| నీళ్ళు తాగటం | చతుర్థీతత్పురుష సమాసము |
| వాహనవేగం | ద్వితీయాతత్పురుష సమాసము |

**ఉ) కింది వాక్యాల్లో గుర్తించబడినవి ఏ విభక్తులో తెలపండి.**

1) ప్రణాళికతో చదవటానికి కొన్ని నేర్పులున్నాయి.

2) ప్రపంచంలో కష్టాలనేవి ఏవి లేవు.

3) క్లిష్టంగా ఉండే సబ్జక్టును గురించి టీచర్లను అడగాలి.

4) నాన్‌స్టాప్‌గా చదవటం వలన ఒత్తిడి పెరుగుతుంది.

5) టీచర్లను కలుస్తూవుండాలి.

**ఊ) కింది వాక్యములు సామాన్య, సంశ్లిష్ట, సంయుక్తములలో ఏరకమునకు చెందినవో రాయండి.**

1) స్టూడెంట్స్ కంగారుగా, ఆందోళనగా వుంటారు.


2) వాహనం వేగంగా వెళ్తే బాగానే వుంటుంది కానీ బ్రేకులేస్తే ఆగాలి.

3) బ్రేకు ఇవ్వకుండా చదివితే మధ్యలో ఆలోచనలు కమ్ముతాయి.

4) చదవాలనే కోరికవుంటే ఎక్కడయినా చదవచ్చు.

5) ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలి.

**V కింది అల్లికను పూరించండి :**




**ప్రాజెక్టుపని :**

సమయపాలన, సమయం విలువ, సకాలంలో పనులు చేయుట వలన లాభాలు-చేయక పోవడం వలన నష్టాలు మొదలగు సమయ నిర్వహణకు సంబంధించి వివిధ భాషలలో గల సామెతలు, జాతీయాలను వేరు వేరు వనరుల నుండి సేకరించండి. ఆ సంకలనాన్ని ఆకర్షణీయమైన ఒక గోడపత్రికగా రూపొందించండి. పాఠశాల సాహితీ సమ్మేళనంలో గోడపత్రిక పఠనం (Poster reading) చేయండి.

**నేనివి గ్రహించా :**

చక్కని ప్రణాళికతో పద్ధతి ప్రకారం ముందుకు సాగుట, తద్వారా పని సామర్థ్యం-ఆత్మవిశ్వాసం పెరిగి ఒత్తిడికి గురికాకుండా ఏ పనినైనా నెరవేర్చగలం.



# ఆహారం-ఆరోగ్యం



ఒక్క చదువే కాదు. చక్కని ప్రణాళికతో ఏపనినైనా విజయవంతంగా సకాలంలో చేయవచ్చు. దానితోబాటు సమయానుసారం పోషకాహారాన్ని తీసుకోవటం కూడా ముఖ్యమైనదే. అదే ఆరోగ్యానికి మూలం.

ఆరోగ్యమే మహాభాగ్యము 'Health is Wealth' అనే సామెత. దాని ప్రాముఖ్యత మనందరికి తెలిసిందే కదా. ఆరోగ్యానికి, ఆహారానికి అవినాభావ సంబంధం కలదు. యుక్తవయస్సు వారి పెరుగుదలకు, ఎముకలు మరియు కండరశక్తికి సంతులిత ఆహారం ఎంతోముఖ్యం. వీలైనంత వరకు మన ఇంట్లో కల్తీలు లేకుండా, స్వచ్ఛంగా, తాజాగా తయారుచేసిన ఆహారాన్నే తీసుకోవాలి. తాజాపండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, మొలకధాన్యాలు, ముడిధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలి. చక్కెర కన్నా బెల్లం మంచిది.

ఈ నియమాలను పాటిస్తూ జంక్ ఫుడ్‌ల జోలికి పోకుండా వుంటే స్థూలకాయం, అధికంగా బక్క చిక్కుట, అనారోగ్యం పాలు గాకుండా చక్కని శరీరదారుఢ్యం, ఆరోగ్యం కలిగి వుంటారు. ఆరోగ్యమే ఆనందానికి, ప్రగతికి మూలం.

పదండి, స్వయంగా, సులభంగా, అతి తక్కువ సమయంలో తయారుచేసుకొని తినగలిగే క్రింది ఆహారపదార్థాలను ('రెసిపీ'లను) చేద్దాం, తిందాం, ఆనందిద్దాం.'

## పల్లీల లడ్డు

**కావలసిన పదార్థాలు : వేయించిన పల్లీలు-2 కప్పులు, బెల్లం తురుము -1 కప్పు, యాలకులు-4.**

**తయారుచేసుకునే పద్ధతి :** పై పదార్థాలన్నింటిని మిక్సీలోవేసి వక్కా, ముక్కా (మరీ మెత్తగా కాకుండా)గా పొడి చేయాలి. ఆ పొడిని కొంచెం కొంచెంగా తీసుకొని లడ్డూలుగా కట్టాలి. తినండి, ఆనందించండి.

## కూరగాయల సలాడ్

**కావలసిన పదార్థాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **తురిమిన క్యారెట్లు** | : | **ఒక కప్పు** | **తురిమిన బీట్‌రూట్** | : | **ఒక కప్పు** |
| **తురిమిన కీరదోసకాయ** | : | **ఒక కప్పు** | **మొలకెత్తిన పెసర్లు** | : | **ఒక కప్పు** |
| **దానిమ్మ గింజలు** | : | **అర కప్పు** | **వేయించిన నువ్వులపొడి** | : | **అర కప్పు** |
| **నిమ్మకాయరసం** | : | **మూడు చెంచాలు** | **పచ్చి మిరపకాయలు** | : | **2 సన్నగా తరగాలి** |
| **తరిగిన కొత్తిమీర** | : | **అర కప్పు** | **ఉప్పు** | : | **తగినంత** |


**తయారుచేసే విధానం :**


ఒక పాత్రలో కడిగి తురిమిన క్యారెట్లు, బీట్‌రూట్, కీరదోస కాయలను వేయాలి. వాటికి మొలకెత్తిన పెసర్లును, పచ్చి మిరపకాయ తరుగును జత చేయాలి. వాటిపై నువ్వులపొడిని చల్లాలి. కొన్ని దానిమ్మ గింజలు కూడా కలపాలి. తగినంత ఉప్పును వేసుకోవాలి. చివరగా నిమ్మరసం వేసి గరిటెతో చక్కగా కలిపి తరిగిన కొత్తిమీరతో అలంకరించాలి. ఇక తీపి, పులుపు, ఉప్పు, కారంతో కూడిన రుచికరమైన సలాడ్ తయారైంది.

**సెలవు రోజున ఈ సలాడ్ తయారు చేసి ఇంట్లో అందరికి తినిపించి, శభాష్ అనిపించుకుందాం.**

ప్రాజెక్టుపని :

మనం ఆరోగ్యంగా, చలాకీగా ఉండటానికి చక్కని పోషకాలు కలిగిన ఆహారం అవసరం. అందువలన మనం ఎంతో కష్టపడి ఆహారాన్ని సంపాదించుకుంటాం, తయారు చేసుకుంటాము, భుజిస్తాం. కానీ ఈ విషయంగా మనం సరైన మార్గంలో పయనిస్తున్నామా? కింది ప్రవాహాకృతులను గమనించండి. వీటి ఆధారంగా ఆహారపుటలవాట్లకు సంబంధించిన మంచి చెడ్డలను గురించి **చర్చావేదిక** నిర్వహించండి.



# 3 అభిరుచులు-ఆప్తబంధువులు

**నేపథ్యం :**

మన సంతోషాన్ని అందరితో పంచుకొని మరింత ఆనంద పడతాము. కాని మన బాధలను మాత్రం త్వరగా ఇతరులతో పంచుకోలేము. ఇతరులతో పంచుకుంటే కొంత ఉపశమనం పొందుతాం. మరి పంచుకోడానికి సరియైన వారు లేనపుడు లేదా ఇతరులకు చెప్పదలచునపుడు ఏం చేయాలి? మనం వేరొక పనిలో నిమగ్నులం కావాలి. అంటే మనకు ఇష్టమైన, ఆహ్లాదం కలిగించే పనులు చేస్తుండాలి. అది కుట్టు పనికావచ్చు, చిత్రలేఖనం కావచ్చు, కవిత్వం రాయడం, పాటలు వినటం, తోటపని మొదలైన పనుల్లో ఏదైనా కావచ్చు. అలా మీరు చేసి చూశారా? లేకపోతే ఈ సారి ప్రయత్నించండి. ప్రతిఫలాన్ని ఆశించకుండా కేవలం మనోల్లాసం కొరకు చేయుపనిని అభిరుచి 'హాబీ' అంటారు. ఈ అభిరుచుల గురించి ఈ పాఠంలో తెలుసుకుందాం.

ఒత్తిడి లేని మానవ జీవితం ఈనాడు కనిపించడం చాలా దుర్లభం. సాంకేతిక అభివృద్ధి కారణంగా ప్రతి రంగంలోను పోటీ చోటు చేసుకుంటుంది. ముందుకు దూసుకువెళ్ళేగాని మనుగడ లేదన్న అభిప్రాయము నేటి సమాజంలో పాతుకు పోయింది. అందుకే ఏ రంగం చూసినా పోటీనే! బుడిబుడి అడుగులు వేసుకుంటూ ఓనమాలు నేర్చుకుంటున్న విద్యార్థి నుంచి పెద్దపెద్ద అంతర్జాతీయ కంపెనీలను నడిపే వ్యాపారవేత్తల వరకు పోటీ, ఒత్తిడి అనివార్యమైంది. ఒక్కొక్కసారి ఈ అనివార్యమైన పోటీ, ఒత్తిడి మానసిక రుగ్మతలకు, వృత్తిపరమైన అపజయాలకు కూడా దారి తీస్తోంది.

అది ఎప్పుడూ అసిధారావ్రతమే అంటే కత్తి మీద సామే. అవి గతి తప్పకుండా ఉండాలంటే ఓ ప్రవృత్తి అవసరం. ఆ ప్రవృత్తి వృత్తిపరంగా మీదకు వచ్చే ఒత్తిడిని మన నుండి దూరం చేసి మనసును, శరీరాన్ని ఉత్తేజపరచి మనలను ముందుకు తీసుకు పోగలదని మానసిక నిపుణులంటున్నారు. ఈ సూక్ష్మసూత్రం తెలుసుకొని చాలామంది ఏదో ఒక కళను ఆశ్రయించి అభిరుచిని పెంచుకొని మానసిక ఒత్తిడిని అధిగమించి జీవితంలో రాణించగలుగుతున్నారు.

ఇలాంటి జీవితం ఈనాడు కల్పించడం చాలా దుర్లభం.

అనివార్యమైన పోటీ ఒక్కొక్కసారి వీటికి దారి తీస్తుంది.

ఈ అభిరుచులనే ప్రవృత్తులని, వ్యాపకాలని, హాబీలని కూడా అంటుంటారు. వీటి గురించి తెలుసుకోనుట కౌమారదశలో అడుగుపెడుతున్న విద్యార్థులకు చాలా అవసరం. వారు భావి జీవితాలకు పునాదివేసే విద్యాభ్యాసంలో ఉంటారు. ఆ విద్యాభ్యాసంలో వారి విజయమే వారి భావి జీవితాన్ని నిర్దేశిస్తుంది. ఆ సమయంలో కొందరు ఒత్తిడికి లోనగుట జరుగుతుంది. ఆ ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత పొందాలంటే విద్యార్థులు ఏదో ఒక అభిరుచిని పెంపొందించుకోవాలి. ఒక ఆటో-పాటో వాళ్ళను సేద తీరుస్తుంది. చిత్రలేఖనమో, సంగీతమో వాళ్ళను లాలించి స్వస్థతను చేకూరుస్తుంది. అలా అలవాటుగా మారే ఆ అభిరుచి భవిష్యత్‌లో వారు ఎదుర్కోబోయే ఒత్తిడికి పరమౌషధంగా పనిచేస్తుంది. నేడు వివిధ రంగాలలో విజేతలుగా నిలిచిన వారి జీవన విధానం పరిశీలిస్తే ఈ సత్యాన్ని మనం చూడగలం.

అభిరుచులకు గల ఇతర పేర్లు.

మనిషిని లాలించి స్వస్థత చేకూర్చే కళలు.

అనివార్యము = తప్పనిసరి; రుగ్మతలు = వ్యాధులు, రోగాలు; ప్రవృత్తి = స్వభావం; ఉత్తేజపరచి = ఉత్సాహపరచి; అధిగమించి = అతిక్రమించి; రాణించుట = శోభిల్లుట; కౌమారదశ = 13 నుండి 19 సం॥ల వయస్సు; నిర్దేశించుట = ఆజ్ఞాపించుట. సేదతీరుట = విశ్రాంతి తీసికొనుట; స్వస్థత = ఆరోగ్యం; పరమౌషధం = గొప్ప ఔషధం;

అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న అభిరుచుల గురించి మనమిప్పుడు తెలుసుకుందాం.

అసలు అభిరుచి అంటే ఏమిటి? మన కిష్టమైన వ్యాపకాన్నే అభిరుచి అనవచ్చు. ఆనందాన్ని, వినోదాన్ని అందించే తంత్రమది. అలసిపోయిన మన జీవితాన్ని లాలించే అమ్మవంటిది.

ఒక సందర్భంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కీ.శే. డా॥ సి. నారాయణరెడ్డి ''కళలు లేని జీవితం కళేబరం లాంటిది'' అని అన్నారు. అలాగే హీరో సల్మాన్‌ఖాన్ చక్కగా పెయింటింగ్స్ వేస్తాడు. సైఫ్ ఆలీఖాన్ గిటార్ అద్భుతంగా వాయిస్తాడు. అనిల్ అంబానీ క్రమం తప్పకుండా మారథాన్‌లలో పాల్గొంటాడు. రతన్ టాటా పియానో వాయిస్తాడు. అమితాబ్ బచ్చన్‌కు బ్లాగు సరదా. దియా మిర్జాకి కుండలు చేయడమంటే భలే ఇష్టం. వీరంతా జీవితం గడవక కాదు. జీవితాన్ని ఇంకా ముందుకు నడపడానికి ఆనందమయం చేసుకోడానికి ఈ పనులు చేస్తుంటారు.

కళలు, క్రీడలు మనిషిలో ఉల్లాసం పెంచడానికి దోహదపడతాయి. ఏ కళతో కూడా పరిచయం లేని మనిషి జీవితం ఉప్పులేని కూరలా, పంచదార లేని పాయసంలా చప్పగా ఉంటుంది.

మానవ జీవితాన్ని ఆనందమయం చేయడానికే కళలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, ఆనందం పంచడానికే క్రీడలు పుట్టుకొచ్చాయి. కళలు, క్రీడల్లో మనుషులు నిష్ణాతులే కానక్కరలేదు. వాటిగురించి తెలుసుకొని ఆసక్తి పెంచుకుంటేచాలు. ఒత్తిడి నుంచి తప్పించుకునే మార్గం ఆధీనమౌతుంది.

మరొక ముఖ్యమైన ప్రయోజనం కూడా అభిరుచులను పెంచుకోవడంవల్ల సిద్ధిస్తుంది. అభిరుచులు మనను చెడు ఆలోచనలకు దూరంగా ఉంచుతాయి. తీరిక సమయం సద్వినియోగమవుతుంది. ఒక్కొక్కసారి మన అభిరుచులు సంపాదనను కూడా తెచ్చి పెడతాయి. మనం నేర్చుకున్న సంగీతం సంగీత కచేరీల వరకు వెళ్ళగలదేమో. మనం వేసే చిత్రాలు ఆర్ట్‌గేలరీ వరకు వెళ్ళి, ధనార్జన చెయ్యగలవేమో.

వృత్తిలోనైనా, విద్యాభ్యాసంలోనైనా కాసింత మార్పు అప్పుడప్పుడు చోటు చేసుకోవాలి. ఆ మార్పు అభిరుచుల రూపంలో జరిగితే మనలో చురుకుతనం, ఆనందం, ఆసక్తి మళ్ళీ జీవం పోసుకుంటాయి. పునరుత్తేజం పొంది మంచి ఫలితాలను సాధించగలం.

యోగా, ధ్యానం శారీరక మానసిక ఆరోగ్యాలను ఎలా అందిస్తాయో అంతలా అభిరుచులు కూడా వాటిని మనకందివ్వగలవు. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను అభిరుచులు బయటకు రప్పించగలవు. మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దగలవు. శీలనిర్మాణం చేయగలవు. ప్రశాంతతను చేకూర్చగలవు. వ్యక్తులు ప్రశాంతంగా ఉంటే కదా విశ్వశాంతి స్థాపనకు మార్గం సుగమం కాగలదు.

ఇప్పుడు కొన్ని ముఖ్యమైన అభిరుచుల గురించి తెలుసుకుందాం. కళలన్నీ అభిరుచులే. వాటిలో ముఖ్యమైనవి లలిత కళలు, ఇవే కాకుండ పుస్తక పఠనం, వంట, చక్కని టీవీ కార్యక్రమాలు చూడడం. ఈతకొట్టడం. ఫొటోగ్రఫీ, ఆటలాడటం, పోస్టల్ స్టాంపులు, నాణేలు కరెన్సీల సేకరణ, తోటపని, ప్రకృతి పరిశీలన, సమాజసేవ పక్షి నిరీక్షణ మొదలైనవన్నీ అభిరుచులే.

**సంతరించుకొన్న = సమకూర్చుకొన్న; వ్యాపకము = పని; తంత్రము = ఉపాయము; కళేబరము = మృత శరీరము; నిష్ణాతులు = ప్రావీణ్యులు; కచేరి = ప్రదర్శనాస్థలము; కాసింత = కొద్దిగ; నిరీక్షణ = ఎదురుచూచుట;**





**రచయిత పరిచయం :** ఈ పాఠ్యభాగ రచయిత **శ్రీ బెలగాం భీమేశ్వరరావు** గారు. వీరి తల్లిదండ్రులు బెలగాం రాజేశ్వరి, గంగారమ్ గార్లు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు అనేక పుస్తకాలు రచించారు. వాటిలో పేర్కొనదగినవి **'చెట్లొస్తున్నాయ్ జాగ్రత్త (బాలల నవల), పాపం బంగారయ్య, చెట్లను పెంచుదాం, కొంగల తెలివి, అవసరాలు, ఎగురలేని పక్షులు, మంచికిమంచి** మొదలైనవి. అక్షరాస్యత కార్యక్రమాల్లో పాల్గొనడం, బాలసాహిత్య శిక్షణ కార్యక్రమాలు వీరి వ్యాపకాలు.


## I చర్చించండి.

1) మీ యొక్క ముఖ్యమైన అభిరుచులు.
2) మంచి అభిరుచులవలన ప్రయోజనాలు.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

**అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1) ప్రవృత్తి వలన కలిగే ప్రయోజనాలు.
2) విద్యార్థులు ఒక అభిరుచిని ఏర్పరచుకొనుటకు గల ఆవశ్యకత.
3) కళలు మరియు క్రీడల యొక్క ప్రాముఖ్యత.
4) అభిరుచులు మరియు కళల వల్ల ప్రయోజనాలు.



**ఆ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.**

1) సాంకేతిక అభివృద్ధి కారణంగా ప్రతి రంగంలోనూ పోటీ చోటుచేసుకుంది. (      )
2) అభిరుచుల గురించి తెలుసుకొనుట కౌమారదశలో అడుగుపెడుతున్న విద్యార్థులకు చాలా అవసరం (      )
3) విద్యార్థుల అభిరుచి భవిష్యత్‌లో వాళ్ళు ఎదుర్కోబోయే ఒత్తిడికి ప్రతికూలంగా పనిచేస్తుంది. (      )
4) డాక్టరు సి. నారాయణరెడ్డి ''కళలు లేని జీవితం కళేబరంలాంటిది'' అన్నారు. (      )

## III స్వీయవ్యక్తీకరణ :

1) అభిరుచుల గురించి మీ అభిప్రాయాన్ని సొంతమాటల్లో రాయండి.
2) యోగా, ధ్యానం గురించి మీ సొంతమాటల్లో రాయండి.

## IV భాషాంశాలు :

**అ) కింది పదాలకు సంధి కార్యాలు రాయండి.**

| | పదము | విడదీసిరాయుట | | సంధి పేరు |
|---|---|---|---|---|
| 1) | మనకిష్టము | + | ⟶ | |
| 2) | | పుట్టుకు + ఒచ్చాయి | ⟶ | |
| 3) | తంత్రమది | + | ⟶ | |
| 4) | ముఖ్యము + ఐన | + | ⟶ | |

ఆ) కింది పదాలకు సమాస కార్యాలు రాయండి.

| | పదము | విగ్రహ వాక్యము | | సమాసనామం |
|---|---|---|---|---|
| 1) | విద్యాభ్యాసము | | → | |
| 2) | టి.వి. కార్యక్రమాలు | | → | |
| 3) | | ధనము యొక్కఆర్జన | → | |
| 4) | సమాజసేవ | | → | |


ఇ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో తెలపండి.

1) కళలు, క్రీడలు మనుషుల ఉల్లాసం పెంచడానికి దోహద పడతాయి.

2) మనకిష్టమైన వ్యాపకాన్నే అభిరుచి అనవచ్చు.

3) ఆరోగ్యము, ఆనందాన్ని పంచడానికి క్రీడలు పుట్టుకొచ్చాయి.

4) పేదరికమే మన శత్రువు.



ఈ) గుర్తింపబడిన ప్రత్యయాలు ఏవిభక్తులకు చెందినవో రాయండి.

1) ఒక ఆటో-పాటో వాళ్ళను సేద తీరుస్తుంది.

2) ముఖ్యమైన అభిరుచుల గురించి తెలుసుకుందాం.

3) వ్యక్తులు ప్రశాంతంగా ఉంటే కదా విశ్వశాంతి స్థాపనకు మార్గం సుగమం కాగలదు.

ఉ) కింది పదాలకు వచనాలు మార్చి రాయండి.

1) అడుగులు = ______ 2) వివరం = ______

3) అభిరుచి = ______ 4) విద్యార్థులు = ______

ఊ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) అపజయం × ______ 2) దూరం × ______

3) సూక్ష్మము × ______ 3) ఆరోగ్యం × ______

ఋ) కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.

1) స్వస్థత 2) పరమౌషధము 3) ప్రయోజనం 4) నిష్ణాతులు

**V** కింది ప్రముఖుల అభిరుచులు :

| రతన్ టాటా | అనిల్ అంబానీ | దియామిర్జా | అమితాబ్ బచ్చన్ |
| --- | --- | --- | --- |
| ↓ | ↓ | ↓ | ↓ |
| | | | |

**VI** కింది అల్లికను పూర్తి చేయండి.

| వివిధ రకాల అభిరుచులు |
| --- |
| |
| |
| |
| |
| |


**ప్రాజెక్టుపని:**

చక్కని భాషాజ్ఞానం కూడా వివిధ అభిరుచులకు, ఉపాధికి, వాకిల్లు తెరుస్తుంది. (ఉదా: బ్లాగ్ లేఖనం, రేడియోజాకీ, కార్యక్రమ నిర్వహణ అనుసంధానము సూత్రసంచాలనము. మీ పాఠశాల వార్షికోత్సవ నిర్వహణ గురించి విపులంగా ఒక కార్యక్రమ పత్రికను తయారు చేయండి. తరగతిలో యాంకరింగ్ చేయండి.



**ఉపక్రమము :**

మీ మిత్రుల యొక్క అభిరుచులను తెలుసుకొని వాటిని పట్టిక రూపంలో తయారుచేసి, పఠనవేదికలో ప్రదర్శించండి.



**నేనివి గ్రహించా :**

జీవితంలో విసుగు చోటు చేసుకోకుండా మనసుకు నచ్చిన అభిరుచిని అలవరచుకొనుట, అవలంబించుట.

# అంతర్జాతీయ యోగాదినోత్సవం

పఠనం

యోగ భారతదేశపు పురాతన సంప్రదాయం యొక్క ఒక అమూల్యమైన బహుమతి. ఇది భారతదేశంలో పుట్టిన భౌతిక, మానసిక మరియు ఆధ్యాత్మిక సాధనము. మనం సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండడానికి ఒకే ఒక పరిష్కార మార్గం యోగసాధన. ఇది మనస్సును, శరీరాన్ని ఐక్యపరుస్తుంది. అనగా ఏకాగ్రత, మానసిక వికాసాన్ని కలిగిస్తుంది. శరీరమును, మనస్సును సమన్వయ పరచుటయే 'యోగము'. ఈ యోగశాస్త్రములోని ఒక భాగమే ఆసనములు. ఇవి శరీరమునకు నిలకడను, ఆరోగ్యమును కలుగజేస్తాయి. శారీరక వ్యాధులు, మానసిక వ్యాధులు సమసిపోతాయి మరియు మన జీవనశైలిని ఆరోగ్యంగా మార్చుకోడానికి సాధనంగా ఉంటాయి.

ఇన్ని ప్రయోజనాలున్న ఈ యోగశాస్త్రమును మొట్టమొదటిగా పతంజలి మహర్షి ప్రపంచానికి అందించారు. 'యోగ' అనేది ఒక సంస్కృతపదం. స్థిర సంకల్పంతో ప్రాతఃకాలమున ఏమి భుజించకముందు యోగసాధన చేయుట ఉత్తమము.

మొట్టమొదటి అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని 21 జూన్, 2015న ప్రపంచమంతటా జరిపారు. భారతదేశంలో ఆయుష్ (AYUSH) మంత్రిత్వశాఖ దీనికి కావలసిన హంగులను సమకూర్చింది. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో సహా దాదాపు 35,985 మంది ప్రజలు మరియు 84 దేశాల నుండి విచ్చేసిన గౌరవ అతిథులు కలిసి 35 నిమిషాల పాటు21 రకాల యోగాసనాలను న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో చేశారు.

రాజ్‌పథ్‌లో జరిగిన ఈ మహత్తర కార్యక్రమానికిగాను ఆయుష్ మంత్రిత్వశాఖ రెండు గిన్నీస్ ప్రపంచ రికార్డులను అందుకున్నది.

21 జూన్ 2015వ సంవత్సరం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (UNGA) ద్వారా యోగా అంతర్జాతీయ దినం అని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఆనాటి నుండి ప్రతిసంవత్సరం 21 జూన్ అంతర్జాతీయ యోగాదినోత్సవంగా ప్రపంచదేశాలలో జరుపబడుతున్నది.

భారత రిజర్వ్‌బ్యాంక్ యోగా అంతర్జాతీయ దినోత్సవం గుర్తుగా 10 రూపాయల స్మారకనాణెం విడుదల చేసింది. అంతర్జాతీయ యోగాదినోత్సవ సందర్భంగా జరిపే వేడుకలలో యోగ, ధ్యానం, యోగా గురించిన అవగాహన మరియు దాని ప్రయోజనాలను చర్చించడం ద్వారా మన జీవనశైలిలో దీనిని అనుసరించడం వంటి అంశాలు వివరించబడతాయి.

మనమంతా యోగాను ప్రోత్సహించి, అనుసరించి ఆరోగ్యవంతులు, జ్ఞానవంతులుగా తయారై మన దేశప్రగతికి తోడ్పడుదామా!

**ఉపక్రమం:**

● 'యోగాసనాల పేర్లు - ఉపయోగాలు' పట్టిక తయారు చేయండి. ● యోగాభ్యాసాన్ని అలవరచుకోండి.



# 4. ఓ చీమకథ

**నేపథ్యం :**

డా. భరద్వాజ కథలు సమగ్ర జీవిత శిల్పాలు, జలపాతంలా దూసుకువచ్చి ఆవేశంతో హృదయం ఆక్రమించుకునే అతని ఉద్వేగం ప్రతి కథలోను కనిపిస్తుంది. అక్షయ నేత్రాలోత సమాజ హృదయాన్ని చీల్చి మనకు చూపే తత్వం భరద్వాజది. ఆయన చేసిన ప్రతి ఉద్యోగం రచనాపరంగా ప్రజలకు సహకరించింది. ఆయన సాహితీ సృష్టి ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డులు, సోవియట్‌ల్యాండ్ నెహ్రూ అవార్డు, రాజాలక్ష్మి అవార్డు, నాగర్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ మొదలైన ఎన్నో సత్కారాలను అందజేసింది. స్మృతి సాహిత్యం ఆవిష్కరించి, సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించే డా. రావూరి భరద్వాజ ప్రతిభకు నిదర్శనం 'ఓ చీమకథ'.

అనగా అనగా ఒక రాజు, ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురు కొడుకులూ ఏటికెళ్ళి, ఏడు చేపలు తెచ్చి ఎండవేశారు. అందులో ఒక చేప ఎండలేదు.

"చేపా! చేపా!! ఎందుకు ఎండలేదు?"

"గడ్డిదుబ్బ అడ్డం వచ్చింది!" అన్నది చేప.


"గడ్డిదుబ్బా! గడ్డిదుబ్బా!! ఎందుకు అడ్డం వచ్చావు?"

"ఆవు నన్ను మేయలేదు!" అన్నది గడ్డిదుబ్బ.

"ఆవూ! ఆవూ!!" ఎందుకు మేయలేదు?"

"కాపరివాడు విడువలేదు!" అన్నది ఆవు.

"కాపరివాడా! కాపరివాడా!" ఎందుకు విడువలేదు?"



''అవ్వ బువ్వ పెట్టలేదు!'' అన్నాడు కాపరివాడు.

''అవ్వా! అవ్వా!!'' ఎందుకు బువ్వ పెట్టలేదు?''


''చంటివాడు ఏడుస్తున్నాడు!'' అన్నది అవ్వ.

''చంటివాడ! చంటివాడ!! ఎందుకేడుస్తున్నావు?''

''చీమ నన్ను కుట్టింది!'' అన్నాడు చంటివాడు.

''చీమా! చీమా!!'' ఎందుక్కుట్టావు?

''నే నెందుక్కుట్టానో నీకు తెలుసు. తెలిసికూడా నువ్వు అమాయకత్వం నటిస్తున్నావని నాకు తెలుసు. అమాయకులంటే నాకు సానుభూతి ఉన్నమాట నిజమే



కాని, దాన్ని నటించేవారంటే మాత్రం నాకు పరమ అసహ్యం'' అంది, చీమ నన్ను గుచ్చిగుచ్చి చూస్తూ.

అది గుచ్చిగుచ్చి చూస్తున్నట్టు నేను గమనించాను. నేను నిజంగానే అమాయకుణ్నో, లేకపోతే అమాయకత్వాన్ని నటిస్తున్నానో, చీమగారు ఖచ్చితంగా పోల్చుకోలేక పోయారన్నది తేలిపోయింది. ఏదో ఒక నిశ్చయాని కొచ్చిన చూపు వేరు. ఎటూ పోల్చుకోలేని చూపు వేరు. చీమగారిది – ఈ చివరి రకానికి చెందిందని ఆ చూపును చూస్తూనే గ్రహించాను. ఎందుకయినా మంచిదనీ, అక్కడే ఇంకొంచెం నొక్కి చూద్దామనీ, అనిపించింది.

చీమకు వీరంటే అసహ్యం.

''చివరికి – ఇదా – నా గురించి నీవనవలసింది! ఒక సంగతి గుర్తుంచుకో నటించడం అసలేమీ చాతగాని వాణ్ణి కాదుగానీ, నీ దగ్గర గూడా నటించాలా – అని! ఆ అవసరం ఉన్నదని ఇప్పటిదాకా నేననుకోలేదు. ఇప్పుడూ అనుకోవడం లేదు. నా బిడ్డల సాక్షిగా చెబుతున్నాను. నువ్వా చంటి వెధవను ఎందుక్కుట్టిందీ నాకు తెలియదు'' అన్నాను.

నా వాక్యం ముగిసీ ముగియకముందే చీమ ఫకాలుమని నవ్వింది!

''అంటే – నా మాటమీద నీకు నమ్మకం లేదన్నమాట అన్నాను.''

''అలా నిగ్గదీయమాకు. నిన్ను – నూటికి నూరుపాళ్ళు నేను నమ్మలేకపోతున్నాను, అసలేమీ నమ్మకుండా ఉండలేకపోతున్నాను. కాస్త నిజాన్ని, ఇంకాస్త అబద్ధాన్ని కలగలిపి నా ముందుంచావని నేననుకొంటున్నాను'' అన్నది చీమ.

''నా బిడ్డల మీద ఒట్టేసుకొన్నా నమ్మవా?'' అన్నాను.

ఈసారి చీమ నన్ను ఎగాదిగా చూసింది. ఒక్క క్షణం ఆలోచిస్తున్నదానిలా అటూఇటూ తిరిగింది. తలగోక్కున్నది. ఒళ్ళు విరుచుకొన్నది. సన్నగా నిట్టూర్చింది.


నువ్వు నిజాయితీగా బతకడం ఎంత అవసరమో, అలా బతుకుతున్నట్టు నలుగురికీ తెలియడమూ, తెలిసేలాగా బతకడమూ అంతే అవసరం! ఇదొక జీవిత సూత్రం. ఈ సూత్రం నీకు తెలిసినట్టు కనబడదు. ఒకవేళ తెలిసినా, బుద్ధిపూర్వకంగానే దాన్ని నీవు పట్టించుకోవడం లేదేమో నాకు తెలియదు... నువ్వు అమాయకత్వాన్ని నటిస్తూనాన్నవనే అనుకొన్నాను. మళ్ళీ అలాంటివాడివి కాదని, లోపల పీకుతూనే ఉంది. అంచేత ఎటూ తేల్చుకోలేని



అసహ్యం = సహించరాని; నిగ్గదీయుట = నిలదీయుట; ఎగాదిగా = పైకి కిందికి; ఒళ్ళు = శరీరం;


దశలో పడిపోయాను. ఎదుటివారు నిన్నపార్థం చేసుకొనేలాగా ఎప్పుడూ ప్రవర్తించమాకు...'' అని హితబోధ చేసింది చీమ.

**చీమ చెప్పిన జీవితసూత్రం.**



ఆ సత్యానికి, నా మాడుపెంకు టాంగుమని లేచిపోయినంత పనయింది. చీమగారికి సాష్టాంగ నమస్కారం చేశాను.

''నువ్వు నటిస్తున్నావని నే ననుమానించడానికి, నా కారణాలు నాకున్నాయి. నువ్వెంతసేపటికి, ''చంటి వెధవను ఎందుక్కుట్టావ్?'' అని నిగ్గదీస్తున్నావే తప్ప ఇంకో



సందేహాన్ని అడగడమే లేదు'' అన్నది చీమ.

''ఇంకో సందేహం నాకు రాను కూడా రాలేదే! అన్నిటికీ అన్నీ సరిపోయాయే'' అన్నాను.

''ఇలా అంటున్నప్పుడే, నీవు నటిస్తున్నావన్న అనుమానం ఎదుటివారికి కలుగుతుంది.... నిజంగా నీకు సందేహాలు రాకపోవచ్చుగానీ ఆలోచిస్తే ఈ కథలో నీకు చాలా లొసగులు కనబడతాయి. మాటవరసకు చెబుతాను చూడు. రాజు కొడుకులు వెళ్ళి – ఏడంటే ఏడే చేపలు తీసుకురావాలా! అసలూ – రాజుగారి కొడుకులేమిటీ, ఏటికెళ్ళి వారే చేపలు పట్టుకోవడమేమిటి? నీకు అసంబద్ధంగా కనిపించడంలేదా? రాజులైనవాళ్ళు ఇంకొకరిశ్రమను అనుభవిస్తారే తప్ప, సొంతంగా శ్రమపడరు. శ్రమపడడం మరొకరి పనయినట్టూ, అనుభవించడమే తమ పని అయినట్టూ వారనుకొంటారు. నీకిక్కడే అనుమానం రావాలి కదా! ఎందుకు రాలేదు?'' అన్నది చీమ.

ఇలాగా – చీమగారు దబాయిస్తుంటే, నా నోటంట మాట రాలేదు. నిజమే! చీమగారన్నట్టు రాజుగారి కొడుకులకు చేపలు పట్టుకొనవలసిన అవసరమేముంది? నా మట్టిబుర్రకు ఆపాటి అనుమానం తట్టనందుకు నన్ను నేనే తిట్టుకొన్నాను. కానీ – నా తెలివితక్కువతనాన్ని చీమ ముందు ఒప్పుకోవడానికి నా అహంకారం అడ్డం వచ్చింది!

''నా కొచ్చిన అనుమానాలకు సమాధానం చెప్పమని మాత్రమే నిన్నడిగాను. తెలిస్తే చెప్పు. తెలియకపోతే! నావల్లకాదు అను. అంతేగాని, నాకు రాని సందేహాల పట్టిక నొకదాన్ని తయారుచేసి అవన్నీ ఎందుకడగలేదని దబాయించమాకు, నీకు సందేహంగా తోచింది, నా కంటికి సందేహంగా కనబడలేదు అయినప్పుడు నే నెందుకడగాలో చెప్పు.'' అన్నాను.

నేనీ ప్రశ్న అడుగుతానని చీమ ఊహించి ఉండదు. అది బిత్తరపోయింది. ఆశ్చర్యంగా నా వేపు చూసింది!

''రాజుగారి కొడుకులయి ఉండి కూడా స్వయంగా చేపలు పట్టుకోవడానికి వెళ్ళడంలో నీకు సందేహమే రాలేదా? నువ్వేదో మొండికెత్తి వాదిస్తున్నావు గానీ – నీవు నిజం మాట్లాడడం లేదు'' అన్నది చీమ.

**చీమ కంటికి సందేహంగా తోచినది.**

''నిజంగానే నాకు సందేహం రాలేదు.... ఎందుకో చెబుతున్నానుండు.... నా మాట పూర్తిగా విను. అతను రాజుగారేగాని, అతనికి రాజ్యమున్నట్టూ, ఆ రాజ్యాన్ని

**లొసుగులు = లోపాలు;**
**ఏరు = చిన్ననీటి ప్రవాహము (వాగు);**



పరిపాలిస్తున్నట్టు కథలో ఎక్కడా లేదు. ''రాజు' అన్నది అతని పేరు కాకూడదా? ఆ పేరున్న ప్రతివాడూ పరిపాలకుడే అయితీరాలని ఎక్కడా లేదే! మాట వరసకు – అతని పేరు ''సత్తిరాజు'' అనుకొందాం. ఆ సత్తిరాజుగారి వృత్తి చేపలు పట్టుకోవడమే ననుకొందాం. నేను మాత్రం ఇలాగనే అనుకొన్నాను. అయినప్పుడు నాకు సందేహం రావలసిన అవసర మెక్కడుంది?'' అన్నాను.

ఈ సారి చీమ తెల్లబోయింది!

''నిజమే! ఈ కథలో – అతగాడు పరిపాలకుడన్న వాక్యం ఎక్కడా లేదు'' అని ఒప్పుకొంది చీమ.

ఇక – చీమగారి నోరు మూయించడం నాకు క్షణాల మీద పని.

''నువ్వు – మధ్యకాలపు రాజుల్ని దృష్టిలో ఉంచుకొని మాట్లాడి ఉంటావు. ఆదిమ సమాజంలోనూ పాలకులను ప్రజలు ఎన్నుకొనేవారు. మిగిలిన ప్రజలందరితో బాటుగా, ఆనాటి పాలకులు కూడా, పనిచేసి పొట్టపోసుకునేవారు. ప్రజలకన్నా తాము అధికులమన్న ఆలోచన వారికెన్నడూ రాలేదు. అందరితోబాటు పనిపాట్లు చేసుకుంటూనే అదనంగా సంక్షేమం కోసమూ పాటుపడేవారు. ఒకసారి 'రాజు' అయినవాడు, మరోసారి కూడా ''రాజు'' అవుతాడన్నదేమీ లేదు. ఏడుగురు కొడుకుల్ని కన్న మన రాజుగారు కూడా ఇలా ఎన్నుకోబడిన రాజుగారే కావచ్చు, కాబట్టి ఆయన కొడుకులు చేపలు పట్టుకోవడంలో నాకెలాంటి అనుమానమూ రాలేదు'' అన్నాను చీమతో.

''మంచిదే! మరి నీ కొచ్చిన అనుమానమెక్కడ?'' అన్నది చీమ.

''చంటి వెధవను కుట్టడం దగ్గర పశువులకాపరికి అవ్వ బువ్వ పెట్టకపోవడానికి కారణం చంటివాడు ఏడవడం. చంటివాడు ఏడవడానికి కారణం, వాణ్ణి నీవు కుట్టడం. నువ్వెందుకు వాణ్ని కుట్టిందీ నాక్కావాలి?'' అన్నాను.

''అది కథలోనే ఉంది గదా! వాడు నా బంగారు కన్నంలో వేలుపెట్టాడు, మరి నేను కుట్టనా?'' అన్నది చీమ నావేపు ఆశ్చర్యంగా చూస్తూ.

సరిగ్గా నాక్కావలసిన ముక్కనే చీమగారు కూడా అన్నందుకు లోలోపల ఆనందించాను.

''అసలు నా సందేహమే ఇక్కడా!'' అని ప్రారంభించాను. ''నువ్వెంతో, నీ బిసాదెంతో నాకు తెలుసు. రాత్రింబవళ్ళు శరీరం హూనం చేసుకొన్నా పొట్ట నిండనివాళ్ళు, మానవ సమాజంలో చాలామంది ఉన్నారు. మాలో కొంతమంది కోటానుకోట్ల సంపదలను పొతేసుకున్నమాట నిజం! సంపదను సృష్టిస్తున్న వారికేమో– తిండిలేదు. ఇది – చాలా సమాజాల్లో నడుస్తున్న విధానం! ఇప్పుడు అసలు విషయానికొస్తున్నాను. నీవేమో 'నాది బంగారు కన్నం' అంటున్నావు. నిజంగా, నీతిగా, ధర్మబద్ధంగా నీవు శ్రమపడితే, నీది బంగారుకన్నం కావడానికి వీల్లేదు. నీది బంగారు కన్నం కావడమే నిజమయితే, అక్రమార్జనకు నీవూ పాల్పడ్డావన్నమాటే! ఆ సంగతేదో నేరుగా నీనుంచే తెలుసుకొందామనే నిన్నా ప్రశ్న అడిగాను. ఇహ చెప్పు'' అన్నాను.



చీమగారు చిద్విలాసంగా నవ్వారు.

“పిచ్చి నాయనా! ఈ ప్రశ్న ‘అడగడానికి ఇన్ని డొంకతిరుగుళ్ళెందుకయ్యా?” అన్నది చీమ. అని, మెల్లగా గొంతు సవరించుకొన్నది. “మీరెలా బతుకుతున్నది నేను చూస్తూనే ఉన్నా. మీ చుట్టూ ఉన్నవారు తిండిలేక మలమలా మాడి చస్తూంటే, మీరు విందులు చేసుకుంటారు.

“మీ ఆశకు అంతులేదు. మీ బ్రతుక్కి తృప్తి లేదు. కాకపోతే వేలెడులేని చంటివెధవ నా బంగారు కన్నంలో వేలు పెట్టడమెందుకయ్యా’ అన్నది చీమ.

“ఇన్నిటికీ నీది ‘బంగారుకన్నం’ ఎలా అయిందో చెప్పనేలేదు” అన్నాను, ఇంకే మనడానికీ తోచక.

**చిద్విలాసం = చిరునవ్వు;**
**స్వార్జితం = స్వయంగా సంపాదించినది.**

“ఎందుక్కాదు? అది నా స్వార్జితం. నేను కష్టపడి సంపాదించుకొన్నాను. నా శ్రమ ఫలితం నాకు బంగారమే! అదెలాంటిది కానివ్వు – నా శ్రమ నాకు బంగారమే! దాన్ని దోచుకోవడానికి ఎవరొచ్చినా సరే – నేను తిరగబడతాను. ఆ తిరుగుబాటులో నేను చావడానికయినా సిద్ధపడతానుగానీ, నా శ్రమను మరొకరు దోచుకోవడానికి ఒప్పుకోను గాక ఒప్పుకోను. నాకన్న బలవంతులైనవారు నన్ను క్షణంలో నలిపి పారేస్తారని నాకు తెలుసు. ఈవిధంగా బతకడం కన్నా స్వేచ్ఛకోసం ప్రయత్నించి చావడంలోనే తృప్తి ఉన్నదని నేననుకొంటున్నాను. నేనా కుర్రాణ్ని ఎందుకు కుట్టానో నీకిప్పటికైనా తెలిసి ఉండాలి. నా కతనిమీద కోపం లేదు. ద్వేషం లేదు. నా శ్రమను కాపాడుకోవడానికి నేను చేసిన ప్రయత్నమది! మీ వాళ్ళను కూడా ఇలానే చేయమని చెప్పండి!” అన్నది చీమ కలుగులోకి పోతూ.



**కవి పరిచయం : కీ.శే. డా॥ రావూరి భరద్వాజ**గారు అవిభక్త హైదరాబాద్ సంస్థానపు పరిటాల జాగీరులోని మోగులూరు గ్రామంలో 1927లో జన్మించారు. తండ్రిపేరు కోటయ్య, తల్లిపేరు మల్లికాంబ. ఈయన 17వ ఏట నుండే రచనలు ప్రారంభించాడు. **రాగిణి, దైవసరాజకీయాలు, జీవనసమరం, పాకుడురాళ్ళు** మొదలగునవి వీరిరచనలు. పెక్కు విశ్వవిద్యాలయాలు వీరికి గౌరవడాక్టరేట్ పట్టాలు ఇచ్చి సత్కరించాయి. 2012 సంవత్సరానికి **“పాకుడురాళ్ళు”** నవలకు **‘జ్ఞానపీఠ పురస్కారం’** లభించింది.

ప్రస్తుత పాఠ్యభాగం ‘తానా (TANA) తెలుగు కథ’ కథాసంకలనం నుండి గ్రహించబడింది.

**I చర్చించండి :**

1) చీమల జీవన విధానం.

2) ఆత్మాభిమానం – పరాధీనత మధ్య బేధం.



**II ఆలోచించండి - రాయండి.**

**అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1) రాజులైనవారు జీవించు విధానం.

2) చీమ తనది ‘బంగారు కన్నం’ అన్నదానికిచ్చిన వివరణ

3) చీమ మనుషుల బ్రతుకు గురించి అన్న మాటలు.

ఆ) కుండలీకరణములలోని సరియైన పదమును ఎన్నుకొని, గడులను పూరించుము.

1) అమాయకులపై నాకున్నది. [ ]
(ద్వేషం, సానుభూతి, పగ)

2) నన్ను గుచ్చిగుచ్చి చూస్తున్నది. [ ]
(దోమ, నల్లి, చీమ)

3) చీమగారి చూపు ఈ రకానికి చెందినది. [ ]
(మొదటి రకానికి, మధ్యరకానికి, చివరిరకానికి)

4) ఈ వాక్యం ముగిసి ముగియక ముందే చీమ చేసింది. [ ]
(కుట్టింది, నవ్వింది, ఏడ్చింది)

ఇ) ఎవరు, ఎవరితో అనిరి.

1) "ఆవు నన్ను మేయలేదు!" [ ] → [ ]

2) "నా బిడ్డలమీద ఒట్టేసుకొన్నా నమ్మవా?" [ ] → [ ]

3) "మంచిదే! మరినీకొచ్చిన అనుమానమెక్కడ? [ ] → [ ]

4) "చంటివాడు ఏడుస్తున్నాడు!" [ ] → [ ]

ఈ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించండి.

1) అమాయకులంటే చీమకు సానుభూతి కలదు. ( )

2) రాజు కొడుకులు ఏటికివెళ్లి ఆరు చేపలు తెచ్చారు. ( )

3) నేనీ జవాబు అడుగుతానని చీమ ఊహించి ఉండదు. ( )

4) చీమగారు చిద్విలాసంగా నవ్వారు. ( )

III స్వీయవ్యక్తీకరణ :

1) చీమకథలోని లొసుగులను చీమ ఎలా తెలియజేసిందో మీ సొంతమాటల్లో రాయండి.

2) "నా శ్రమ నాకు బంగారమే" - అని చీమ ఎలా సమర్థించుకుందో మీ సొంతమాటల్లో రాయండి.

IV భాషావగాహన :

అ) కింది వాక్యాలలోని భాషాభాగాలను గుర్తించండి.

1) "చీమ నన్ను కుట్టింది!" [ ] [ ] [ ]

2) చీమ ఫకాలుమని నవ్వింది [ ]

ఆ) క్రింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో గుర్తించండి.

1) నువ్వు నటిస్తున్నావని నేను అనుమానించాను.

2) ''మంచిదే! మరి నీకొచ్చిన అనుమానమెక్కడ?''

3) మీ ఆశకు అంతులేదు.

ఇ) కింది వాక్యాలలోని గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు.

2) మీ వాళ్ళను కూడా ఇలానే చేయమని చెప్పండి.

3) నా కారణాలు నాకున్నాయి.

4) ప్రజలందరితో ఆనాటి పాలకులు కూడా పనిచేసి పొట్టపోసుకునేవారు.

ఈ) కింది వాటిలో సరియైన సంధి కార్యాలను రాయండి.

| పదము | విడదీయుట | సంధిపేరు |
|---|---|---|
| 1. ఎందుకేడుస్తున్నావు | + | |
| 2. | నిశ్చయానికి + ఒచ్చిన | |
| 3. నీకిక్కడ | + | |
| 4. | అయిన + అప్పుడు | |

ఉ) సమాస కార్యాలను రాయండి.

| పదము | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| 1. మానవ సమాజము | | |
| 2. | సహ్యముకానిది | |
| 3. రాత్రింబగళ్ళు | | |

ఊ) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

1) సానుభూతి, 2) నిజాయితి, 3) స్వార్జితం, 4) బిత్తర పోవుట

సృజనాత్మకత :

డా॥ సి. నారాయణరెడ్డి మరియు డా॥ రావూరి భరద్వాజ రచించిన కథలపుస్తకాలు చదివి, వాటిని మీ తరగతిలో చర్చించండి.

ప్రాజెక్టు పని :

పాత్రోచిత పఠనం: తరగతిలో 'ఓ చీమకథ' పాఠాన్ని భావ ప్రకటితమైన (expressive) పాత్రోచిత పఠనం చేయండి. 'యు ట్యూబ్' లో expressive reading సహాయం తీసుకోండి.

నేనివి గ్రహించా :

- ఎవరి స్వార్జితాన్ని వారు రక్షించుకోవటానికి ప్రయత్నించడంలో తప్పులేదు.
- సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించాలి-దానికై ప్రయత్నించాలి.

# 5 సాహసమహిళల సాగరయానం

**నేపథ్యం :** సముద్రతీర విహారం పిల్లా పెద్ద అందరికీ ఆనందం. గవ్వలు ఏరుకోవడం, ఇసుకలో పిచ్చుక గూళ్ళు కట్టుకోవడం, ఇసుకలో కాళ్ళను జొనిపి సిద్ధమై పెద్ద అలకోసం ఎదురు చూడటం, ఒకటేమిటి ఎన్ని సరదాలో.

భూగోళం పుస్తకంలో సముద్రాల గురించి వాటి ఆటుపోట్ల గురించి వాటిలో కలిసే నదుల గురించి సముద్ర సంపద గురించి ఎంతో చదువుతాం. టి.వి. ఛానళ్ళలో ఎన్నో వింతలు చూస్తాం. అయినా మరింకెన్నో అంతు చిక్కని అనుభవాలు, అద్భుతాలు దాగి ఉంటాయి, సముద్రంలో తమకు లభించిన అవకాశాన్ని అంది పుచ్చుకొని ఎన్నో అనుభవాలు గడించారు, అద్భుతాలు చూశారు. దానికొరకు ఎన్నో సాహసాలు చేశారు. సవాళ్ళను ఎదుర్కొన్నారు భారతదేశపు మహిళా నావిక జట్టు ఎవరా మహిళలు? ఏమాసాహసం - చదువుదాం. తెలుసుకుందాం, స్ఫూర్తిని పొందుదాం.


తమ శక్తి సామర్థ్యాలను, ధైర్యసాహసాలను, ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ప్రపంచాన్ని నివ్వెరపరచగలమని నిరూపించిన మహిళామణులెంతో మంది ఉన్నారు. ప్రస్తుతం స్త్రీలు అన్ని రంగాలతోపాటు భారత సైన్యంలోని త్రివిధ దళాల్లో సైతం తమ శక్తియుక్తుల్ని, అంకితభావాన్ని, దక్షతని చాటుతున్నారు. ఇటీవల సముద్రయానం ద్వారా ప్రపంచాన్ని చుట్టివచ్చిన ఆరుగురు నావికాదళ మహిళా అధికారుల సాహసం స్త్రీ సాధికారితకు ప్రత్యక్ష సాక్ష్యం. వారు వీరనారీమణులుగా కీర్తికెక్కటమే కాకుండా, భారత నావికాదళ చరిత్రలోనే ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. కేవలం మహిళలే సముద్రమార్గంలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన ఈ సంఘటన మొత్తం ఆసియాఖండంలోనే ప్రథమం.

## స్త్రీ సాధికారతకు ప్రత్యక్షసాక్ష్యం.

సముద్రప్రయాణం అంటేనే అడుగడుగునా ప్రమాదాలు, సవాళ్ళు-సమస్యలు ఎటుచూసినా కనుచూపుమేర నీరేనీరు. ఎగిసిపడే అలల గర్జన, హోరున వీచే ప్రళయభీకర వాయుతరంగాలు, హఠాత్తుగా విరుచుకుపడే తుఫానులు, హరికేన్లు, ప్రాణాంతకమైన తిమింగలాలు, జలాంతర్గత మంచుకొండలు. వీటన్నిటినుంచి తమ నావని, తమని కాపాడుకోవటం పెద్ద సవాలు. ఎంతో నేర్పు-ఓర్పు, మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటేనే ఈ కఠినమైన కార్యంలో సఫలీకృతులు కాగలుగుతారు. అటువంటి అసాధ్యమైన కార్యాన్ని తమ మనోబలంతో, పట్టుదలతో సుసాధ్యంచేసిన వీరవనితల్ని గురించి తెలుసుకోవటం స్ఫూర్తిదాయకం.

కేవలం మహిళా నావికులతో కొనసాగిన ఈ 'నావికా సాగర పరిక్రమ' సమస్త ప్రపంచం దృష్టిని ఆకర్షించి, చరిత్ర సృష్టించింది.

ఈ యాత్రలో పాల్గొన్న ఆరుగురు మహిళా నావికుల బృందం






'తారిణి' నావికురాండ్ర బృందం

అపూర్వమైన ఈ యాత్రకోసమే గోవాలోని అక్వేరియస్ బోట్ యార్డులో ప్రత్యేకంగా ఒక పడవ రూపొందించబడింది. దీని నిర్మాణకర్త శ్రీ రత్నాకర్ దండేకర్. దానికి **ఐ.యన్.యస్.వి.** 'తారిణి' అని పేరు పెట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడ్డ ఆ చిన్న పడవలో 2017, సెప్టెంబరు 10న మహిళా సాహస నావికులు గోవా ఓడరేవు నుంచి ప్రపంచయాత్రకు బయలుదేరారు. ఈ చారిత్రక యాత్రను భారత రక్షణశాఖా మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు.

ఏదైనా మహత్తరమైన కార్యం విజయవంతం కావాలంటే, దానికి దక్షులైనవారిని ఎంపిక చేయటం, వారికి తగిన శిక్షణ ఇవ్వటం ఎంతైనా అవసరం. కెప్టెన్ దిలీప్ దోండే అరుగురు యోగ్యమైన మహిళల్ని ఎంపికచేసారు. వారికి ఆయనే దాదాపు 3 సంవత్సరాలపాటు ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు.

కెప్టెన్ దోండే వారికి సమర్థంగా పడవ నడపటంలో శిక్షణనివ్వటమొక్కటే కాకుండా, నెలల తరబడి ప్రయాణించటంలో ఎదురయ్యే అవరోధాల్ని బృందస్ఫూర్తితో అధిగమించి ముందుకుసాగే విధంగా, మానసికంగా వారిని సంసిద్ధుల్ని చేశారు. ఆ తరువాత వారు లక్ష్యమే పరమావధిగా ప్రపంచయాత్రకు బయలుదేరి వెళ్ళారు.

ఎనిమిది నెలలపాటు ఆ చిన్న పడవే ఆ అరుగురు మహిళలకు ఇల్లు-వాకిలి, సమస్తం అయింది. పగలు-రాత్రి నిరంతర ప్రయాణం. సముద్రం ప్రశాంతంగా ఉంటేనే నిద్ర. వంతులవారీగా అన్ని బాధ్యతలు అందరూ నిర్వహించారు. మొత్తం 254రోజులు సాగించిన సుదీర్ఘ యాత్రలో వీరు ఐదుచోట్ల మజిలీలు చేశారు.




మజిలీ చేసిన ప్రతిచోట స్థానికుల అద్భుత స్వాగతం, ప్రశంసలవర్షం, ప్రవాస భారతీయుల ఆత్మీయ ఆతిథ్యం, వినోద కార్యక్రమాలు తారిణి సభ్యులలో ఉత్సాహాన్ని నింపాయి. నావికాబృందం ప్రతి మజిలీలోను పిల్లలతో తమ అనుభవాల్ని పంచుకొని వారికి సముద్రయానం గురించి స్ఫూర్తినిచ్చి, మరల ముందుకు సాగారు.

ఈ సాహస మహిళా నావికులు 199రోజులు సాగర ప్రయాణంలోనే గడిపారు. 21,600 నాటికల్ మైళ్ళ

ప్రయాణించి ''సర్కమ్ నావిగేషన్'' (సముద్రంపై ప్రపంచయాత్ర) చేసిన ఖ్యాతి దక్కించుకొన్నారు.

''తారిణి' నావికులు తమ ప్రపంచయాత్రలో ఎన్నో కఠినమైన సవాళ్ళను ఎదుర్కొన్నారు. ఎముకలు కొరికే చలి, తీవ్రమైన పెనుగాలులు, పెద్ద-పెద్ద అలల తాకిడి, తుఫానులు, హరికేన్లను తట్టుకున్నారు. ఎన్నో ప్రమాదాల్ని, సున్న డిగ్రీల శీతోష్ణస్థితిని చవిచూశారు. అట్లాంటిక్-పసిఫిక్ మహాసముద్రాలు కలిసేచోట, కేప్‌హార్న్‌ని సముద్ర ప్రయాణంలో ఎవరెస్టుగా, ఓడలపాలిటి శ్మశానస్థలిగా అభివర్ణిస్తారు. దానిని దాటే సమయంలో 140 కి.మీ. వేగంతో పెనుగాలులు, తుఫాను, జోరున వర్షం, పది మీటర్ల ఎత్తున ఎగిసిపడిన అలల్లో వీరి పడవ పైకి-కిందికీ పడుతూ అతలాకుతలం అయింది. దాదాపు 20 గంటలపాటు ప్రకృతి వైపరీత్యం వారిని ఉక్కిరిబిక్కిరి చేసేసింది. అటువంటి వాతావరణంలో ''బెంబేలు పడకుండా, నిద్రాహారాలు మానుకుని అందరూ కలిసికట్టుగా పడవని నియంత్రించటంలో సఫలీకృతులయ్యారు. ఆనందంతో త్రివర్ణపతాకం ఎగరవేసి కేరింతలుకొట్టి సంబరడ్డారు.

సముద్రంలో సాహసయాత్ర సాగించిన ఈ మహిళా నావికుల దినచర్య చాలా ఆసక్తికరం. పగలు-రాత్రి విరామం లేకుండా నడుస్తూనే ఉంటుంది కాబట్టి వేళకి విశ్రాంతి, నిద్ర ఎలాగో ఉండేవికాదు. ఆహారం ప్రధానమైన అవసరం కాబట్టి, దాని విషయంలోమాత్రం వారు ముందుచూపుతో ఏర్పాట్లు చేసుకుంటూ వచ్చారు. తాజా కూరగాయలు, పళ్ళు, డ్రై ఫ్రూట్స్, ఉప్పు-పప్పు, బియ్యం, గోధుమపిండి, పౌష్టికపానీయాలు మొదలైనవన్నీ సమకూర్చుకునేవారు. సమతులాహారంపై దృష్టి పెట్టేవారు. వంతులవారీగా వంట చెయ్యటం, అంట్లుతోమటం లాంటి బాధ్యతలు చేపట్టేవారు. ప్రశాంత వాతావరణంలో ప్రయాణించేటప్పుడు మాత్రమే తిండిని, అందులోని రుచిని ఆస్వాదించేవారు. భీకరమైన వాతావరణం ఉంటే ఆ వత్తిడిలో ఇతరబాధ్యతలు నిర్వర్తిస్తూనే తిండి తినేవారు. సాధారణ స్థితిలో వంతులవారీగా స్లీపింగ్ బ్యాగ్స్‌లో దూరి నిద్రపోయేవారు.

పైన ఏదైనా మేఘం కనిపిస్తే, ప్రయాణిస్తున్న పడవని దాని కిందికి మళ్లించటం, వర్షంలో హాయిగా స్నానం చెయ్యటం చేసేవారు. బట్టలకు సబ్బు రాసి, వాటిని తాడు సాయంతో పడవ వెనుక నీటిలో వేలాడగట్టేవారు. కొంచెం సేపయ్యాక వాటిని పైకితీసి తెరచాప తాళ్ళపై క్లిప్పుల సాయంతో అరబెట్టుకునేవారు. మానసిక ఉల్లాసం, ఆహ్లాదం కోసం మ్యూజిక్ సిస్టంలో పాటలు, సంగీతం వింటూ,



పాటలు పాడుకుంటూ, స్నేహ సంభాషణలు చేసుకుంటూ, ఛలోక్తులు విసురుకుంటూ నూతనోత్సాహాన్ని నింపుకునేవారు. కుటుంబసభ్యులతో వీడియోకాల్‌లో మాట్లాడుకుని పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటుండేవారు. పుట్టినరోజులు, దసరా, నూతన సంవత్సర వేడుక, దీపావళి పండుగ ఆనందోత్సాహాలతో నడిసంద్రంలో పడవలోనే జరుపుకున్నారు. తాము యాత్ర సాగిస్తున్న 'తారిణి' పడవ పుట్టినరోజును కూడా జరుపుకోవడం విశేషం.

సముద్ర ప్రయాణంలో 'తారిణి' నావికులకు అద్భుతము, ఊహాతీతమైన ప్రకృతి అందాలు తారసపడ్డాయి. సూర్యోదయం, సూర్యాస్తమయం, ఇంద్రధనుస్సు, చంద్రుడు, నక్షత్రాలు మిణుగురులు మొదలైనవాటి శోభని వారు తనివితీరా చూసి ఆనందించారు. తిమింగలాల్ని, అపురూపమైన జలచరాల్ని ప్రత్యక్షంగా చూసి ఆనందానుభూతుల్ని సొంతం చేసుకున్నారు. తమ పడవంత పెద్ద తిమింగలం తన రెండు పిల్లలతో బాటు ఒక గంటపాటు తమ పడవ పక్కనే ఈదుకుంటూ సఖ్యంగా ప్రయాణించటం వారిని సంభ్రమాశ్చర్యాలకు, ఆనందాతి రేకానికి గురిచేసింది. ఈ యాత్ర నారీనావికుల్లో ప్రకృతిపట్ల ప్రేమని, జలయానంపై అమితమైన అభిమానాన్ని నింపింది.

'తారిణి' బృందసభ్యులు ఈ చారిత్రక యాత్ర ముగించుకుని 2018, మే 21న తాము బయలుదేరిన గోవాలోని పనాజీ ఓడరేవుకు తిరిగి చేరుకున్నారు. విజయవంతంగా ప్రపంచయాత్ర పూర్తిచేసుకుని విచ్చేసిన సాహస మహిళా నావికులకు అక్కడ ఘనమైన స్వాగతం లభించింది.

భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఈ సాహస వనితలను అభినందనలతో ముంచెత్తారు. భారత రాష్ట్రపతి శ్రీ రామనాథ్ కోవింద్ ఈ ఆరుగురు మహిళామణులకు ''నారీశక్తి పురస్కారం' ఇచ్చి ఘనంగా సత్కరించారు. అంతేగాక వీరు బృహత్తరమైన టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాన్ని, నౌసేనా పతకాన్ని కూడా అందుకుని భారతదేశం గర్వించేలా చేశారు.





అర్థాలు: సాధికారత = అధికారయుతమైన, ప్రామాణికమైన; శ్రీకారం = శుభప్రారంభం; సవాళ్ళు = ప్రశ్నలు, పోటీలు; ప్రళయం = అపాయం; భీకర=భయంకరమైన; హఠాత్తుగా = అకస్మాత్తుగా; స్థైర్యం = నిలకడ, ఓర్పు; స్ఫూర్తి = ఉత్సాహం; దక్షులు = సమర్థులు; మజిలీ = ప్రయాణంలో ఒకచోట తాత్కాలికంగా ఆగడం; ప్రశంస = పొగడ్త; అతలాకుతలం = తారుమారు; గజిబిజి, చెదరిపోవడం; వైపరీత్యం = తడబాటు; విపరీతత్వం; ఉక్కిరిబిక్కిరి = ఊపిరి ఆడకపోవడం; విశ్రాంతి లేకపోవడం, బెంబేలు = గాభరా; భయం; నియంత్రించటం= అదుపులో ఉంచటం; ఉల్లాసం = సంతోషం; ఛలోక్తులు = వ్యంగ్యపు మాటలు; పరస్పరం = ఒకరినొకరు; యోగక్షేమాలు = క్షేమసమాచారాలు; తారసపడు = సమీపించు; ఎదురుపడు; తటస్థపడు, బృహత్తరమైన = పెద్దదైన.



**రచయిత పరిచయం :** **డా॥ వెన్నా వల్లభరావు**గారు 09-05-1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా బేతవోలు గ్రామములో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీనాగేశ్వరమ్మ, హనుమంతరావు గార్లు. వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి హిందీలో ఎం.ఏ., పిహెచ్.డి. చేశారు. ఆంధ్ర లయోల కళాశాల, విజయవాడలో హిందీ శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ పొందారు.

డా. వల్లభరావుగారు హిందీలోను, తెలుగులోను అనేక రచనలు చేశారు. వాటిలో పేర్కొనదగినవి **సాహిత్యవారథి, కవితాభారతి, జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య**, 35 రేడియో నాటకాల అనువాదం మొదలగునవి. వీరికి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీచే **'ఉత్తమ అనువాద పురస్కారం'** **'బోయపాటి నాగేశ్వరరావు పురస్కారం'** మొదలగు పురస్కారాలు, **'అనువాద సాహిత్యరత్న'** బిరుదు లభించాయి. అంతేగాక ఇటీవల వీరి అనువాద రచనలకు గాను **'కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం'** కూడా అందుకున్నారు.

**I చర్చించండి :**

1) మీకు తెలిసిన సాహస మహిళలు
2) భారతసైన్యంలోని త్రివిధదళాలు
3) మీరు చేసిన నౌకప్రయాణ అనుభవాలు



**II ఆలోచించండి - రాయండి. - ఐదు, ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1) స్త్రీ సాధికారతకు ప్రత్యక్ష సాక్ష్యం.
2) ఈ చారిత్రక యాత్రను ప్రారంభించిన వారు.
3) భారత రాష్ట్రపతి మహిళామణులకు ఇచ్చిన పురస్కారం.
4) భారత ప్రధానమంత్రి సాహస వనితలను ప్రశంసించిన విధము.

**III స్వీయవ్యక్తీకరణ :**

1) సముద్రయానం గావించిన వీరవనితలను గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.
2) మహిళానావికుల దినచర్యను గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.
3) కెప్టెన్ దోండే మహిళానావికులకు శిక్షణ నొసంగిన విధానాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
4) సముద్రయానంపై మీ అభిప్రాయాన్ని రాయండి.

**ప్రవాహ పట్టిక పూరించుము**

| | | |
|---|---|---|
| తారిణి బృందం సముద్ర ప్రయాణం మజిలీలు → | → | ↓ |
| ← | ← | |

**సృజనాత్మకత :** సముద్రంలో లభించే వివిధరకాల జలసంపదను గూర్చి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి. ఒక వ్యాసం రాయండి.

**ప్రాజెక్టు పని :**

- స్త్రీ-పురుష సమానత/స్త్రీలను గౌరవించడం నేర్చు కోవాలి' అనే అంశాలపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మీరు ఇవ్వవలసిన ఉపన్యాసాన్ని అంచెల వారిగా నోటుపుస్తకం పై రాసుకోండి. **ఉపన్యసించండి.**
- ప్రస్తుత పాఠంలోని అంశాల ఆధారంగా **వార్తాలేఖనం** చేయండి.

**నేనివి గ్రహించా :** 'ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్' - ఎటువంటి కఠినతర విషయమునైననూ స్త్రీలు పురుషులతో సమానంగా సాధించగలరు.

# కెప్టెన్ దిలీప్ దోండేతో ముఖాముఖి

**(విద్యార్థినీ విద్యార్థులు సాగర భూప్రదక్షిణ గురించి గౌ. కెప్టెన్ దిలీప్ దోండే గారితో జరిపిన ముఖాముఖి)**



**విద్యార్థులు :** నమస్కారమండి.

**కెప్టెన్ దోండే :** నమస్కారం.

**విద్యార్థులు : సముద్రంపై ప్రపంచయాత్రకు నారీదళాన్ని ఎంపికచేసే ప్రక్రియలో మీ అనుభవాలను వివరించండి.**

**కెప్టెన్ దోండే :** కేవలం స్త్రీలకే పరిమితమైన ఈ యాత్రకోసం ఐచ్ఛికంగా ముందుకొచ్చిన వారికి అవకాశం ఇచ్చాం. మనోబలం, ధైర్యము, తెగింపు, పట్టుదల, సానుకూల దృక్పథం, నిజాయితీ, సాహస యాత్రికులకుండవలసిన మౌలికమైన లక్షణాలు. అటువంటి గుణాలున్న వారినే ఎంపికచేశాము.

**విద్యార్థులు :మీరు ఎంపిక చేసిన టీమ్ సభ్యుల శిక్షణ మరియు మీ అనుభవాలను వివరించండి.**

**కెప్టెన్ :** టీమ్ సభ్యులకు ముందుగా నావికా శిక్షణ కేంద్రంలో ఒక నెల రోజులు సముద్ర ప్రయాణానికి అవసరమైన మెళకువలు నేర్పాము. తరువాత కొచ్చిలోని నేవీ ట్రైనింగ్ స్కూలులో నావికాలక్షణం, నౌకాయాన నియంత్రణ, ప్రసారవ్యవస్థ, వాతావరణశాస్త్ర పరిజ్ఞానం ఇత్యాది మౌలిక విషయాలను వారికి బోధించాము. అటు పిమ్మట INSV మహాదేయి పడవపై నౌకాయానంలో శిక్షణ ఇచ్చాము. నౌక నిర్వహణ, యాంత్రిక లోపాలను సరిచేయటం ఇత్యాదులన్నీ ప్రాథమికంగా వారికి నేర్పాము. ప్రత్యక్ష అనుభవంకోసం వారిని వెంటపెట్టుకుని సముద్రంపై చిన్న-చిన్న యాత్రలు, సుదూర నౌకాయానాలు కూడా చెయ్యటం జరిగింది.

**విద్యార్థులు: శిక్షణ ముగిసిన తరువాత మహిళల సాగరపరిక్రమ విజయవంతమౌతుందని మీరు విశ్వసించారా?**

**కెప్టెన్ :** పూర్తిగా విశ్వసించాను! నాకు గనుక పూర్తి నమ్మకం లేకుంటే వారిని ఆ సాహసకృత్యానికి అనుమతించేవాణ్ణే కాదు. నిజానికి వాళ్ళ శిక్షణ, పరిక్రమణ ప్రారంభమయ్యేంతవరకేగాక యాత్ర ముగిసేంతవరకూ కొనసాగిందనే చెప్పాలి.

**విద్యార్థులు: నారీనావికుల శక్తి సామర్థ్యాలపైన, వారి టీమ్ స్పిరిట్ పైన మీకు నమ్మకం ఏర్పడిందా?**

**కెప్టెన్ :** అవును. నేను వారి దక్షతను దగ్గరగా నిశితంగా పరిశీలించాను. వారి శక్తిసామర్థ్యాల పైన, టీమ్ స్పిరిట్ పైన నాకు పూర్తి నమ్మకం ఏర్పడింది.

**విద్యార్థులు: సాగర పరిక్రమకోసం నిర్మించిన ప్రత్యేక పడవ 'తారిణి' నిర్మాణంలో మీతో పాటు మీ టీమ్ పాత్ర ఎలాంటిది?**

**కెప్టెన్ :** ఈ సాహసయాత్ర కోసం రూపొందించిన 'తారిణి' పడవ వారి శిక్షణకు ఉపయోగించిన మహాదేయిని పోలి వుంటుంది. ఆ పడవను నడిపే సమయంలో మాకు కలిగిన ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా తారిణి పడవను అనేక మార్పులతో మరింతగా మెరుగు పరచటం జరిగింది. 'తారిణి' పడవ నిర్మాణ సమయంలో బృందసభ్యులు అనేకమార్లు దానిని పరిశీలిస్తూ చిన్నపాటి ప్రయాణాలు కూడా చేశారు. అందువల్ల, యాంత్రిక లోపాలను స్వయంగా సరిచేసుకోగలమన్న ధైర్యం, ఆత్మవిశ్వాసం వారిలో పెంపొందాయి.

**విద్యార్థులు:** **తారిణి గాలి ఆధారంగా, గాలి-తెరచాప సాయంతో నడిచే పడవా లేక ఇంజను ద్వారా నడిచేదా?**

కెప్టెన్ : 'తారిణి' గాలి సాయంతో, తెరచాప ఆధారంగా నడిచే పడవ. దానికి అమర్చిన 130 అశ్వశక్తి (హార్స్ పవర్) గల ఇంజను పడవను ఓడరేవు నుంచి బయటకు-లోపలకు నడపటానికి మాత్రమే సహాయకారిగా వుంటుంది. ఎందుకనగా ఈ పనిని తెరచాప సాయంతో చేయటం కష్టం. నౌక నిలకడగా ప్రయాణించటానికి పైభాగాన ఆటోమేషన్ సిస్టం 'ఆటోపైలట్' అనేది యేర్పరచబడింది. తెరచాప పైకెత్తటం. దించటం, సరిచేసుకోవటం వంటి మిగిలిన పనులను నావికులే స్వయంగా చేసుకోవలసి వుంటుంది.



**విద్యార్థులు:** **నడిసముద్రంలో సాంకేతిక లోపంతో పడవ మొరాయిస్తే, సమస్య పరిష్కారానికి ఏం ఏర్పాట్లు చేశారు?**

కెప్టెన్ : నడిసముద్రంలో ఏ ఇబ్బంది వచ్చినా బయటి నుండి గావించే ఏ సహాయమైనా వారికి అందటానికి రెండు మూడు రోజులు పడుతుంది. అందువల్ల నావికులకు స్వయంగా పరిస్థితిని చక్కదిద్దుకోవటం నేర్పాము. అయినా ప్రయాణానికి తీవ్రమైన అంతరాయం ఏర్పడినప్పుడు శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా తీరప్రాంతంలోని అధికారుల సహాయం కోరవచ్చు. పడవ మునిగిపోయే ప్రమాదం ఏర్పడితే ప్రాణరక్షణకోసం చిన్నపాటి తేలికైన పడవను నౌకలో ఏర్పాటుచేశాం.

**విద్యార్థులు:** **నావికాబృందం సముద్రంలో గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొనేటప్పుడు మీ మనోభావాలు ఎలా ఉన్నాయి?**

కెప్టెన్ : మహిళా నావికుల సాహసయాత్ర విజయంపట్ల నాకు పూర్తి విశ్వాసం వున్నది. శిక్షణ ప్రారంభంలో అనుభవశూన్యులైన వీరు శిక్షణ తర్వాత యాత్ర మొదలుపెట్టే నాటికి అత్యంత అనుభవజ్ఞులు, సమర్థులైన నావికులుగా రూపొందారు. అందుచేతనే వారు సముద్రం మీద విపత్కర పరిస్థితుల్లో వున్నప్పటికి వారి విజయంపట్ల నాకు ఏమాత్రం సందేహం, ఆందోళన కలగలేదు. వారు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని సాధించిన ఈ విజయం పట్ల నాకు చాలా గర్వంగా ఉంది.

**విద్యార్థులు:** **ఒక సముద్రయానాన్ని సాగర భూప్రదక్షిణం (సర్కమ్ నావిగేషన్) అని చెప్పటానికి గల షరతులు ఏమిటి?**

కెప్టెన్ : చెబుతాను.

- భూమి గుండ్రంగా ఉంటుంది కాబట్టి సముద్రయానం ఏ ఓడరేవు నుండి మొదలుపెడితే అక్కడికే చేరి ముగించాలి.
- సముద్రయానం సూయాజ్ పనామా వంటి కాలువలలో నుండి సాగకూడదు.
- నౌకయానం ఉత్తర దక్షిణ ధృవాల మధ్య ఉండే అన్ని రేఖల గుండా కనీసం ఒక్కసారైనా చేయవలసి వుంటుంది.
- భూమధ్యరేఖ గుండా కనీసం రెండు సార్లు ప్రయాణించ వలసి వుంటుంది. (ఎందుకంటే భూమికి దక్షిణార్ధగోళంలో వుండేవారు కొద్దిపాటి దూరాన్ని మాత్రమే ప్రయాణించి భూప్రదక్షిణం చేశామని చెప్పినా అది నిబంధనలకు విరుద్ధం.)
- భూ పరిక్రమణ యాత్ర భూమి చుట్టుకొలత 21600 నాటికల్ మైళ్ళ కంటే ఎక్కువ దూరం ఉండాలి.
- భూ పరిక్రమణ యాత్రలో తప్పనిసరిగా ఆస్ట్రేలియా ఖండంలోని కేప్ లియువిన్, అమెరికా ఖండంలోని కేప్ హార్న్, ఆఫ్రికా ఖండంలోని కేప్ ఆఫ్ గుడ్ హోప్ .... ఈ మూడు కొనల ద్వారా ప్రయాణించవలసి ఉంటుంది.
- యంత్రసహాయం లేకుండా కేవలం గాలి సహాయంతో నడిచే తెరచాపగల నావను మాత్రమే ఉపయోగించాలి.

**విద్యార్థులు:** **మీ నుంచి చాలా విషయాలు తెలుసుకున్నాము. మీ అమూల్యమైన సమయం కేటాయించినందుకు మీకు ధన్యవాదములు.**

# 6 కరెంటు సంబరం

**నేపథ్యం :** మనం ఇంట్లోకి ఏదైనా కొత్తవస్తువు వస్తే సంబర పడతాం. అలాగే ఊరిలో ఏదైనా కొత్త విశేషం జరిగినా ఊరంతా సంబరపడుతుంది. ఇలాంటి సంఘటనలు మీకెప్పుడైనా ఎదురయ్యాయా? వాటిని గురించి తరగతిలో చెప్పండి.

ప్రస్తుత పాఠం బామ్మగారి గాబరా, సంబరం ఎందుకో, ఏంటో చూద్దామా!


మా చిన్నతనంలో కరెంటు ఉండేది కాదు మా ఊళ్ళో. లాంతరు హాల్లో ఇనపకొక్కేనికి తగిలించేవారు. వంటింట్లోనో, పడకగదిలోనూ లాంతర్లు, మిగిలినచోట కోడిగుడ్డు దీపాలు. చేత్తో పుచ్చుకుని తిరిగేందుకు రెండు చిన్న లాంతర్లుండేవి. సాయంత్రంపూట ఆ దీపాలన్నీ దగ్గరపెట్టుకుని కిరసనాయిలు పోసి ముగ్గుతో గ్లాసులన్నీ మసి లేకుండా తుడిచి, కత్తెరతో వత్తులు కత్తిరించి సిద్ధంగా పెట్టుకునేది అమ్మమ్మ.

చీకటిపడగానే దీపాలు వెలిగించేవాళ్ళు. భాగ్యవంతుల ఇళ్ళల్లో పెట్రోమాక్స్ లైట్లు వుండేవట.

ఒకసారి మేము సెలవులకు వెళ్ళినప్పుడు ఊరంతా సందడి. ఊళ్ళోకి కరెంటు వస్తుందట! స్తంభాలకోసం గుంటలు తవ్వడం, అంత ఎత్తున వైరుచుట్టలు తేవడం అన్నీ విచిత్రంగా చూశాం. అయిదారిళ్ళవాళ్ళు ఇంటికి కరెంటు పెట్టించుకోవాలనుకున్నారు. అందులో మా ఇల్లు ఒకటి.

ముందు సంబరపడినా ఆ తర్వాత భయపడింది మా అమ్మమ్మ. ''ఆ కరెంటీ ప్రమాదకరమైనదిట కదా! మన పార్వతమ్మ వదినగారి దూరపు చుట్టం బెజవాడలో కరెంటీకి అతుక్కుపోయి గుటుక్కుమన్నాడట. ఇప్పుడా కరెంటీ లేకపోతే ఏం? ఇన్నాళ్ళూ గడవలేదా? అట్లాగే గడుస్తుంది'' అంది.

**భాగ్యవంతులు = ధనవంతులు; సందడి = గోల;**



''ప్రమాదం ఏమీలేదు. కరెంటు వస్తే ఆ సులువువేరు. కాస్త జాగ్రత్తగా వుంటే చాలు'' అంది అమ్మ.

''ఏమోనమ్మా! కాళ్ళకి రబ్బరు చెప్పులు వేసుకోవాలిట. లేకపోతే నేలకి అతుక్కుపోతారుట. అలా అతుక్కుపోతే ఇంకెవరైన రబ్బరుచెప్పులు వేసుకుని వచ్చి కర్రతో అతుక్కుపోయినవాళ్ళని కొడితేగానీ ఊడిరావుట కాళ్ళు. ఈ వయసులో రబ్బరుచెప్పులు వేసుకుని ఏం తిరుగుతాను?'' అంది అమ్మమ్మ.

అమ్మ ఫకాలున నవ్వింది. ''ఎవరా చెప్పింది, మా ఊళ్ళో కరెంటు లేదూ! నేను చెప్పులేసుకుని తిరుగుతున్నానా? అక్కడికి వచ్చినప్పుడు నువ్వు చెప్పులేసుకుని తిరుగుతున్నావా? ఆ మాటలేం నమ్మకు'' అని తీసిపారేసింది.

అమ్మతో వాదించలేక ఊరుకున్నా మా దగ్గర వాపోయేది.

''మీ అమ్మకేం.. చెప్తుంది. అక్కడైతే మీరందరూ వున్నారు. ఇక్కడ మేమిద్దరమే వుంటాం. పోనీ నేను నేలకి అతుక్కుపోతే మీ తాతయ్య ఓ దెబ్బ వేసినా ఫర్వాలేదు గానీ ఆయన అతుక్కుపోయారనుకో... కట్టుకున్న భర్తని కర్రతో ఎట్లా కొడతాను? రౌరవాది నరకాలు పట్టిపోనూ? ఎందుకొచ్చిన ప్రారబ్ధం ఇదంతా'' అని బాధపడింది.

''అలా ఏం కాదులే అమ్మమ్మా. మా ఊళ్ళో కరెంటువుంది. ఎవరూ నేలకి అతుక్కుపోలేదు'' అని ధైర్యం చెప్పాం.

''మీది బస్తీ కరెంటీ. ఇది పల్లెటూరి కరెంటీ. దానికున్న తెలివితేటలు దీనికుండద్దూ'' అంది.

ఆవిడ ఎంత ప్రతిఘటించినా వినలేదు. ఇంట్లో వైరింగ్ చేసి బల్బులు బిగిస్తుంటే మళ్ళీ అడ్డుపడిందిట. ''అంటే అన్నానంటారు. అంత ఎత్తున దీపాలు పెడితే నేను ముగ్గుపెట్టి ఎట్లా తుడుచుకుంటాను? కాస్త నేలబారుకి బిగించండి'' అందిట. వాళ్ళు నవ్వేసి ''ఈ దీపాలు రోజూ తుడవక్కర్లేదమ్మా. మసి ఉండదు కదా'' అన్నారట.

ఎలాగైతేనేం... కరెంటు వచ్చేసింది. ఆ శుభసందర్భంలో మేమంతా వెళ్ళాం. తాతగారు సంబరంగా ఉన్నారుగానీ అమ్మమ్మకి సవాలక్ష సందేహాలు... అమ్మ సమాధానాలు.

**ఇంట్లో వైరింగ్ చేస్తూ బల్బులు బిగిస్తుంటే అడ్డుపడింది.**

''ఒక్కొక్కచోట ఒకటేమీట పెడితే సరిపోయేది. ఇక్కడ మూడు మీటలు పెట్టారు. ఒకటి వంటగదిలోకి, రెండోది భోజనాల గదిలోకి, మూడోది దొడ్లోకట. ఒకటి వెయ్యబోయి ఇంకొకటి వేస్తే ప్రమాదం కాదా!''

''ఏమీ కాదు. అది ఆర్పేసి ఇంకొకటి వెయ్యాలి.''

''సరే! కరెంటీ దీపం ఉండగ లాంతరు వాడితే కరెంటీ దీపానికి కోపం వస్తుందా?''

''కోపం రావడానికీ, తాపం రావడానికీ అదేమైనా మనిషా? అయినా కరెంటు దీపం ఉండగా మళ్ళీ లాంతరు ఎందుకు?''

అలా ఎన్నో అనుమానాలు...

ఆ తర్వాత కొన్నాళ్ళకి మళ్ళీ వెళ్ళా,.

''నేను చదువుకోనిదాన్ననీ,ఏమీ తెలియనిదాన్ననీ తాటాకులు కట్టేస్తారు. కరెంటీకి కోపం ఎందుకొస్తుందీ అంది మీ అమ్మ. ఆ కరెంటీకి వున్నంత చుప్పనాతి తనం ఇంకెవరికీ ఉండదు. మామూలప్పుడు పుచ్చపువ్వుల్లా వెలుగుతాయా దీపాలు! మొన్నామధ్య గోవిందరాజువాళ్ళు మనింటికొచ్చినప్పుడు ఠపీమని ఆరిపోయాయి. అదేమిటంటే కరెంటీ పోయిందిట. అల్లా పరాయివాళ్ళు వచ్చినప్పుడు పోవడం మర్యాదేనా? ఆనక అంతా అయిపోయి వాళ్ళు వెళ్ళాక తిరిగ్గా వచ్చింది. నాకీ కరెంటీ పద్ధతేం నచ్చటంలేదు. నయానాభయానా చెప్పమంటే మీ తాతయ్య వినరు'' అని చెప్పుకుని బాధపడింది.

ముందర కొంచెం అస్తావ్యస్తాపడినా తరువాత కరెంటు దీపాలు చూసి మురిసిపోయింది అమ్మమ్మ.

గుటుక్కుమనుట = చనిపోవుట;
సులువు = సులభం, తేలికైన;
రౌరవం = ఒక నరకం, పాపం;
ప్రతిఘటించుట = ఎదిరించుట; ఠపీమని = ఒక్కసారిగా;
అస్తావ్యస్తాపడుట = తారుమారవుట;

గాలికి అల్లల్లాడవు. మసిబారిపోవు. బ్రహ్మముడి వేసుకున్నట్లు వెంట తీసుకుపోనక్కర్లేదు. చక్కగా పొందికగా ఉన్నచోటే ఉండి పుచ్చపువ్వులా మెరిసిపోతాయి అని సంబరాలు పడేది.

**కరెంటి పద్ధతి నచ్చక పోవడానికి కారణం.**

కరెంటు వచ్చాక ఆవిడ హోదా కూడా పెరిగింది.

పక్కింటి రాఘవమ్మగారు దొడ్డిగోడ నుంచి కేకేసి ''వదినా! ఇంట్లో గాలాడడం లేదు. పిల్లవెధవలకి దొడ్లో అన్నం పెడతాను. కాస్త మీ లైటు వెలిగిస్తావా?'' అని అడిగేది.

''అయ్యో! దానికేం భాగ్యం'' అని వెనకాల లైటు వేసేది అమ్మమ్మ.


మర్నాడు తెల్లవారాక ఆవిడ వచ్చి ''ఎంతైనా కరెంటు దీపం మహిమే వేరు. మాకొద్దు, మాకు చాలు అని సూకిరాలు పోయే పిల్లలు ఇంకాస్త ఇంకాస్త అంటూ ఇత్తడి గిన్నెడు అన్నం ఊడ్చిపెట్టేశారు వదినా'' అని ఫీడ్‌బేక్ ఇస్తే.

''అవును వదినా! అదివరకు నా కీళ్ళు కీచుకీచుమంటూ ఉండేవి. కరెంటీ దీపాలు వచ్చాక సాఫీగా సాగుతున్నాయమ్మా'' అన్నది అమ్మమ్మ.

ఈ విషయం విని అపోజిషన్ పార్టీలోని జగన్నాథంగారి భార్య మంచినీళ్ళ బావిదగ్గర ఎద్దేవా చేసిందట. ''మరీ బడాయి కాకపోతేనూ... కరెంటు దీపంతో కాళ్ళనెప్పులూ కీళ్ళనెప్పులూ తగ్గుతాయా?'' అందిట.

అది తెలుసుకొని ''ముక్కానీ ఆవదం దీపాలవాళ్ళు కూడా కరెంటీ గురించి మాట్లాడుతుంటే ఏం చెప్తాం? దమ్ముంటే వందరూపాయలు పెట్టి ఇంట్లోకి కరెంటీ పెట్టించుకుని నెల తిరిగేసరికి మూడుముప్పాలా కరెంటీ ఖర్చు కట్టమను తెలుస్తుంది... సత్తా ఏమిటో? అయినా అమావాస్యనాడు వెన్నెల్లో భోజనం చేస్తాననే తెలివి తక్కువది. దానికేం తెలుసు కరెంటీ గొప్ప?'' అంది మా అమ్మమ్మ గర్వంగా.

**మురిసిపోవు = సంతోషపడు.**





**రచయిత్రి పరిచయం :** శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు 18-7-1953న గుంటూరు జిల్లా (ఆం.ప్ర) యాజలి గ్రామంలో కీ.శే. శ్రీమతి వల్లూరి సత్యవాణి, శ్రీవల్లూరి వెంకటకృష్ణమూర్తి దంపతులకు జన్మించారు.

పొత్తూరి విజయలక్ష్మిగారి రచనా వ్యాసంగం 1982లో ప్రారంభమైంది. మొదటినవల 'ప్రేమలేఖ'. 'పొత్తూరి విజయలక్ష్మి హాస్యకథలు', 'చంద్రహారం', 'మా ఇంటి రామాయణం', 'ఆనందమే అందం', 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం','సన్మానం', 'స్క్రిప్ట్ సిద్ధంగా ఉంది సినిమా తియ్యండి!' 'పూర్వి' కథా సంపుటాలు వెలువడ్డాయి.

విజయలక్ష్మిగారికి 2007లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ధర్మనిధి పురస్కారం లభించింది. అదే సంవత్సరంలో తురగా కృష్ణ మోహన్‌రావు స్మారక పురస్కారం కూడా పొందారు. 2009 సంవత్సరపు శేషారత్నం స్మారక హాస్యకథా పురస్కారం, 2012లో గృహలక్ష్మి పురస్కారం పొందారు. 2015లో అపురూప హాస్య పురస్కారం, మునిమాణిక్యం నరసింహారావు స్మారక ధర్మనిధి పురస్కారం లభించాయి.

ప్రస్తుత పాఠ్యభాగం 'పొత్తూరి విజయలక్ష్మి హాస్యకథలు' నుండి గ్రహించబడినది.

## I చర్చించండి..

1) వెలుగునిచ్చే సాధనాలు

2) విద్యుత్తు ఏర్పడు విధము.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) అమ్మమ్మ చిన్నతనంలో సాయంత్రం పూట దీపాలను సిద్ధం చేసే విధము.
2) అమ్మమ్మ వైరింగ్ వారిని ప్రతిఘటించిన రీతి.
3) అమ్మమ్మ తన బాధను వ్యక్తపరచిన తీరు.
4) కరెంటు వచ్చాక అమ్మమ్మ హోదా.

### ఆ) కింది వాక్యాలను సరైన వరుస క్రమంలో అమర్చి రాయండి.

1) అంత ఎత్తున దీపాలు పెడితే ముగ్గుపెట్టి ఎట్లా తుడుచు కుంటాను?
2) ఒక్కొక్కచోట ఒకమీట పెడితే సరిపోయేది.
3) ఒకటి వెయ్యబోయి ఇంకొకటి వేస్తే ప్రమాదం కాదా!
4) ఆవిడ ఎంత ప్రతిఘటించినా వినలేదు.


ఇ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) చీకటి పడగానే దీపాలు ఆర్పివేసేవాళ్ళు. ( )

2) మేము సెలవులకు వెళ్ళినప్పుడు ఊరంతా సందడి. ( )

3) ఈ దీపాలు రోజూ తుడువనక్కర్లేదమ్మా. ( )

4) కరెంటు దీపాలుచూచి దుఃఖపడింది అమ్మమ్మ. ( )



ఈ) కింది వాక్యాలను జతపరచండి.

| | |
|---|---|
| స్తంభాల కోసం | ఆ సులువు వేరు |
| కరెంటు వస్తే | సవాలక్ష సందేహాలు |
| కాస్త నేలబారుకి | గుంటలు తవ్వడం |
| అమ్మమ్మకి | బిగించండి. |
| | వేల సందేహాలు |

## III స్వీయ వ్యక్తీకరణ :

1) విద్యుత్ ఉపయోగాలను గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.

2) కరెంటును గూర్చి అమ్మమ్మకు కలిగిన సందేహాలను మీ సొంతమాటల్లో రాయండి.

3) పూర్వకాలంలోని దీపాల పరిస్థితిని గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.

## IV భాషావగాహన :

అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.

1) అంత ఎత్తున దీపాలు పెడితే <u>నేను</u> ముగ్గుపెట్టి ఎలా <u>తుడుచుకుంటాను</u>.

2) <u>కత్తెరతో</u> వత్తులు <u>కత్తిరించి</u> సిద్ధంగా పెట్టుకొనేది అమ్మమ్మ.

ఆ) కింది పదాలను విడదీసి, సంధి నామం రాయండి.

| | పదము | | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|---|
| 1) | మీరందరు | = | + | → | |
| 2) | తాతయ్య | = | + | → | |
| 3) | ఇంటికొచ్చిన | = | + | → | |
| 4) | సాగుతున్నాయి | = | + | → | |

ఇ) కింది వాక్యములు సామాన్య/సంయుక్త/సంశ్లిష్టములలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.

1) కరెంటు దీపాలు గాలికి అల్లాడవు, మసిబారిపోవు.

2) అమ్మ ఫకాలున నవ్వింది.

3) కరెంటు వచ్చాక, ఆవిడ హోదా కూడా పెరిగింది.

**ఈ) కింది వాక్యములో గుర్తించబడిన పదాలు ఏ వాక్యాంగములకు చెందినవో రాయండి.**

<u>అమ్మమ్మ</u> <u>కరెంటుదీపాలు</u> చూసి <u>మురిసిపోయింది.</u>

| ↓ | ↓ | ↓ |
|---|---|---|
| | | |

**ఉ) కింది వాక్యభేదాలను గుర్తించి రాయండి.**

(ప్రశ్నార్థకము, ఆశ్చర్యార్థకము, వ్యతిరేకార్థకము, నిశ్చయార్థకము)

1) ఒకటి వెయ్యబోయి ఇంకొకటి వేస్తే ప్రమాదం కాదా!

2) మా ఊళ్ళో కరెంటు ఉంది.

3) కాస్త మీ లైటు వెలిగిస్తావా?

4) మా చిన్నతనంలో మా ఊళ్ళో కరెంటు ఉండేది కాదు.

**ఊ) కింది పదాలు ఏ వచనములకు చెందినవో రాయండి.**

1) బావి = 2) దీపాలు =

3) మీటలు = 4) లాంతరు =

**ఋ) కింది పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.**

1) భార్య = 2) స్తంభము =

3) ఆయన = 4) అమ్మ =

**ౠ) కింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి:**

1) భాగ్యవంతులు × 2) భయం ×

3) మర్యాద × 4) నవ్వు ×

**ఎ) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.**


1) సిద్ధం 2) సంబరపడుట 3) ప్రతిఘటించుట

**ఏ) కింది వాక్యాలు ఏకాలములకు చెందినవో గుర్తించి రాయండి.**

1) ఊళ్ళోకి కరెంటు వస్తుందట :

2) ఇక్కడ మూడు మీటలు పెట్టారు :

3) నేను చెప్పులేసుకుని తిరుగుతున్నాను :



## V అల్లికలను పూరించండి.

1) మీటలు పెట్టిన గదులు

2) కరెంటు దీపాలు చూసి అమ్మమ్మ మురిసి పోవుటకు కారణాలు

3) కరెంటు వాడకంలోనికి రాక మునుపు, వచ్చిన తర్వాత ఉపయోగించు పరికరాల పట్టికను పూరించండి.

| | కరెంటు వాడుకలోకి రాకమునుపు | కరెంటు వాడకంలోనికి వచ్చిన తరువాత |
|---|---|---|
| వెలుతురు కొరకు | ________________ | బల్బ్, ట్యూబ్‌లైట్ |
| గాలి కొరకు | ________________ | ________________ |
| రుబ్బుట, విసరుట కొరకు | ________________ | ________________ |
| ఇస్త్రీ కొరకు | చెంబు, బొగ్గు ఇస్త్రీ పెట్టె | ________________ |

## VI సృజనాత్మకత

విద్యుచ్ఛక్తి ఒక వరం. దాని ద్వారా అనేక సాధనాలు ఏర్పడ్డాయి. ఎన్నో సౌకర్యాలు కలిగాయి. కాని వాటిని పరిమితంగా ఉపయోగించాలి. వీలైనంత మేరకు ప్రకృతి సిద్ధంగా జీవించడం ఆరోగ్యకరం. దీనిని సమర్థిస్తూ చిత్ర సహితమైన వివరణలతో కూడిన ఆకర్షణీయమైన సంగణక ప్రదర్శనా ఫలకాలను (స్లైడ్‌షో) రూపొందించండి. ప్రదర్శించండి.

### ప్రాజెక్టుపని–చర్చావేదిక

తరగతిలోని విద్యార్థులందరూ రెండు జట్లుగా ఏర్పడండి. సామాజిక మాధ్యమాలు (Social media) సమాజానికి ''హితము–హితముకాదు'' అను విషయాలపై చర్చించండి.

**నేనివి గ్రహించా :**

నిత్యజీవితంలోని సాధారణ విషయాలను హాస్య స్ఫోరకంగా ఎలా చెప్పవచ్చు-రాయవచ్చు.

# 7 విశ్వకవి

**నేపథ్యం :** విశాలంగా, సుదూరంగా ప్రవహించే నదులు ఉద్గమస్థానంలో చాలా చిన్నవిగా మొదలవుతాయి. కానీ పోనూ పోనూ గొప్ప ప్రవాహంతో జీవనదులుగా పరిణమిస్తాయి. అలాగే గొప్ప వ్యక్తులు కూడా బాల్యం నుండే ఘన కార్యాలను సాధిస్తూ ఎదుగుతారు.

బాల్యం నుండే కవితారచన ప్రారంభించి విశ్వకవిగా ఎదిగి నోబుల్ బహుమతి పొందిన రవీంద్రనాథ్ ఠాగూర్ గారి గురించి ఈ పాఠంలో తెలుసుకుందామా!

పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు రవీంద్రుడు బాల్యం నుండే కవితా పరిమళాలు వెదజల్లిన వైనం చాలావింతైన చోద్యం. అప్పటికి రవికి ఎనిమిదేండ్ల ప్రాయము. జ్యోతి అను కుర్రవాడు రవీంద్రుని మేనల్లుడు. అతడు వయసులో రవికన్నా కొంచెం పెద్ద. అతడొకనాడు కొన్ని కవితాలక్షణాలను వివరించాడు. వెంటనే రవి ఆ లక్షణాలను ఆకళింపు చేసుకొని ఒక కవిత రాసాడు. కవిత్వం రాయడం అసాధ్యమైన పని కాదని గ్రహించాడు. రవీంద్రుడు 8 ఏండ్ల ప్రాయము నుండే కవితలు రాయడం ప్రారంభించాడు. అతని అన్నయ్య ప్రోత్సాహంతో తాను రాసిన కవితలను భవనంలోని వారితోబాటు వార్తాపత్రికల సంపాదకులకు కూడా వినిపించాల్సి వచ్చేది. అతడు మహాకవి కాళిదాసు సాంప్రదాయ కవిత్వం చదవడం ద్వారా ప్రేరణ పొంది తానుకూడా సాంప్రదాయ కవిత్వం రాయడం అలవరచుకున్నాడు. అతడు తన అన్నదమ్ములు, అక్క చెల్లెండ్ర నుండి ప్రేరణ పొందాడు. అతని అన్న ద్విజేంద్రనాథ్ కవి మరియు తత్త్వవేత్త, మరొక సోదరుడు సత్యేంద్రనాథ్ చాలా గౌరవనీయమైన పదవిలో ఉండేవాడు. అతని సోదరి స్వర్ణకుమారి ప్రసిద్ధ నవలాకారిణి.


ఒకనాడు రవి అతని సోదరుడు ఎస్టేట్ కార్యాలయం నుండి బయటకు వస్తుండగా వారికి పత్రికా సంపాదకులు నవగోపాల్‌బాబు ఎదురైనాడు. అతనితో రవి సోదరుడు ''మా రవి ఒక కవిత రాశాడు. దానిని మీరు వింటారా'' అని అడిగాడు. దానికి ఆయన అంగీకారం తెల్పగానే రవీంద్రుడు తాను రాసిన 'కమలము' అనే కవితను గొంతెత్తి చదివాడు.

ఆ కవితలో అతడు తుమ్మెద అను అర్థములో ద్విరేఫ అనే పదాన్ని వాడాడు. కానీ ఆ పదం అంతగా వాడుకలో లేదు. ఈ కవిత అంతా విన్నాక సంపాదకుడు ''ఈ ద్విరేఫను ఎక్కడ నుండి తెచ్చావని ప్రశ్నించాడు. కవిత్వం రాయడం మొదలుపెట్టిన దగ్గరి నుండి రవికి శబ్దములపై ప్రీతి మెండు. పాపం! రవి ఆ పదం ఎంతో గొప్పదని భావించి ప్రయోగించాడు. గొప్ప గొప్ప పుస్తకాలు చదువుతూ ఇంపుగా వుండే ధ్వనులు గల పదాలను గుర్తుంచుకొని తన కవిత్వంలో ఉపయోగించేవాడు. అలాగే ద్విరేఫ అనే పదం ఎంతో గొప్పదని భావించి ప్రయోగించాడు రవి. ఆయనిలా ప్రశ్నించగానే చిన్నబుచ్చుకున్నాడు. ఆ కాలంలో పిన్న వయస్కులు, కవితలు రాసే పెద్దలు వారిని ఎంతగానో మెచ్చుకునేవారు. పత్రికా సంపాదకులు సైతం వారిని ప్రశంసించేవారు.

## రవి గొంతెత్తి చదివిన కవిత.

రవీంద్రుడు కవిత్వం రాస్తాడన్న సంగతి పాఠశాలలో అందరికి తెలిసిపోయింది. ఓమారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందబాబు విరామసమయంలో రవిని తన గదికి రప్పించి నీవు కవిత్వం రాస్తావా అని ప్రశ్నించాడు. ఆయన చాలా స్ట్రిక్ట్ మనిషి. దానితో ఆయనంటే విద్యార్థులందరికి చాలా భయం. అందువల్ల రవి భయం భయంగా, మెల్లగా ''అవునండి'' అని జవాబిచ్చాడు. అప్పుడాయన ఒక నీతి సూత్రాన్నిచ్చి దాని గురించి కవిత రాయమని ఆదేశించాడు. రవి అలాగే రాసి మరుసటి రోజు

చోద్యం - వింత; ప్రశంస = పొగడుట



# విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

**జననం :** 1861వ సంవత్సరం, మే 7వ తేది

**పరమపదించినది :** 1941వ సంవత్సరం, ఆగస్టు 7వ తేది

**జన్మ స్థానం :** కోల్‌కత్తా

**తండ్రి:** 'మహర్షి' దేవేంద్రనాథ్ ఠాగూర్

**తల్లి :** శారదా దేవి

**ప్రసిద్ధి :** సాహిత్యంలో, జాతీయ గీతం, సాహిత్యములో నోబెల్ బహుమతి

ఆయనకు చూపాడు. వాటిని చూసి ఆయన ఆశ్చర్యపోయాడు. ఎంతో సంతోషించాడు. రవిని పాఠశాలలో అన్నింటికన్నా పెద్ద తరగతికి తీసుకొనిపోయి విద్యార్థుల ఎదుట నిలబెట్టి రవితో ఏదీ నీ కవితలు చదువు అని అన్నాడు. రవి బిగ్గరగా, చక్కని ఉచ్చారణతో తన కవితలు చదివారు. అదివిని తరగతిలోని పిల్లలందరూ చకితులయ్యారు.

**ప్రధానోపాధ్యాయులు రవిని ఆదేశించినది.**

ఆ రవియె పెరిగి పెద్దవాడై బహుముఖ ప్రజ్ఞాశాలియైన రవీంద్రనాథ్ ఠాగూర్. అతడు కవి, కథారచయిత, కథానికల రచయిత, నటుడు, నాటకకర్త, నవలా రచయిత, సంగీత కారుడు, చిత్రకారుడు, విద్యావేత్తగా పేరుగాంచాడు. విశ్వకవిగా ప్రపంచప్రఖ్యాతి గాంచాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ మాతృభాష వంగభాష అనగా బెంగాలీ కానీ అతని కవితలు కేవలం వంగభాషకే పరిమితంకాలేదు. అవి విశ్వజనీనమైనవి. గొప్ప సందేశాత్మకాలు. రవీంద్రుని కలం నుండి జాలువారిన ప్రతిష్ఠాత్మకమైన 'గీతాంజలి' అను కృతి వంగభాష నుండి ఇంగ్లీషులోనికి అనువదింపబడి విశ్వవిఖ్యాతమైన నోబుల్ సాహిత్య పురస్కారమందుకొన్నది. రవీంద్రుడు మన జాతీయగీతమైన జనగణమనను, బాంగ్లాదేశ్ జాతీయ గీతమైన అమర్‌షోనార్ బాంగ్లాలో రచించాడు. శ్రీలంక జాతీయగీతం రవీంద్రుని ఒకానొక కవిత ఆధారంగా రచింపబడింది. ఠాగూర్ గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్తలతోనూ, సాహితీవేత్తలతోను సాన్నిహిత్యం పెంచుకున్నాడు. తన దేశాభిమానానికి సంకేతంగా బ్రిటీష్ ప్రభుత్వం తనకిచ్చిన

**బిగ్గరగా = గట్టిగా; జాలువారు = ప్రవహించు**

'సర్' బిరుదాన్ని 1919లో జలియన్ వాలాబాగ్ మారణకాండను ఖండిస్తూ తిప్పిపంపారు రవీంద్రనాథ్ ఠాగూర్. రవీంద్రుని రచనలలో అతడు పుట్టి పెరిగిన పరిసరాలు ప్రతిబింబించేవి. అతడు సాంఘిక సమస్యలను, నిరుపేదల కష్టసుఖాలను అతని కథలలో తప్పక చిత్రించేవాడు. అతని కథానికలలో "కాబూలీవాలా, క్షుదితపాషాన్, హైమంతి' మొదలగునవి ప్రసిద్ధమైనవి. అలాగే "నౌకడుబీ, గోరా, చతురంగా, జోగాజోగ్ మొదలగునవి రవీంద్రుని ప్రసిద్ధమైన నవలలు. అతడు రాసిన పెక్కునవలలు, కథలను సత్యజిత్‌రే మొదలగు పేరుగాంచిన దర్శకులు చలనచిత్రాలుగా రూపొందించారు. కొన్ని కథలు టి.వి. మాలికలుగా రూపుదిద్దుకున్నాయి.

**రవీంద్రుని ఈ కృతికి నోబుల్ బహుమతి వచ్చింది.**


ఠాగూర్ ప్రతిదేశం తనదైన సంస్కృతిని పరిరక్షించుకోవాలని ప్రపంచ ప్రజలందరూ ఐక్యమై సామరస్యంగా సమస్యలను పరిష్కరించు కోవాలని, పేదరికం, నిరక్షరాస్యతలను తుడిచి వేయాలని, పారిశ్రామికంగా ముందడుగు వేసి అభివృద్ధి చెందాలని, వైజ్ఞానిక ఆవిష్కరణలను, ప్రజల శ్రేయస్సుకు వినియోగించాలని ఉద్బోధించారు.

ఇంతటి మహనీయుడు, స్ఫూర్తిదాత అయిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మనదేశానికే గర్వకారణం.

## I చర్చించండి.

1) మీకు తెలిసిన వ్యక్తుల ప్రత్యేకతలు.

2) మన జాతీయ గీతం 'జనగణమన' రాసిన కవి.



## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) రవి చిన్నబుచ్చుకోవడానికి కారణం.

2) ప్రధానోపాధ్యాయులు రవి తెలివి తేటలను పిల్లలకు చూపించిన విధం.

3) రవీంద్రుడు మానవాళికి చేసిన బోధ.

### ఆ) ఎవరు ఎవరితో అనిరి.

1) మా రవి ఒక కవిత రాశాడు.

2) ఈ ద్విరేఫను ఎక్కడ నుండి తెచ్చావు.

3) నీవు కవిత్వం రాస్తావా?

## III భాషావగాహన :

### అ) వచనములు మార్చి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | గది | | 2 | భాషలు | |
| 3 | | విద్యార్థులు | 4 | కవితలు | |
| 5 | పత్రిక | | 6 | | సాహితీవేత్తలు. |

ఆ) వాచకములు తెల్పండి.

1) [ ] → సోదరి  2) కలం → [ ]

3) ఉపాధ్యాయుడు → [ ]  4) [ ] → రవి

5) [ ] → సోదరుడు  6) తుమ్మెద → [ ]

7) పుస్తకము → [ ]

ఇ) గీతగీసిన పదములు ఏ వాక్యంగాలో గుర్తించి కుండలీకరణములలో రాయండి. (కర్త, కర్మ, క్రియ)


1) రవి కవిత <u>రాశాడు</u>. ( )

2) పత్రికా సంపాదకులు సైతం <u>వారిని</u> ప్రశంసించేవారు. ( )

3) ప్రధానోపాధ్యాయుడు <u>రవిని</u> తనగదికి రప్పించాడు. ( )

4) రవి బిగ్గరగా తన కవితలు <u>చదివాడు</u>. ( )

ఈ) వాక్యభేదములు గుర్తించి రాయండి.




1) పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది. [ ]

2) ఈ ద్విరేఫ ఎక్కడ నుండి తెచ్చావు? [ ]

3) ఆ పదం అంతగావాడుకలో లేదు. [ ]

4) పాపం! రవి ఆ పదం ఎంతో గొప్పదని భావించి ప్రయోగించాడు. [ ]

ఉ) కింద పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.

1) అంగీకారం  2) గొంతెత్తి  3) మాతృభాష


ఊ) కింది పదాలను కలిపి రాయండి.

1) దేశ + అభిమానము = [ ]


2) రవి + ఇంద్రుడు = [ ]

## IV అల్లిక :

1) పిన్నవయస్కులు కవితలు రాస్తే వీరు మెచ్చుకునేవారు.



2) రవీంద్రుడు రచించిన నవలలు.



## V సృజనాత్మకత :

- **'పూవు పుట్టగానే పరిమళిస్తుంది'** అను అంశమును కవికోకిల సరోజినీ నాయుడు జీవన విశ్లేషణతో చర్చించండి.
- మహాత్మా జ్యోతిబాపులే, సావిత్రీబాయి ఫులేల గురించి ఒక్క చక్కని వ్యాసం రాయండి.

### ప్రాజెక్టుపని :

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు – వస్తువు ప్రక్రియలు అను విధంగా పట్టికను తయారు చేయండి. (ఇందులకై ఉపాధ్యాయులు, గ్రంథాలయాలు, అంతర్జాలం సహాయాన్ని తీసుకొనవచ్చు) అందుండి మీకు నచ్చిన కథ/కవితను గురించి సోదాహరణంగా తరగతిలో వివరించండి.

### నేనిది గ్రహించా :

విశిష్ట వ్యక్తుల గుణవిశేషాలు బాల్యం నుండి పరిమళిస్తాయి.

# 8 పచ్చల ద్వీపాలు - పగడాల సంద్రాలు

**నేపథ్యం:** ప్రయాణాలు వేరు, యాత్రలు వేరు, ప్రదేశాలు, వింతలు, విశేషాలు చూడటం ప్రయాణాల లక్ష్యం. అయితే మనుషులూ, సమాజమూ, సంస్కృతి యాత్రికుని ముఖ్యలక్షణాలు. ప్రపంచం నుంచి పారిపోవడానికి కాకుండా ప్రపంచాన్ని కౌగలించుకోడానికి సన్నద్ధమై వెళతాడు యాత్రికుడు. సుఖసౌఖ్యాల కన్నా సంతృప్తి సంతోషాలకు ప్రాధాన్యమిస్తాడు యాత్రికుడు. ప్రయాణికులకు ప్రపంచజ్ఞానం అబ్బితే యాత్రికులకు ఆత్మజ్ఞానం కూడా కలుగుతుంది. తమ యాత్రలను జిజ్ఞాసతో నింపుకొని, సాంద్రత నిండిన అనుభవాలను పోగుచేసుకొని, తమతమ అనుభవాలను అనుభూతులుగా మలచుకొని వాటిని తమదైన పిపాసతో వ్యక్తీకరించినపుడు అతి ఉత్తమ సాహిత్యంగా రూపొందుతుంది.

సాయంత్రం నాలుగింటికి మా తిరుగు ప్రయాణపు ఫెర్రీ.

కనీసం అయిదారుగంటలు ఇంకా మిగిలే ఉన్నాయి– తిరగడానికి.

మనసు ప్రలోభపెట్టగా నిన్న సాయంత్రం వెళ్ళివచ్చిన లక్ష్మణపూర్ బీచ్‌కి మళ్ళా వెళ్ళాం. ఇలాంటి విషయాల్లో నా అర్ధాంగి లక్ష్మి మీద మనం ఎకనామిక్స్‌లో చదువుకొనే 'లా ఆఫ్ డిమినిషింగ్ రిటర్న్స్' చాలా త్వరగా పనిచేస్తుంది. నేను మరీ ముదురు గాబట్టి అలాంటి సామాన్య సూత్రాలకు బాగా అతీతం. అయినా తన మనోభావనను గౌరవించి వెంటనే ఆ బీచ్ వదిలిపెట్టాం. కానీ 'లక్ష్మణపూర్–2' అనే మరో బీచ్ ఆ దగ్గరలోనే ఉందని అక్కడ మన తిరుపతి శైలిలో ఓ బృహత్తర శిలాతోరణం ఉందని మా బ్రోషరు చెపుతోంది గదా – బండి అటు నడిపాం.

చక్కని గ్రామీణ ప్రాంతాల్లోంచి సాగింది దోవ. ఆహ్లాదకరమైన వాతావరణం. అతి చక్కని పంటపొలాలు, కూరగాయల మళ్ళు. హఠాత్తుగా ఒక చోట చెరువుగట్టు లాంటి ప్రదేశం. ఆ గట్టు దిగువన ఒకటి, రెండు దుకాణాలు, టీ కొట్లు. 'బీచ్ ఇదేనా' అని వాకబు చేసాం, నమ్మకం చిక్కక, ఓ దుకాణం నడుపుతోన్న పెద్దావిడ ఔనని నిర్ధారించింది. సముద్రానికి గట్టట!!

'మీరు సముద్రపు పోటు సమయంలో వచ్చారు. అదిగో ఆ గుట్ట దాటితే గట్టుదాకా సముద్రమే. ఆటు సమయంలో అయితే సముద్రం ఓ ఏభై అరవై అడుగులు వెనక్కు వెళుతుంది. మీరు శిలాతోరణం దాకా వెళ్ళగలిగేవారు. ఇపుడు దూరం నుంచే చూడగలరు.' అని వివరంగా వివరించిందావిడ.

ఉసూరుమంటూ అక్కడే కూలబడ్డాం. కొబ్బరినీళ్ళు తాగుతూ ఉండగా కబుర్లు ఊపందుకొన్నాయి. బంగ్లాదేశ్‌కు చెందిన కుటుంబం వారిది. ఈ ద్వీపంలో వారికి పునరావాసం కల్పించింది భారత ప్రభుత్వం. ద్వీపవాసుల్లో అత్యధికులది అదే నేపథ్యం. వాళ్ళల్లో చాలామంది ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవడమే గాకుండా, ముందు ముందుకు వెళ్ళగలిగారట. ఈవిడ కొడుకు ఢిల్లీలోని ఎయిమ్స్‌లో మెడిసిన్ పీజీ చేస్తున్నాడు. కూతురు బెంగుళూరులో సాఫ్ట్‌వేరు. 'ఇంకా ఈ కొట్టెందుకూ, కట్టెయ్యి అంటారు వాళ్ళు. ఇదేమో నాకు అలవాటయిన జీవనరీతి. ఎలా వదిలి పెట్టాలీ! అసలు ఎందుకు వదిలిపెట్టాలి అన్నారావిడ. ఎంతో గాఢత, సంస్కారం కనిపించాయి ఆవిడ మాటల్లో..

ఎలాగూ వచ్చాం గదా అనుకుని ఆ గట్టు మీదకు చెట్ల మధ్యలోంచి ఎక్కాం. గట్టుపైకి చేరీ చేరగానే నిరాశపడడం, హతాశులవడం శుద్ధ అనవసరం అని తెలిసిపోయింది. ఆ పోటు సంద్రం గుట్టదాకా పరుగెత్తి వస్తోన్న మాట నిజమే. కానీ ఆ కెరటాల మధ్య నుంచి అటూ ఇటూ చిరు సాహసపు

ఫెర్రీ = పడవ; ప్రలోభము=ఆశ; బీచ్=సముద్రతీరం;
బృహత్తర=పెద్దదైన; తోరణం=గడపకు కట్టేమాల;
బ్రోషరు=సంచిక; ఆహ్లాదకరము=ఆనందం కలిగించు;
హఠాత్తుగా=అకస్మాత్తుగా; వాకబు=విచారణ;
నిర్ధారించుట=నిశ్చయించుట;
ఉసూరుమను=బాధపడు/దుఃఖించు;
నేపథ్యం=పూర్వరంగం

నడకలకు అవకాశముంది. అంతకన్నా ముఖ్యం అది కోరల్ 'శిలల' ఓ సజీవ ప్రదర్శనశాల!!

నిజానికి నీల్ ద్వీపమే ఓ కోరల్ ప్రదర్శనాలయం. నిన్న జెట్టీలోంచి దిగి ఒడ్డును చేరడానికి కర్రవంతెన మీద ఆ వంద అడుగులూ నడుస్తున్నపుడే దిగువన లోతులేని, కెరటాలు లేని నీళ్ళలో కోరల్ 'శిలలు' కనిపించాయి. ఇక్కడ, ఈ లక్ష్మణపూర్ బీచ్‌లో కోరల్సే కోరల్సు. అంతా అందమైన కోరల్‌రాళ్ళ గుట్టలు. నిండుగా అనంతజలధి. పాదాలను తాకి మోకాళ్ళదాకా బట్టలను తడుపుతోన్న స్నేహజలాలు. దూరాన సముద్రంలోకి చొచ్చుకు వచ్చిన పెద్దకొండ చరియ, అందులో ఓ విశాల ద్వారంలా శిలాతోరణం. మా ఇద్దరికి బాగా నచ్చేసిన ప్రదేశమది. అక్కడి కోరల్ శిలలు బాగా నచ్చేసి ఇంటికి తీసుకువెళిపోదామా అనిపించింది గానీ, అది పూర్తిగా నిషిద్ధం. అక్కడి అధికారులు కూడా ఈ విషయంలో చాలా చాలా జాగ్రత్తగా ఉండి, అలాంటి స్మగ్లింగ్‌లు సమర్థవంతంగా అరికడతారట.

**లక్ష్మణపూర్ బీచ్‌లో కనిపించేవి.**

గట్టుదిగి వస్తోంటే కాస్తంత ఎగువన కుడిచేతి వేపు చిరుకోలాహలం. ఓ ఐదారు కుటుంబాలు నివాసముండే చిన్న కాలనీ అట. వినిపించేది ఆనాటి హోలీ కోలాహలమట. ఉత్సాహం పొంగగా వెళ్ళి వాళ్ళతో కాసేపు గడిపాం. పాపం ఆ పెద్ద మనుషులు 'మాకు రంగులు పుయ్యకండి' అంటే మాట విని నుదుటి బొట్లతో సరిపెట్టారు!

తిరిగి తిరిగి గూటికి చేరేసరికి సుమారు పదకొండు. అలసిన సహచరి 'ఇహ చాలు, నాలుగు దాకా విశ్రాంతి' అని ప్రకటించేసింది. నాకు మాత్రం ఇలాంటి సమయాల్లో తనివి తీరడమన్న ప్రసక్తేలేదు.

ఈసారి బీచ్‌లు గాకుండా ద్వీపపు గ్రామాలన్నీ తిరిగి రావాలన్నది ప్లాను. ఇప్పటికే ద్వీపపు రూపురేఖల గురించి మంచి అవగాహనే కలిగింది గాబట్టి ఉన్న అయిదారు గ్రామాలనూ చుట్టబెట్టాను. దారిలో నాలానే స్కూటరు మీద నిన్న లక్ష్మణపూర్ బీచ్‌లో కలసిన స్పానిష్ జంట. మధ్యలో దారి గురించి (నన్ను) వాకబు చేస్తూ మరో ఫ్రెంచి జంట. గ్రామాల్లో పిల్లల బృందాల హోలీ కోలాహలం. రంగులు

**కోరల్ = పగడాలు; కెరటాలు = అలలు, తరంగాలు; జలధి = సముద్రము; నిషిద్ధం = నిషేధం; స్మగ్లింగ్ = సుంకమియ్యకుండా మరియు నిషేధించిన వస్తువులను ఎగుమతి, దిగుమతి చేయు; అరికట్టు = నిరోధించు; కోలాహలం = కలకలం, సందడి; తనివి = తృప్తి; ప్రసక్తి = ప్రసంగం; అవగాహన = తెలుసుకోవడం;**



చిమ్మాలని నా పైన దండయాత్రలు. నయానా భయానా అలాంటి ఒకటి రెండు 'మూక'లనుంచి తప్పించుకోవడం. అలా తప్పించుకోవడంలో ఆనందంలేదని స్ఫురించి ఆ తర్వాత ఇష్టపూర్వకంగానే లొంగిపోవడం. ముంచెత్తిన రంగు నీళ్ళు. స్కూటరు ఆపి ఆయా పిల్లలతోనూ, వారి వారి పెద్దలతోనూ హోలీ ఆటలు. స్వీట్లు స్వీట్ మెమరీస్.. పన్నెండున్నర.

**భరత్‌పూర్ దీనికి ప్రసిద్ధి.**

ఉన్న గంటన్నరా రెండు గంటల్లో ముఖ్యమైన మూడు బీచ్‌లూ మళ్ళా చుట్టి రావాలన్న పురుగు బుర్రలో పుట్టింది. స్కూటర్ని లక్ష్మణపూర్ వేపు మళ్ళించాను. స్నేహంగా పలకరించింది. చెదురుమదురుగా సూర్యస్నానాలు చేస్తోన్న విదేశీ టూరిస్టులు. కబుర్లలో పెట్టిన ఓ నడివయసు బ్రిటీషరు. తన సెలవులు సమస్య గురించి చెపుతోంటే నేను బడాయిగా 'నాకా సమస్య లేదు.. రిటైరయ్యాక నాకు వారంలో ఏడు ఆదివారాలు' అనేశాను! 'నిజమే గదూ! భలే చెప్పావయ్యా!' అంటు మురిసిపోయాడా అల్పసంతోషి.


పక్కనే ఉన్న శిలాతోరణపు 'లక్ష్మణపూర్-2' బీచ్ రెండో మజిలీ. టీ కొట్టావిడ చెప్పినట్లు మధ్యాహ్నమయేసరికి పోటు తీసి శిలాతోరణం దాకా నడచివెళ్ళే వెసులుబాటు ఉంటుంది గదా అనుకొంటూ వెళ్ళాను. నిజమే. నీరు తీసింది. సజీవ కోరల్ మ్యూజియంలోని శిలలన్నీ 'మళ్ళా వచ్చావా!' అంటూ ఆహ్వానంగా పలకరించాయి. వాటిల్ని నొప్పించకుండా దాటుకొంటూ శిలాతోరణం దగ్గరికి – అక్కడ ఓ పుణె సాఫ్ట్‌వేర్ యువజంట. జట్టుకట్టాం.. కలిసి అక్కడి అందాలను పంచుకొన్నాం. ఇరవై అడుగుల ఎత్తూ, పాతిక అడుగుల వెడల్పు ఉన్న విశాలమైన వాకిలిలాంటి శిలా వైచిత్రి దగ్గర ఫోటోలు దిగాం.

వెంటనే ఏదో ఎపాయింటుమెంటు ఉన్నట్టుగా గబగబా ద్వీపపు అటు చివర ఉన్న సీతాపూర్ బీచ్ దగ్గరకు – ఒకే పూటలో ఇది మూడో విజిటు! మరో చక్కని ఫోటో. ఇహచాల్లే అని గూటికి చేరబోతోంటే 'మరి నేనో' అంటూ నిలదీసింది భరత్‌పూర్ బీచ్. అటు మళ్ళాను. ఇది మా గెస్టుహౌసుకు కిలోమీటరు లోపే. హేవలాక్‌లో ఎలిఫెంట్ బీచ్‌లాగా ఇక్కడ ఈ భరత్‌పూర్ స్నోర్కెలింగ్‌కూ, స్విమ్మింగ్‌కూ ప్రసిద్ధి. రంగు రంగుల చేపల బృందాలు ఇక్కడి ప్రత్యేకత. ఆయా వ్యాపకాల్లో మునిగిపోయి ఉన్న ఏభై మంది టూరిస్టులు. మరో పాతిక మంది గైడు కుర్రాళ్ళు.

**భరత్‌పూర్ బీచ్, గెస్టుహౌసుకు గల దూరం.**

తిరుగు ప్రయాణం హేవలాక్ నుంచి బయల్దేరి నీల్ మీదుగా పోర్ట్ బ్లెయిర్ చేరే ఫెర్రీలో, నిన్న లక్ష్మణపూర్ దగ్గర కలిసిన కోహ్లీ కుటుంబం కూడా మాతోనే పడవ ఎక్కింది. మరిన్ని కబుర్లు. అతను పంజాబీ. ఆవిడది కాకినాడ! అందరం సముద్రంలో దిగిపోతోన్న సూర్యుడ్ని పడవలోంచి కలసి చూసాం.

**చెదురుమదురు = అక్కడక్కడ;**
**మురిసిపోవుట = సంతోషపడుట;**
**వెసులుబాటు = తీరిక; కబురు=వార్త.**
**స్నోర్కెలింగ్ = స్నోర్కెల్ (ట్యూబ్ గల మాస్క్)తో ఈత**



**పరిచయం : దాసరి అమరేంద్ర**గారు 1953 మార్చి 14న దాసరి నాగభూషణరావు, పరిపూర్ణ దంపతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజి గూడెంలో పుట్టారు.

సాహిత్యమంటే బాగా చిన్నప్పట్నుంచీ ఎనలేనిగురి. జీవితాలను మలచడంలో సాహిత్యం గణనీయమైన పాత్ర వహించగలదు అన్నది వీరి స్వీయానుభవం. గత ముప్ఫై ఏళ్ళుగా వివిధ సాహితీ ప్రక్రియలు విరివిగా రాసారు. ఇప్పటిదాకా పన్నెండు పుస్తకాలు వెలువడ్డాయి. అన్ని ప్రక్రియల్లోనూ తనకు యాత్రా సాహిత్యం అంటే ఎక్కువ మక్కువ అంటారు. గత ఐదేళ్ళుగా వీరు అనువదించిన **'చిత్రగ్రీవం'** అన్న పుస్తకపు భాగం ఉభయ తెలుగు రాష్ట్రాలలో పదోతరగతి తెలుగులో పాఠ్యాంశంగా వుంది. ప్రస్తుత పాఠ్యభాగం **'అండమాన్‌డైరీ'** అను పుస్తకం నుండి గ్రహించబడినది.

**I చర్చించండి..**

1) మీరు చూచిన వివిధ సముద్రతీరాలు.
2) జలమార్గంలో మీ ప్రయాణ అనుభవాలు.

**II చదవండి - ఆలోచించండి - రాయండి.**

**అ) కింది వాటికి మూడు, నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1) లక్ష్మణపూర్-2 బీచ్.
2) కోరల్ 'శిలల' సజీవ ప్రదర్శనశాల.
3) గ్రామాల్లో జరిగే హోలీ కోలాహలం.
4) 'భరత్‌పూర్' బీచ్.

**ఆ) కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.**

1) స్కూటర్ ఆపి ఆయాపిల్లలతోను, వారివారి పెద్దలతోను హోలీ ఆటలు.
2) ఈ సారి బీచ్‌లుగాకుండా ద్వీపపు గ్రామాలన్నీ తిరిగి రావాలన్నది ప్లాను.
3) దారిలో నాలానే స్కూటర్ మీద నిన్న లక్ష్మణపూర్ బీచ్‌లో కలిసిన స్పానిష్ జంట.
4) గ్రామాల్లో పిల్లల బృందాలు హోలీ కోలాహలం.

**ఇ) కింది వాక్యాలను జతపరచండి.**

| | |
|---|---|
| రంగురంగుల | కోరల్‌రాళ్ళ గుట్టలు. |
| అందమైన | లక్ష్మణపూర్ వైపు మళ్ళించును. |
| విశాలమైన వాకిలిలాంటి | చేపల బృందాలు. |
| స్కూటర్ని | శిలావైచిత్రి. |

**III స్వీయవ్యక్తీకరణ**

1) మీరు చేసిన పడవ ప్రయాణాన్ని లేదా ఏదేని ప్రయాణాన్ని గురించి సొంతమాటల్లో రాయండి.
2) మీ గ్రామంలో జరిగే ఏదేని పండుగ కోలాహలాన్ని గూర్చి సొంతమాటల్లో రాయండి.

**IV భాషావగాహన :**

**అ) కింది సంధి కార్యాలను పూరించండి.**

| | పదము | | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|---|
| 1) | | = | ఊపు + అందుకొన్నాయి | → | |
| 2) | చెప్పినట్లు | = | + | → | |
| 3) | | = | రావాలి + అన్నది | → | |
| 4) | విశాలమైన | = | | → | |

**ఆ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములో ఏరకమునకు చెందినవో గుర్తించి రాయండి.**

1) ఆవిడ మాటల్లో ఎంతో గాఢత, సంస్కారం కనిపించాయి. ____________________

2) ఉత్సాహం పొంగగా వెళ్లి వాళ్ళతో కాసేపు గడిపాం. ____________

3) స్కూటర్ని లక్ష్మణపూర్ వేపు మళ్ళించాను. ____________

ఇ) కింది వాక్యాలు కుండలీకరణంలో నీయబడిన ఏ వాక్యరకములకు చెందినవో గుర్తించి రాయండి.

(ప్రశ్నార్థకము, ఆశ్చర్యార్థకము, నిశ్చయార్థకము, వ్యతిరేకార్థకము)

1) మీరు సముద్రపు పోటు సమయంలో వచ్చారు. [ ]

2) నిజమే గదూ! భలే చెప్పావయ్యా! [ ]

3) ఇంకా ఈ కొట్టెందుకూ కట్టెయ్యి అంటారు వాళ్ళు. [ ]

4) ఎందుకు వదలిపెట్టాలి? [ ]

ఈ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) తన మనోభావనను గౌరవించి వెంటనే ఆ బీచి వదిలిపెట్టాం. ____________ [ ]

2) ఈ లక్ష్మణపూర్ బీచ్‌లో కోరల్సేకోరల్సు.____________ [ ]

3) ఉత్సాహం పొంగగా వెళ్ళి వాళ్ళతో కాసేపు గడిపాం. ____________ [ ]

4) ఆ గట్టు దిగువన ఒకటి రెండు దుకాణాలు, టీకొట్లు. ____________ [ ]

ఉ) కింది పదములు ఏవాచకములకు చెందినవో గుర్తించి రాయండి.

1) బండి 2) కొడుకు 3) ఆవిడ 4) గూడు

ఊ) కింది పదాలకు వచనాలు మార్చి రాయండి.

1) ఫోటో 2) శిలలు 3) మనుషులు 4) మాట

ఋ) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) ఆహ్లాదకరము : ____________

2) ఉసూరుమను : ____________

3) అరికట్టు : ____________

4) కోలాహలం : ____________

ౠ) కింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి:

1) నిజము 2) ఎగువ 3) అనవసరం 4) నిరాశ

ఎ) కింది వాక్యాల కాలాలను సూచనానుసారం మార్చి రాయండి.

1) సాయంత్రం నాలుగింటికి ఫెరీలో వెళ్తాము. (భూతకాలం)

2) ఈవిడ కొడుకు ఢిల్లీలోని ఎయిమ్స్‌లో మెడిసిన్ పీజీ చేస్తున్నాడు. (భవిష్యత్కాలం)

3) కోష్లా కుటుంబం కూడ మాతోనే పడవ ఎక్కింది. (వర్తమానకాలం)

నేనివి గ్రహించా :

- విహారయాత్రలు, వినోదయాత్రల వల్ల కలుగు ప్రయోజనం.
- వివిధ ప్రాంతాలు దర్శించడం వలన అచ్చటి ఆచారవ్యవహారాలను, సంస్కృతులను, వేషభాషలను అర్థం చేసుకొనగలం.
- యాత్రావర్ణన (Travelogue) రాయటం.

## ప్రసిద్ధ పర్యటనస్థలం-జున్నర్ తాలూకా

పఠనం



మహారాష్ట్ర నందలి పుణె జిల్లాలోని జున్నర్ తాలూకా సహజ ప్రకృతి సౌందర్యంతో, వైభవ సంపన్నమై శోభిల్లుచున్నది. ఇది ఛత్రపతి శివాజీ మహారాజు జన్మభూమి. ఈ ప్రాంతం ప్రఖ్యాతిగాంచిన పౌరాణిక గుహలు, కోటలు, తీర్థస్థలాలు, పురాతన మందిరాలు, ఆనకట్టలు, పర్వతకనుమలు, ఘాట్ రోడ్లు, దుర్గమ ఆదివాసి గ్రామీణ ప్రాంతాలు, సుసంపన్నమైన వ్యవసాయ క్షేత్రాలతో వర్ధిల్లుచున్నది.

జున్నర్ తాలూకాలో ప్రకృతి సౌందర్యముతో ఒప్పారు ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మస్థానమైన శివనేరికోట (జున్నర్), నారాయణగడ్‌కోట (ఖోడద్), చావండ్ కోట (చావండ్‌గావ్), సిందోళాకోట (మఢ్, పారగావ్) మొదలైన ఏడు కోటలు.

శివనేరి కోటగుహలు (జున్నర్), తుల్జాభవాని గుహలు (పాడళీ), లేణ్యాద్రి వినాయక గుహలు (లేణ్యాద్రి), నాణెఘాట్ గుహలు (ఘాట్‌ఘర్), జీవ్‌ధన్ గుహలు (ఘాట్‌ఘర్) మొదలగు 350 చూడదగ్గ గుహలు, ......

నాణెఘాట్ (ఘాట్‌ఘర్), మాళ్‌శేజ్ ఘాట్ (కల్యాణ్-ముంబయి హైవే), దర్యా ఘాట్ (ఆంబోళీ) మొదలగు ప్రకృతి రమ్యమైన ప్రసిద్ధ పర్వతఘాట్‌లు, ......


ఆంబోలీ, నాణెఘాట్, మాళ్‌సేజ్, హాత్‌వీజ్ మొదలగుగాగల అనేక గొప్ప జలపాతాలు.



యెడ్‌గావ్ ఆనకట్ట (కుక్‌డీనది), పింపల్‌గావ్ జోగా ఆనకట్ట (పుష్పావతినది) మొదలగు ముఖ్యమైన పెక్కు ఆనకట్టలు,......



బారాబావడీ (జున్నర్), కుందల్‌వాడీ (జున్నర్), ఆయ్‌డేకర్ బావి (పాడళీ) వంటి సుప్రసిద్ధబావులు కలవు.












ఛాయాచిత్రాల సౌజన్యం :
శ్రీ రమేష్ గణపత్ ఖర్మాళే
Sri. Ramesh Ganpat Kharmale

ఇచ్చటి గిరిజాత్మక మందిరం (లేణ్యాద్రి), విఘ్నేశ్వర్ మందిరం (ఓఝుర్), నాగేశ్వర్ మందిరం (ఖిరేశ్వర్), కుక్‌డేశ్వర్ మందిరం (కుక్‌డేశ్వర్), సంత్‌జ్ఞానేశ్వర్ వేదప్రణీత రెడా సమాధి (ఆళె), చైతన్య మహారాజ్ సమాధి (ఓతుర్), పంచలింగ మందిరం (జున్నర్), దుర్గాదేవి మందిరం (దుర్గావాడీ), భైరవనాథ్ అంతఃపురం, దుర్గాదేవి అంతఃపురం మొదలగునవి చూడదగ్గవి.

అంతేగాక ఈ తాలూకాలో ప్రాపంచిక కేంద్రాలయిన ప్రపంచ మహాదుర్బిణి (ఖోడద్), విక్రమ్ రవాణా ఉపగ్రహం (ఆర్వీ) మరియు కాగితపు పరిశ్రమ (జున్నర్), విఘ్నహర్ సహకార చక్కెర పరిశ్రమ (ఓఝుర్) మొదలగు పెద్ద పరిశ్రమలు కలవు మరియు పరాశర్ వ్యవసాయ పర్యటన కేంద్రం (రాజురీ), హచికో టూరిజం (రాజురీ) మొదలగు అనేక విశేషాలతో విలసిల్లే జున్నర్ ప్రాంతం అందరికీ దర్శనీయం.

ప్రాజెక్ట్‌పని :ఐ

జున్నర్ తాలూకాకు సంబంధించిన అనేక దర్శనీయ స్థలాలను గురించిన సమాచారాన్ని అంతర్జాలంలో సేకరించి, లేదా స్వయంగా దర్శించి యాత్రావర్ణన (ట్రావెలాగ్‌ను) రాయండి.

# 9 స్వయం ఉపాధి



**నేపథ్యం :**

అనేక అవార్డులు అందుకుని ఆదర్శంగా నిలిచిన సేంద్రీయ వ్యవసాయదారుడు ఇలా అంటున్నాడు. ''నా పేరు రమేష్. నేను డిగ్రీ పూర్తి చేశాను. దేశానికి రైతు వెన్నెముక అని గ్రహించి నాకెంతో ఇష్టమైన వ్యవసాయాన్ని ఉపాధిగా ఎంచుకున్నాను. డిగ్రీ చేసి ఈ పనేంటి? అని కొందరు ప్రశ్నించారు. చదువు అనేది సంస్కారం, సమాజంలో చక్కగా బ్రతికే సామర్థ్యం, చేసేపనిలో నేర్పును, ఎలా పెంచుకోవాలో నేర్చుకొనే కళను ప్రసాదించాలే కాని కేవలం ఉద్యోగం సంపాదించి పెట్టేది మాత్రమే కాకూడదు. అంకితభావంతో పనిచేస్తే ఏ పనిలోనైనా రాణించవచ్చు.''

ఈ పాఠంలో స్వయం ఉపాది మార్గంలో పయనించాలనే శిరీష్ నిర్ణయం దానికి లభించిన సహకారం గురించి తెలుసుకుందామా!

''ఎక్కడికెళ్లావు?''

''ఈటీవీలో మంచి సినిమా ఉంటే పక్కింటికెళ్లానండి''

''మన టీవీ కేమయింది?''

మన టి.వి. చిన్నది కదండీ. అందులో సినిమా చూస్తే తృప్తిగా అనిపిస్తుంది.

''పే కమీషన్ ఎరియర్స్ రాగానే మనం చేసే మొదటి పని పెద్ద LED టీవీ తేవడం, సరేనా? ఇప్పుడు కాస్త కాఫీ నీళ్లియ్యి?''

''మీ ఎరియర్లు ఎప్పుడొస్తాయో? మన ఇంటికి కొత్త టీ.వీ. ఎప్పుడొస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి'' అంటూ వంటింట్లోకి దారితీసింది పద్మ.

''ఎంత, ఇంకొక్క రెన్నెల్లు ఓపిక పట్టు'' అని టీవీ ఆన్ చేశాడు రంగనాథం.



రంగనాథంది చిన్నపాటి ఉద్యోగం. తనకి వచ్చే జీతంలో ముంబయి వంటి నగరంలో పిల్లల్తో సంసారం నడపడానికి హైరానా పడవలసి వస్తోంది. లేదు. వచ్చిన దాంతోనే పొదుపుగా గుంభనగా దినాలు వెళ్ళదీస్తున్నాడు. పెద్దబ్బాయి శిరీష్ బి.కామ్. పాసై డి.టి.పి. డిప్లొమా చేస్తున్నాడు. పార్ట్ టైం కంప్యూటర్ ఆపరేటర్‌గా తన సొంతఖర్చులకు సంపాదిస్తున్నాడు. అమ్మాయి ఇంటరు చదువుతోంది.

రాత్రి తొమ్మిది తర్వాత శిరీష్ రాగానే కుటుంబ సభ్యులంతా భోజనానికి కూర్చున్నారు. ''ఎంతదాకా వచ్చింది నీ డిప్లొమా?'' శిరీష్‌నడిగాడు రంగనాథం.

''వచ్చేనెల పరీక్షలున్నాయి నాన్నా.''

''ట్రైనింగ్ బాగా అయిందా?''

''అయింది డిస్టింక్షన్ తప్పక వస్తుంది నాన్నా.''

''ఇప్పడినుండే ఉద్యోగానికి అప్లై చేస్తుండు. ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో రిజిస్టరు చేయి.''

''నాకు ఉద్యోగం చేయడం ఇష్టంలేదు నాన్నా.''

''ఉద్యోగం చేయవా?''

''సొంతంగా డి.టి.పి. సెంటర్ పెట్టుకోవాలని ఉంది.''

పెట్టుబడి సంగతి ఆలోచించావా? భోంచేయి ఆ తర్వాత మాట్లాడదాం.

భోజనాలయింతర్వాత పద్మ, చిన్నపిల్లలు టీవీ ముందు కూర్చుంటే, తండ్రీకొడుకులు లోపలిగదిలో కెళ్ళారు.

''ఇప్పుడు చెప్పు నీ ఉద్దేశ్యం.''

''దరఖాస్తులు పంపుతూ, టెస్టులు రాస్తూ, ఇంటర్వ్యూలకు అటెండవుతూ ఉద్యోగం కొరకు పడిగాపులు పడేదానికన్నా కంప్యూటరు కొనుక్కుని డి.టి.పి. సెంటరు పెట్టుకోవాలని ఉంది.''

''ఎంతవుతుందేమిటి?''

''కొత్త మెషిన్లయితే లక్ష రూపాయల పైనే కావచ్చు, పాతవి యాభైవేల లోపల వస్తాయి.''

''డబ్బెక్కడి నుండి వస్తుందని''

''మీరు సర్దితే సరే, లేకపోతే బ్యాంకులోనుకు ప్రయత్నం చేస్తాను.''

''మన స్థితిగతులు నీకు తెలియనివి కాదు. ఇప్పటికే ఆఫీసులో దొరికే అన్ని లోన్లూ తీసుకున్నాను. వాటి వాయిదాలు పోను, చేతికొచ్చే జీతంతో, ఇంటి ఖర్చు, మీ చదువు ఖర్చులతో ఎలా నెగ్గుకొస్తున్నానో నాకు తెలుసు. పైన ఆ భగవంతునికి తెలుసు. నీవు ఉద్యోగంలో చేరితే నాకు వెసులుబాటుగా ఉంటుంది.''

''నేనడిగేది నా సొంతఖర్చులకు కాదు నాన్నా. ఇంటికి పెద్దబ్బాయిగా నా సొంత బాధ్యతలు తెలుసు. మనం ఇంకా మంచి జీవనం గడపాలనే నా ఆశయం. ఏ ఉద్యోగం చేసినా గొర్రెతోక బెత్తెడే అన్నట్లు, వచ్చిన జీతం మన కనీస అవసరాలు కూడా తీర్చలేదు. అదే వ్యాపారమైతే మన ఆదాయానికి హద్దుండదు. మన శ్రమ ఫలితం మనమే అనుభవించవచ్చు.'' ఇరవై రెండేళ్ళ శిరీష్‌లో యువరక్తం ఉరకలు వేస్తూంది.

''వ్యాపారం అంటే మాటలా? పెట్టుబడి కావాలి, నేర్పు కావాలి, వాయిదాలకు, వడ్డీలకు, ఖర్చులకు సరిపడు ఆదాయముంటుందనే గ్యారంటీ ఏమిటి?''

''అవన్నీ ఆలోచించాను నాన్నా, నేను కంప్యూటరు తీసుకుంటే ఇంట్లోనే పని చేయవచ్చు. ఇన్‌స్టిట్యూట్‌వాళ్ళే జాబ్‌వర్క్ ఇస్తారు. అదనపు కంప్యూటర్లు లేక, తగిన పనివారు లేక, వారు కొత్త క్లయింట్లను తీసుకోవడం లేదు. తీసుకున్నా పనికూడా సకాలంలో పూర్తి చేయలేక పోతున్నారు.''

''బిజినెస్ ఇలాగే వస్తుందని నమ్మకమేమిటి? పోటీ పెరిగి వ్యాపారం దెబ్బతినవచ్చు''.

''డి.టి.పి. అంటే డెస్క్‌టాప్ పబ్లిషింగ్ బిజినెస్, తగ్గే ప్రసక్తే లేదు. ముద్రణ అవసరం ఎంతదాకా ఉంటుందో అంతదాకా ఈ బిజినెస్‌కు ఢోకాలేదు. మూడేళ్ళ కింద ఒక్క

**హైరానా = శ్రమ;**
**పడిగాపులుకాయు = చాలాసేపు ఎదురుచూచు;**
**ఆశయం = అభిప్రాయం; ఢోకా = మోసం;**

కంప్యూటరుతో మొదలు పెట్టిన మా ఓనరు ఇప్పుడు అయిదు కంప్యూటర్లు, రెండు లేజర్ ప్రింటర్లు, రెండు డాట్‌మ్యాట్రిక్స్ ప్రింటర్లు నడిపిస్తున్నాడు. జాబ్‌వర్క్‌తోపాటు కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నడుపుతూ నాలుగు కాదు - పదహారు చేతులా సంపాదిస్తున్నాడు.''

**డి.టి.పి. గురించి మీకు తెలిసినది.**

''పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు. ఎవరో ఏదోచేసి సంపాదిస్తున్నారు, మనంగూడా చేద్దామంటే అయ్యే పనేనా? దానికి తగ్గ అనుభవం ఎక్కడుంది నీకు? బిజినెస్ నడిపే చాకచక్యం ఉందనే అనుకుంటున్నావా?''

''క్షమించండి నాన్నా, మీకు చెప్పదగ్గవాణ్ణి కాను. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అని మీరే అంటుంటారు కదా! పని చేస్తేనే గదా అనుభవం వచ్చేది?

''సరే ఆలోచిద్దాం, పరీక్షలు మాత్రం బాగా రాయి'' అని పడుకోటానికి లేచాడు రంగనాథం.

''ఏమిటండీ అంత రాత్రి దాకా మీ తండ్రీ కొడుకుల మంతనాలు? మంచి సినిమా మిస్సయ్యారు'' పొద్దున కాఫీ ఇస్తూ అంది పద్మ.

''నేననేది మన గురించి కాదు. మన పిల్లల బతుకుతెరువు గురించి. శిరీష్ వ్యాపారం చేస్తాడట. 'స్వయం ఉపాధి' పిచ్చి తలకెక్కింది. పెట్టుబడికి డబ్బులు సర్దాలట. హాయిగా ఉద్యోగం కొరకు ప్రయత్నించరా అంటే ససేమిరా అంటున్నాడు.''

''మీరేమాలోచించారు?''

''నాకెటూ తోయడంలేదు. సాయంత్రం పంచాక్షరి దగ్గరికెళతాను. ఈ విషయంలో అతనే సరైన సలహా ఇవ్వగలడు.''

పంచాక్షరి ఛార్టెడ్ ఎకౌంటెంటు. సొంత ప్రాక్టీసు. బాగా నడుస్తోంది. అతను, రంగనాథం ఎల్.ఎల్.బి.లో సహాధ్యాయులు. ఇద్దరూ ముక్కుసూటిగా పోయేవారవడం వల్ల వారిమధ్య స్నేహం కలిసింది. గట్టి పడింది. స్థాయీ భేదం వారి మిత్రత్వానికి అడ్డుకాలేదు.

రంగనాథం పంచాక్షరి ఆఫీసుకు చేరేసరికి సాయంత్రం ఆరున్నర అయింది. టీ, ఫలహారాల తర్వాత కబుర్లలో పడ్డారు మిత్రులు.

''ఆ.. ఏమిటీ అకాల దర్శనం?'' సాధారణంగా ఆదివారాల్లో తప్ప కలవని మిత్రుణ్ని అడిగాడు పంచాక్షరి.

''మా శిరీష్ విషయంలో నీ సలహా తీసుకుందామని.''

''ఉద్యోగం చూడాలా? డి.టి.పి. చేస్తున్నాడు గదా పూర్తయిందా?''

**'పంచాక్షరి' రంగనాథాల స్నేహం.**

''ఇంకా లేదు, వచ్చేనెల పరీక్షలు. వాడికి ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. సొంత డి.టి.పి. సెంటరు పెట్టుకోవాలనుకుంటున్నాడు.''

''భేష్, నా గాడిలోకి వస్తాడన్నమాట. అభినందనలు''

''నువ్వూ వాడికి వత్తాసు పలుకుతున్నావా? మాలాంటివాళ్ళతో వ్యాపారం అయ్యేనా? పెట్టుబడి ఎక్కడినుండి తేవడం?''

''ఏం, మీకేం తక్కువ? వ్యాపారం చేసేవాళ్ళు పైనుండి ఊడిపడతారా? ఇక పెట్టుబడి సంగతి నాకొదిలేయ్.''

''నా విషయం నీకు తెల్సుగా, మన మధ్య డబ్బు లావాదేవీలు వద్దు. మన స్నేహం ఇలానే ఉండనీ''

''పే కమిషన్ ఎరియర్స్ ధీమానా అది?''

''ఆ ఎరియర్స్ ఎప్పుడో LED టి.వి.కి అంకితమయ్యాయి. అవి చేతికి రావడమే తరువాయి, ఇంట్లో పెద్ద LED టి.వి. కళకళలాడబోతోంది'' భవిష్యత్తును తలచుకుని సంబరపడ్డాడు రంగనాథం.

''టి.వి. అంత అవసరమంటావా? అదే డబ్బుల్తో కంప్యూటరు కొంటే వడ్డీ దక్కుతుంది. ఆదాయం వస్తుంది.'' పంచాక్షరిలోని సి.ఎ. బయటకు వచ్చాడు.

చాకచక్యం=చురుకుదనం, నేర్పు; వత్తాసు = మద్దతు;
లావాదేవీలు=ఇచ్చిపుచ్చుకోడాలు;
ధీమా = విశ్వాసం, నమ్మకం;



''నేను పద్మకిచ్చిన మాట సంగతేమౌతుంది మరి''

''అది మీ ఇద్దరూ తేల్చుకోవల్సిన విషయం. వినోదమా, బతుకుతెరువా? ఆలోచించుకోండి. ప్రాధాన్యాలు నిర్ణయించుకోండి. ఈ లోగా శిరీష్‌ను పంపించు. వాడి నుండి వివరాలు కనుక్కుంటాను. ఎంత లోతులో ఉన్నాడో తెలుసుకుంటాను. పై పై ఉత్సాహం అనిపిస్తే ఉద్యోగం చేయమంటాను. పట్టుదలతో పైకొస్తాడనుకుంటే చేయూతనిస్తాను.'' పంచాక్షరి మనస్ఫూర్తిగా అన్నాడు.

''రావోయ్ రా, ఇండస్ట్రియలిస్టు కావాలని కలలు కంటున్నావట నిజమేనా?'' తన ఆఫీసుకు వచ్చిన శిరీష్‌ను పలకరించాడు పంచాక్షరి.

''మీలాంటి పెద్దల అండతో, ఆశీర్వాదంతో పారిశ్రామికవేత్తను కూడా అవుతానేమో. ప్రస్తుతానికి మాత్రం నా కాళ్ళమీద నిలబడాలనుకుంటున్నాను అంకుల్'' సరియైన జవాబిచ్చాడు శిరీష్.


''జాబ్ వర్కుకు మీ ఇన్‌స్టిట్యూట్ వారి మీదే ఆధారపడతావా, లేక వేరే ఎవర్నయినా చూశావా?''

''చాలా మందిని కలిశానంకుల్. కొందరు డి.టి.పి. పని ఇస్తామని వాగ్దానం చేశారు. ముఖ్యంగా తెలుగు సాఫ్ట్‌వేర్ పెట్టాలని ఉంది. తెలుగు ప్రింటింగు వసతులు అంతగా లేని ముంబయిలో ఈ సౌకర్యం కల్పిస్తే ఇక్కడ దాదాపు పది లక్షలున్న తెలుగువారు ఆ మాత్రం పని ఇవ్వకపోరు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు, ప్రింటింగ్ ప్రెస్సులు ఇచ్చే పని అదనంగా వస్తుంది'' దృఢంగా అన్నాడు శిరీష్.

శిరీష్ మాటలతో ఇంప్రెస్ అయిన పంచాక్షరి అతని డి.టి.పి. సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. రంగనాథం పెట్టుబడి సన్నాహాలు చేయసాగాడు. పద్మ LED టి.వి. ఇంకొంత దూరం పోయింది. ప్రాథమికతల పందెంలో బతుకుతెరువు ముందు వినోదం వీగిపోయింది.

జీవితంలో ఓ కొత్త పాఠం నేర్చుకున్నారు రంగనాథం, పద్మ దంపతులు.

చేయూత = సహాయం; వాగ్దానం = మాట ఇవ్వడం;
బతుకుతెరువు = జీవనోపాయం;
వీగిపోవడం = తిరస్కరించబడటం;




**రచయిత పరిచయం :** శ్రీ అంబల్ల జనార్ధన్ గారు నిజామాబాద్ జిల్లాలోని ధర్మోరా గ్రామములో 1950 నవంబరు 9న జన్మించిరి. వీరి తల్లిదండ్రులు శ్రీ అంబల్ల చిన్ని నర్సయ్య, శ్రీమతి అంబల్ల నర్సవ్వ. వీరు బొంబాయిలోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి పాఠశాలలో చదివారు. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి పదవీ విరమణ పొందారు.

1993 నుండి కథలు రాస్తున్న అంబల్ల జనార్ధన్‌గారు ఆంగ్లంలోను, వివిధ విషయాల మీద వ్యాసాలు రాసి ప్రచురించారు. బొంబాయి కథలు, బొంబాయి నానీలు మొదలగునవి వీరి రచనలు. వీరి శైలి సహజ సుందరంగా, సరళంగా, పాఠకుల హృదయాలను హత్తుకొనేటట్లు వుంటుంది.

ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన 'మనోళ్ళ ముంబయి కథలు' నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1. 'స్వయం ఉపాధి' నిర్వచనం.
2. ఉపాధి – స్వయం ఉపాధికి మధ్యగల తేడాలు.
3. స్వయం ఉపాధిలో గల ప్రయోజనాలు.



## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) ఐదు లేక ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

i) శిరీష్ తన వ్యాపారాన్ని గురించి తండ్రికి చెప్పిన విధము.

ii) పంచాక్షరి శిరీష్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటానికి కారణం.

iii) రంగనాథం పంచాక్షరిల సంభాషణ.

### ఆ) కింది గడులను కుండలీకరణంలో ఇచ్చిన సరైన పదాలతో పూరించండి.

(వ్యాపారమైతే, ఉద్యోగానికి, రంగనాథం, పంచాక్షరి)

1) ఇప్పటి నుండే ______ అప్లై చేస్తుండు.

2) ______ మన ఆదాయానికి హద్దుండదు.

3) సాయంత్రం ______ దగ్గరికెళతాను.

4) ______ పెట్టుబడి సన్నాహాలు చేయసాగాడు.

### ఇ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) శిరీష్ బి.కామ్. పాసై డి.టి.పి. డిప్లొమా చేస్తున్నాడు. ( )

2) వ్యాపారానికి పెట్టుబడి అవసరం లేదు. ( )

3) శిరీష్‌కు ఉద్యోగం చేయడం ఇష్టం. ( )

4) ఆ ఎరియర్స్ ఎప్పుడో LED టి.వి.కి అంకితమయ్యాయి. ( )

### ఈ) కింది వాక్యాలను ఎవరు, ఎవరితో పలికిరో రాయండి.

1) "ఎంత, ఇంకొక్క రెణ్ణెల్లు ఓపిక పట్టు." ______ → ______

2) "సొంతంగా డి.టి.పి. సెంటర్ పెట్టుకోవాలని ఉంది." ______ → ______

3) "నువ్వా వాడికి వత్తాసు పలుకుతున్నావా?" ______ → ______

4) "ముఖ్యంగా తెలుగు సాఫ్ట్‌వేర్ పెట్టాలనుంది." ______ → ______

ఉ) జతపరచండి :

| | |
|---|---|
| రంగనాథం | సహోధ్యాయులు |
| శిరీష్ | కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి |
| కంప్యూటర్ తీసుకుంటే | పార్ట్‌టైం కంప్యూటర్ ఆపరేటర్ |
| పంచాక్షరి, రంగనాథంలు | ఇంట్లోనే పనిచేయవచ్చు |
| | చార్టెడ్ ఎకౌంటెంట్ |

## III స్వీయవ్యక్తీకరణ :

1) స్వయం ఉపాధి పట్ల మీ అభిప్రాయం.

2) మన స్నేహం ఇలానే ఉండనీ – అని అనడంలోని అంతరార్థం.

3) మీ జీవితంలో నేర్చుకున్న కొత్త పాఠాన్ని గురించి.

## IV భాషావగాహన :

అ) కింది వాక్యాలలో గుర్తించబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.

1) <u>మనం</u> ఇంకా <u>మంచి</u> జీవనం గడపాలనే నా ఆశయం.

↓ [ ] ↓ [ ]

2) <u>ఇప్పటికే</u> అన్ని లోన్లూ <u>తీసుకున్నాను.</u>

↓ [ ] ↓ [ ]

ఆ) కింది పదాలకు సంధికార్యాలు రాయండి.

| | పదము | విడదీసి రాయుట | | సంధినామం |
|---|---|---|---|---|
| 1) | పరీక్షలున్నాయి | + | → | |
| 2) | | పెద్ద + అబ్బాయి | → | |
| 3) | | ఎవర్ని + అయినా | → | |
| 4) | అంకితమయ్యాయి | + | → | |

ఇ) కింది సమాసకార్యాలను పూరించండి.

| | పదము | విగ్రహవాక్యము | | సమాసనామము |
|---|---|---|---|---|
| 1) | | బ్యాంకు యొక్క లోను | → | |
| 2) | | తండ్రిని, కొడుకును | → | |
| 3) | ప్రింటింగు ప్రెస్సు | | → | |

ఈ) గుర్తింపబడిన పదాలు ఏ వాక్యాంగములకు చెందినవో రాయండి.

1) పంచాక్షరి శిరీష్‌ను పలకరించెను.

2) రంగనాథం, పద్మదంపతులు కొత్తపాఠం నేర్చుకున్నారు.

ఉ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తవాక్యాలలో ఏ రకమునకు చెందినవో రాయండి.

1) వచ్చేనెల పరీక్షలున్నాయి.

2) అదనపు కంప్యూటర్లు లేక, తగిన పనివారు లేక వారు కొత్త క్లయింట్లను తీసుకోవడం లేదు.

3) శిరీష్ రాగానే, కుటుంబ సభ్యులంతా భోజనానికి కూర్చున్నారు.

ఊ) గుర్తింప బడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) దినమంతా ఆఫీసులో ఉంటారు.

2) హాయిగా ఉద్యోగం కొఱకు ప్రయత్నించు.

3) వాడినుండి వివరాలు కనుక్కుంటాను.

4) మీలాంటి పెద్దల ఆశీర్వాదంతో పారిశ్రామికవేత్తను కూడా అవుతాను.

ఋ) కింది పదాలకు వచనాలు మార్చి రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| 1 | వివరాలు : | | 2 | ఆశ్రయము : |
| 3 | కల : | | 4 | ఖర్చులు : |

ౠ) కింది పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.

1) నాన్న :

2) పద్మ :

3) కంప్యూటర్ :

4) శిరీష్ :

ఎ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) ఇష్టం ×

2) అవసరం ×

3) నిరుత్సాహం ×

4) కొత్త ×

ఏ) సొంతవాక్యాలు రాయండి.

1) చేయూత : ______________________________

2) వాగ్దానం : ______________________________

3) చాకచక్యం : ______________________________

4) లావాదేవీలు : ______________________________


ఐ) కాలములు గుర్తించి రాయండి.

1) శిరీష్ తన సొంతఖర్చులకు సంపాదిస్తున్నాడు. [ ]

2) ఈ విషయంలో అతనే సరైన సలహా ఇవ్వగలడు. [ ]

3) రంగనాథం టి.వి. ఆన్ చేశాడు. [ ]

## IV కింది అల్లికను పూరించండి.




ప్రాజెక్టుపని

చిన్న చిన్న పెట్టుబడులలో స్వయం ఉపాధి మార్గాలను పట్టికగా ఆలోచించి రాయండి.


జట్టుపని :

(1) మీ చుట్టుప్రక్కల గల చిరువ్యాపారులతో ముఖాముఖి (ఇంటర్వ్యూ)ని జరపండి.

(2) స్వయంఉపాధిపై తరగతిగదిలో చర్చాగోష్ఠి (ఇష్టాగోష్ఠి)ని చేపట్టండి.

నేనివి గ్రహించా :

- ఉద్యోగావకాశాలు
- స్వయం ఉపాధి ఆవశ్యకత.



# 1 గలీవర్ సాహస యాత్రలు



ఇంగ్లాండ్‌లోని 'నాటింగ్ హాంప్షైర్'లో గలీవర్ తండ్రికి చిన్న 'ఎస్టేట్' వుండేది. గలీవర్‌కు 14 సంవత్సరాల వయస్సు వున్నప్పుడు తండ్రి'కేంబ్రిడ్జి'లోని ఎమాన్యుయేల్ కాలేజీ'లో ఉన్నత విద్యాభ్యాసం కోసం చేర్పించారు. కానీ ఆ ఖర్చు భరించలేని వాళ్ళ తండ్రి సంవత్సరం తర్వాత గలీవర్‌ను ఇంటికి పిలిపించి, లండన్‌లో ప్రముఖ సర్జన్ అయిన డా. బేట్స్ దగ్గర అప్రెంటిస్‌గా చేర్పించాడు.

గలీవర్‌కి మొదటి నుంచీ సముద్ర ప్రయాణమంటే ఎక్కడలేని యిష్టం. అందుకు అతడు తన తీరిక సమయాన్నంతా నౌకా యానం నేర్చుకోవడానికి వినియోగించేవాడు. 4 సంవత్సరాలు 'సర్జరీ'నేర్చుకుని, తర్వాత 'లీడన్'లో 2సంవత్సరాలు 'మెడిసిన్' చదివాడు.

ఆ తర్వాత 'స్వాలో' అనే నౌకలో సర్జన్‌గా చేరి 3¾ సంవత్సరాలపాటు రకరకాల ప్రదేశాలకు యాత్రలు చేసాడు.

'ఇక జీవితంలో స్థిరపడాల'నుకుని లండన్ నగర వాస్తవ్యుడైన 'బర్టన్' గారి కూతురుని వివాహమాడాడు. తర్వాత వైద్యవృత్తిని కొనసాగించాడు. కానీ పెద్దగా సంపాదించ లేకపోయాడు. దాంతో అప్పుడే ''సౌత్‌సీ'' యాత్రకు వెళ్ళబోతున్న 'యాంటిలోప్' నౌకలో ఉద్యోగానికి ఒప్పుకున్నాడు.

గలీవర్ వివాహము చేసికొనినది.

సముద్రంలో ప్రయాణిస్తుండగా 'డైమెండ్ ల్యాండ్' అనే ప్రాంతంలో ఆ ఓడ తుఫాను తాకిడికి గురయింది. పూర్తిగా నీటిలో ధ్వంసమై పోయింది. ఒక పెద్దశిలను ఢీకొని నీటిలో మునిగిపోయింది. కొందరు చిన్న పడవలోకి చేరారు. కానీ అదీ మునిగి పోయింది.

గలీవర్ తన శక్తి మేరకు సముద్రంలో ఈదుకుంటూ వెళ్ళాడు. 'ఇక లాభం లేదు, ఈదలేను' అని నిస్పృహ చెందుతున్నప్పుడు అతని కాళ్లకు భూమి తగిలింది.



అప్పుడు రాత్రి 8 గంటల సమయం.

గలీవర్ పూర్తిగా అలసిపోయి, అట్లాగే ఆ సముద్రం ఒడ్డున పడి నిద్రపోయాడు.

ప్రొద్దున్నే మేల్కొని లేచి కూర్చోబోయాడు. కానీ అతని శరీరం మొత్తం భూమికి కట్టివేయబడి వుంది. సూర్యకిరణాలు వాడిగా, అతని కళ్ళల్లోకి సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. అయినా లేవలేక పోయాడు.

అంతలో అతని ఎడమకాలు మీద ఏదో కదులుతున్నట్లుగా అనిపించింది. అది.. అది... అలా... కదులుతూ అతని గడ్డం దాకా వచ్చింది. పరీక్షగా చూస్తే 'అతడొక మనిషని, 6 అంగుళాల కన్నా పొడవు లేడని, చేతుల్లో విల్లంబులు, వీపున అంబుల పొది వున్నాయి'' అని తెలిసింది. అతని వెనుక అతని లాంటివారే దాదాపు 40 మంది వున్నారు. అది చూసి గలీవర్ బిగ్గరగా అరిచాడు.

అంతే... వాళ్ళందరూ ప్రాణభీతితో బిలబిల మంటూ వెనక్కి పరుగులు పెట్టారు. కొందరు గలీవర్ మీద నుంచి క్రిందికి దూకి గాయాలపాలయ్యారు.

గలీవర్ తన ఎడమ చేతిని కట్టివేసిన త్రాళ్ళను (దారాలను) తెంపటానికి ప్రయత్నం మొదలు పెట్టాడు. దాంతో వాళ్ళు వందలకొద్దీ బాణాలను అతని మీదికి ప్రయోగించారు. అవి ఆయనకు గుండుసూదుల్లా గుచ్చుకోసాగాయి. వాళ్ళు తమ బల్లాలతో గలీవర్‌కు గుచ్చసాగారు. కానీ ఆయన ధరించిన 'జర్కిన్' నుంచి అవి గుచ్చుకోలేక పోయాయి. ఆ చిన్నచిన్న సూదుల్లాంటి బాణాలు తన ముఖానికి తగలకుండా గలీవర్ చెయ్యి అడ్డం పెట్టాడు.

'చీకటిపడి వాళ్ళు వెళ్ళిపోయేదాక కదలకుండా వుండి, ఆ తర్వాత వెళ్ళిపోదాం అనుకున్నాడు గలీవర్.

ఇంతలో ఆ బుల్లి మనుషులు 1½ అడుగుల ఎత్తుగల ఒక వేదికను నిర్మించ సాగారు.

చాలా ముఖ్యమైన వానిలా కనిపిస్తున్న ఒక వ్యక్తి దాని మీదకి ఎక్కి పెద్ద ఉపన్యాసం యిచ్చాడు. కానీ గలీవర్‌కి ఏమి అర్థం కాలేదు. ఇంతలో గలీవర్‌ను కట్టేసిన కొన్ని త్రాళ్లు తెగిపోయాయి.

వెంటనే అతని శరీరానికి నిచ్చెనలు వేసి వందల



మంది పైకి ఎక్కారు. బకెట్ల కొద్దీ మాంసం తెచ్చారు. ఒక్కోసారికి రెండు మూడు బుల్లి రొట్టెలు, 4 బుల్లి బకెట్ల మాంసం చొప్పున తిన్నాడు గలీవర్. గ్యాలన్ల వారి కొలతప్రకారం కొద్దీ నీటిని, రెండు మూడు గుక్కల్లో త్రాగేసి, 'యింకా కావాలన్నట్లు'గా సైగ చేసాడు. కానీ అప్పటికే వాళ్ళ నిల్వలన్నీ హరించుకు పోయాయి. వాళ్ళు గలీవర్ ఛాతి మీద చిందులేయసాగారు.

ఇంతలో రాజుగారి దగ్గరి నుండి ఒక ప్రతినిధి వచ్చాడు. ఆయన నిచ్చెన సహాయంతో గలీవర్ మీదకి ఎక్కి ముఖందాకా వచ్చాడు. ఆయన తనతోపాటు ఒక రాజ ముద్రిక ఉన్నలేఖ తెచ్చాడు. 'అరమైలు దూరంలో వున్న మా రాజుగారి దగ్గరికి మీరు బందీగా రావాలి అని గలీవర్‌కు సైగల ద్వారా తెలిపాడు.

ఈలోగా కొందరు తమ బాణాల వల్ల గలీవర్ శరీరం మీద అయిన గాయాలకు పసరుపూసి, కట్టు కట్టారు. దాంతో గలీవర్‌కు నిద్రవచ్చి కొంతసేపు నిద్రపోయాడు. కారణం వాళ్ళు నీటిలో మత్తు మందు కలిపి ఇచ్చారు.

**రాజప్రతినిధి సైగల ద్వారా తెలియజేసినది.**

గలీవర్‌ను రాజధాని నగరానికి తీసుకెళ్ళడానికి వాహనం తయారు చేయటం కోసం 500 మంది వడ్రంగులు, ఇంజనీర్లు శ్రమించారు. అది భూమి నుంచి 3 అడుగుల ఎత్తులో 7 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పువుంది. దానికి 22 చక్రాలు అమర్చారు. ఆ వాహనం మీద ఒక్కొక్కటి అడుగు ఎత్తు వుండే 80 కొయ్యలు నాటి, వాటికి గలీవర్‌ను కట్టేసారు. 900 మంది ఆ వాహనాన్ని లాగటానికి నియమించబడ్డారు. 3½ గంటలు శ్రమించి గలీవర్‌ను దాని మీదికి ఎక్కించారు. ఒక్కొక్కటి 4 అంగుళాల పొడవు, ఒక అంగుళం ఎత్తువున్న రాజుగారి అశ్విక దళానికి చెందిన 1500 మేలుజాతి అశ్వాలు ఆ వాహనాన్ని లాగాయి.

ప్రయాణం ప్రారంభమయినప్పుడు గలీవర్ నిద్రపోతున్నాడు. కానీ ఒక సైనికాధికారి తన బల్లెంతో గలీవర్ ముక్కులో గుచ్చాడు. ఏదో గడ్డిపోచతో చక్కిలిగిలి పెట్టినట్లుయి గలీవర్ నిద్రలేచాడు.

ఆ పగలంతా ఆ వాహనం ప్రయాణిస్తూనే వుంది. చీకటి పడ్డాక వాళ్ళంతా విశ్రాంతి తీసుకున్నారు. గలీవర్‌కు ఇరువైపుల 500 మంది చొప్పున కావలి వున్నారు.

మర్నాడు సూర్యోదయంతో బయలు దేరి, మధ్యాహ్నం కల్లా ఆ నగర ద్వారానికి 200 గజాల దూరం వారందరూ చేరుకున్నారు. ½ మైలు దూరం ప్రయాణించటానికి వాళ్ళకి 1½ రోజులు పట్టింది.

రాజుగారు యితర ఉన్నతోద్యోగులు గలీవర్‌ను కలవటానికి వచ్చేసారు.

బాగా శిథిలమై, పాడుపడిపోయిన ఒక గుడిలో గలీవర్‌కు బస ఏర్పాట్లు చేశారు. దానిగేటు 4 అడుగుల ఎత్తు, 2 అడుగుల వెడల్పు వుంది. 80 సంకెళ్ళతో గలీవర్ కాళ్ళను బంధించారు.

గలీవర్‌ను బాగా పరికించి చూడటానికి రాజుగారు అడుగు ఎత్తున్న తిన్నెమీదకి ఎక్కాడు. అలాగే అతణ్ణి చూడటానికి దాదాపు 10,000 మంది నిచ్చెనల సాయంతో అతని మీదకెక్కారు. ఆ తర్వాత గలీవర్‌ను చూడటానికి రావటం నిషేధించారు. త్రాళ్ళను తెంపేసారు.

ఇక గాలిలో లేచి నిల్చోవచ్చు. ఇష్టమైనప్పుడు వంగి, ప్రాకుతూ దేవాలయంలోకి వెళ్ళి పడుకోవచ్చు.

గలీవర్ కళ్ళు తెరచి చుట్టూ పరికించి చూసాడు. దూరాన కనిపిస్తున్న ఉద్యానవనాలు మనం కుండీలలో పెంచే పూలగుత్తుల్లా వున్నాయి. మిక్కిలి ఎత్తైన చెట్లు 7 అడుగుల ఎత్తు వున్నాయి. ఆ నగరం మొత్తం కూడా చిత్రకారుడు చిత్రించిన దృశ్యంలా వుంది.

ఆ దేశపు రాజు ఒక చిన్న అశ్వాన్ని అధిరోహించి, గలీవర్‌ను చూడటానికి వచ్చాడు. కదులుతున్న పర్వతంలా వున్న గలీవర్‌ను చూసి ఆ గుర్రం బెదిరిపోయింది. ఆ రాజు మంచి అశ్వికుడు కావడం వల్ల క్రిందపడలేదు.

గలీవర్ కోసం 20 చక్రాల బళ్ళల్లో ఆహారం, 10 బళ్ళలో పానీయాలు తెచ్చారు. చిటికెలో అవన్నీ ఖాళీ చేసాడు గలీవర్.

రాణి, యువరాజు కొద్ది దూరంలో కూర్చున్నారు. ఆ రాజు వాళ్ళ కన్న గోరంత పొడవున్నాడు. చాలా దర్జాగా వున్నాడు. కళ్ళు జిగేల్మనే దుస్తులు, రత్నాలు, వజ్రాలు పొదిగిన బంగారు కిరీటం ధరించారు. ఆయన ఖడ్గం 3

అంగుళాల పొడవుంది. దానికి నగిషీ చెక్కిన పిడి వుంది.

ఆడవాళ్ళు, యితర ఉన్నతోద్యోగులందరూ మంచి దుస్తులు వేసుకున్నారు.

రెండు గంటల తర్వాత కొలువు ముగిసింది. ఆ రాక్షసాకారుణ్ణి చూడటానికి జనం తండోపతండాలుగా వచ్చారు. వాళ్ళు గలీవర్ మీద పడకుండా సైనికులు అడ్డుకున్నారు. కొందరైతే గలీవర్ మీదికి బాణాలు వేసారు. వాటిలో ఒకటి అతని ఎడమ కంట్లో గుచ్చుకునేదే, కానీ కొద్దిలో తప్పిపోయింది.

సైనికాధికారి ఆజ్ఞ ప్రకారం బాణాలు వేసిన ఆరుగురు దుండగులను పట్టి బంధించి, గలీవర్‌కు అప్పగించారు. గలీవర్ వాళ్ళల్లో అయిదుగురిని తన కోటు జేబులో వేసుకుని, 6వ వాణ్ణి తినబోతున్నట్లుగా చేశాడు. వాడు లబోదిబో మంటూ హృదయ విదారకంగా కేకలు వేశాడు.

అంతలో గలీవర్ మరొక జేబులోనించి కత్తిని తీయటం చూసి అక్కడ వున్న వారంతా హాహా కారాలు చేశారు. కానీ గలీవర్ అతణ్ణి కట్టి వున్న త్రాళ్ళను కోసివేసి, అతణ్ణి వదిలివేసాడు. అది చూసి అందరూ హర్షధ్వానాలు చేసారు. మిగతా వాళ్ళను కూడా వదిలేసాడు.

మొదట్లో గలీవర్ నేలమీదే పడుకునేవాడు. ఒక 15రోజుల తర్వాత 600 పరుపులు తెచ్చి అన్నీ కలిపి ఒకే పరుపుగా కుట్టారు. వందల కొద్దీ దుప్పట్లను ఒకే దుప్పటిగా కుట్టారు.

గలీవర్‌ను 50 గజాల దూరం నుంచి చూడాలనుకునేవారికి ప్రవేశ రుసుము పెట్టారు.

రాజుగారి ఆస్థానములో 'ఆ రాక్షసవ్యక్తిని ఏం చేయాలి?' అనే చర్చ మొదలయింది. అతణ్ణి అలాగే బందీగా తమ అధీనంలో వుంచుకోవచ్చు. ఒకవేళ అతణ్ణి విషప్రయోగంతో చంపినా అతని శరీరం క్రుళ్ళిపోయి, ప్లేగు లాంటి వ్యాధి వ్యాపించే అవకాశంవుంది.

తనకు బందీలుగా చిక్కిన ఆరుగురిని గలీవర్ ఏ హానీ చేయకుండా వదిలి పెట్టినందు వల్ల, అతడ్ని తమ దగ్గరే వుంచుకుందామన్నారు. అతని పాలన, పోషణ చూడటానికి 600 మందిని ప్రత్యేకించారు. 300 మంది దర్జీలను అతనికి దుస్తులు కుట్టడానికి ఉపయోగించారు. తమ భాషను గలీవర్‌కు నేర్పటానికి 6గురు విద్వాంసులను నియమించారు.

తాను 'స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించమని' గలీవర్, రాజుగారిని అభ్యర్థించాడు. అందుకోసం అతణ్ణి అనువణువునా శోధించటానికి యిద్దరు అధికారులను నియమించారు. తన జేబులలో వెతకటానికి వీలుగా వాళ్ళిద్దరినీ పైకి ఎత్తి ఒక్కొక్కరిని ఒక్కో జేబులో జారవిడిచాడు గలీవర్. అక్కడ వాళ్ళకి కనిపించిన వస్తువులను వాళ్ళు ఒక జాబితాలో వ్రాసారు.

**గలీవర్, రాజుని అభ్యర్థించినది.**

వాళ్ళకు ఒక వెండి డబ్బా కనిపించింది. అది గలీవర్ 'నస్యం డబ్బా'. దాని ఘాటుకు వాళ్ళిద్దరూ ఒకటే తుమ్మటం. 'దువ్వెన' వాళ్ళకు ఒక పెద్ద 200 స్తంభాల యంత్రంలా కనిపించింది. 'జోడుగుళ్ళ పిస్తోలు' రెండు పెద్ద పెద్ద స్తంభాలున్న యంత్రంలా అనిపించింది. అంతేగాక పెద్ద పెద్ద 'స్టీలుముక్కలు' (షేవింగ్ బ్లేడ్లు) వున్నాయి. 'కత్తి' 5 గురు మనుషుల పొడవుంది.

'గలీవర్ వాచీ' వాళ్ళను బాగా తికమక పెట్టింది. నీటి మరలా శబ్దం చేసే ఒక పెద్ద యంత్రం అనుకున్నారు దాన్ని. బహుశ అది గలీవర్ 'దేవుడు' కావచ్చు. ఎందుకంటే దాన్ని సంప్రదించకుండా ఆయన ఏపనీ చేయడు.

''ఆ వస్తువులన్నీ మా స్వాధీనం చెయ్యండి. ఆ పిస్తోలు ఎలా పనిచేస్తుందో చూపించండి'' అన్నాడు రాజు.

''భయపడకండి'' అని ఆయనతో చెప్తూ, గలీవర్ దాన్ని 'ఢాం' అనిపించాడు. రాజు నిలదొక్కుకున్నాడు గానీ మిగతా వాళ్ళకు దాదాపు చచ్చిపోయినంత పనయింది.

ఇంకో రహస్య జేబులో 'కళ్ళజోడు' వుంది. కానీ వాళ్ళు చూడలేదు - కాబట్టి దాన్ని వాళ్ళ స్వాధీనం చేయలేదు గలీవర్.

గలీవర్ క్రమంగా అంతఃపుర జనుల యొక్క, ప్రజల యొక్క అభిమానం చూరగొన్నాడు.

ఒకరోజున 'లిల్లీ పుటియన్‌లు' అతని ముందు 'రోప్‌డాన్స్' (తాడు మీద నాట్యం) చేసి చూపించారు. ఆ దేశంలో వాళ్ళకు తెలిసిన ఏకైక కాలక్షేపం అదే మరి. త్రాడు అంటే 2 అడుగుల పొడవున్న దారం అన్నమాట. దాన్ని

భూమికి 12 అంగుళాల ఎత్తులో చిన్న కర్రముక్కలకు కట్టారు. దాని మీద రకరకాల విన్యాసాలు చేసారు. ఆ దేశంలో రాజాస్థానంలో ఉద్యోగం కావాలంటే రోప్ డాన్స్ తప్పనిసరిగా రావాలి.

కోశాధికారి ''ఫ్లిమ్‌నాప్'' ఈ విద్యలో అఖండుడు. ఈ మధ్యే గలీవర్‌కు స్నేహితుడుగా మారిన రెల్‌డ్రేసల్ కూడా ఈ కళలో ఘటికుడే.

రాజు కూడా తనకు వచ్చిన విద్యను గలీవర్‌కు ప్రదర్శించి చూపాడు. అదేమంటే ఆయన ఒక కర్రను రకరకాల భంగిమలలో పట్టుకుని నిల్చుంటే, కొంతమంది దాని క్రిందుగా మరికొందరుదాని మీదుగా దూకారు.

ఆ విద్యను అందరికన్నా ఉత్తమంగా ప్రదర్శించిన అధికారికి ఒక 'బ్లూ రిబ్బన్' బహుకరించారు. ఆయన దాన్ని తన నడుముకు చుట్టుకున్నారు. రెండవ స్థానంలో వచ్చినతనికి 'రెడ్ రిబ్బన్' మూడవ స్థానంలో వచ్చినతనికి 'గ్రీన్ రిబ్బన్' ప్రదానం చేశారు.

గలీవర్ కూడా వాళ్ళకు కొన్ని ఆటలు నేర్పించాడు. అతడు నేల మీద కూర్చుని కాళ్ళు చాపితే అతని కాళ్ళమీదుగా, చేతుల మీదుగా దూకటం లాంటివి.

ఒకనాడు రాజుగారు, గలీవర్‌ను కాళ్ళు బాగా ఎడంగా చాపి నిల్చోమని చెప్పి, అతని కాళ్ళ మధ్య నుంచి 300 మంది సైనికులు నడుస్తూ, 100 మందిసైనికులు గుర్రాలమీద స్వారి చేస్తూ ఒక క్రమ పద్ధతిలో కవాతు చేసేలా చేశాడు.

ఆ పర్వతాకారునికి స్వేచ్ఛను ప్రసాదించుట గురించి రాజు, తన ఆంతరంగికులతో చర్చించాడు. దానికి కేవలం 'స్కైరెష్ బోల్గోఆమ్' మాత్రమే వ్యతిరేకించాడు. రాజు దాన్ని లెక్కచేయకుండా కొన్ని షరతులతో గలీవర్‌కు స్వేచ్ఛను ప్రసాదించటానికి నిశ్చయించాడు. ఆ షరతులను ఒక లేఖ ద్వారా పంపించాడు.

ఆ పర్వతాకారుడు రాజుగారి అనుజ్ఞ లేకుండా దేశరాజధానిని విడిచిపోకూడదు. ఒకవేళ అతడు ఎక్కడి కన్నా పోదలచుకుంటే కనీసం 2 గంటల ముందే తెలియపర్చాలి. అప్పుడు జనాలు వీలైనంత వరకూ ఎవరిళ్ళల్లో వారే వుండి పోతారు. అపాయాలు తప్పుతాయి. గలీవర్ కేవలం రహదారి మీదే నడవాలి. ప్రజలను దాటుకుంటూ పోకూడదు. ప్రభుత్వ అత్యవసర సందేశాలను యితర ప్రాంతాల వారికి చేరవేయటంలో సహకరించాలి. రాజుకు ఎల్లప్పుడూ విధేయుడుగా వుండాలి. తమ మీదికి సముద్ర మార్గాన దండెత్తబోతున్న తమ శత్రుద్వీపమైన 'బ్లెఫస్కూ' వారి నౌకలను ధ్వంసం చేయాలి. ఇవి ఆ షరతులు.

గలీవర్ ఆ షరతులను ఆనందంగా ఆమోదించాడు. దాంతో అతన్ని బంధించిన శృంఖలాలను తెంపి స్వేచ్ఛను ప్రసాదించారు.

రాజుగారి గణిత శాస్త్ర పండితులు లెక్కలు కట్టి, గలీవర్ శరీరంలో 1728 మంది లిల్లీపుటియన్లకు తావుంటుందని నిర్ధారించి, అతనికి 1728 మందికి సరిపడే ఆహారాన్ని యివ్వవలసిందిగా సిఫార్సు చేశారు.

గలీవర్ తనకు స్వేచ్ఛ లభించగానే మొదట 'రాజధాని నగరమైన మిల్టెండోను' దర్శించటానికి అనుమతి కోరాడు.

అలాగే అనుమతించి, 'జనులందరూ వారి వారి యిళ్ళల్లోనే వుండి పోవాల్సిందిగా ఆజ్ఞాపించారు'. ఆ నగరం చుట్టూ 2½ అడుగుల ఎత్తు, 21 అంగుళాల వెడల్పు గల గోడతో ఆవరింపబడి వుంది. సరిగ్గా నలుచదరంగా వుండి, ఒక్కోవైపు 500 అడుగుల పొడవుంది. అక్కడ 5 లక్షల మంది నివసించవచ్చును.

రాచమందిరం ఆ నగరానికి నడిబొడ్డున వుంది. బాహ్య వలయంలో 5 అడుగుల ఎత్తైన భవనాలున్నాయి. అంతర్వలయంలో రాజ కుటుంబీకుల భవనాలున్నాయి. 'అక్కడికి ఎట్లా వెళ్ళాలా?' అని గలీవర్ సందేహించాడు. ఆ భవనం దాటుకుంటూ వెళ్ళలేడు. అలాగని 18 అంగుళాల ఎత్తు, 7 అంగుళాల వెడల్పు గల ఆ గేట్ల గుండా వెళ్ళలేడు. అందుకని అతడు రెండు పెద్ద పెద్ద బల్లలు తెప్పించి, వాటి మీదుగా లోపలికి దూకి, నేలమీద పడుకుని, కిటికి గుండా రాణిగారి దర్శనం చేసుకున్నాడు.

ఒక రోజున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయిన రెల్‌డ్రేసల్, గలీవర్ చెంతకు చేరి 'లిల్లీపుట్' దేశంలోని రాజకీయ పార్టీలు, వాళ్ళ మధ్యగల విభేదాల' గురించి విడమరచి చెప్పాడు. ''ఇక్కడ ముఖ్యంగా రెండు

పార్టీలున్నాయి. వాళ్ళు ధరించే 'హై హీల్స్ - లో హీల్స్' ద్వారా వాళ్ళను గుర్తు పట్టొచ్చు. ఆ రెండు పార్టీల మధ్య ఎంతటి విభేదాలు వున్నాయంటే యిరువర్గాలవారు ఎన్నడూ కలసి తినటం గానీ, త్రాగటం కానీ, ఆఖరుకు మాట్లాడుకోవడం గానీ చేయరు. ప్రస్తుతం 'లో హీల్స్ పార్టీ' అధికారంలో వుంది. కానీ రాజుగారి కాబోయే వారసునికి మాత్రం 'హై హీల్స్ పార్టీ' అంటే అభిమానం, సానుభూతి.

బ్లెఫస్కూ ద్వీపవాసులు ఇపుడు గొప్ప నౌకాదళాన్ని తయారు చేసుకొని నేడో రేపో లిల్లిపుట్ దేశం మీదికి దండెత్తి రాబోతున్నారు'' అని వివరించాడు.

''మీ దేశ రాజకీయాలతో నాకు సంబంధం లేదు కానీ శత్రువులు దండెత్తి వస్తే మాత్రం మీ రాజుగారికి తప్పక సహాయ పడతా'' అని రెల్‌డ్రేసేల్‌కు హామీ యిచ్చాడు గలీవర్.

**గలీవర్, రెల్‌డ్రేస్‌కు ఇచ్చిన హామీ.**

''మా జ్యోతిష్య శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం యీ ప్రపంచంలో రెండే దేశాలున్నాయి. లిల్లీపుట్ మరియు బ్లెస్కు అనేవి. నువ్వు బహుశా చంద్రుని మీది నుంచిగానీ, నక్షత్రాల మీదినుంచి గానీ జారిపడి వుంటావు. నీలాంటి వాళ్ళు ఒక 10 మంది వుంటే యీ ప్రపంచలోని మొత్తం పాడిపశువులను నాశనం చేయగలరు.'' అన్నాడు రెల్‌డ్రేసల్.

గలీవర్ ఆ దేశమంతా తిరిగి, ఆ రెండు దేశాలనూ ఒక 800 గజాల పొడవు గల కాలువ వేరు చేస్తున్నట్లుగా కనుగొన్నాడు. తనవైపు నించి చూస్తే ఆవలి వైపు 500 మంది వీరులు యుద్ధ సన్నద్ధులవుతూ కనిపించారు.

కొన్ని త్రాళ్ళు, కొన్ని ఇనుప కొక్కాలు తెప్పించాడు గలీవర్. ఆ త్రాళ్ళు దారాల్లాగా, కొక్కాలేమో అల్లిక సూదుల్లా వున్నాయి. ఆ సూదులను కొక్కాలుగా వంచి, వాటి చివర త్రాళ్ళు కట్టాడు. అట్లా ఒక 50 కొక్కాలు తయారుచేశాడు.

అవన్నీ వెంటనే తీసుకుని ఆ సముద్రంలో నడక కొనసాగించాడు. కొంత లోపలికి వెళ్ళాక, లోతు ఆరు అడుగులు వుంది. అక్కడి నుంచి యీదసాగాడు. అలా శత్రుద్వీపం మీదికి వెళ్ళాడు.

అతణ్ణి చూసి 'బ్లెఫస్కూ వాసులు' భీతిల్లి పోయారు. అక్కడి నౌకల మీద వున్న దాదాపు 30,000 మంది నావికులు కకావికలమై ఒడ్డుకు పరిగెత్తారు. గలీవర్ ఒక్కొక్క యుద్ధ నౌకను ఒక్కొక్క కొక్కానికి తగిలించాడు. దూరాన్నించి ఆ నావికులు గలీవర్ మీద వందల కొద్ది బాణాలు వేసారు. అవి తన కళ్లల్లో గుచ్చుకోకుండా కళ్ళద్దాలు ధరించాడు గలీవర్. ఆ శత్రునౌకల లంగర్లను, తన దగ్గరవున్న చిన్న కత్తితో కోసేసి ఒక చేత్తో పట్టుకుని, మరో చేత్తో యీదుకుంటూ లిల్లీపుట్ ఒడరేవుకు సురక్షితంగా తిరిగి వచ్చాడు.

రాజూ, పరివారమూ అంతా అక్కడే వున్నారు. గలీవర్ ఈదుకుంటూ వస్తున్నపుడు మెడవరకు నీళ్ళల్లో మునిగి వుండటం వల్ల మొదట అతడిని శత్రువులు, చూచి నౌకలలో తమ మీదికి దాడికి వస్తున్నారు అనుకుని బెదిరి పోయారు. కానీ దగ్గరికి వచ్చాక గలీవర్ ఆ నౌకలన్నింటిని ఒక చేత్తో పట్టుకుని నడచి రావటం చూసి పొంగి పోయాడు రాజుగారు.

వెంటనే గలీవర్‌కు 'నార్డాక్' అనే అత్యున్నత బిరుదును అక్కడికక్కడే ప్రదానం చేశాడు రాజు.

''బ్లేఫస్కూ దీవిని పూర్తిగా జయించి, ఆ దీవిలో కొలువుండు'' అని గలీవర్‌ను కోరాడు రాజు.

కానీ, సాహసికులు, స్వతంత్రులు అయిన వాళ్ళను బానిసలుగా మార్చటానికి గలీవర్ ఒప్పు కోలేదు. పైగా ఇది అన్యాయం మంచి పద్ధతి కాదు'' అన్నాడు. దాంతో రాజు కినుక వహించి, కొందరు మంత్రులతో కలిసి గలీవర్‌కు వ్యతిరేకంగా కుట్రపన్నాడు.

**గలీవర్‌ను తమ ద్వీపానికి ఆహ్వానించినవారు.**

**లిల్లీపుట్ రాజు గలీవర్‌కి ఇచ్చిన బిరుదు.**

బ్లెఫస్కన్‌లు సంధిరాయబారం పంపారు. వాళ్ళ షరతులు లిల్లీపుట్‌యన్లకే అనుకూలంగా వున్నాయి.

బ్లెఫస్కు దూతలు గలీవర్‌ను తమ ద్వీపానికి ఆహ్వానించారు. బోల్గోలామ్ మరియు ఫిమ్‌నాప్ ఈ సంగతిని రాజుగారికి చేరవేసారు. అందుకే గలీవర్ బ్లెఫస్కు వెళ్ళటానికి అనుమతి కోరినప్పుడు ఆయన నిర్లిప్తంగా అనుజ్ఞయిచ్చాడు.



**రచయిత పరిచయం :** **'గలీవర్‌ట్రావెల్స్'** అను ప్రసిద్ధ గద్యరచనను ఐరిష్ రచయిత **జోనాథన్ స్విఫ్ట్** ఆంగ్లభాషలో రచించెను. దీనిని పెక్కురు అనేక భాషలలోకి అనువదించారు. అనేక సంక్షిప్త అనువాదాలు కూడా వెలువడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం శ్రీ షేక్ సుభాన్‌గారి **గలీవర్ గమ్మత్తు కథలు** నుండి గ్రహింపబడినది. వీరు 09-11-1979న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామంలో జన్మించారు. **'శైలి', 'యువమిత్ర'** అనునవి వీరి కలంపేర్లు, వీరు 333 పుస్తకాలు, 500 కవితలు, 2000కు పైగా శీర్షికలు రచించిన రచయితగా గుర్తింపు పొందారు. వాటిలో **బాలలవ్యక్తిత్వవికాస** పుస్తకాలు, **అక్బర్-బీర్బల్ హాస్యకథలు**, **తెనాలి రామలింగని హాస్యకథలు**, **గలీవర్ గమ్మత్తు కథలు** మొదలగునవి ముఖ్యమైనవి.

## I చర్చించండి.

1) గలీవర్ సాహసయాత్రల గురించి విన్నారా?

2) మీరు చదివిన కొన్ని సాహసగాథల గూర్చి చర్చించండి.

## II రెండు మూడువాక్యాలల్లో జవాబులు రాయండి.

1) గలీవర్‌పైన ప్రయోగించిన బాణాలు అతనికి ఎలాగుచ్చుకున్నాయి.

2) గలీవర్ ప్రయాణిస్తున్న ఓడ తుఫాను తాకిడికి గురియైనపుడు కలిగిన పరిణామం.

3) గలీవర్ అరుపుతో లిల్లిపుట్‌లు భయపడ్డారన్న విషయాన్ని స్పష్టీకరించండి.

### ఆ) జతపరచండి :

| | |
|---|---|
| గలీవర్ శరీరానికి నిచ్చెన వేసి | మందు పూసి కట్టు కట్టారు. |
| ఆ దేశపు రాజు చిన్న అశ్వాన్ని ఎక్కి | రోప్‌డాన్స్ చేసి చూపించారు. |
| లిల్లీపుట్‌యన్లు అతని ముందు | వందలమంది పైకిఎక్కారు. |
| గలీవర్ శరీరంపై అయిన గాయాలకు | గలీవర్‌ను చూడడానికి వచ్చాడు. |

### ఇ) తగిన సమాధానాన్ని ఎన్నుకొని రాయండి.

1) రాజు గలీవర్‌కు [ ] అనే అత్యున్నత బిరుదు నిచ్చాడు.
అ) సాహసికుడు ఆ) నార్డాక్ ఇ) సర్దార్

2) గలీవర్ ప్రయాణిస్తున్న ఓడ [ ] కి ఢీకొని నీటిలో మునిగింది.
అ) శిలను ఆ) విల్లంబులు ఇ) కొండను

3) లిల్లీపుట్ చేతుల్లో ఉన్న ఆయుధాలు [ ].
అ) కర్రలు ఆ) విల్లంబులు ఇ) బల్లెములు

4) ఉద్యానవనాలు గలీవర్‌కు [ ] లా కనిపించాయి.
అ) పూలగుత్తులు ఆ) అరణ్యాలు ఇ) పచ్చికబయళ్ళు

5) తనకు స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించమని రాజును [ ] అభ్యర్థించినది.
అ) భటుడు ఆ) మంత్రి ఇ) గలీవర్

ఈ) ఎవరు ఎవరితో పలికిరో రాయండి.

1) మీ దేశరాజకీయాలతో నాకు సంబంధంలేదు. [ ] → [ ]

2) ఆ పిస్తోలు ఎలా పని చేస్తుందో చూపించండి. [ ] → [ ]

3) నువ్వు చంద్రుని మీదనుంచి గాని, నక్షత్రాల మీద నుంచిగాని జారిపడి వుంటావు.
[ ] → [ ]

4) ఈ దీవిలో కొలువుండు. [ ] → [ ]

ఉ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.



1) గలీవర్‌పై లిల్లీపుట్‌లు బాణ ప్రయోగం చేశారు. ( )

2) లిల్లీపుట్ల చెట్లకు నిచ్చెనలు వేసి పైకిఎక్కారు. ( )

3) గలీవర్ వాచీ లిల్లీపుట్‌లకు బాగా నచ్చింది. ( )

4) గలీవర్‌కి మొదటి నుంచీ సముద్ర ప్రయాణం అంటే భయం. ( )

ఊ) మీరు గమనించిన గలీవర్‌కు, లిల్లీపుట్లకు గల భేదములు రాయుము.

III అ) లఘుటీకలు రాయండి.

1) లిల్లీపుట్ల దేశంలో ఉద్యోగ నియామకానికి ప్రాముఖ్యత.

2) బ్లెఫస్కుల జీవితం.

3) గలీవర్ రాణిని దర్శించిన తీరు.

4) ఫ్లిమ్‌నాప్‌కు రాజు ఇచ్చిన సలహాలు.

5) ఉన్నతోద్యోగి రహస్యంగా గలీవర్‌కు చెప్పిన విషయాలు.

ఆ) కింది పాత్రల వ్యక్తిత్వాన్ని గురించి రాయండి.

1) గలీవర్

2) రెల్‌డ్రెసల్

3) లిల్లీపుట్ రాజ్యంలోని ఉన్నతోద్యోగి

4) లిల్లీపుట్ రాజు

IV కింది పట్టికలోని సమాచారాన్ని జతలు/జట్టులో చర్చించి రాయండి. ఇదే విధంగా మీ అనుభవాలను చర్చించి రాయండి.

| గలీవర్ | అనుభవాలు |
|---|---|
| సముద్ర ప్రయాణం | తుఫాను తాకిడికి గురయ్యింది.<br>ఓడ పూర్తిగా ధ్వంసమయ్యింది.<br>గలీవర్ ఈదుకుంటూ వెళ్ళాడు. |

## కృత్యం

కింది గద్యమును చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.

**i)** కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.

1) ఒక పెద్ద శిలను ఢీకొని నీటిలో మునిగిపోయింది.

2) అంతలో అతని ఎడమకాలు మీద ఏదో కదులుతున్నట్లుగా అనిపించింది.

3) కానీ పెద్దగా సంపాదించలేక పోయాడు.

4) ప్రొద్దునే మేల్కొని లేచి కూర్చోబోయాడు.

పుటసంఖ్య 104, 105లలోని ''గలీవర్‌కి మొదటి నుంచీ .......... గలీవర్ బిగ్గరగా అరిచాడు'' వరకు.

**ii)** సరైన సమాధానం గుర్తించి గడులు పూరించండి.

1) గలీవర్ తన శక్తి మేరకు [ ] లో ఈదుకుంటూ వెళ్ళాడు.

అ) చెఱువు  ఆ) నది  ఇ) సముద్రం  ఈ) కాలువ

2) అతని [ ] మీద ఏదో కదులుతున్నట్లుగా అనిపించింది.

అ) ఎడమకాలు,  ఆ) కుడి చెయ్యి  ఇ) కుడికాలు  ఈ) ఎడమ చెయ్యి.

3) ''సౌత్ సీ'' యాత్రకు వెళ్ళబోతున్న 'యాంటిలోప్' [ ] లో ఉద్యోగానికి ఒప్పుకున్నాడు.

అ) విమానం  ఆ) కారు  ఇ) నౌక  ఈ) పరిశ్రమ

4) సముద్రంలో ప్రయాణిస్తుండగా 'డైమండ్ ల్యాండ్' అనే ప్రాంతంలో ఆ ఓడ [ ] తాకిడికి గురయింది.

అ) గాలి  ఆ) తుఫాను  ఇ) అలల  ఈ) కొండ

**iii)** అభిప్రాయ వ్యక్తీకరణ:

1) సముద్ర ప్రయాణంలో ఉండే సమస్యలపై మీ అభిప్రాయాన్ని వ్యక్తీకరించండి.

2) గలీవర్ ప్రొద్దున మేల్కొన్న తర్వాత పొందిన అనుభూతిని మీ మాటల్లో వ్యక్తీకరించండి.

నేనివి గ్రహించా :

- వైవిధ్యంతో కూడిన సాహిత్య పఠనాన్ని అలవరచుకోవాలి.
- వివిధ ప్రాంతాలకు సంబంధించిన సాహిత్య పఠనం ద్వారా సమైక్యత, సహనం పెంపొందును.
- పాఠ్యపుస్తకంలో ఇచ్చిన దానికన్నా అదనపు పఠనం ఆసక్తిదాయకం.

# 2. చిట్టిబాబు

'అమ్మా అమ్మా! ఎదురింటికెవరో దండిగా మనుషులొచ్చారు. ఎందుకొచ్చారమ్మా వాళ్లు?' కుతూహలంగా ప్రశ్నించాడు చిట్టిబాబు.

కిటికిలోనుంచి ఒకసారి వెలుపలికి చూచి 'పనివాళ్లు లేరా చిట్టిబాబూ! ఇంటిని రిపేర్ చెయ్యడానికి వచ్చినట్టున్నారు' అంది పార్వతమ్మ.

'ఎందుకమ్మా రిపేర్ చెయ్యడం?'

'ఇల్లు పాడయిపోయిందికదరా మరి! గోడలకు కన్నాలు పడ్డాయి. గచ్చు లేచిపోయింది. ప్రహరీ అక్కడక్కడ కూలిపోయింది. పెరడు అడవిలా బలిసిపోయింది. వాళ్లదంతా బాగుచేసి వెళతారు.'

'ఎందుకమ్మా బాగుచెయ్యడం?'


'ఇప్పుడైతే అందులో ఎవరూ లేరనుకో; యిక మీదట అలా కాదు. ఎవరో పెద్దాయన ఆ యింట్లో చేరబోతున్నాడు...

'ఎవరమ్మా ఆ పెద్దాయన?'

ఇలా కాదన్నట్లు పార్వతమ్మ కొడుకును పైకెత్తి కిటికి అంచున నిల్చోబెట్టింది. 'చూడరా బాబు! పొడుగు చేతుల చొక్కా, లావాటి మీసాలు, తలలో వెంట్రుకలు సగంపైగా నెరిసిపోయాయి. ఆయనే ఎదురింటికి రాబోతున్నది...'

'నేనెప్పుడూ ఆయన్ని చూడలేదే. ఎవరమ్మా ఆయన? ఏ ఊరు?'

'ఒరే చిట్టిబాబూ! నీ ప్రశ్నలన్నిటికి జవాబులు చెప్పడానికి నాకు తీరిక లేదు. పోయి మీ నాన్నగారినడుగు' అంటూ పార్వతమ్మ పెరట్లోకి వెళ్లిపోయింది.



వరండాలో చాప వేసుకొని కూర్చొని ఆఫీసు కాగితాలు చూచుకుంటున్న చిదానందం పరుగెత్తుకుంటూ వచ్చిన చిట్టిబాబువైపు చూచి 'ఏరా చిట్టిబాబూ! ఏం కావాలి?' అన్నాడు.

'మరేమీ వద్దులే నాన్నా! అమ్మకు తెలియదట, ఆ లావుపాటి మీసాలాయన ఎవరు?

'ఆయన పేరు మధుసూదనరావుగారు. ఐనా పేరు చెప్పినంత మాత్రాన నీకేం తెలుస్తుందిరా చిట్టిబాబూ! జిల్లా అధికారి కలెక్టరంటూ చదువుకున్నావుగదా! ఈయన ఆపనే చేసేవాడు. ఇప్పుడు పెద్దవాడై పోయాడుగదా! విశ్రాంతి తీసుకుంటున్నాడు. అందుకు ఒక యిల్లంటూ వుండాలిగా! అందుకే ఈ యిల్లు కొన్నాడు. ఇకపైన ఇక్కడే ఉండిపోతాడట. తోడుగా వంటచేసి పెట్టడానికి ఒక వంటవాడుంటాడు. సరేనా!'

**మధుసూధనరావుగారు చేసిన పని.**

చిట్టిబాబు ఆలోచిస్తూ కూర్చున్నాడు. రెండు నిముషాలలో ఆలోచించే సరికి వాడి బుర్రలో మళ్లీ ఒక సందేహం బయల్దేరింది.

'వంట చేసి పెట్టడానికి వాళ్ళవాళ్ళెవరూ లేరా నాన్నా?'

సర్లే, బడికి టైం అవుతోంది వెళ్లి పుస్తకాలు సర్దుకో.

ఆనాటి సాయంకాలం చిట్టిబాబు బడినుంచి యింటికొచ్చేసరికి ఎదురింటి స్వరూపం మారిపోయింది. వెల్లవేసిన గోడలు తెల్లగా మెరుస్తున్నాయి. ఇంటిచుట్టూ ఇప్పుడు అడవిగూడా లేదు.

రోజులు గడిచేకొద్దీ చుట్టూ తోట పెరగసాగింది. ఇల్లు శుభ్రంగా వుంటుంది. లోపలినుంచి రేడియోగూడా వినవస్తుంది. అక్కడ లేనిదొక్కటే... మనుషుల సందడి.

'పాపం! అంత పెద్ద యింటిలో ఆ లావాటి మీసాలాయనికి యెలా ప్రొద్దుపోతుందో' అనుకునేవాడు చిట్టిబాబు.

అరవై పైసలు పెట్టి చిదానందం చిట్టిబాబుకొక రబ్బరు బంతిని కొని తెచ్చాడు. బంతి చాలా బాగుంది. పెద్దది



కూడా. కర్రతో కొడితే చివాలున పైకెగిరిపోతుంది. ఉదయంనుంచీ అదే ధ్యాసతో బంతితో ఆడుకుంటున్నాడు చిట్టిబాబు. కన్నుమూసి తెరిచేంతలో ఒక ప్రమాదం జరిగి పోయింది. ఆ మాయదారి బంతి ఒక్క పెట్టున పైకెగిరి ఎదురింటి గుమ్మంలో దూరి గోడకు తగిలించి వున్న గాంధీతాత పటానికి తగిలి హాల్లో దొర్ల సాగింది.

**చిదానందం చిట్టిబాబుకి కొనిచ్చింది.**

భయంతో చిట్టిబాబు గుండె కొట్టుకోసాగింది. మరొక వస్తువేదయినా అయితే పోతేపోయింది లెమ్మని యింటిలోకి తుర్రుమనేవాడే చిట్టిబాబు. కానీ రబ్బరు బంతిపై మోజు అలా చేయనివ్వలేదు. ఎలాగైనా రబ్బరు బంతిని తెచ్చుకోవాలి. హాల్లో ఎవరైనా ఉన్నారేమో! మెల్లగా తక్కుతూ తారుతూ బెదురుబెదురుగానే గుమ్మందాకా వెళ్ళి లోపలికి తొంగి చూశాడు చిట్టిబాబు.

'వచ్చావా అబ్బాయ్! బంతి కోసమే గదూ?' గంభీరంగా కంఠం వినిపించింది. బొద్దుమీసాలాయన వాలుకుర్చీలో ప్రత్యక్షమయ్యాడు.

'అవున్సార్! అవునండీ....

'ఇలా లోపలికి వచ్చి ఎదరుగా నిలబడు.'

సింహం దగ్గరికి వెళ్తున్న కుందేలు పిల్లలా చిట్టిబాబు నాలుగడుగులు లోపలికి వేశాడు.

'బంతితో ఆడుకోవచ్చు. కానీ దాన్ని ఇతరుల యిళ్లలో పడేటట్లు కొట్టటం తప్పుగదూ!'

'తప్పేనండి...'

'బంతి పటానికి తగిలింది. అందులోనూ బాపూ పటానికి పడిన చోట మరక కూడా అయింది. క్రిందపడి పగిలిపోయివుంటే?...'

చిట్టిబాబు పటంవైపు చూశాడు, పటంలోని తాతయ్యకు కోపం వచ్చినట్టు లేదు. చిట్టిబాబు కళ్ళు క్రిందికి దించాడు. బొద్దుమీసాలాయన తనవైపు సూటిగా చూస్తున్నాడు.

''నేను కావాలని కొట్టలేదండి! ఎలా వచ్చిందో పటానికి తగిలింది. ఇంకెప్పుడూ బంతిని రోడ్డుపైకి తీసుకరానండి...'

'అబ్బే, కాదులే అబ్బాయ్! తప్పు తప్పే! తప్పు ఒప్పుకోవాలి. శిక్షననుభవించాలి. అది బుద్ధిమంతుల లక్షణం. ఒప్పుకుంటావా?'

'అలాగేనండి.'

'ఐతే వుండు. ఒక్క క్షణంలో వస్తాను. తప్పించుకోడానికి ప్రయత్నించావో శిక్ష రెట్టింపవుతుంది.

మధుసూదనరావుగారు లేచి లోపలికి వెళ్ళారు. చిట్టిబాబుకు అతడు నిల్చున్న నేల కంపించిపోతున్నట్లుగా వుంది. కళ్లల్లో నీళ్లు గిర్రునతిరిగాయి.

ఇంతలో మధుసూధనరావుగారు మళ్లీ హాల్లోకి వచ్చారు.

**చిట్టిబాబు పెద్దాయనకు ఇచ్చిన సమాధానం.**

యధాస్థానంలో కూర్చుంటూ 'ఐదు నిముషాలాగాలి. తరువాత చెబుతాను. ముందుగా నేనడిగిన ప్రశ్నలకు జవాబులివ్వు. నీ పేరేమిటి?'

'మా అమ్మా నాన్నా చిట్టిబాబంటారండి. బడిలోనేమో నా పేరు హరిబాబు.

'ఏ తరగతి?'

'నాలుగో తరగతి చదువుతున్నానండి.'

'మీ నాన్న పేరేమిటి?'

'చిదానందంగారండి'

'ఆయనేం చేస్తాడు?'

'ఆఫీసులో పనండి'

'పెద్దవాడైతే నువ్వేం చేస్తావ్?'

చిట్టిబాబు ఏంచెప్పాలో తోచక గుటకలు మింగసాగాడు.

ద్వారం దగ్గర అడుగుల చప్పుడయింది. వంట మనిషి సుబ్బయ్య ఒక చేతిలో ప్లేటు, మరో చేతిలో నీళ్ల గ్లాసు తీసుకొచ్చి పెట్టాడు.

'ఇలా వచ్చి కూర్చో!' అన్నారు మధుసూధనరావుగారు.

చిట్టిబాబు తటపటాయించాడు.

'ఊఁ కూర్చో' స్వరం హెచ్చింది.

ఎగిరి కుర్చీలో కూర్చున్నాడు చిట్టిబాబు.

'ఆకు తీసేసెయ్!'

చిట్టిబాబు పాదాలకు నేల అందడం లేదు. చేతులకు

టేబుల్ పైనున్న ప్లేటు అందలేదు. మధుసూధనరావుగారు చటుక్కున పైకిలేచి చిట్టిబాబును పైకెత్తి టేబుల్‌పైన కూర్చోబెట్టారు. చిట్టిబాబు ఆకు తీసేశాడు. ప్లేటులో గారెలు ప్రత్యక్షమయ్యాయి.

'ఊ త్వరగా ముగించు. అన్నీ తినేసెయ్యాలి! అదే నీకు శిక్ష. ఇకపైన బంతిని యిలా యితరుల యిళ్లల్లోకి కొట్టగూడదు. ఇంకొకటేమిటంటే నీవు ప్రతిరోజు ఇక్కడికి రావాలి. తెలిసిందా చిట్టిబాబూ!'

'తెలిసిందండి'

'ఏమిటి తెలిసింది?'

'ప్రతిరోజు యిక్కడికి రావాలి'

'ఎందుకు?'

'ఎందుకో మీరు చెప్పలేదండి'

'ఎందుకంటే మనిద్దరం ఇకమీదట స్నేహితులం. నేను నీతో కలిసి ఆడుకోలేననుకో, కానీ మంచి కథలు చెబుతాను, ఏమంటావ్...'

**పిల్లలు చేసిన తప్పుకు మధుసూధనరావుగారు ఇచ్చిన శిక్ష.**

'అలాగేనండి'

'అన్నీ తినేశావ్‌గదూ, మెల్లగా దిగు. బంతిని తీసుకున్నావ్‌గదా! ఇక వెళ్లు.

తూనీగలా పరుగెత్తాడు చిట్టిబాబు.

* * *

'ఒరె చిట్టిబాబూ! అరగంటసేపటి నుంచీ కనిపించలేదు. ఎక్కడికెళ్లావురా?' అడిగింది పార్వతమ్మ.

'నీకు తెలియదులేవే అమ్మా! బొడ్డు మీసాలాయన చాలా మంచివాడు' అన్నాడు చిట్టిబాబు.

'ఎందుకెళ్ళావురా ఎదురింటికి? ఆయన చెడ్డవాడట. చాలా స్ట్రిక్టు ఆఫీసరట. తహశిల్దారు, రెవిన్యూ యిన్‌స్పెక్టర్లు ఆయన్ను చూసి హడలి పోయేవారట. మీ నాన్నగారు చెప్పారు.....'

'అన్నీ అబద్ధాలే'

'కుర్రకుంకవి నీకేం తెలుసు ఆయన మంచితనం?'

'ఆయన నాతో నేస్తం కడతానన్నాడు. కథలు చెబుతానన్నాడు. గారెలు తినమన్నాడు.

'ఇంతకూ నువ్వే వెళ్లావా?'

'లేదమ్మా! నేను కొట్టిన బంతి ఎదురింట్లో గాంధీ పటానికి తగిలింది. నేనేమో తెచ్చుకొందామని అక్కడికి వెళ్లాను. అప్పుడు లావాటి మీసాలాయన అక్కడ ఉన్నాడు.'

'హవ్వ! ఇంకేమైన వుందట్రా చిట్టిబాబూ! నీకు దేహశుద్ధి చేయాల్సిందిపోయి గారెలు పెట్టాడా? నిజమేనట్రా...' విస్తుపోయింది పార్వతమ్మ.

చిట్టిబాబుకు గూడా లోలోపల చిత్రంగానే ఉంది.

* * *

మరునాడు బడిదినం, సాయంకాలం చిట్టిబాబు బడినుంచి వచ్చే సరికి తనకోసం ఎదురింటి వంటాయన వచ్చి వెళ్లినట్టు తెలిసింది. 'ఒరే చిట్టిబాబూ! నీకు పిలుపొచ్చింది. బొడ్డుమీసాలాయన రమ్మన్నాడట' అంది పార్వతమ్మ.

చిట్టిబాబుకారోజు ఎదురింట్లో కమలాపళ్ళు దొరికాయి. గ్లాసు నిండుగా నిమ్మరసం దొరికింది. అయితే వీటికన్నా వాడికి మీసాలాయన చెప్పిన కథే బాగుంది.

ఎవరో 'సిందుబాద'నే నావికుడుండేవాడట! అతడు సముద్రంపైన ఎన్నెన్నో దేశాలకు వెళ్లాడట! ఒక దేశంలోనైతే గండభేరుండపక్షి ఒకటి అతణ్ణి తన్నుకపోయిందట! అయినా ఎలాగో తప్పించుకున్నాడట! అమ్మో! ఎంత గుండెలు తీసిన బంటో' అనుకుంటూ ఆశ్చర్యపడిపోయాడు చిట్టిబాబు.

ఎదురింటాయన మీసాలేకాదు, ఆయన చెప్పే కథలు కూడా చాలా పెద్దవి, అయితే ఒకటి. ప్రొద్దుపోయి, దీపాలు వెలిగేసరికి ఆయన కథను ఆపేస్తాడు. 'వెళ్ళి చదువుకో చిట్టిబాబూ! మిగిలిన కథ రేపు చెబుతాలే' అంటాడు.

అమ్మో, ముసలాయన చిట్టిబాబుకెన్నెన్ని కథలు చెప్పాడని! గలీవర్ బ్రాబ్డింగ్‌నాగ్ దేశం వెళ్లిన కథ చెప్పాడు. ఆలీబాబా నలభైదొంగల కథ చెప్పాడు. అన్నింటికన్నా కాబూలీవాలా కథంటే చిట్టిబాబుకు చాలా యిష్టం.

రోజులు దొర్లిపోతున్నాయి, చిట్టిబాబు ఎదురింటి

మీసాలాయనతో నేస్తం కట్టి మూడు మాసాలైంది.

ఒకరోజు వున్నట్టుండి ఆయన అన్నాడు : 'చూడు చిట్టిబాబూ! పై వారంనుంచీ మనకు పండుగ! ఎందుకో తెలుసా? మనకింకా చాలామంది స్నేహితులొస్తారు.'

ఎవరు వాళ్లు? ఎందుకొస్తారు? ఎన్నాళ్లుంటారు? ఇలా చిట్టిబాబుకెన్నో ప్రశ్నలు అడగాలనే వుంది. కానీ అంతలోనే దీపం వెలిగింది.

మరునాటి నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. చిట్టిబాబు వాళ్లమ్మగారి ఊరికి వెళ్లి వారం రోజులుండి వచ్చాడు. వచ్చి చూచే సరికేమయింది? ఎదురింట్లో ఒక పిల్లల పటాలమే దిగేసింది.

జ్యోతి, ప్రసాద్, కిరణ్, కుమారి, చందన, రమ, ఆనంద్, రవి, భాను.... యిలా చాలా పేర్లు వినిపిస్తున్నాయి.

ఊరినుంచి తిరిగివచ్చిననాటి మధ్యాహ్నం మూడు గంటలప్పుడు చిట్టిబాబు తక్కుతూ తారుతూ వెళ్లి ఎదురింటి ప్రహరీ గేటు దగ్గర నిల్చున్నాడు. కాంపౌండ్ లోపల గున్నమామిడి చెట్టు క్రింద పిల్లలందరూ ఆడుకుంటున్నారు. ఒకడు బూరా ఊదుతున్నాడు. ఇంకొకడు పిల్లిమొగ్గలు వేస్తున్నాడు. వేరొకడు కొమ్మకు కట్టిన త్రాటి ఉయ్యాల్లో ఊగుతున్నాడు. అమ్మాయిలు కొంచెం దూరంలో బొమ్మరిళ్లు కట్టుకుంటున్నారు.

'ఎవడో తొంగిచూస్తున్నాడురోయ్!' అన్నాడు కిరణ్.

నీపేరేంటి గద్దించాడు ప్రసాద్. ''చిట్టిబాబు'' భయంభయంగా చెప్పాడు.

'ముక్కు చూచారా? చిలక ముక్కులా లేదూ?' అన్నాడు ఆనంద్.

'వాణ్ణి పట్టుకోవాలి'. అంటూ ప్రారంభించాడు ప్రసాద్.

'పాపం, ఏడవడూ?' ఎందుకలా చేస్తావ్? అంది చందన.

'ఇష్ ఊరుకో! ఇలాంటి వాళ్ళను లోపలికి రానీయగూడదు.. ఒరేయ్ ఆనంద్, కిరణ్ అందరూ రండిరా...' పిల్లలందరూ కళ్ళు పెద్దవి చేసి, పిడికిళ్ళు బిగించి పళ్లు కొరుకుతూ ముందుకు వురికారు.

చిట్టిబాబుకు పరుగుపరుగున పడుతూ లేస్తూ వెళ్ళి వాళ్ల యింట్లో పడ్డాడు.

సరిగ్గా ఆ సమయానికి ఎవరో శత్రురాజుల గూఢచారి తమ రాజ్యంలోకి జొరబడాలని చూచాడు. తుపాకి పేల్చేసరికి తిరిగి చూడకుండా పారిపోయాడు. ఇకపైన ఎప్పుడయిన తల చూపిస్తే అప్పుడు చెప్పాలి వాడి పని! అన్నట్లు ఎదురింటి పిల్లలు గున్నమామిడి చెట్టుక్రింద విజయోత్సవం జరుపుకుంటున్నారు.

* * *

నాలుగు రోజులు దొర్లిపోయాయి. ఎదురింటి పిల్లలు ఈ నాలుగు రోజుల్లోనూ శత్రురాజుల గూఢచారిని తమ రాజ్యం దరిదాపుల్లోకి రాకుండా చేయగలిగారు. తప్పిదారి చిట్టిబాబు ఎప్పుడైన వీధిలో కనిపిస్తే అరచి, గీపెట్టి, ముక్కు కోసేస్తానని భయపెట్టి, బెదిరించి నానా అల్లరీ చేశారు. తలుపులు బిడాయించుకుని యింట్లో వుండడమే చిట్టిబాబుకు క్షేమమైపోయింది.

ఒకనాటి మధ్యాహ్నం మధుసూధనరావుగారు హాల్లో ఫ్యాను క్రింద కూర్చుని భోజనం చేస్తుండగా పెద్ద గగ్గోలు ఏదో వినిపించింది. ఆయన కిటికీలోనుంచి వెలుపలికి తొంగి చూశాడు. పిల్లలందరూ మామిడి చెట్టు దగ్గర ప్రోగయ్యారు. మగపిల్లలు మాత్రం చెట్టెక్కి కొమ్మకొకడు చొప్పున కూచున్నారు. ఊరికే కూచున్నారా? అప్పటికప్పుడే పాటలు కట్టి బిగ్గరగా పాడేస్తున్నారు. 'చిట్టీ చిట్టి శ్రీరంగం, చిట్టి తారంగం' అని ఒకరు, 'చిట్టి, పట్టి, సున్నపు బట్టీ' అని ఒకరు....

చెట్టు క్రింద నిల్చున్న అమ్మాయిలు మగపిల్లల పాటలకు వంత పాడుతున్నారు.

ఎదురింటి గుమ్మం వెనుక నిల్చున్న చిట్టిబాబు దీనంగా వీళ్లవైపు బిక్కచూపులు చూస్తున్నాడు.

'ఒరేయ్ అబ్బాయిలూ!' ఉరుము ఉరిమినట్టుగా పిలుపు వినిపించింది.

'అందరూ యిలా వచ్చి నిల్చోండి.'

చేతిని పైకెత్తి దోసిలిలో వున్న పట్టెడన్నాన్ని దూరంగా తోటలో పడేటట్టుగా విసిరాడు రావుగారు. అన్నపు ముద్ద

క్రింద పడగానే ప్రిదిలి మెతుకులన్నీ చెల్లాచెదురైపోయాయి.

'ఏం చేశానో చూచారుగదా! ఇప్పుడేం జరిగేది మీరు చెప్పాలి. ఊ చెప్పవోయ్ ప్రసాద్....'

'ఓ కాకి వచ్చి వాలింది తాతయ్య!'

'వాలి ఏంచేసింది? అన్నం ముట్టుకుందా లేదా? నువ్వు చెప్పరా ఆనంద్'

'ముట్టుకోలేదు తాతయ్యా! కావు కావుమంటూ అరుస్తోంది.'

'అదిగో యింకో కాకి గూడా వచ్చేసింది' అన్నాడు కిరణ్.

'అదయినా అన్నం ముట్టుకోలేదు తాతయ్యా! కావు కావుమనే అరుస్తోంది' అంది జ్యోతి.

'అబ్బో, అబ్బో, ఎక్కడున్నాయో ఏమిటో! బోలెడన్ని కాకులొచ్చేశాయ్ తాతయ్యా!' అన్నాడు రవి.

'అన్నీ కలిసి యిప్పుడేం చేస్తున్నాయ్'? రావుగారు ప్రశ్నించారు.

'ఇప్పుడన్నీ ఒక్కొక్క మెతుకే ఏరుకుని తింటున్నాయి తాతయ్యా!' అంది చందన.

'మంచిది. కాకులకున్నంత మాత్రం బుద్ధి' అయినా మనుషులకు లేకపోతే ఎలాగమ్మా? చిట్టిబాబును హడలగొట్టొచ్చా? వాడైనా మీలాంటి వాడే గదా! వాణ్ణి ఏడిపించడం తప్పు కాదూ?'

'పిల్లలు ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. అందరూ ఒకే గొంతుకతో 'తప్పే తాతయ్యా' అన్నారు.

'ఈ తప్పుకు శిక్షేమిటో తెలుసా?'

'గుంజిళ్ళు పెడతాం తాతయ్యా!' అన్నాడు ప్రసాద్.

'ఇంటి చుట్టూ పది రౌండ్లు పరుగెత్తుకొస్తాం' అన్నాడు ఆనంద్.

'అదేం వద్దు. మీరు చిట్టిబాబుతో స్నేహంగా వుండాలి. మీరీవూరు నుంచి వెళ్లేటంతవరకూ వాణ్ణి గూడా మీతోబాటు మన యింటిలోనే వుండనివ్వాలి.

* * *

మరునాటి ఉదయం రావుగారికి గున్నమామిడి నీడలో ఆడుకుంటున్న పిల్లల్లో చిట్టిబాబు కూడా కనిపించాడు. ఆయన కళ్లు ఆనందంతో మెరిసాయి.

ఔడుకరచు = పెదవివిరుచు;
ప్రిదిలి = సడలు, వెలువడు, పడు, విడివడు.





**రచయిత పరిచయం : కీ.శే. మధురాంతకం రాజారాం** గారు చిత్తూరు జిల్లా మొగరాల గ్రామములో 1930 అక్టోబర్ 5న జన్మించిరి. వీరి తల్లిదండ్రులు విజయనగర పిళ్ళై, ఆదిలక్ష్మమ్మ, ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు.

ముందు గేయరచయితగా తనరచనా ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. **ప్రాణదాత, కమ్మ తెమ్మెర, తాను వెలిగించిన దీపాలు, స్వేచ్ఛకోసం** మొదలగు. కథా సంపుటాలు, **ధర్మదీక్ష** నాటకం, **పరమానందయ్య శిష్యులు** అనే కథాగేయం వీరి రచనలు. ఆయనరాసిన మొట్ట మొదటికథ **'కుంపట్లో కుసుమం'**.

1986లో **'తాను వెలిగించిన దీపాలు'** కథా సంపుటికకు **'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం'**, 1993లో **'మధురాంతకం రాజారాం కథలు'** పుస్తకానికి **'కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి'** లభించింది. ఈయన 1999 ఏప్రిల్ 1న పరమపదించారు.

ప్రస్తుత పాఠ్యభాగమైన **'చిట్టిబాబు'** తురగాజానకీరాణిగారి **'బంగారుపిలక'** అను సంకలనం నుండి గ్రహించబడింది. దీనిని రచించిన వారు శ్రీమధురాంతకం రాజారాంగారు.

## I అ) రెండు మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) చిట్టిబాబు బంతిని గట్టిగా కొట్టటం వలన కలిగిన పరిణామం ఏమిటి.

2) మధుసూధనరావు గారి గురించి చిట్టిబాబుకి తల్లి ఏమని చెప్పిందో స్పష్టీకరించండి.

3) చిట్టిబాబుకి, మధుసూదనరావుగారికి నేస్తం ఎలా ఏర్పడిందో స్పష్టం చేయండి.

4) చిట్టిబాబు పరుగు పరుగున వెళ్ళి ఇంట్లో పడటానికి గల కారణాన్ని స్పష్టీకరించండి.

5) కాకులకథ వినడం ద్వారా పిల్లల్లో కలిగిన పరిణామం.

6) చిట్టిబాబు మధుసూధనరావు గారి ఇంటికి వెళ్ళటాన్ని కవి దేనితో పోల్చాడు.

7) ఎదురింటి పిల్లలు చిట్టిబాబుని తమ ఇంట్లోకి రాకుండా అడ్డుకోవటానికి కవి ప్రయోగించిన పోలిక.

8) మధుసూధనరావు గారు కోపంతో మనవళ్ళను పిలిచిన పిలుపును కవి దేనితో పోల్చారు.

## ఆ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) బొడ్డు మీసాలాయన చాలా మంచివాడు. (      )

2) చిట్టిబాబు కొట్టిన బంతి శాస్త్రిగారి పటానికి తగిలింది. (      )

3) ముసలాయన చిట్టిబాబుకి పద్యాలు నేర్పాడు. (      )

4) కాకులు ఒక్కొక్క మెతుకు ఏరుకొని తింటున్నాయి. (      )

## ఇ) కింది వాక్యాలు ఎవరుఎవరితో పలికిరో రాయండి.

| | | | |
|---|---|---|---|
| 1) అరగంట నుంచి కనిపించలేదు ఎక్కడి కెళ్ళావురా? | | → | |
| 2) మనిద్దరం ఇక మీద స్నేహితులం | | → | |
| 3) చిట్టిబాబు మిగిలిన కథ రేపు చెపుతా. | | → | |
| 4) ఎవడో తొంగి చూస్తున్నాడు రోయ్. | | → | |
| 5) మీరు చిట్టిబాబుతో స్నేహంగా వుండాలి. | | → | |

ఈ) తగిన సమాధానాన్ని ఎన్నుకొని రాయండి.

1) చిట్టిబాబుకి తండ్రి కొనిచ్చింది.

అ) పుస్తకము ఆ) బంతి ఇ) బ్యాటు

2) చిట్టిబాబు కొట్టిన బంతి వెళ్ళి తగిలినది.

అ) మీసాలాయనకు ఆ) గోడకు ఇ) గాంధీపటానికి

3) చిట్టాబాబు చదువుచున్నది.

అ) ఆరవతరగతి ఆ) నాలుగవ తరగతి ఇ) మూడవ తరగతి

4) మధుసూధనరావు గారికి భోజనం చేస్తుండగా వినిపించింది.

అ) అరుపు ఆ) ఏడుపు ఇ) పెద్దగగ్గోలు

II. అ) లఘుటీకలు రాయండి.

1) ఎదురిల్లు బాగుచేయడానికి తల్లి చెప్పిన కారణాలు.

2) బంతికోసం చిట్టిబాబు ఎదురింటికి వెళ్లినప్పుడు జరిగిన సంభాషణ.

3) మీసాలాయన చిట్టిబాబుకు చెప్పిన కథలు.

4) మీసాలాయన మనవళ్ళు, మనవరాళ్ళు చిట్టిబాబును ఏడ్పించిన విధము.

5) మధుసూధనరావు తన మనుమలకు కలిసుండమని చెప్పిన విధం.

ఆ) కింది పాత్రల వ్యక్తిత్వాన్ని గురించి రాయండి.

1) మధుసూదనరావు. 2) మధుసూధనరావు మనవలు-మనవరాండ్రు 3) చిట్టిబాబు.

III కింది పట్టికలో ఉదాహరణకు ఇచ్చిన దాని సహాయంతో కింది పట్టికను జతలు/జట్టులో చర్చించి రాయండి.


| చిట్టిబాబు | ఎదురింట్లో జరిగిన సంఘటనలు |
|---|---|
| బంతి | గోడకున్న పోటోకు తగిలింది. |
| కథలు | భయపడుతూ వెళ్ళాడు. |
| ఎదురింటి పిల్లలు | మధుసూధనరావుగారు లడ్డూలు పెట్టి రోజు రమ్మని చెప్పారు. |

నేనిది గ్రహించా :

పెద్దలతో నేస్తం కడితే వారి అనుభవసారాన్ని, ఎన్నో విషయాలను తెలిసికొంటాం.



# 3 నీరు-మీరు



నీరు జీవనాధారం. నీరు మనిషి పుట్టిల్లు. ఆ మాటకొస్తే విష్ణుమూర్తి అంతటి దేవుడికీ జలమే నివాస స్థానం. నీటికి మొహం వాచి శ్రీనాథ మహాకవి సార్వభౌముడు-పరమేశా! గంగ విడుపు అన్నాడు. ఆ గంగను శివుడు వదిలి పెట్టేదాకా ఊరుకోలేదు భగీరథుడు. ఆ నీరు సరిపడా లభించకపోవడం ఇప్పుడు నగర జీవనాన్ని అల్లకల్లోలం చేస్తోంది. నీటి కొరతకు సంబంధించిన చిరు నాటిక ఈ 'నీరు-మీరు'.

తాత : ఒరేయ్ వరుణ్! ఊరంతా బలాదూర్‌గా తిరిగి వస్తావు. కాళ్ళు కడుక్కోకుండా ఇంట్లో దూరతావు.

వరుణ్ : పంపులో నీళ్ళు రావడం లేదు తాతా!

అమ్మ : వారం రోజుల నుండి నీళ్ళు రావడవం లేదు. ఆ సీసాలో నీళ్ళు ఉన్నాయి. పోయి కడుక్కో వరుణ్.

తాత : వానా కాలంలో కూడా నీటి కొరతా? ఏమి పట్టణంరా బాబూ! నీళ్ళ నుంచి నిప్పుదాకా, కరివేపాకు నుంచి కాకరకాయదాకా ప్రతిదీ కొనుక్కోవలసిందే పట్నవాసంలో.

నాన్న : అవును నాన్నా! పట్టణాల్లో జనాభా పెరుగుతోంది. అందుకే ఈ నీటి కొరత!

వరుణ్ : జనాభా పెరగడానికి, నీటి కొరతకి సంబంధం ఏమిటి నాన్నా?

నాన్న : పెరిగిన జనాభాకి నీరు సరిపోవడం లేదు. ఎక్కడెక్కడి నదుల నుండి బోలెడు ఖర్చు పెట్టి నగరాలకు నీటిని తరలిస్తున్నారు. అది చాలక ప్రజల నీటి అవసరాలకు భూమిలోంచి బోరుల ద్వారా నీటిని తోడేస్తున్నారు.

తాత : అందుకేనేమో, పక్క వీధిలో బోరు వేసినా నీరు పడలేదట, మాకాలంలో గ్రామాల్లో ఇలాంటి సమస్య లేదురా!

నాన్న : నిజమే. మా తాత నదినీళ్ళు చూశాడు. నీవు బావినీళ్ళు చూశావు. నేను పంపునీళ్లు చూశాను. నా పిల్లలు సీసానీళ్ళు చూస్తున్నారు. నా మనవళ్ళు కాప్స్యూల్స్‌లో నీళ్లు చూస్తారు. ఇలాగే నీటిని అశ్రద్ధచేస్తే కన్నీళ్ళు మాత్రమే చూడవలసివస్తుంది నాన్న?

పట్టణాలలో నీటి కొరత ఏర్పడడానికి కారణం.

బావి నీళ్ళు చూచినది.

తాత : ఈ నీటి కష్టాలకు కారణమేమిటిరా?

నాన్న : ఇక్కడ ప్రతి ఇంటి ఆవరణలో భూమిలోకి ఇంకే వర్షపునీటి కన్నా బోర్ల ద్వారా భూమిలోంచి తోడే నీరు చాలా రెట్లు ఎక్కువ. అందుకే భూమిలో నీటి వనరులు తగ్గిపోతున్నాయి నాన్నా!

తాత : అంతంత వానలు పడితే ఆ నీరంతా ఏమవుతుందిరా?

నాన్న : గ్రామాల్లో గడ్డి భూమిలో కురిసే వానలో 95% భూమిలోకి ఇంకుతుంది. 5 శాతం మాత్రమే వృథా అవుతుంది. అదే కాంక్రీటు పరచుకున్న నగరాల్లో కురిసే వానలో 5 శాతం భూమిలో ఇంకితే 95 శాతం వాననీరు మురుగు కాలవల ద్వారా నగరంబయటికి పోయి వృథా అవుతుంది.

వాననీటి రక్షణ ప్రభుత్వం చూసుకుంటుందిలే అనుకోకూడదు. ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని తెలుసుకోవాలి.

అమ్మ : తెలుసుకొని ఏంలాభం? వాన పడితే చాలు వీధుల్లో మోకాలు లోతు నీళ్ళు నిలుస్తాయి. ఎవరు పట్టించుకోరు.

నాన్న : ఏం చేస్తాం? రోడ్ల మీద కురిసే వాన ఇంకడానికి దారిలేదు. ఇళ్ళ నుంచి మురుగు నీటిని తరలించే డ్రైనేజీలోనికే రోడ్లమీది వరద నీటిని మళ్ళిస్తున్నారు. అందువల్ల కుండపోత వర్షాలు కురిసినప్పుడు నగరాల్లో నీటి ముంపు సమస్య వస్తోంది.

వర్షాకాలంలో గ్రామాలు-పట్టణాలలో పరిస్థితులు, అందుకుకారణాలు.

అమ్మ : ఈ నీటి ముంపు బాధల కంటే, మామయ్యగారు చెప్పినట్లు మనం గ్రామానికి వెళ్ళిపోతే సరి!

నాన్న : పల్లెలు పెరిగి పట్టణాలు అవుతున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు, సిమెంటు వీధులు పెరిగిపోయాయి. ఎక్కడికి వెళ్ళినా ఇదే పరిస్థితి.

తాత : ముందునుయ్యి, వెనుక గొయ్యిలా ఉంది. వానలు పడాలి, భూమిలోకి నీరు ఇంకాలి. బోరుల్లో నీరు రావాలి. వాన పడితే వీధుల్లో నీరు నిలవకూడదు. ఇలాంటి రోజులు వస్తాయంటావా?

నాన్న : తప్పకుండా వస్తాయి నాన్నా.

95% వర్షపు నీరు భూమిలోకి ఇంకే ప్రాంతం.

పట్టణాలలో కుండపోత వర్షం కురిసినపుడు నీటి ముంపు రావడానికి కారణం.

అమ్మ : ఎలా వస్తాయండీ?

నాన్న : ఎలా అంటే? ఇంటింటికీ మొక్కలు నాటాలి, వీధులలో చెట్లు పెంచాలి.

వరుణ్ : అశోకుడిలాగా కదూనాన్న?

నాన్న : అవును వరుణ్. 'అప్పుడు కాలానుగుణంగా వానలు పడతాయి. చినుకు పడిన చోటకే భూమిలోకి నీరు ఇంకేలా చేస్తే నీటికొరత తీరుతుంది. ఇంకుడు గుంతలు బాగా పనిచేసేలా చూడాలి.

వరుణ్ : వానవస్తే మోకాలులోతు నీళ్ళలో బడికి పోవాలి నాన్నా! చాలా కష్టంగా ఉంది.

తాత : అవును. ఆ సమస్య ఎలా తీరుతుందిరా?


నాన్న : రోడ్లపై నుంచి వర్షపు నీటిని నగరం బయటకు పంపేందుకు ప్రత్యేక గొట్టాలు (పైప్‌లైన్) వేయాలి. అప్పుడు నగరంలో నీటిముంపు ఉండదు.

వరుణ్ : నీటిని గురించి వివరంగా చెప్పావు నాన్నా?

తాత : ఒరే వరుణ్! మెల్లగా ఇంట్లోకి జారుకుంటున్నావు ముందు కాళ్ళు కడుగు.

వరుణ్ : అలాగే తాతయ్యా!





**రచయిత పరిచయం : శ్రీ చొక్కాపు వెంకటరమణ**గారు 1-4-1948 నాడు సావిత్రమ్మ, దాలయ్య దంపతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో పట్టభద్రులు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమి వారి **''బాల చంద్రిక''** పిల్లల మాసపత్రికకు 18 ఏండ్ల సంపాదకులుగా పనిచేశారు. వివిధ పత్రికలలో జర్నలిస్టుగా పనిచేశారు. వీరు పిల్లల కోసం సుమారు 70కి పైగా పుస్తకాలు రాశారు. అందులో కొన్ని పుస్తకాలు హిందీ, కన్నడ భాషల్లోకి అనువాదం అయ్యాయి. బాల సాహిత్య పరిషద్ అధ్యక్షులుగా బాలలకు గేయరచన శిక్షణా శిబిరాలు నిర్వహించారు. 2015లో కేంద్ర సాహిత్య అకాడమి వారి **''బాల సాహిత్య పురస్కారం''** పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వీరిని **'కీర్తి పురస్కారం'**తో గౌరవించింది.

**I అ) జవాబులు రాయండి.**

1) చొక్కాపు వెంకట రమణగారు నిర్వహించిన పదవులను తెలపండి.

2) వెంకట రమణగారు పొందిన బిరుదులేవి?

3) వర్షపు నీటిని బయటకు పంపే పైప్‌లైన్‌లు వేయటం వల్ల కలిగే పరిణామం ఏమిటి?

4) పట్టణాలలో నీటి కరువు ఏర్పడటానికి గల కారణాలను స్పష్టీకరించండి.

**ఆ) కింది వాక్యాల్లోని తప్పొప్పులను గుర్తించండి.**

1) భూమిలోకి నీరు ఇంకేలా చేస్తే నీటికొరత తీరుతుంది. (  )

2) వాననీటి రక్షణ ప్రభుత్వం చూసుకుంటుంది. (  )

3) పట్టణాలలో జనాభా తరిగి పోతోంది. (  )

4) నీటిని అశ్రద్ధ చేస్తే కన్నీళ్ళు మాత్రమే మిగులుతాయి. (  )

**ఇ) సరియైన సమాధానం గుర్తించండి.**

1) గంగను భూమికి తెచ్చినది. → శివుడు / భగీరథుడు [  ]

2) భూమిలోని నీటివనరులు తగ్గటానికి కారణం. → చెట్లు నాటడం / బోర్లుతవ్వడం [  ]

3) రోడ్లకి ఇరు ప్రక్కల చెట్లను నాటించిన రాజు. → అర్జునుడు / అశోకుడు [  ]

4) పల్లెలు పెరిగి ఇలా అవుతున్నాయి. → భవనాలు / పట్టణాలు [  ]

**II. లఘుటీక రాయండి.**


1) నీటి సంరక్షణ ఆవశ్యకత.

2) నగరాలు నీటి ముంపుకు గురవతున్న కారణం.

3) గ్రామాలకు – నగరాలకు నీటి ఉపయోగంలోని వ్యత్యాసం.

**III. పట్టిక పూరించుము.**

పట్టణాలలో, గ్రామాలలో లభ్యమగు నీటి వనరులు.




**IV. కింది పట్టికలో ప్రతిరోజు చేయవలసిన పనులు, జలదినోత్సవం సందర్భంగా మార్చి 22న చేపట్టవలసిన కార్యక్రమాలు ఇవ్వబడ్డాయి. వాటి గురించి కింది పట్టిక ఆధారంగా ఒక వ్యాసాన్ని రాయండి.**

| ప్రతినిత్యం చేయవలసిన పనులు | జలదినోత్సం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు |
|---|---|
| • పళ్ళు తోముకునేటప్పుడు వాష్ బేసిన్‌లో పూర్తి సమయం నీటిని వదిలి పెట్టరాదు.<br>• త్రాగునీరు పట్టి ఉంచేవారు రెండవరోజు ఆ నీటిని వృథాచేయకుండా ఇతర అవసరాలకు వాడుకోవాలి.<br>• గిన్నెలు తోమడం లాంటి పనులు చేసేటప్పుడు పూర్తి సమయం నల్లను తెరచి ఉంచరాదు.<br>• స్నానానికి షవర్ కాకుండా బక్కెట్‌నే వాడాలి. | • ఫ్లష్‌టాంక్‌లో రాళ్ళు నింపిన ప్లాస్టిక్ సీసాలను ఉంచితే ఎక్కువ నీరు ప్రతిసారి వృథాకాకుండా ఉంటుందని జాగృతి కలిగించడం.<br>• ఇంకుడు గుంతల ఏర్పాటు పనితీరుపై పర్యవేక్షణ<br>• రహదారులలో కూడా నీరు ఇంకేలా పూర్తి కాంక్రీటు చేయకుండా చూడటం.<br>• నీరు నిలువ ఉండే ప్రదేశాలలో (ఉదా. చెరువులు, నదులు, బావులు) వ్యర్థ పదార్థాలను పడేయకుండా కట్టుదిట్టం చేయడం. శుభ్రం చేయడం. |

**V సృజనాత్మకత :**

నీటినిలువ కొరకు గ్రామ ప్రాంతాల్లోని వాగులు, నదులపై చిన్న చిన్న అడ్డుకట్టల (చెక్‌డ్యాములు) నిర్మాణాల ప్రయోజనాలపై చర్చించండి.

**విశేషాంశములు :**

వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా.

**నేనివి గ్రహించా :**

- నీటి వనరులు - నీటి ఆవశ్యకత.
- నీటిని పొదుపు చేయడం - ఇంకుడు గుంతల ప్రాముఖ్యత.

# వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా

పఠనం



డా. రాజేంద్రసింగ్ భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్రంలోని అల్వార్ జిల్లాకు చెందిన నీటిపరిరక్షకులు, సంఘసేవకులు. వీరిని ''వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'' గా పిలుస్తారు. ఈయన స్టాక్‌హోం వాటర్‌ప్రైజ్ కూడా గెలుచుకున్నారు. వీరు ఉత్తరప్రదేశ్‌లో మీరట్‌కు సమీపంలో గల భగవత్ జిల్లాలోని డౌలా గ్రామంలో 1959 ఆగస్టు 6వ తేదీన జన్మించారు. రాజేంద్రసింగ్ ఆ గ్రామంలో ప్రారంభ విద్యను అభ్యసించారు. పాఠశాల విద్య పూర్తయిన తరువాత అలహాబాద్ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల బారాత్ కళాశాలలో హిందీ సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసారు.

పాఠశాలలోని ఆంగ్లభాష ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్ గారి ప్రభావం రాజేంద్రసింగ్‌పై పడింది. ఆ ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థులతో రాజకీయాలు మరియు సాంఘిక సమస్యలను చర్చించేవారు. ఇలా రాజేంద్రుడు గ్రామీణుల సమస్యలపై వారితో చర్చించి స్వంత అభిప్రాయాలను ఏర్పరచుకున్నారు. వీరు ప్రభుత్వేతర సంస్థ ''తరుణ్ భారత్ సంఘ్''ను 1975లో స్థాపించారు. రాజస్థాన్‌లో మంచి నీటి నిర్వహణలో విశేషకృషి చేసినందుకు 2001లో ''రామన్‌మెగ్‌సెసె'' పురస్కారాన్ని అందుకున్నారు.

ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో అంతరించి పోయిన 5 నదులకు జీవం పోసి, 100 గ్రామాలకు నీరందించిన ఘనమైన చరిత్ర ఆయనది. వందల అడుగులు తవ్వితేగానీ జలంపడని చోట్లలో ఆయన పాటించిన విధానాలతో 15 అడుగుల లోతులోనే నీళ్ళు పడేంతగా భూగర్భజలాలు చార్జ్ అయ్యాయక్కడ. ఆయన వర్షపునీటిని నిల్వచేసే ట్యాంకులు, చెక్‌డ్యాంలను ఉపయోగించి నీటిని సంరక్షించే విధానాలను అవలంబించారు. 1985లో ఒక గ్రామం నుండి ప్రారంభించి ఈ సంస్థ 8600 జోహాద్‌లు (నీటిని నిల్వచేసే దొరువులు) నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటుచేసి వర్షపునీటిని నిల్వచేసింది. ఈయన అవలంబించిన ఈ విధానాల వలన రాజస్థాన్‌లో అర్వారి, రూపరెల్, సర్సా, భగాని, జగజ్వాలి అనే ఐదు నదులు పునరుజ్జీవనము పొంది 1000 గ్రామాలకు నీటిని అందించాయి.

2009 సం.లో భారత ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చట్టం-1996 అనుగుణంగా గంగానది కోసం ఏర్పడిన అధికార ప్రణాళిక, ఫైనాన్సింగ్, పర్యవేక్షణ, సమన్వయ అధికారం గల సంస్థ ''నేషనల్ గంగారివర్ బేసిన్ అథారిటీ'' సభ్యులలో డా. రాజేంద్రసింగ్ ఒకరు ''యునైటెడ్ కింగ్‌డం'' (ఇంగ్లాడు)లో ఈయన నేలకోత, వరదలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనే లక్ష్యంతో ''ఫ్లో పార్ట్‌నర్‌షిప్'' అనే సంస్థను స్థాపించారు. రాజపుత్రుల కుటుంబంలో జమీందారి సాంప్రదాయానికి చెందినప్పటికీ గ్రామీణుల క్షేమాభివృద్ధికి పాటుపడుతున్న సంఘసంస్కర్త.

# లేఖన కౌశల్యాలు

మన తెలుగు భాషను చక్కగా అధ్యయనం చేయడం వల్ల మనకు ఎన్నో రంగాలలో రాణించడానికి దారులు ఏర్పడతాయి. భాషను నేర్చుకొని దానిలో పట్టు ఏర్పరచుకుంటే రచనలు, సంభాషణలు, పాటలు రాయుట, అనువాదం చేయుట, 'బ్లాగ్‌లో రాయుట, వార్తా లేఖనం, వార్తా పఠనం, సూత్రసంచాలనం, ముఖాముఖి నిర్వహణ వంటి వృత్తులను చేపట్టవచ్చు. కొంతకాలం క్రితం వరకు కేవలం అభిరుచులుగా ఉన్న ఈ అంగాలు నేడు ఎంతోమందికి వృత్తిగా జీవనభృతిని అందిస్తున్నాయి. వీటివల్ల ధనార్జనయే కాక పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. అభిమానులు లభిస్తారు. అన్నింటినీ మించి ఎనలేని ఆత్మసంతృప్తి కూడా కలుగుతుంది.

## 1. బ్లాగ్ లేఖనం (Blog writing)

నేటి ప్రపంచంలో అందరూ అరచేతిలో వైకుంఠం అనేస్థితిలో ఉన్నారు. అంటే అందరూ చిన్నదో, పెద్దదో తెరకి కళ్ళు అతికించుకుని జీవితంలో ఎక్కువ భాగం గడిపేస్తున్నారు. ఇలా గడిపేవారందరు కాలాన్ని వృథా చేస్తున్నారని అనుకోకూడదు. సద్వినియోగం చేసుకునేవారుకూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మొబైల్‌కి, కంప్యూటర్‌లలో అంతర్జాలం ద్వారా ఎంతో జ్ఞానం సంపాదించుకోవడానికి అవకాశంవుంది.

వ్యక్తిగత ఆలోచనలు, సమాచారం, సాహిత్య రచనలు, మొదలైన వాటిని సమాచార వినిమయానికి అనువుగా ఉండేటట్లు (ఆన్‌లైన్లో) అంతర్జాలంలో ఉండే వెబ్‌పేజీలాంటి సౌకర్యాన్ని 'బ్లాగ్' అంటారు. ఈ బ్లాగ్‌లు జ్ఞానం సంపాదించుకోవడానికి మరియు పెంపొందించుకోవడానికి బాగా ఉపయోగపడతాయి. బ్లాగ్ లేఖకుని 'బ్లాగర్', బ్లాగర్ పెట్టే రచనలను టపా (పోస్టు) అంటారు.

మనకు తెలిసిన విషయాన్ని గురించి ఆసక్తిగా, చదివించేలా రాసి దానిని ఆన్‌లైన్‌లో ప్రత్యేకమైన సైట్‌లో అప్‌లోడ్ చేయడాన్ని 'బ్లాగ్ రైటింగ్' అంటారు.

ప్రతి మనిషికి ఎంతో కొంత విశ్లేషణా జ్ఞానం ఉంటుంది. ఆజ్ఞానాన్ని ప్రదర్శించుకోవడానికి అందరికి నిజజీవితంలో అవకాశం రాకపోవచ్చు. కానిబ్లాగ్‌లో రాయడం వల్ల వారికి తమజ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవడానికి వేదిక దొరకడమే కాకుండా వెనువెంటనే వారికి ప్రతిస్పందనలు, మెచ్చుకోవడాలు, విమర్శలు లభిస్తాయి. కావున అవి బ్లాగర్ యొక్క రచనాశక్తిని అభివృద్ధి చేసుకోవడానికి సహకరిస్తాయి.

ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలలో వున్నవారికి సైతం పేరు ప్రఖ్యాతులు సాధించడానికి 'బ్లాగ్' విశ్వవేదికగా ఉపయోగపడుతుంది.

ఈ బ్లాగులను ఎలా తయారు చేసుకోవచ్చునో చూద్దాం.

గూగల్ బ్లాగర్ వెబ్‌సైట్లో మొదట క్రియేట్ బ్లాగ్ ఆప్షన్‌ను ఎంచుకొని ఒక డొమైన్‌తో మన బ్లాగును తయారు చేసుకోవాలి. తదనంతరం ఒక డిజైన్ను ఎంచుకొని అందులో మనం రాయాలనుకున్న సమాచారాన్ని రాసి పోస్ట్ (టపా) చేసుకోవాలి. అంతే మీ బ్లాగు తయారైనట్లే.

**బ్లాగులో రాస్తున్నపుడు దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలు:**

1) చక్కని, ఆకర్షణీయమైన శీర్షికను ఎంచుకోవాలి.

2) రాసే విషయాన్ని క్లుప్తంగా, సరళంగా, ఆసక్తి కలిగేలా రాయాలి.

3) చదువరుల అభిరుచికి తగ్గట్లు, విషయాన్ని రాయాలి.

### ఎవరెవరు బ్లాగ్ రచన చేయవచ్చు.

విద్యార్థి నుండి పరిశోధకుని వరకు, పామరుని నుండి పండితునివరకు అందరూ బ్లాగ్‌లో రచనలు చేయవచ్చు. కేవలం భాషా సంబంధీకులేకాక వివిధ వృత్తులకు, వివిధ రంగాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు ఈ బ్లాగులను రాయవచ్చు. దీనిలో మన ఆలోచనలు, కవితలు, రచనలు రాసుకోవచ్చును మరియు పోటోలు, వీడియోలు పెట్టవచ్చును.

### బ్లాగ్‌లలో రకాలు :

బ్లాగ్‌లలో చాలా రకాలున్నాయి. ఇవి అంశాన్ని బట్టి వర్గీకరించబడ్డాయి.

- **వ్యక్తిగతమైనవి.**
- **ఆలోచనాత్మకమైనవి.**
- **ఆధ్యాత్మికమైనవి.**
- **రాజకీయపరమైనవి.**
- **విద్యా పరమైనవి.**

ఈ విధంగా చాలా రకాల బ్లాగులను నిర్వహించవచ్చును.

**అభ్యాసం :**

1. బ్లాగ్ రచనా విధానం రాయండి.
2. బ్లాగ్ రచన ఎవరు చేయవచ్చు, బ్లాగులు ఎన్ని రకాలు?

## 2. వార్తాలేఖనం

నేటి యుగము సమాచార సాంకేతికయుగం. సాంకేతికత ప్రసార మాధ్యమాల వికాసంతో ప్రపంచము దగ్గరైనది. ప్రపంచములో జరిగిన సంఘటనల సమాచారం గురించి మనం ఇంట్లో కూర్చొని కూడా వార్తాప్రతికలు, ఆకాశవాణి, దూరదర్శన్, అంతర్జాలం మొదలైన ప్రసారమాధ్యమాల ద్వారా సునాయాసంగా తెలుసుకోవచ్చు. జరిగిన సంఘటన గురించిన సమాచారాన్ని ఉన్నది ఉన్నట్లుగా, ప్రభావవంతముగా అందజేయుటయే వార్తా లేఖనము యొక్క ముఖ్యోద్దేశ్యము.

**''జలవాహిని పగిలినందువల్ల రేపు పట్టణంలో నీటి సరఫరా జరుగదు''** వంటి నిత్య జీవితానికి సంబంధించిన అతిచిన్న వార్త మొదలుకొని **''భారత్‌క్షిపణి అస్త్రాల పరీక్షణలో విజయం సాధించింది''** – వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన విషయాలు వార్తల ద్వారా మనకు తెలుస్తాయి.

క్లుప్తంగా చెప్పాలంటే వార్తలకు మన జీవితంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది.

### వార్తా లేఖనము కొరకు అవసరమైన లక్షణాలు:

- చక్కని లేఖన నైపుణ్యము.
- ఉత్తమ భాషాజ్ఞానము, లోకజ్ఞానము.
- వ్యాకరణంపై ప్రభుత.
- సులభమైన వాక్యరచన.
- సమగ్ర పఠనము.

**ఏదైనా సంఘటన గురించి 'వార్త' తయారు చేయునపుడు కింది విషయాలను గుర్తుంచుకోవాలి.**

- సంఘటన యొక్క విశ్వసనీయత.
- లేఖనంలో పక్షపాతం లేకుండా తటస్థంగా వ్రాయుట.
- సంఘటన గురించిన ఖచ్చితమైన వివరాలు.
- ప్రత్యక్షంగా జరిగిన విషయాల గురించి వ్రాయడం.
- తనకు నచ్చిన విధంగా స్వంత అభిప్రాయాలను, ఊహలను జోడించిగాక యథాతథంగా రాయాలి.

**వార్తాలేఖనంలో పాటించవలసిన అంశాలు:**

- శీర్షిక : వార్తాసారాన్ని ప్రతిబింబించే క్లుప్తమైన వాక్యం.
- తేది : ప్రదేశం/స్థలం, సమయం, సంబంధిత వ్యక్తుల ప్రస్తావన.
- అల్లర్లు రేపేవి, ప్రజల మనోభావాలను నొప్పించే వార్తలు రాయకుండుట.
- వార్త ప్రారంభంలో ముఖ్యమైన వార్తను క్లుప్తంగా రాసి, వివరాలను తర్వాత విశదీకరించుట.
- వార్తలను సంఘటన జరిగిన తరువాత రాస్తారు కాబట్టి వార్తలను ఎప్పుడూ భూతకాలంలో రాయాలి.

**వార్తలు-వివిధ రంగాలు :**

**● సాంస్కృతిక ● క్రీడా ● రాజకీయ ● సామాజిక ● వాఙ్మయ ● విద్య ● వైద్య ● శాస్త్రీయ ● ధార్మిక మొదలగు సంఘటనలకు సంబంధించినవి.**

**అభ్యాసం :**

1) ఢిల్లీలో జరిగిన 'అంతర్జాతీయ యోగాదినోత్సవం' గురించి వార్తా లేఖనం చేయండి.

2) కింది అంశాల ఆధారంగా వార్త రాయండి.

   * వేసవి సెలవులకు ప్రత్యేకరైళ్ళు
   * ప్రారంభతేది
   * ఎక్కడ నుండి ఎక్కడి వరకు
   * రైలు ఆగే స్టేషన్‌లు
   * శ్రేణులు.

3) మీ పాఠశాల వార్షికోత్సవం గురించి వార్త రాయండి.

4) మీ ప్రాంతంలో జరిగిన ఏదేని ఒక సంఘటనను వార్తగా రాయండి.

## 3. అనువాదం.

పూర్వకాలం నుండే వేర్వేరు భాషల మధ్య ఆదాన ప్రదానాలు జరుగుతున్నాయి. ఇందులకొక ఉదాహరణ. ఒక భాషలోని పదాలు మరొక భాషలోకి చేరటం. భాషల మధ్య రకరకాల ఆవశ్యకతలు కలుగుతునే ఉంటాయి. ప్రస్తుత కాలంలో మనం వివిధ హెచ్చరికలు, జనజాగృతి సూచనలను హిందీ, ఆంగ్లం లేదా ఆయాస్థానిక భాషలలో చూస్తుంటాము. వానిని అర్థం చేసుకోవటం ఎంతైనా అవసరం.

కాబట్టి ఇతర భాషాపరిజ్ఞానం కలిగి ఉండటం మంచిది. అలాగే ఇతర భాషలలోని మంచి సాహిత్యాన్ని ఆస్వాదించటానికి అనువాదాలు ఆధారం.

అనువాదాన్ని తర్జుమా అని కూడా అంటారు. అంటే ఒక భాషలోని విషయాన్ని ఇంకొక భాషలోకి అర్థం చెడకుండా మార్చి రాయటం.

**అనువాదకులకు ఉండవలసిన లక్షణాలు :**

- అనువాదం చేసేవారికి రెండు భాషలలోను సమాన పటుత్వం ఉండాలి.
- రెండు భాషలలోను సమగ్ర పఠనం, శబ్దసంపత్తి కలిగి ఉండటం అవసరం.
- అనువాదం చేసేటపుడు మూలములో ఉన్నవాటిని తగ్గించడంగాని, పెంచడంగాని చేయరాదు.
- అనువాదం యథాతథంగా రాయాలి మరియు తప్పులు లేకుండా చూసుకోవాలి.
- మూల రచనలోవున్న శైలిని అనుసరించి అనువాదం చేయాలి.
- అనువాదం చేసేవారి వద్ద శబ్దకోశాలు విరివిగా ఉండాలి లేదా ఆన్‌లైన్ శబ్దకోశాలను ఉపయోగించే నేర్పు కలిగి ఉండాలి.
- ఆయా భాషలలోని అంతర్లీనభావాలు, నుడికారాలు జాతీయాల అర్థము, వాడుక సమగ్రంగా తెలిసి ఉండాలి.
- అనువాదం సహజంగా, సరళంగా మూలభావానికి దగ్గరగా ఉండాలి.

**అనువాదంలోని రకాలు :**

సాంకేతిక, శాస్త్రీయ, ఆర్థిక, వైద్య, న్యాయ, వాఙ్మయ మొ॥ అనువాదాలు.

**అభ్యాసం :**

1) కింది ఆంగ్ల పరిచ్ఛేదాన్ని తెలుగులోకి అనువదించండి.

My aunt gave me this little plant. I water it every day. I loosen the soil around its roots from time to time. I add a little organic manure to it once in two or three months.

**తెలుగు అనువాదం.**

మా అత్తమ్మ నాకు ఈ చిన్న మొక్కను ఇచ్చింది. నేను దీనికి ప్రతిరోజు నీరు పోస్తాను. నేను దీని వ్రేళ్ళ చుట్టూ గల మట్టిని అప్పుడప్పుడు వదులు చేస్తాను. దీనికి ప్రతి 2-3 నెలలకు ఒకసారి కొంచెం సేంద్రియ ఎరువును వేస్తాను.

2) కింది ఆంగ్ల వాక్యాలను తెలుగులోనికి అనువదించి రాయండి.

i) Forests are invaluable wealth of a country.

ii) Forests provide shelter to a number of animals.

iii) Forests reduce atmospheric pollution.

3) కింది పదాలను తెలుగులోనికి అనువదించి రాయండి.

| | | | |
|---|---|---|---|
| Education | : ________________ | Humanity | : ________________ |
| Hardwork | : ________________ | Intelligence | : ________________ |
| Laboratory | : ________________ | Development | : ________________ |

# 4. సంభాషణ లేఖనం (మాటలు/డైలాగ్స్)

మన మనోభావాల వ్యక్తీకరణకు భాష ఉత్తమ మాధ్యమం, ఒకరి భావాలు ఇంకొకరితో మాటలలో చెప్పుటను మాట్లాడటం అంటాం. నవల, కథ, వ్యాసం మొదలగు ప్రక్రియల కన్నా సంభాషణ లేఖనంలో రచయిత, పాత్రల సంభాషణల ద్వారా తాను చెప్పదలచుకున్నది మరింత ప్రభావవంతంగా వ్యక్తపరచుటకు అవకాశం అధికంగా ఉంటుంది. ఈ సంభాషణ రచననే 'స్క్రిప్ట్ రైటింగ్' అని అంటారు. ఇది మాస్ మీడియాలో చాలా ముఖ్యమైనది. సంభాషణ లేఖనం అనునది ఒక కళ. ప్రస్తుతం ఈ కళను స్వతంత్రవృత్తిగా చేపట్టడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఉదా: చలన చిత్రాలు, దూరదర్శన్, నాటికలు. కార్టూన్‌షోలు, వీడియోగేమ్స్ మొదలైనవి.

ఒక కథలో ఉన్న పాత్రల మధ్య జరుగు సంభాషణను వ్రాయుటనే 'స్క్రిప్ట్‌రైటింగ్' లేక 'వ్రాతప్రతి రాయుట' అంటారు.

నాటకాలకు, సినిమాలకు, దూరదర్శన్‌కు స్క్రిప్ట్‌రైటింగ్ ఆత్మలాంటిది, కథలో ఉన్న పాత్రలకు సంబంధించిన సంభాషణను స్క్రిప్ట్‌రైటర్స్ అందిస్తారు. వీరు కాల్పనిక లేదా యదార్థకథలు, నవలలు, కవితలు, హాస్యరచనలలోని పాత్రల సంభాషణలను స్క్రిప్ట్‌గా తయారుచేసి నిర్మాతలకు అందజేస్తారు.

## సంభాషణ లేఖన నమూనా

ప్రస్తుత పాఠ్యపుస్తకంలోని 'కరెంటుసంబరం' ను తీసుకొని సంభాషణ లేఖనం చేయుట.

**అమ్మమ్మ** : నేను కరెంటీ వద్దంటే మీతాత వినట్లేదు చూడవే.

**మనవరాలు** : కరెంట్ అంటే భయమెందుకు అమ్మమ్మా!

**అమ్మమ్మ** : మీట నొక్కితే దానికి అతుక్కుపోతారటగా, రబ్బరు చెప్పులు వేసుకోవాలట. ఈ వయస్సులో ఇలాంటి అలవాట్లు ఎలా?

**మనవరాలు** : అదేం అక్కర్లేదు.

**అమ్మమ్మ** : మీ అమ్మ అదే చెప్పింది. (ఎలక్ట్రీషన్ వచ్చి వైరింగ్ పనులు చేస్తున్నారు.) బాబు ఆదీపాలు కాస్త కిందగా పెట్టు.

**ఎలక్ట్రీషియన్** : అయ్యో మామ్మగారు! వీటిని బుడ్డిదీపాల చిమ్మీలా రోజు తుడువక్కర్లేదు, మసిబట్టదు.

**అమ్మమ్మ** : అలాగా అయితే సరేలేనాయనా అలాగేకాని.

(తరువాత మనవరాలితో ఎలక్ట్రీషన్ చేసిన పనిగురించి)

**అమ్మమ్మ** : చూడవే దేనిమీట దానికి అదేగదిలో పెట్టమంటే విన్నాడుకాదు.

**మనవరాలు** : దానివల్ల నీకిబ్బంది ఏమిటి అమ్మమ్మా?

**అమ్మమ్మ** : వంటింట్లో దీపానికి బదులు వేరే మీట నొక్కితే అప్పుడు ఎలా!

**మనవరాలు** : అదేం లేదు. ఆ మీటను ఆర్పి నీక్కావలసింది నొక్కటమే.

**అమ్మమ్మ** : అంతేనా, అయితేసరి, కానీ... కరెంటీదీపం ఉండగా లాంతరీ వెలిగిస్తే కరెంటీ దీపానికి కోపం వస్తుందేమో!

**మనవరాలు** : (నవ్వుతూ) అదేమైనా మనిషా కోపం రావడానికి.

**అభ్యాసం :**

1) చిట్టిబాబు పాఠం ఆధారంగా సంభాషణను రాయండి.

2) మీ తరగతిగదిలో ఉపాధ్యాయులు-విద్యార్థుల మధ్య జరిగే సంభాషణను రాయండి.

# 5. సూత్రసంచాలనం (యాంకరింగ్)

సూత్రము అనగా దారము. విడివిడి పూలను దారంతో మాలగా కూర్చడం ద్వారా ఆ పూల అందం ఇనుమడిస్తుంది. కాని ఆ మాలలో దాగిన దారం మాత్రం కనిపించదు. అలాగే ఏ కార్యక్రమంలోనైనా విడిపూలవంటి అనేక ఉపకార్యక్రమాలు ఇమిడి ఉంటాయి. వాటినన్నింటిని ఒకే త్రాటిపై (సూత్రము) నడిపించే నేర్పరిని 'సూత్రసంచాలకు'లంటారు. కార్యక్రమ నిర్వహణ అనుసంధానం వీరి చేతిలోనే ఉంటుంది. కార్యక్రమము ముగిసిన తర్వాత ''సూత్రసంచాలనము చాలా బాగుండినది'' అనే మెచ్చుకోలు ఉత్తమ సూత్రసంచాలనము యొక్క లక్షణము.

సూత్రసంచాలనం అనేది ఒకకళ. కార్యక్రమాన్ని ఒక క్రమమైన పద్ధతిలో ఆకర్షణీయంగా తీర్చి దిద్దటమే సూత్రసంచాలకుల ప్రధాన కర్తవ్యము.

సూత్ర సంచాలనం అనేది కేవలము మాట్లాడటము కాదు. శాస్త్రీయంగా అభ్యసించి నేర్చుకోవలసిన కళ. దాని కొరకు నిరంతర పఠనం ద్వారా ప్రాప్తించిన జ్ఞానం, చక్కని ఆలోచనా సరళి, సందర్భానుసారంగా అన్వయించే నేర్పు, వాక్చాతుర్యము మొదలగునవి మిక్కిలి ఆవశ్యకము. సూత్రసంచాలనంలో అనేక రకాలున్నాయి. కళాశాల స్థాయిలో ఈ కళను అవగతం చేసుకోవడానికి చర్చలు, సన్మానసభలు, వీడ్కోలు కార్యక్రమాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, స్వాగతకార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలగునవి ప్రాముఖ్యత వహిస్తాయి.

సూత్ర సంచాలకులు కార్యక్రమ యదార్థ స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. వారిభాష శాస్త్రీయమైన శైలితో వుండటమే కాక కార్యక్రమాన్ని అనుసరించి భాషలో తగినమార్పు చేసుకోవాలి. అర్థవంతమైన పదాల ప్రయోగము, ఆ ప్రయోగాలలో తారతమ్య వివేచనము కలిగి వుండాలి. స్పష్టమైన ఉచ్చారణ, సందర్భానికి తగినట్లుగా కార్యక్రమంలో భాషా ప్రయోగము చేసే నైపుణ్యము కలిగివుండాలి. తనదైన శైలిని అభివృద్ధి పరచుకోవడము, కార్యక్రమానికి తగినట్లుగా శైలిని మార్చుకోవటం ఆవశ్యకము. సమయపాలన కూడా ముఖ్యమైన అంశమే. సభాభీతి లేకుండా ధారాళంగా మాట్లాడటం, ఇతరులను నొప్పించనిరీతిలో హాస్యస్ఫోరకత వుండాలి.

కార్యక్రమంలో పదవుల అనుసారం క్రమం పాటించాలి, కార్యక్రమ రూపురేఖలు దోషరహితంగా వుండాలి. అందుకుగాను కార్యక్రమపత్రిక తప్పులు లేకుండా పేర్ల సహితంగా ఉండాలి. మనోరంజకమైన నివేదన సూత్ర సంచలనానికి పునాది.

సంపూర్ణ కార్యక్రమ నిర్వాహక బాధ్యత సూత్ర సంచాలకునిపై వుంటుంది. కార్యక్రమ పగ్గాలు అతని చేతిలోనే వుంటాయి. నిశ్చయించిన విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ముందుకు కొనసాగించటం సూత్ర సంచాలకుల బాధ్యత. బహుభాషాప్రభుత, సామెతలు, సుభాషితాలు ఉపయోగించటం ద్వారా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి వారి మనసు కార్యక్రమంలో నిలచునట్లు చేయవచ్చు.

## సూత్రసంచాలనం - నమూనాస్క్రిప్ట్

- మీ పాఠశాలలో జరగనున్న 'అభినందన సభ' కార్యక్రమానికి సూత్రసంచాలనం చేయవలసియున్నది. అందుకొరకుగాను కార్యక్రమ పత్రిక తయారుచేసుకోండి.
- సూత్రసంచాలనం దృష్ట్యా అంచెలంచెలుగా [కార్యక్రమంలో పాల్గొను పెద్దల నామావళి (కల్పిత) సహితం] కార్యక్రమ స్వరూపాన్ని తయారుచేయండి.

**పరీక్షా ఫలితాలు వచ్చిన తరువాత విద్యార్థులను అభినందించుటకు ఏర్పాటు చేసిన అభినందన సభ.**

**తేదీ :** జూన్ 1, సమయం మధ్యాహ్నం 3.00 గం.లకు.

**వేదిక :** సావిత్రీబాయి సభాగృహము, ముంబయి.

**సూత్రసంచాలకులు :** అందరికి ఆహ్వానం, శుభస్వాగతం. ఓం శ్రీ గురుభ్యోనమః

మన మందరం ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యాము అంటే దానికి మన గురువులు ముఖ్యమైన పాత్ర. అందుకే ముందుగా ప్రధానోపాధ్యాయులు, మన ఉపాధ్యాయులు మరియు మనకు చక్కని పాఠశాల వాతావరణాన్ని కల్పించిన యాజమాన్యము వారికి శిరస్సువంచి నమస్కరిస్తూ ఆహ్వానిస్తున్నాను.

ఈనాడు ఎంతో ఉత్సాహంతో ఆనందంగా ఇలా కలుసుకోవడం మనందరికి అత్యంత ఆనందాన్ని కలిగిస్తోంది. సంవత్సరం అంతా నిరంతరం శ్రమచేసి, సంక్రాతికి ధాన్యం కోకొల్లలుగా ఇల్లుచేర రైతుకు కలిగే ఆనందం లాంటిదే నేటి మన ఆనందం.

ముందుగా మన విజయాల గురించి మన ప్రధానోపాధ్యాయులు వివరిస్తారు.

**(ప్రధానోపాధ్యాయుల ఉపన్యాసం)**

**సూ.సం.** : ధన్యవాదములు సర్.

ఇప్పుడు ముఖ్య అతిథిగా విచ్చేసిన మన యాజమాన్య అధ్యక్షురాలు శ్రీమతి శారదగారు మనల్నందరిని అభినందించుటకు వచ్చారు. గౌరవనీయులైన శ్రీమతి శారద గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

**(అధ్యక్షుల ఉపన్యాసం)**

**సూ.సం.** : ఎంతో ఆప్యాయతతో తమ స్వంత కుటుంబ సభ్యులను పలకరించినట్లే మాట్లాడారు. చాలా చాలా సంతోషం... ఇప్పుడు పదవ తరగతిలో 98.59% తో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థిని కుమారి ఇందిరను వేదిక మీదికి వచ్చి అధ్యక్షులవారి చేతుల మీదుగా చక్కని మొక్కను, బహుమతిని అందుకోవాల్సిందిగా కోరుతున్నాను.

**అధ్యక్షురాలు** : (ఇందిరకు మొక్కను అందిస్తూ) ఈ మొక్కను బాగాపెంచు, దానిలాగే అభివృద్ధిచెందు.

**సూ.సం.** : కుమారి ఇందిరను తమ విజయం గురించి రెండు మాటలు చెప్పమని కోరుతున్నాను.

**(ఇందిర ... మాటలు)**

సూ.సం. : తన అనుభవాలను చాలా బాగా చెప్పారు. ఇప్పుడు ద్వితీయ స్థానంలో నిలిచిన దీపక్‌ను వేదిక మీదికి రావల్సిందిగా కోరుతున్నాను.

అధ్యక్షురాలు : (చక్కని మొక్క, బహుమతి ప్రదానం)

సూ.సం. : దీపక్ నీ అభిప్రాయం చెప్పు.

దీపక్ : చాలా సంతోషంగా ఉన్నది. మాలాగే ప్రతి సంవత్సరం ఎక్కువమంది విద్యార్థులు ఉత్తమ శాతంతో ఉత్తీర్ణులై మన పాఠశాలపేరు నిలబెడతారని ఆశిస్తూ... అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలుపుతూ శెలవు.

సూ.సం. : విద్యార్థులందరూ తమ తరగతి గదులకు వెళ్ళి తమతమ సర్టిఫికెట్లను తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

**అభ్యాసం :**

**కింది కార్యక్రమాల సూత్ర సంచాలన స్క్రిప్ట్ రాయండి.**

1) అభినందన సభ  2) వీడ్కోలు సమావేశాలు

3) స్వాగత సమావేశాలు  4) పోటీల కార్యక్రమం

5) కవి సమ్మేళనం  6) సంగీత సమ్మేళనం

## వ్యాకరణము

**భాషాభాగాలు :** (1) నామ వాచకము (2) సర్వనామము (3) విశేషణము (4) క్రియ (5) అవ్యయము.

ఈ ఐదింటిని భాషాభాగములు అంటారు.

**నామవాచకము :** పేర్లను తెలియజేయునది. ఉదా., కమల

**సర్వనామము :** నామవాచకమునకు బదులుగా వాడబడునది. ఉదా., అతడు, ఆమె, వాడు.

**విశేషణము:** నామవాచకములోని విశేష విషయమును (రంగు, స్వభావము, గుణము) తెలియజేయునది. ఉదా., తెల్లని గుఱ్ఱము.

**క్రియ :** పనిని తెలియజేయునది. ఉదా., చదువుచున్నాడు.

**అవ్యయము :** లింగ, వచన, విభక్తులు లేని పదములు. ఉదా., ఆహా! ఔరా! అక్కటా!

**వాక్యరకములు :** వాక్యములు మూడు విధములు.

**సామాన్యవాక్యము :** ఒకే సమాపక క్రియ కలిగినవాక్యము. ఉదా., రఘు బడికి వెళ్ళెను.

**సంశ్లిష్ట వాక్యము :** అసమాపక క్రియతో కూడి యుండు వాక్యము. ఉదా., రఘు బడికి వెళ్ళి, పరీక్ష రాసెను.

**సంయుక్త వాక్యము :** రెండు లేక అంతకంటే ఎక్కువ వాక్యములు కలిసి ఏక వాక్యముగా ఏర్పడుట. ఉదా., శాంతి బాగా చదివింది అందువలన మంచి మార్కులు పొందినది.

**వాక్య భేదాలు:**

అర్థమును ప్రతిపాదించు విధమును బట్టి వాక్యము ప్రధానముగా నాలుగు విధములు.

1. **నిశ్చయార్థక వాక్యము:**

ఒక నిశ్చయమును గాని, సత్యమును గాని తెలుపు వాక్యము.

**ఉదా:** ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉండును.

2. **వ్యతిరేకార్థక వాక్యము :**

వ్యతిరేకతను తెలియజేయువాక్యము.

**ఉదా:** తగవులాడుకొనుచోట చేరరాదు.

3. **ప్రశ్నార్థక వాక్యము :**

ప్రశ్నలను తెలియజేయు వాక్యము.

**ఉదా:** మీ తరగతి ఉపాధ్యాయుని పేరేమి?

4. ఆశ్చర్యార్థక వాక్యము :

ఆశ్చర్యమును తెలియజేయు వాక్యము.

ఉదా:ఆహా! ఎంత చక్కని కట్టడం!

విభక్తి-ప్రత్యయాలు :

1. ప్రథమా విభక్తి – డు, ము, వు, లు
2. ద్వితీయా విభక్తి – నిన్, నున్, లన్, కూర్చి, గురించి.
3. తృతీయావిభక్తి – చేతన్, చేన్, తోడన్, తోన్
4. చతుర్థీ విభక్తి – కొఱకున్, కై.
5. పంచమీ విభక్తి – వలనన్, కంటెన్, పట్టి.
6. షష్ఠీ విభక్తి – కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్.
7. సప్తమీ విభక్తి – అందున్, నన్.
8. సంబోధన ప్రథమా విభక్తి – ఓ, ఓయి, ఓరి, ఓసి.

వాక్యాంగములు : కర్త, కర్మ, క్రియ అనునవి వాక్యాంగములు.

కర్త – పనిచేయువాడు. నేను పూలను కోశాను.

కర్మ – ఫలితము పొందువాడు – ఎవరిని, దేనిని అని ప్రశ్నించగా వచ్చు సమాధానము కర్మ. ఉదా., వాడు పాట పాడెను.

క్రియ – పనిని తెలుపునది. ఉదా., అతడు వ్రాయుచున్నాడు.

వచనము : వచనములు రెండు

1. ఏకచవనము, 2. బహువచనము.

ఏకవచనము : ఒకే వస్తువును తెలియజేయు పదములు.

ఉదా: కుర్చీ, పక్షి, స్త్రీ

బహువచనము : ఒకటి కంటే ఎక్కువ వస్తువులను తెలియజేయు పదములు.

ఉదా: కుర్చీలు, పక్షులు, స్త్రీలు

కాలములు : కాలములు నాలుగు

1. భూతకాలము, 2. వర్తమాన కాలము, 3. భవిష్యత్కాలము, 4. తద్ధర్మకాలము.

భూతకాలము : జరిగిపోయిన విషయములను తెలియజేయునది.

ఉదా: శాంత పాఠశాలకు వచ్చెను.

వర్తమానకాలము : జరుగుచున్న విషయములను తెలియజేయునది.

ఉదా: జమున పాఠము చదవుచున్నది.

భవిష్యత్కాలము : జరుగబోవు విషయములను తెలియజేయునది.

ఉదా: కరుణ పాట పాడబోవుచున్నది.

తద్ధర్మకాలము: ఎప్పుడూ జరిగే పనులను గురించి తెలియజేయునది.

ఉదా: సూర్యుడు తూర్పున ఉదయించును.

వాచకము (లింగము): వాచకములు మూడు.

1. మహద్వాచకము, 2. మహతీవాచకము, 3. అమహద్వాచకము

మహద్వాచకము : పురుషులను తెలియజేయు పదాలు.

ఉదా: వాడు, అతడు, రాముడు.

మహతీవాచకము : స్త్రీలను తెలియజేయు పదాలు.

ఉదా: ఆమె, రాధ, పాప.

అమహద్వాచకము: జడ వాచకములను తెలియజేయు పదాలు.

ఉదా: పుస్తకము, నల్లబల్ల.

పురుషములు : పురుషములు మూడు.

(1) ఉత్తమ పురుషము (2) మధ్యమ పురుషము (3) ప్రథమ పురుషము.

1. ఉత్తమ పురుషము : తనను గురించి తెలియ జేయునది. ఉదా. నేను, మేము. నేను బజారుకు వెళ్ళితిని. (ఏక.వ.)

మేము బజారుకు వెళ్ళితిమి. (బహు.వ.)

2. మధ్యమ పురుషము : ఎదుటి వారిని గురించి తెలియజేయునది. ఉదా. నీవు, మీరు, నీవు ఎచటికి వెళ్ళుచున్నావు? (ఏక.వ.)

మీరు ఎచటికి వెళ్ళుచున్నారు? (బహు.వ.)

3. ప్రథమ పురుషము : ఇతరులను గురించి తెలియజేయునది. ఉదా. అతడు, వారు, ఆమె. ఆమె పూలను కొనెను. (ఏక.వ.)

వారు పూలను కొనిరి. (బహు.వ.)

## తెలుగు సంధులు

ఉకారసంధి: ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి నిత్యము. ఉదా., నీవు + ఎక్కడ = నీవెక్కడ

యడాగమ సంధి: సంధిలేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

మీ + ఇల్లు = పూర్వ పర స్వరములు మధ్య సంధి జరిగిన 'మీల్లు' అను రూపమువచ్చును. కాది అని సరియగు రూపము కాదు కనుక రెండు అచ్చుల మధ్య సంధి జరుగుట లేదని తెలిసి కొనవచ్చు. ఈ విధముగా పూర్వ పర స్వరముల మధ్య ఎప్పుడైతే సంధి జరుగదో అప్పుడు 'య్' అనునది ఆగమముగా వచ్చును.

అప్పుడ మీ + య్ + ఇల్లు = మీ యిల్లు అను రూపము వచ్చును.

ఇకారసంధి: ఇత్తునకు అచ్చు పరమగునపుడు సంధి వైకల్పికము. వైకల్పికము అనగా సంధి జరుగవచ్చు, జరుగకపోవచ్చు. రెండు అచ్చుల మధ్య సంధి జరుగనపుడు 'య్' ఆగమముగా వచ్చును. ఉదా., ఏమి + అంటివి – ఏమంటివి, ఏమియంటివి.

అకారసంధి : అత్తునకు సంధి బహుళము. బహుళము అనగా నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్యము. ఉదా., రామ + అయ్య = రామయ్య; అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను; మేన + అత్త = మేనత్త, మేనయత్త; ఒక + ఒక = ఒకానొక.

## సంస్కృతసంధులు

సవర్ణదీర్ఘసంధి : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైన దీర్ఘము ఏకాదేశ మగును. ఉదా., రామ + ఆలయము = రామాలయము.

గుణసంధి : అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమైన క్రమముగా ఏ, ఓ, అర్ లు ఆదేశమగును. ఉదా., దేవ + ఇంద్రుడు = దేవేంద్రుడు.

## సమాసములు

సమర్థ వంతమైన పదములు కలసి ఏకపదమగుట సమాసము.

తత్పురుషసమాసము - ఇది ఉత్తరపద ప్రాధాన్యత కలది.

ప్రథమాతత్పురుష – కడ కన్ను – కంటి యొక్క కడ.

ద్వితీయాతత్పురుష – కృష్ణాశ్రితుడు – కృష్ణుని ఆశ్రయించినవాడు.

తృతీయాతత్పురుష – రాజపూజితుడు – రాజు చేత పూజితుడు.

చతుర్థీతత్పురుష – గ్రంథాలయము – గ్రంథముల కొఱకు ఆలయము.

పంచమీతత్పురుష – చోరభయము – చోరుని వలన భయము.

షష్ఠీతత్పురుష – తండ్రిమాట – తండ్రి యొక్క మాట.

సప్తమీతత్పురుష – శాస్త్రనిపుణుడు – శాస్త్రము నందునిపుణుడు.

నఞ్ తత్పురుష – అసత్యము – సత్యము కానిది.

కర్మధారయసమాసము : విశేషణ, విశేష్యముతోడి సమాసము – వృద్ధకపోతము–వృద్ధమైన కపోతము. విశేషణము ఇందు మొదటి పదముగా ఉన్నది కనుక **విశేషణ పూర్వపద కర్మధారయం.**

కపోత వృద్ధము – వృద్ధమైన కపోతము – ఇందు విశేషణము రెండవ పదముగా వున్నది కనుక **విశేషణ ఉత్తరపద కర్మధారయము.**

మృదుమధురము – మృదువైనది, మధురమైనది.

ఈ సమాసమందు రెండు పదాలు విశేషణములు కనుక **విశేషణ ఉభయపద కర్మధారయము.**

ద్వంద్వసమాసము: ఉభయపద ప్రాధాన్యత కలది ద్వంద్వసమాసము.

తల్లిదండ్రులు – తల్లియును, తండ్రియును.

## అలంకారములు

### శబ్దాలంకారములు :

వృత్యనుప్రాసము : ఒకటి లేదా రెండక్షరములు పలుమార్లు ఆ వృత్తి అగుట అనగా మరల మరల వచ్చుట. ఉదా., ఆనంద, బిందు బృందస్యందన సుందరము. బిందు పూర్వక'ద'కారము పలుమార్లు ఆవృతమైనది.

ఛేకానుప్రాసము : రెండు హల్లులు అవ్యవధానముగా అనగా వెంట వెంటనే వచ్చుట – అర్థములో మార్పు వుండుట.

ఉదా., నీ సుందర దరహాసము – దర, దర అను పదములు వెంట వెంటనే వచ్చినవి కాని సుందర – అనునపుడు అందమైన అని, దరహాసము అనగా చిరునవ్వు అని అర్థము నందు భేదమును చెప్పుకొందుము.

లాటానుప్రాసము : తాత్పర్య భేదముతో శబ్దార్థములు పునరుక్తములగుట.

కమలాక్షు నర్చించు కరములు కరములు

ఇందు కరములు అన్న పదమును రెండుసార్లు కవి ప్రయోగించారు. కరములు అనగా చేతులు. విష్ణువును పూజించునట్టి చేతులే సార్థకత కలిగిన చేతులు అని తాత్పర్యమునందు భేదమును తెలుపు చున్నాము.

అంత్యానుప్రాసము : పదాంతములందు కాని, పాదాంతములందు కాని, వాక్యాంతములందు కాని వర్ణములు పునరుక్తములగుట. ఉదా., విశ్వదాభిరామ వినురవేమ.

ఇందు పదాంతములందు రామ, వేమ అను ప్రాస పదములు ఉపయోగింపబడినవి.

యమకము : ఉపయోగించిన పదాలనే అర్థ భేదము కలుగునట్లు మరల మరల ప్రయోగించుట.

ఉదా : **మన సుభద్ర సుకృతి మహిమ ఏమనవచ్చు**
**మనసు భద్రమయ్యె మనకు నెల్ల**

ఈ పద్యపాదంలో ''మన సుభద్ర'' అనునపుడు మన యొక్క సుభద్ర అని అర్థము చెప్పుకొందుము.

రెండవ పాదమందు ''మనసు భద్రమయ్యె'' అనగా మనందరి మనసు కుదుటపడెను అని అర్థ భేదమును చెప్పుకొందుము.

''మనసుభద్ర'', ''మనసుభద్ర'' అని రెండు మార్లు అవే పదాలను ఉపయోగించినను ఆ పద విభజనలో మార్పువల్ల అర్థ భేదం కలుగుతున్నది. (మన సుభద్ర మనసుభద్ర)

ముక్త పదగ్రస్తం :

విడిచిన పదాన్నే అవ్యవధానంగా అనగా మరల వెంటనే ప్రయోగించుట.

ఉదా : **సుదతీ నూతన మదనా**
**మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా**
**సదనా మయ గజ రదనా**
**రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!**


ఈ పద్యము నందు మొదటిపాదము ''మదనా'' అను పదముతో ముగియుచుండగా రెండవ పాదములో మొదటి పదం 'మదనా'తో ప్రారంభింపబడింది. అట్లే రెండవ పాదం చివరి పదం 'సదనా' తో ముగియగా, మూడవ పాదము మొదటిపదం 'సదనా తో ప్రారంభించబడింది. ఈ విధంగా విడిచిన పదాన్ని తిరిగి స్వీకరించుటనే 'ముక్త పదగ్రస్తము' అందురు.











































- पाठ्यपुस्तक मंडळाची वैशिष्ट्यपूर्ण पाठ्येत्तर प्रकाशने.
- नामवंत लेखक, कवी, विचारवंत यांच्या साहित्याचा समावेश.
- शालेय स्तरावर पूरक वाचनासाठी उपयुक्त.

पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेत स्थळावर भेट द्या.

**साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.**

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५




మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

तेलुगु युवकभारती इयत्ता अकरावी

₹ 98:00